

శతారుణ గీతాంజలి
రూ॥180/-
పేజీలు:180
నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్),
హైదరాబాద్-68. ఫోన్: 040-29884453/54
E-mail: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
బ్యాంక్ స్ట్రీట్(ఆబిడ్స్),హిమాయత్‌నగర్,
బండ్లగూడ(నాగోల్)- హైదరాబాద్
హన్మకొండ.



www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★★



ఎల్‌పిజి కొరతపై ఏం చర్యలు తీసుకుంటున్నారు?
భారత్‌కు మరో రెండు ఎల్‌పిజి ట్యాంకర్లు
కార్పొరేట్ చట్టాల (సవరణ) బిల్లు- 2026 జెపిసికి సిఫార్సు 05



సంపుటి 09, సంచిక: 113 | మంగళవారం | 24-03-2026 | కరీంనగర్ | Published from: Karimnagar, Hyderabad, Khammam, Mahabubnagar | పేజీలు: 12+8 | వెల రూ. 5.00


## మూసీ ప్రక్షాళనకు రాజకీయ రంగు ఎందుకు?

ప్రతిపక్షాలకు సిఎం సూటి ప్రశ్న

- మూసీ బాధితులను నిరాశ్రయులను కానివ్వం
- ఏ ఒక్కరికీ నష్టం జరగకుండా పునరావాసం కల్పిస్తాం
- ప్రాజెక్టుపై సలహాలు, సూచనల స్వీకరణకు ముగ్గురు మంత్రులతో ఉపసంఘం
- శాసనమండలిలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటన



ప్రజాపక్షం/హైదరాబాద్

మూసీ ప్రక్షాళనకు రాజకీయ రంగు ఎందుకు? అని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ప్రతిపక్షాలను సూటిగా ప్రశ్నించారు. ఎవరినీ నిరాశ్రయులను చేయబోమని, పునరావాసం కల్పిస్తామని భరోసా ఇచ్చారు. ప్రతిపక్షాల నేతలు అడ్డుకోవడం తప్పించి, ఏ సలహా ఇచ్చినా తీసుకుంటామని స్పష్టం చేశారు. మూసీ ప్రాజెక్టుతో పాటు ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణం జరుగుతోందని తెలిపారు. ఎలివేటెడ్ కారిడార్లకు ఎక్కువ భూమి కూడా అవసరం లేదన్నారు. 'గతంలో మాదిరిగా నచ్చితే నజరానా.. లేకపోతే జరిమానా విధించే విధానం ఉండదు. గుడ్ గవర్నెన్స్ కాదు. మాది స్మార్ట్ గవర్నెన్స్ అని సిఎం అన్నారు. ప్రాజెక్టుపై సలహాలు, సూచనలు స్వీకరించడానికి ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క నేతృత్వంలో మంత్రులు శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్‌లతో కూడిన మంత్రివర్గ ఉప సంఘాన్ని నియమిస్తామని సిఎం ప్రకటించారు. శాసనమండలిలో సోమవారం ప్రశ్నోత్తరాల సమయంలో కాంగ్రెస్ సభ్యులు బి.మహేష్ కుమార్ గౌడ్, అద్దంకి దయాకర్ లేవనెత్తిన అంశాలపై ముఖ్యమంత్రి సమాధానమిచ్చారు. బాధితులందరికీ ప్రభుత్వం అండగా ఉంటుందని, ప్రస్తుతం ఉన్న వసతుల కంటే మెరుగైన సౌకర్యాలతో పునరావాసం కల్పిస్తామని ఆయన హామీ ఇచ్చారు. ఈ ప్రాజెక్ట్ తమ ప్రభుత్వం కొత్తగా తీసుకురాలేదని, గత ప్రభుత్వం సిఎం కెసిఆర్ హయాంలో

తరువాయి 2లో

## అరకొరగా సంక్షేమ పథకాలు

- బిఆర్‌ఎస్ శాసనసభాపక్ష ఉప నాయకులు టి.హరీశ్‌రావు

03



## ఐదు రోజులు దాడులు చేయం

48 గంటల డెడ్‌లైన్ పొడిగించిన ట్రంప్

- ఇరాన్-అమెరికా మధ్య చర్చల్లో అర్థవంతమైన ఫలితాలు
- ఈ వారమంతా చర్చలు జరగవచ్చని ప్రకటన
- చర్చలు ఒట్టి అబద్ధం : ఇరాన్ టీవీ
- ఇరాన్‌పై తమ దాడులు కొనసాగుతాయన్న ఇజ్రాయెల్
- ట్రంప్‌ను నమ్మలేం.. మేం హెచ్చరించాకే ఆయన వెనక్కు తగ్గారని వ్యాఖ్య



**వాషింగ్టన్:** ఇరాన్‌పై ఐదురోజులపాటు దాడులు నిలిపివేస్తున్నట్లు ట్రంప్ ప్రకటించారు. ఇరాన్‌కు తీవ్ర హెచ్చరికలు చేసిన తర్వాత చివరిక్షణాల్లో ఆయన వెనక్కు తగ్గారు. హోర్ముజ్ జలసంధిలో నౌకల రాకపోకలను 48 గంటల్లో అనుమతించకపోతే ఇరాన్‌లోని విద్యుత్ వ్యవస్థను నేలమట్టం చేస్తానని హెచ్చరించిన ట్రంప్ తాజాగా ఆ గడువు పొడిగించారు. ఐదు రోజుల వరకూ ఇరాన్ పై దాడులు నిలిపివేస్తున్నట్లు తన సొంత ట్రూత్ సోషల్ మీడియా వేదికగా పేర్కొన్నారు. చర్చలు జరుగుతున్నాయని, ఈ వారమంతా చర్చలు జరిగే అవకాశం ఉందని చెప్పారు.
ఐతే ట్రంప్ వ్యాఖ్యలను నమ్మలేమని, ట్రంప్ కుట్ర చేస్తున్నారని, చర్చలు జరపలేదని, సమయం చూసి దాడి చేసేందుకే ఈ పన్నాగమని ఇరాన్ టీవీ వ్యాఖ్యానించింది. మరోవైపు ఇజ్రాయెల్ కూడా ఒక ప్రకటన చేస్తూ, ఇరాన్‌పై తమ దాడులు కొనసాగుతాయని చెప్పింది. తర్వాత కాసేపటికే టెహ్రాన్ నగరంపై ఇజ్రాయెల్ సోమవారం భారీ ఎత్తున దాడులు కొనసాగించింది.
ప్రపంచవ్యాప్తంగా మార్కెట్‌లలో,ఆర్థికరంగంలో నెలకున్న ఆందోళనను తగ్గించడంకోసం ట్రంప్ మొట్టమొదట ఈ విషయాన్ని స్వయంగా 'ఫాక్స్ బిజినెస్', 'సిఎన్‌బిసి' బిజినెస్ ఛానెళ్ళకు తెలియజేశారు. ఇంధన ధరలు తగ్గించడానికి, మార్కెట్లను శాంతపరచడానికి అధ్యక్షుడు ఆసక్తి చూపిస్తున్నారని ఆ ఛానెళ్ళ ప్రతినిధులు వ్యాఖ్యానించారు. ఈ ప్రకటనల తర్వాత అంతర్జాతీయ మార్కెట్‌లో క్రూడాయిల్ ధర 13 శాతం తగ్గింది. ప్రపంచవ్యాప్తంగా స్టాక్ మార్కెట్లు కోలుకున్నాయి. అమెరికా స్టాక్ మార్కెట్లు భారీ లాభాల బాట పట్టాయి.
''అమెరికా-ఇరాన్ మధ్య చాలా మంచి వాతావరణంలో అర్థవంతమైన సంభాషణలు జరుగుతున్నాయి, ఈ సంభాషణలు పూర్తిగా,మొత్తం సమస్య పరిష్కారానికి దారి తీయవచ్చు, చర్చలు ఈ వారమంతా కొనసాగవచ్చు'' అని క్యాపిటల్ లెటర్స్‌లో ట్రంప్ సోషల్ మీడియా ద్వారా పేర్కొన్నారు తప్ప పూర్తి వివరాలు మాత్రం తెలియజేయలేదు. దీనిపై ఇరాన్ అధికారికంగా వెంటనే స్పందించలేదు. కానీ ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కోర్ (ఐఆర్‌జిసి)కు సన్నిహితంగా ఉంటే రెండు వార్తాసంస్థలు మాత్రం, అమెరికా-ఇరాన్ మధ్య చర్చలు వట్టి బూటకమని తోసిపుచ్చాయి. ట్రంప్ ప్రకటన చేసిన కొద్దిసేపటికే ఇరాన్ ప్రభుత్వ టీవీ ఒక ప్రకటన చేస్తూ, ఇరాన్ పాలకుల హెచ్చరికల తర్వాతే ట్రంప్ దాడుల నుండి వెనక్కు తగ్గారని పేర్కొంది. చర్చల గురించి ట్రంప్ చెప్పేవన్నీ పచ్చి అబద్ధాలని, తాము ఎలాంటి చర్చలూ జరపడంలేదని ఇరాన్ వార్తాసంస్థలు చెప్పాయి. హోర్ముజ్‌ను తెరవకపోతే ఇరాన్ విద్యుత్,ఇంధన క్షేత్రాలపై దాడులు చేస్తామని ట్రంప్ ప్రకటించిన

తరువాయి 2లో

## పశ్చిమాసియాలో సంక్షోభం పరిష్కారానికి భారత్ సంప్రదింపులు

దౌత్యాన్నీ ప్రోత్సహిస్తోంది లోక్‌సభలో ప్రధాని మోదీ



**న్యూఢిల్లీ :** పశ్చిమాసియా సంక్షోభం పరిష్కారం విషయమై తాజాగా భారతదేశం తన వైఖరిని స్పష్టం చేసింది. పశ్చిమాసియాలో నెలకొన్న సంక్షోభాన్ని పరిష్కరించడానికి భారతదేశం సంప్రదింపులు, దౌత్యమార్గాన్ని ప్రోత్సహిస్తోందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వెల్లడించారు. వాణిజ్య నౌకలపై దాడులు, హోర్ముజ్ జలసంధికి అంతరాయం కలిగించడం ఎంతమాత్రం ఆమోదయోగ్యం కాదని అన్నారు. చమురు, గ్యాస్ అవసరాలను తీర్చడానికి ప్రభుత్వం వివిధ దేశాల సరఫరాదారులతో సంప్రదింపులు జరుపుతోందని తెలిపారు. పశ్చిమాసియాలో యుద్ధం వల్ల నెలకొన్న ఉద్రిక్తతలపై ప్రధానమంత్రి నరేంద్రమోదీ సోమవారం లోక్‌సభలో మాట్లాడారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ మాట్లాడుతూ యుద్ధ ప్రభావిత ప్రాంతంలోని ప్రతీ భారతీయుడికీ సాధ్యమైన మేరకు అన్ని సహాయాలు అందిస్తున్నామని, అలాగే పశ్చిమాసియా దేశాధినేతలతో తాను మాట్లాడానని, వారందరూ భారతీయుల భద్రతకు హామీ ఇచ్చారని వివరించారు. ఇంధన కొరతలపై నెలకొన్న ఆందోళనల విషయమై ప్రధానమంత్రి నరేంద్రమోదీ మాట్లాడుతూ సాధ్యమైన చోటల్లా చమురు, గ్యాస్ సరఫరాలు కొనసాగేలా చూసేందుకు ప్రభుత్వం నిరంతరం సంప్రదింపులు జరుపుతూనే ఉందన్నారు. దేశంలోని అన్ని విద్యుత్ ప్లాంట్లలో

తరువాయి 2లో

## ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు కార్పొరేషన్

చర్చించి నిర్ణయం : మంత్రి వివేక్

కూనంనేని సాంబశివరావు ప్రశ్నకు సానుకూల సమాధానం

ప్రజాపక్షం/హైదరాబాద్

ప్రభుత్వ శాఖలలో పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు ప్రత్యేకంగా కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసే అంశాన్ని ప్రభుత్వంలో చర్చించి, నిర్ణయం తీసుకుంటామని కార్మిక, ఉపాధి కల్పన శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకట స్వామి హామీ ఇచ్చారు. ప్రభుత్వ శాఖలలో పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల అంశంపై సిపిఐ శాసనసభా పక్ష నేత కూనంనేని సాంబశివ రావు శాసనసభలో సోమవారం ప్రశ్నోత్తరాల సమయంలో అడిగిన ప్రశ్నకు మంత్రి గడ్డం వివేక్ వెంకట స్వామి సానుకూలంగా స్పందించారు. ప్రశ్నోత్తరాల సమయంలో

తరువాయి 12లో

## మీ వ్యక్తికి వ్యాపారం ఇవ్వకుంటే స్కామ్ అంటారా?

- హరీశ్‌రావుపై మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి ఆగ్రహం
- బియ్యం ఎగుమతులపై ఫిలిప్పీన్స్‌కు, ప్రేమ్‌చంద్ గార్గ్‌కు ఎటువంటి సంబంధం లేదని స్పష్టీకరణ
- రబీ సీజన్‌లోనూ ప్రతి గింజా కొనుగోలు చేస్తామని వెల్లడి



ప్రజాపక్షం/హైదరాబాద్

''హరీశ్ రావు సివిల్ సప్లయ్ ఆఫీసుకు ఒక మనిషిని పంపించి ఆదిత్య బిర్లాకు బదులుగా ఆయన పంపించిన మనిషికి వ్యాపారం ఇవ్వాలని చెప్పిండు. మీరు సిఫార్సు చేసిన వారిని అంగీకరించకపోతే స్కామ్ అనడం టోటల్లీ నాన్‌సెన్స్'' అని రాష్ట్ర నీటి పారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్ రెడ్డి అన్నారు. తెలంగాణ బియ్యం ఎగుమతి అంశంలో ఫిలిప్పీన్స్‌కు ప్రేమ్ చంద్ గార్గ్‌కు ఎటువంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. రబీ సీజన్‌లో కూడా రైతుల నుంచి ప్రతి గింజను కొనుగోలు చేస్తామన్నారు. శాసనసభలో సోమవారం జరిగిన ప్రశ్నోత్తరాల సమయంలో బిఆర్‌ఎస్ ఎంఎల్‌ఎలు తన్నీరు హరీశ్‌రావు, పల్లా రాజేశ్వర్ రెడ్డి అడిగిన ప్రశ్నకు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

తరువాయి 12లో

## ఉద్యోగుల పెండింగ్ బిల్లుల చెల్లింపునకు ప్రతినెలా రూ.1000 కోట్లు

- పిఆర్‌సి నివేదిక రాగానే అమలుపై నిర్ణయం తీసుకుంటాం
- సాధ్యమైనంత త్వరగా పెండింగ్ డిఎలను చెల్లిస్తాం
- డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క వెల్లడి
- మంత్రి సరైన సమాధానం చెప్పలేదంటూ బిఆర్‌ఎస్ వాకౌట్



ప్రజాపక్షం/హైదరాబాద్

ప్రభుత్వ ఉద్యోగుల పెండింగ్ బిల్లులను చెల్లించేందుకు ప్రస్తుతం ప్రతి నెలా చెల్లిస్తున్న రూ.700ల కోట్లను ఇక నుంచి రూ.1000 కోట్లకు పెంచేందుకు విధానపరమైన నిర్ణయం తీసుకునేందుకు ప్రభుత్వం ఆలోచిస్తుందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. పిఆర్‌సి నివేదిక రాగానే పరిశీలించి, కొత్త పిఆర్‌సి అమలుపై నిర్ణయం తీసుకుంటామని, పెండింగ్ డిఎలను సాధ్యమైనంత త్వరగా చెల్లిస్తామని వెల్లడించారు. గత బిఆర్‌ఎస్ ప్రభుత్వం పెండింగ్‌లో పెట్టిన మూడు డిఎలను కాంగ్రెస్ ప్రభుత్వమే చెల్లించిందన్నారు. శాసనసభలో సోమవారం జరిగిన ప్రశ్నోత్తరాల సమయంలో బిఆర్‌ఎస్ ఎంఎల్‌ఎలు తన్నీరు హరీశ్ రావు, కె.పి.వివేకానంద, కల్వకుంట్ల సంజయ్ అడిగిన ప్రశ్నకు

తరువాయి 12లో

## తల్లిదండ్రులను ఆదరించకుంటే ఉద్యోగుల వేతనాల్లోంచి 15% చెల్లింపు

బిల్లుకు కేబినేట్ ఆమోదం

రోహిత్ వేముల చట్టం రూపకల్పనకు కేబినేట్ సబ్‌కమిటీ

ఎల్ అండ్ టి నుంచి మెట్రో రైలు స్వాధీనం చేసుకోవాలని

మంత్రిమండలి నిర్ణయం



ప్రజాపక్షం / హైదరాబాద్

విద్వేషపూరిత ప్రసంగాలు, విద్వేష పూరిత నేరాల నిరోధక బిల్లు (తెలంగాణ హేట్ స్పీచ్ అండ్ హేట్ క్రైమ్ ప్రివెన్షన్ బిల్లు 2026) ను మంత్రివర్గం ఆమోదించింది. అలాగే గిగ్ వర్కర్ల సంక్షేమంపై బిల్లు, న్యాయవాదుల రక్షణ బిల్లు, తల్లిదండ్రులను ఆదరించకపోతే ఉద్యోగుల వేతనాల నుంచి నేరుగా వారికి 15 శాతం లేదా రూ.10వేలు చెల్లించేలా చట్ట రూపకల్పనకు సంబంధించిన బిల్లుకు కూడా క్యాబినెట్ ఆమోదం తెలిపింది. రోహిత్ వేముల చట్టం రూపకల్పనకు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క నేతృత్వంలో క్యాబినెట్ సబ్ కమిటీని ఏర్పాటు చేసింది. ఎల్ అండ్ టి నుంచి మెట్రో రైలును స్వాధీనం చేసుకునే నిర్ణయాన్ని వేగవంతం చేయాలని క్యాబినెట్ నిర్ణయం తీసుకుంది. అసెంబ్లీ కమిటీ హాల్ లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన సోమవారం జరిగిన రాష్ట్ర మంత్రివర్గ సమావేశం ప్రస్తుత బడ్జెట్ సమావేశంలో ప్రవేశపెట్టనున్న పలు ముసాయిదా బిల్లులకు ఆమోదం తెలిపింది. ఆమోదం పొందిన

**ఇతర బిల్లుల వివరాలు**

మత సామరస్యాన్ని భంగం కలిగించే పోస్టులు, అల్లర్లు ఘర్షణలు ప్రేరేపించే ప్రసంగాలను కట్టడి చేసేందుకు విద్వేషపూరిత

తరువాయి 2లో



## భారీ కుంభకోణం బట్టబయలు

- తెలంగాణ, ఎపి, కర్ణాటకలో సిసిఎస్ పోలీసుల మెరుపు దాడులు
- 32 మంది అరెస్ట్

ప్రజాపక్షం/హైదరాబాద్

దేశవ్యాప్తంగా వేల కోట్ల రూపాయల మేర ప్రజలను మోసం చేస్తున్న మల్టీ లెవల్ మార్కెటింగ్ (ఎంఎల్‌ఎం) కుంభకోణాన్ని హైదరాబాద్ సెంట్రల్ క్రైమ్ స్టేషన్ (సిసిఎస్) అధికారులు బట్టబయలు చేశారు. 'విహాన్ డైరెక్ట్ సెల్లింగ్ ప్రైవేట్ లిమిటెడ్ (క్యూనెట్) పేరుతో నడుస్తున్న ఈ భారీ మోసంపై తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల్లో ఒకేసారి మెరుపు దాడులు నిర్వహించి 32 మంది నిందితులను

తరువాయి 12లో

## కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు కనీస వేతనాలివ్వరా?

- ప్రాణాలు పణంగా పెట్టి కష్టపడుతున్నా.. కార్మికులకు కనీస వేతనాలు లేకపోవడం దారుణం
- కార్మికుల సమస్యలు అసెంబ్లీలో లేవనెత్తి ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తా
- మున్సిపల్ కార్మికుల మహాధర్నాలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు



ప్రజాపక్షం/హైదరాబాద్

మున్సిపాలిటీలలో పర్మినెంట్ ఉద్యోగులతో పాటు కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు సమానంగా పనిచేస్తారని, అలాంటప్పుడు పర్మినెంట్ ఉద్యోగులకు వేలల్లో జీతాలు చెల్లిస్తున్న ప్రభుత్వాలు, కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు ఎందుకు తగిన వేతనాలు చెల్లించడంలేదని సిపిఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి, ఎంఎల్‌ఎ కూనంనేని సాంబశివరావు ప్రశ్నించారు. ఆరోగ్యాలను,

తరువాయి 12లో

## ఆర్‌ఎస్‌ఎస్, బిజెపిలకు వామపక్షాలు ఎప్పుడూ వ్యతిరేకమే...

సిపిఐ(ఎం)-బిజెపి ఒప్పందం ఆరోపణలను తిప్పికొట్టిన కేరళ సిఎం పినరయ్ విజయన్



**తిరువల్ల :** కేరళలో 2016 అసెంబ్లీ ఎన్నికల్లో నేమోమ్‌లో కాషాయ పార్టీ విజయం సాధించడానికి కాంగ్రెస్, బిజెపిల మధ్య కుదిరిన ఒక రహస్య అవగాహనే కారణమని ముఖ్యమంత్రి పినరయి విజయన్ ఆరోపించారు. పలు నియోజకవర్గాల్లో సిపిఐ(ఎం)-బిజెపి ఒప్పందం జరిగిందంటూ ప్రతిపక్షాలు చేస్తున్న ఆరోపణలను ఆయన తోసిపుచ్చారు. సోమవారం తిరువల్లలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో విజయన్ మాట్లాడారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో పాలక్కాడ్‌తో సహా సుమారు 10 స్థానాల్లో సిపిఐ(ఎం), బిజెపిలు అవగాహనకు వచ్చాయన్న కాంగ్రెస్ ఆరోపణలను తోసిపుచ్చారు. కాంగ్రెస్‌పై విమర్శల దాడి చేశారు. బిజెపితో రహస్య సంబంధాలు పెట్టుకోవడం ఆ పార్టీ చరిత్రేనని ముఖ్యమంత్రి అన్నారు. 2016 నాటి నేమోమ్‌ను దీనికి కీలక ఉదాహరణగా ఆయన పేర్కొన్నారు. నియోజకవర్గంలో

తరువాయి 12లో

# నన్నేమీ చేయలేక నా భార్యను వేధిస్తున్నారు

## అంతరాత్మను అమ్ముకున్న పాక్ న్యాయమూర్తులు

## న్యాయవ్యవస్థపై ఇమ్రాన్‌ఖాన్ నిశిత విమర్శ



**ఇస్లామాబాద్:** పాకిస్థాన్ న్యాయమూర్తులు తమ అంతరాత్మను అమ్ముకుని బతుకుతున్నారని మాజీ ప్రధానమంత్రి, తెహ్రీక్–ఎ–ఇన్సాఫ్ పార్టీ వ్యవస్థాపకుడు ఇమ్రాన్‌ఖాన్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. తమ వ్యక్తిగత సౌకర్యాలు, గౌరవాలు పొందడంకోసం న్యాయమూర్తులు అంతరాత్మలను, చిత్తశుద్ధిని అమ్ముకుని బతుకుతున్నారని, తాము మాత్రం పదే పదే న్యాయస్థానాల చుట్టూ తిరిగినాగానీ న్యాయం దక్కడంలేదని విమర్శించారు. ఈ విధమైన న్యాయమూర్తుల ఉనికి న్యాయ వ్యవస్థకు సిగ్గుచేటు అన్నారు. పాకిస్థాన్ సైన్యాన్ని పరోక్షంగా ప్రస్తావిస్తూ, తనను ఏమీ చేయలేరన్న విషయం వారికి బాగా తెలుసుననీ, అందుకే తన భార్యను వేధింపులకు గురిచేస్తున్నారన్నారు.వారానికి ఒక అరగంట సేపు తప్ప నెలలో 30 రోజులూ తన భార్యను మనుషులు కనిపించని ఏకాంతవాసంలో నిర్బంధించి ఉంచారని ఆవేదన వ్యక్తం చేశారు. ఒక మహిళలు, వృద్ధులు, పిల్లలకు హాని తలపెట్టడం ఇస్లామ్ మత సూత్రాలకు విరుద్ధమైన విషయమని అన్నారు. న్యాయమూర్తులు సమాజానికి న్యాయం చేయాలని, అందుకువారు బాధ్యత వహించాలని కానీ వీరు విరుద్ధంగా ప్రవర్తిస్తున్నారన్నారు. తన భార్యను అమానవీయ పద్ధతులలో లక్ష్యంగా చేసుకుని వేధింపులకు గురిచేస్తున్నారని, ఆమెను దీర్ఘకాలంగా ఏకాంతవాసంలో ఉంచారని,ఆమెపట్ల తప్పుగా ప్రవర్తిస్తున్నారని విమర్శించారు. అనుసరిస్తున్న విధానాలన్నీ పాకిస్థాన్ న్యాయవ్యవస్థకు సిగ్గుచేటుగా మారాయని విమర్శించారు. దేశంలో న్యాయ వ్యవస్థల నుండి తనకుగానీ, తన భార్యకుగానీ ఎంతమాత్రం న్యాయం లభించడంలేదని తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. 73 ఏళ్ళ వయసుగల పాకిస్థాన్ మాజీ ప్రధానమంత్రి ఇమ్రాన్‌ఖాన్ 2023 ఆగస్టు నెల నుండి రావల్పిండిలో అత్యంత కట్టుదిట్టమైన అదైలా జైలులో అనేక కేసులకు సంబంధించి శిక్షలు అనుభవిస్తున్నారు. మెజార్టీ కోల్పోయి పార్లమెంటులో తీర్మానం ద్వారా ప్రధానమంత్రి పదవి నుండి ఆయనను తొలగించారు. అప్పటి నుండీ ఆయనపై దాదాపు 200 కేసులు బనాయించారు. ఆయనను ఏకాంతవాసంలో బంధించారు. దీంతో ఆయన కుటుంబ సభ్యులను కూడా కలవనివ్వలేదు. ఆయన సజీవంగా ఉన్నారా? లేదా? అనే ప్రశ్నలు, ఆందోళనలు చెలరేగాయి. జైలులో ఆయన ఆరోగ్యం కూడా బాగా క్షీణించింది. కానీ ప్రభుత్వం మాత్రం ఈ వార్తలను తిరస్కరించింది. చాలా రోజుల తర్వాత ఈద్ ఉల్ ఫితర్ సందర్భంగా తన కుమారుడితో టెలిఫోన్‌లో సంభాషించారు. ఈ సందర్భంగా ఇమ్రాన్‌ఖాన్ గొంతువిప్పి న్యాయ వ్యవస్థపై తీవ్ర విమర్శలు చేశారు.

# ఫ్రాన్స్ మున్సిపల్ ఎన్నికల్లో వామపక్షాల విజయం

## కంచుకోట పారిస్ సహా పెద్ద నగరాల్లో మేయర్ పదవులు స్వాధీనం

## పారిస్ ఎన్నటికీ మితవాదుల వశంకాబోదు: గ్రెగోయిర్ వ్యాఖ్య



**పారిస్:** ఫ్రాన్స్‌లో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో కమ్యూనిస్టు, సోషలిస్టు వామపక్ష శక్తులు విజయభేరి మోగించాయి. కమ్యూనిస్టుల కంచుకోట పారిస్ సహా గతంలో ఉన్న స్థానాలను నిలబెట్టుకుని తమ బలాన్ని సుస్థిరం చేసుకున్నారు. కొందరు మితవాదులను కూడా ఈ ఎన్నికల్లో బలమైన ఓట్లతో ఓడించారు. పారిస్, మార్సెయిల్, లియోన్ నగరాలలో మేయర్ పదవులను తిరిగి చేజిక్కించుకుని తమ ప్రాధాన్యతను, నియంత్రణను, ఆధిపత్యాన్ని రుజువుచేశారు. లిల్లే,రెన్నెస్ వంటి కీలక నగరాలలో సోషలిస్టులు తమ ఆధిపత్యాన్ని తిరిగి నిలబెట్టుకున్నారు. నైరుతీ ఫ్రాన్స్‌లోని పౌ నగరాన్ని మధ్యేవాద మాజీ ప్రధానమంత్రి ఫ్రాంకోయిస్ బేరూ ఆధిపత్యం నుండి సోషలిస్టులు తిరిగి స్వాధీనం చేసుకున్నారు. ఉత్తర ఓడరేవు నగరం హవ్రేలో మరో మాజీ ప్రధానమంత్రి ఎడ్వర్డ్ ఫిలిప్ మేయర్‌గా తిరిగి ఎన్నికయ్యారు. దాదాపు 35,000 కమ్యూన్‌లలో ఈ ఎన్నికలు జరిగాయి. అతిపెద్ద నగరాల్లో ఉన్న మేయర్ పదవులను వామపక్షాలు తిరిగి కైవసం చేసుకుని తమ బలాన్ని పటిష్టపరచుకున్నారు. అదేసమయంలో మితవాదులు చిన్న చిన్న పట్టణాలలో లాభాలు పొందినప్పటికీ వామపక్షాలపై గెలవలేక చతికిలపడ్డారు. మెరైన్ లీపెన్ నాయకత్వానగల పచ్చిమితవాదపార్టీ నేషనల్ ర్యాలీ దక్షిణ ఫ్రాన్స్‌లో కొద్దోగొప్పో లాభపడినప్పటికీ గొప్ప విజయాలు సాధించి ముందడుగు వేయలేకపోయింది. ఈ విజయాలు అత్యంత ఉత్తేజకరమైనవిగా పేర్కొంటూ ‘పారిస్ నగరం ఎన్నటికీ మితవాదుల వశం కాబోదు’ అని మేయర్ ఇమ్మాన్యుయేల్ గ్రెగోయిర్ వ్యాఖ్యానించారు. పారిస్ నగరం తన గత చరిత్రకు కట్టుబడే ఉంటుందని, పారిస్ ఓటర్లు ఈ నిర్ణయంతోనే ఓటింగ్‌లో పాల్గొన్నారన్నారు. మార్సెయిల్ నగరంలో కూడా ప్రస్తుత మేయర్ బెనోయిట్ పాయన్ అత్యంత సునాయాసంగా తిరిగి విజయం సాధించారు. మితవాద నేషనల్ ర్యాలీ పార్టీకి తాను పెద్ద అడ్డుగోడగా నిలబడతానని, వారిని ఎప్పటికీ గెలవనివ్వబోననే నినాదంతో ఎన్నికల ప్రచారం చేసిన బెనోయిట్ పాయన్‌ను సమర్థిస్తూ ప్రజలు తిరిగి ఆయనకే పట్టకట్టి వామపక్ష నాయకత్వానికి తమ మద్దతును ఉద్ఘాటించారు. మార్సెయిన్ నగరాన్ని నేషనల్ ర్యాలీ మితవాదులకు కట్టబెట్టడం అంటే దేశానికి తీవ్ర భూకంపం తీసుకువచ్చినట్టే కాగలదని ఈనెలారంభంలోనే బెనోయిట్ పాయన్ ప్రజలకు హెచ్చరిక చేశారు. లియాన్ నగరంలో గ్రీన్‌పార్టీ మేయర్ గ్రెగొరీ డూసెట్ తిరిగి విజయం సాధించారు. ఎన్నికలకు ముందు జరిగిన సర్వేలో లియోన్‌లో వ్యాపారవేత్త జీన్ మిషెల్ ఔలాన్‌కు అనుకూల పవనాలు కనిపించినప్పటికీ చివరిదశనాటికి పరిస్థితులు తారుమారయ్యాయి. డూసెట్ పైచేయి సాధించారు. హోరాహోరీ పోరులో ఔలాన్‌ను డూసెట్ స్వల్పతేడాతో ఓడించారు. ఐతే ఎన్నికల్లోఅవకతవకలు జరిగాయని ఆరోపిస్తూ ఆయన న్యాయస్థానాన్ని ఆశ్రయించే ప్రయత్నాలు చేస్తున్నారు. పారిస్‌లో కమ్యూనిస్టు నాయకుడు ఇమ్మాన్యుయేల్ గ్రెగోయిర్ విజయం సాధించడం ద్వారా దేశ రాజధానిలో సోషలిస్టులకు సుదీర్ఘకాలంగా ఉన్న ఆధిపత్యాన్ని నిలబెట్టి ఆ వారసత్వాన్ని కొనసాగించారు. ఆయన విజయం రాజధాని పారిస్‌లో వామపక్షాలు 25 సంవత్సరాలుగా కొనసాగిస్తున్న పరిపాలనకు చిహ్నంగా నిలిచింది. ఇమ్మాన్యుయేల్ మేక్రాన్ పదవీకాలం ముగింపు దశకు వచ్చిన తరుణంలో అధికారానికి చేరువ కావడానికి ఈ స్థానిక ఎన్నికలు సానుకూల సంకేతాలుగా ఉంటాయని అతివాదులు, మితవాదులు ఆశించారు. గతవారంలో జరిగిన మొదటిరౌండ్ పోలింగ్‌లోనే చాలా వరకూ కమ్యూన్స్‌లో ఎన్నికల ఫలితాలు తేలిపోయాయి. అనేకచోట్ల మాత్రం రన్నాఫ్ ఎన్నికలు జరిగిన తర్వాత వామపక్షాల ఆధిపత్యం రుజువైంది. ప్రధాన నగరాలు సహా 1500 నగరాలలో మాత్రం ఎవరికీ సరైన మెజారిటీ రాకపోవడంతో మొదటి విజేతలమధ్య రెండోసారి రన్నాఫ్ ఎన్నికలు నిర్వహించారు. ఈ నిర్ణయాత్మకమైన రెండో విడత ఎన్నికలు అటు మితవాదులకు, కమ్యూనిస్టులకు కూడా పెద్ద అగ్నిపరీక్షగా మారి వామపక్షాలు విజయాలు సాధించి పునీతులయ్యారు. ఇక నౌకా కేంద్రమైన టౌలాన్‌లో సంప్రదాయవాది విజయం సాధించడంతో మితవాద నేషనల్ ర్యాలీపార్టీకి పరాభవం ఎదురైంది. ఐనాగానీ కార్కాసోన్, మెంటన్, కాన్స్ నగరాలలో నేషనల్ ర్యాలీ అభ్యర్థులు విజయాలు సాధించారు. ఫ్రాన్స్‌లో ఐదో అతిపెద్ద నగరం నైస్‌లో నేషనల్ ర్యాలీ మిత్రపార్టీ ఎరిక్ సియోటి గెలిచారు.దీనిని ఆర్ ఎన్‌పార్టీ నాయకుడు బార్డెల్లా తమ విస్తృత విజయంలో ఒక భాగమని పేర్కొన్నారు. దక్షిణ నగరం పెర్పిగ్నాన్‌లో కూడా ఆ పార్టీ మేయర్ తిరిగి విజయం సాధించారు.

**వచ్చే ఏడాది అధ్యక్ష ఎన్నికలు అత్యంత ఉత్కంఠ భరితం**

స్థానిక ఎన్నికల్లో పెద్ద నగరాలలో వామపక్షాలు,సోషలిస్టులు ఘన విజయాలు సాధించడంతో వచ్చే ఏడాది దేశాధ్యక్ష పదవికి జరిగే ఎన్నికలు అత్యంత ఉత్కంఠ భరితంగా జరుగుతాయని విశ్లేషకులు అంచనావేస్తున్నారు. హవ్రేలో మళ్ళీ ఘన విజయం సాధించిన ఎడ్వర్డ్ ఫిలిప్ వచ్చే ఏడాది అధ్యక్ష ఎన్నికల్లో మితవాద నేషనల్ ర్యాలీకి వ్యతిరేకంగా అత్యంత శక్తిమంతమైన అభ్యర్థిగా ముందుకు వచ్చేందుకు సిద్ధంగా ఉన్నారు. రాబోయే దేశాధ్యక్ష ఎన్నికల్లో నేషనల్ ర్యాలీ తరపున మెరైన్ లీపెన్ లేదా జోర్డాన్ బార్డెల్లా అభ్యర్థిగా ఉండే అవకాశం ఉంది. వచ్చే ఏడాది దేశాధ్యక్ష పదవికి ఎన్నికల ముందుగా ప్రగతిశీల రాజకీయాలకు వామపక్షాలు గెలుచుకున్న అతిపెద్ద నగరాలు ప్రధానవేదికలుగా మారనున్నాయి. రాజ్యాంగపరంగా ఉన్న పరిమితుల కారణంగా ప్రస్తుత దేశాధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మేక్రాన్ మరోసారి పోటీ చేసే అవకాశం లేదు. అందువల్ల ఈసారి ఎన్నికల్లో వామపక్షాలు,మధ్యేవాదశక్తులు, పచ్చిమితవాదులమధ్య కీలకమైన పోరు సాగునున్నది. రాబోయే అధ్యక్ష ఎన్నికల పోరాటానికి ఈ స్థానిక ఎన్నికలు దిశానిర్దేశం చేశాయి.



# స్లోవేనియా ఎన్నికల్లో ఫ్రీడమ్ మూమెంట్‌కు స్వల్ప ఆధిక్యత

**లుబ్లియానా:** మధ్యయూరప్ గణతంత్ర దేశం స్లోవేనియాలో ఆదివారం జరిగిన పార్లమెంటు ఎన్నికల ఫలితాల్లో ప్రస్తుత ప్రధాన మంత్రి, ఫ్రీడమ్ మూమెంట్ పార్టీ నాయకుడు రాబర్ట్ గోలోబ్‌కు అత్యంత స్వల్ప ఆధిక్యత లభించింది. తిరిగి సంకీర్ణ ప్రభుత్వం ఏర్పాటు చేసేందుకు ఆయన ప్రయత్నాలు చేస్తున్నారు. గతంకంటే ఈ సారి పోలింగ్ శాతం తగ్గింది. నాలుగేళ్ళక్రితం 71శాతం ప్రజలు ఓటింగ్‌లో పాల్గొన్నారు. ఈసారి 68శాతం మంది మాత్రమే ఓట్లు వేశారు. ప్రధాన మంత్రి గోలోబ్‌కు 28.6 శాతం ఓట్లు లభించాయి. ప్రభుత్వం ఏర్పాటు చేయడానికి వీలుగా ఎవరికీ తగినంత మెజారిటీ రాలేదు. ఈసారి ఎన్నికల్లో ట్రంప్ మిత్రుడు,డెమొక్రటిక్ పార్టీ ఆఫ్ స్లోవేనియా (ఎస్‌డిఎస్) నాయకుడు జానెజ్ జాన్సా (68) గెలిచే అవకాశాలున్నాయని ముందస్తు ఊహాగానాలు జోరుగా సాగినప్పటికీ ఆయన చతికిలబడ్డారు. ఆయనకు 28.2శాతం ఓట్లు లభించాయి. ఫ్రీడమ్ మూవెంట్‌కు 29సీట్లు, ఎస్‌డిఎస్‌కు 28 సీట్లు లభించాయి. ఇంతకుముందు గోలోబ్‌తో సంకీర్ణ ప్రభుత్వం ఏర్పాటు చేసిన మిత్ర పార్టీలే ఈసారి ఆయనకు భాగస్వాములుగా ఉంటారని భావిస్తున్నారు. నేషనల్ అసెంబ్లీగా పిలిచే జాతీయ పార్లమెంటులో ఉన్న 90స్థానాల్లో 46 సీట్ల మెజారిటీ ఎవరికీ దక్కలేదని 99.2 శాతం కౌంటింగ్ పూర్తయిన తర్వాత ఎన్నికల సంఘం అధికారులు ప్రకటించారు. స్లోవేనియా డెమొక్రాట్స్, న్యూ స్లోవేనియా–క్రిస్టియన్ డెమొక్రాట్స్, సోషల్ డెమొక్రాట్లు, వామపక్షాలు ఈ ఎన్నికల్లో పోటీ చేశాయి. ప్రధానమంత్రి రాబర్ట్ గోలోబ్ (59) 2022 జనవరి ఎన్నికల్లో 41 సీట్లు గెలుచుకుని సెంటర్ లెఫ్ట్, సోషల్ డెమొక్రాట్స్‌తో కలిసి మిశ్రమ ప్రభుత్వం ఏర్పాటు చేశారు. గాజాలో ఇజ్రాయెల్ యుద్ధాన్ని ఆయన తీవ్రంగా వ్యతిరేకించారు. పాలస్తీనాను స్వతంత్రదేశంగా గుర్తిస్తున్నట్లు 2024లో ప్రకటించారు. ట్రంప్ మిత్రుడు జానెజ్ జాన్సా మాత్రం ఇజ్రాయెల్ అనుకూలవాది.

# రన్‌వేపై ప్రమాదం

## ఇద్దరు కెనడా పైలట్లు మృతి

## 41 మంది ప్రయాణికులకు గాయాలు

**న్యూయార్క్:** న్యూయార్క్‌లోని లాగార్డియా విమానాశ్రయంలో ఎయిర్ కెనడాకు చెందిన విమానం రన్‌వేపై వెళుతూ ఒక అగ్నిమాపకదళ వాహనాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన పైలట్, కో–పైలట్ ఇద్దరూ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరణించారు. మరో 41 మంది ప్రయాణికులను ఆసుపత్రిలో చేర్చారు. వీరిలో తొమ్మిదిమంది తీవ్రంగా గాయపడ్డారు. అగ్నిమాపక వాహనంలో ఉన్న ఇద్దరు సిబ్బంది పరిస్థితి నిలకడగా ఉందని ఆసుపత్రివర్గాలు తెలిపాయి. ఈ ప్రమాద ఘటనతో లాగార్డియా విమానాశ్రయాన్ని సహాయ చర్యల నిమిత్తం తాత్కాలికంగా మూసివేశారు. అమెరికాలో అత్యంత రద్దీగా ఉండే విమానాశ్రయాలలో లాగార్డియా విమానాశ్రయం కూడా ఒకటి. 72 మంది ప్రయాణికులతో కూడిన ఈ విమానం మాంట్రియల్ నుండి బయలుదేరి న్యూయార్క్ చేరుకుని సురక్షితంగా రన్‌వేపై దిగింది. ఆ తర్వాత అగ్నిమాపకదళ వాహనాన్ని ఢీకొట్టింది. ఈ ఘటనపై న్యూయార్క్ సిటీ మేయర్ జోహ్రాన్ మమ్దాని స్పందిస్తూ సత్వర చర్యల ద్వారా ప్రయాణికుల ప్రాణాలు కాపాడామన్నారు. దీనిని అత్యంత దురదృష్టకరమైన ఘటనగా పేర్కొన్నారు. ఈ ఘటనపై జాతీయ రవాణా భద్రతామండలి దర్యాప్తు చేస్తోందని చెప్పారు. న్యూయార్క్ గవర్నర్ క్యాథీ హోచుల్ దీనిని హృదయ విదారక ఘటనగా పేర్కొన్నారు. మృతులకు, బాధితులకు ప్రగాఢ సంతాపం సానుభూతి తెలియజేశారు.

# వైట్‌హౌస్‌లో కొలంబస్ విగ్రహావిష్కరణ



**వాషింగ్టన్:** అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కోరిక మేరకు వైట్‌హౌస్ ప్రాంగణంలో క్రిస్టఫర్ కొలంబస్ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. అమెరికాలో చారిత్రక, సాంస్కృతిక వారసత్వ వైభవచిహ్నాలను పునరుద్ధరించేందుకు ట్రంప్ చేపట్టిన చర్యల్లో భాగంగా కొలంబస్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. 2020లో తెల్లజాతీయుడైన ఒక పోలీసు అధికారి నల్లజాతీయుడైన జార్జి ఫ్లాయడ్‌ను నడిరోడ్డుపై గొంతునొక్కి హత్యచేసిన తర్వాత దేశంలో పెద్ద ఎత్తున వేలాదిమంది అనేకరోజులపాటు నిరసన ప్రదర్శనలు జరిపారు. ఈ ప్రదర్శనల సందర్భంగా కొలంబస్ విగ్రహాన్ని వారంతా కూల్చివేసి నౌకాశ్రయంలో పడేశారు. 1984లో రోనాల్డ్ రీగన్ హయాంలో ఈ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. వైట్‌హౌస్‌కు ఆనుకుని ఉన్న ఐసెన్ హోవర్ ఎగ్జిక్యూటివ్ బిల్డింగ్‌కు ఉత్తర దిశలో పూర్వస్థానంలోనే తిరిగి కొలంబస్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. అసలైన అమెరికన్ వీరుడు, ఈ భూమ్మీద నడచిన అత్యంత ధైర్యవంతులు, దార్శనికులలో ఒకరు కొలంబస్ అని ట్రంప్ కొనియాడారు. ఈ స్మారకచిహ్నాన్ని గతంలో తొలగించిన వారిని అమెరికా వ్యతిరేక అల్లరిమూకలుగా ట్రంప్ అభివర్ణించారు. అమెరికా వ్యతిరేక భావజాలం అని ట్రంప్ వ్యతిరేకులు అభివర్ణిస్తున్న విషయాలను ట్రంప్ సవాలు చేస్తూ వాటిని పునరుద్ధరించేందుకు ఆయన ప్రయత్నాలు చేస్తున్నారు. వివాదాస్పద స్మారక చిహ్నాలను ఆయన పునరుద్ధరించే పనులు చేపట్టారు.

# 15% చెల్లింపు

(మొదటి పేజీ తరువాయి)

నేరాల నిరోధక బిల్లును రూపొందించారు.

**గిగ్ వర్కర్‌లకు సంక్షేమ బోర్డు:**

గిగ్, ప్లాట్‌ఫామ్ కార్మికుల సంక్షేమం, భద్రత కోసం రూపొందించిన ‘తెలంగాణ ప్లాట్ ఫామ్ బేస్డ్ గిగ్ వర్కర్స్ (రిజిస్ట్రేషన్, సోషల్ సెక్యూరిటీ అండ్ వెల్ఫేర్) యాక్ట్, 2026’ బిల్లు ఉంది. రాష్ట్రంలో దాదాపు 4.2 లక్షల మంది గిగ్ వర్కర్స్, ప్లాట్ ఫాం బేస్డ్ వర్కర్స్ ఉన్నారు. కొత్త బిల్లు ప్రకారం వర్కర్స్ రిజిస్ట్రేషన్‌తో పాటు వెల్‌ఫేర్ బోర్డ్ ఏర్పాటు, సంక్షేమ నిధి ఏర్పాటు చేస్తారు. ఈ బిల్లు ప్రకారంగిగ్ వర్కర్లకు చట్టబద్ధమైన గుర్తింపు, సామాజిక భద్రత లభించడంతో పాటు వారి సంక్షేమానికి బోర్డు ఏర్పాటు చేయడంతో వారి హక్కులకు రక్షణ లభిస్తుంది. గతంలో మంత్రివర్గం ఆమోదించిన బిల్లును ఇటీవల కేంద్రం ప్రవేశపెట్టిన సోషల్ సెక్యూరిటీ కోడ్‌కు అనుగుణంగా స్వల్ప మార్పులతో కేబినెట్ ఆమోదించింది.

**న్యాయవాదుల రక్షణ బిల్లు :**

తెలంగాణ అడ్వకేట్ ప్రొటెక్షన్ బిల్లుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. న్యాయవాదుల పై జరుగుతున్న దాడుల ఘటనలను కట్టడి చేసేందుకు, న్యాయవాదులకు రక్షణ కల్పించేందుకు ఈ బిల్లు రూపొందించారు. గతంలో జరిగిన అడ్వకేట్ దంపతులు వామన రావు హత్యల నేపథ్యంలో న్యాయవాదుల కు రక్షణ, తగిన భద్రత కల్పించాలని మంత్రివర్గం నిర్ణయించింది.

**తల్లిదండ్రులను ఆదరించకపోతే వేతనం కట్ :**

వృద్ధాప్యంలో ఉన్న తల్లిదండ్రులను ఆదరించని ప్రజా ప్రతినిధులు, ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగుల వేతనాల నుంచి 15 శాతం లేదా రూ.10 వేలు ఏది తక్కువైతే ఆ మొత్తం వేతనాల నుంచి పరిహరించి తల్లిదండ్రులకు అందజేసే తల్లిదండ్రుల మద్దతు బిల్లును క్యాబినెట్ ఆమోదించింది.

**రోహిత్ వేముల చట్టంపై క్యాబినెట్ సబ్ కమిటీ :**

విద్యాలయాల్లో కుల వివక్షను నియంత్రించేందుకు ఉద్దేశించిన రోహిత్ వేముల చట్టం విధివిధానాల రూపకల్పనకు ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అధ్యక్షతన మంత్రివర్గ ఉప సంఘం ఏర్పాటుకు క్యాబినెట్ ఆమోదించింది. మంత్రివర్గం ఉప సంఘం సభ్యులుగా మంత్రులు దామోదర రాజనరసింహ, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొన్నం ప్రభాకర్ ఉంటారు.

**ఎల్ అండ్ టి నుంచి మెట్రో స్వాధీనం :**

హైదరాబాద్‌లో ప్రస్తుతమున్న 69 కిలోమీటర్ల మెట్రో వ్యవస్థను ఎల్ అండ్ టి కంపెనీ నుంచి స్వాధీనం చేసుకునే చర్యలు వేగవంతం చేయాలని కేబినెట్ నిర్ణయం తీసుకుంది.రుణబారం సహా మొత్తం రూ.15 వేల కోట్లకు ప్రభుత్వం ఎల్ అండ్ టికి చెల్లించి ఫేజ్–1 మెట్రో రైలు ప్రాజెక్టు స్వాధీనం చేసుకోవాల్సి ఉంటుందని ఇప్పటికే సబ్ కమిటీ నివేదికను సమర్పించింది. ప్రభుత్వం తరపున ఈ నిధుల చెల్లింపులు, లావాదేవీల బాధ్యతను నిర్వర్తించే బాధ్యతను హైదరాబాద్ మెట్రో రైల్ లిమిటెడ్ కు అప్పగించింది. హెచ్ఎంఆర్ఎల్‌ను నోడల్ ఏజెన్సీగా నియమించేందుకు కేబినెట్ ఆమోదం తెలిపింది.

**జస్టిస్ సుదర్శన్‌రెడ్డి కమిటీ నివేదిక ఆమోదం :**

రాష్ట్రంలో చేపట్టిన కులగణనను అధ్యయనం చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం నియమించిన స్వతంత్ర నిపుణుల కమిటీ నివేదికను కేబినెట్ ఆమోదించింది. ఇండిపెండెంట్ ఎక్స్‌పర్ట్స్ వర్కింగ్ గ్రూప్ చైర్మన్ జస్టిస్ సుదర్శన్ రెడ్డి అధ్వర్యంలోని నిపుణుల కమిటీ ఈ నివేదిక తయారు చేశారు. నిపుణుల కమిటీ సమర్పించిన నివేదికలోని అంశాలను కేబినెట్ చర్చించింది. సామాజిక న్యాయం, అన్ని వర్గాల సాధికారత లక్ష్యంగా దేశంలోనే మొదటిసారిగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సామాజిక, ఆర్థిక, కుల సర్వేను నిర్వహించింది. 2024 నవంబర్ 6వ తేదీ నుంచి డిసెంబర్ 25వ తేదీ వరకు 50 రోజుల పాటు రాష్ట్రమంతటా సర్వే నిర్వహించింది. నిపుణుల కమిటీ ఇచ్చిన నివేదికను పరిశీలించే బాధ్యతను కేబినెట్ సబ్ కమిటీకి అప్పగించింది.

# లోక్ భవన్‌లో గవర్నర్‌ను కలిసిన మంత్రి కొండా సురేఖ



**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ సోమవారం లోక్ భవన్‌లో రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి దేవస్థానంలో మార్చి 27న నిర్వహించనున్న శ్రీ సీతారాముల కళ్యాణమహోత్సవానికి సంబంధించిన ఆహ్వాన పత్రికను ఆలయ అర్చకులు, దేవాదాయ శాఖాధికారులతో కలిసి అందజేశారు. భద్రాచలం శ్రీ సీతారాముల కల్యాణం యొక్క విశిష్టత గురించి కొండా సురేఖ గవర్నర్‌కు వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా ఎంతో వైభవంగా జరిగే పవిత్ర వేడుకని, ఈ మహోత్సవానికి దేశం నలుమూలల నుండి భక్తులు పెద్ద సంఖ్యలో హాజరవుతారని తెలిపారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ప్రభుత్వం తరపున అన్ని ఏర్పాట్లు పూర్తి స్థాయిలో చేస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య, దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజ రామయ్యర్, కమిషనర్ హన్మంతరావు, అర్చకులు పాల్గొన్నారు.

# దాడులు చేయం

(మొదటి పేజీ తరువాయి)

వెంటనే ఇరాన్ కూడా హోర్ముజ్‌ను శాశ్వత ప్రాతిపదికపై మూసివేస్తామని హెచ్చరిక చేసిన విషయం తెలిసిందే. కానీ అంతకుముందు ఇరాన్ విదేశీ వ్యవహారాలమంత్రి అబ్బాస్ అరాఘ్చి మాట్లాడుతూ, టర్కీ విదేశాంగమంత్రి హకన్ ఫిదాన్‌తో తాను ఫోన్‌లో సంభాషించానని చెప్పారు. ఇరాన్‌కు, అమెరికాకు మధ్య గతంలో జరిగిన చర్చల్లో టర్కీ ప్రభుత్వం మధ్యవర్తిగా వ్యవహరించిన విషయం తెలిసిందే. అందువల్ల అమెరికా–ఇరాన్ మధ్య అంతర్గతంగా టర్కీ మధ్యవర్తిత్వం చేస్తోందని అంచనాలు వేస్తున్నారు. ఇరాన్‌లో ఇంధన కేంద్రాలపై దాడులు చేయబోమని, శత్రుత్వం తగ్గించేందుకే ఈ ప్రయత్నం చేస్తున్నానని, పశ్చిమాసియాలో శాంతికి కృషి చేస్తానని ట్రంప్ తన ప్రకటనలో భరోసా ఇచ్చారు. రెండు రోజులుగా చర్చలు జరుగుతున్నాయని, ఈ చర్చల్లో అర్థవంతమైన ఫలితాలు వచ్చాయన్నారు. కేవలం సమాచారం ఇచ్చిపుచ్చుకోవడంకంటే ఇంకా ముందుకు వెళ్ళి యుద్ధ పరిష్కారం దిశగా అర్థవంతమైన ఫలితాలు (ప్రొడక్టివ్ టాక్స్) సాధించిన తర్వాతే దాడులను వాయిదా వేయాలని నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. శాంతి కోసమే తాను తాపత్రయ పడుతున్నానని చెప్పారు. ‘ఇరాన్ ఒక ఒప్పందం చేసుకోవాలని చాలా బలంగా కోరుకుంటోందని, ఈ చర్య రాబోయే ఐదు రోజుల్లో లేకపోతే అంతకంటే ముందుగానే జరగవచ్చునని ‘ఫాక్స్ బిజినెస్’ ప్రతినిధికి ఇచ్చిన ఇంటర్వ్యూలో చెప్పారు. వైట్‌హౌస్ ఉన్నతాధికారులు జారెడ్ కుష్నెర్ (ట్రంప్ అల్లుడు),స్టీవ్ విట్‌కాఫ్ (పశ్చిమాసియాలో అమెరికా ప్రతినిధి), ఇరాన్ ప్రతినిధుల మధ్య ఆదివారం రాత్రి కూడా చర్చలు జరిగాయని చెప్పారు.

**ఆపేస్తామని ఇరాన్ వాగ్దానం: యుద్ధంపై ట్రంప్ మరో కీలక ప్రకటన**

అణ్వాయుధాలకు కీలక ముడిపదార్థమైన యురేనియంను శుద్ధి చేయడం ఆపేస్తామని ఇరాన్ వాగ్దానం చేసిందని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ చెప్పారు. సోమవారం రాత్రి ఎయిర్‌ఫోర్స్ వన్ విమానం ఎక్కేముందుగా పాత్రికేయులతో ట్రంప్ మాట్లాడారు. వారు అడిగిన అనేక ప్రశ్నలకు సమాధానాలు చెప్పారు. పశ్చిమాసియాలో ఉన్న తమ భాగస్వామ్య మిత్ర దేశాలను దృష్టి లో పెట్టుకునే ఇరాన్‌తో సంభాషణలు చేస్తున్నామని చెప్పారు. ఒక ఒప్పందం చేసుకోవాలని ఇరాన్ చాలా బలంగా కోరుకుంటోందని, తాము కూడా అదే కోరుకుంటున్నామని చెప్పారు. మంగళవారం ఉదయం నాటికి ఇరాన్‌లోని అతిపెద్ద విద్యుత్ ఉత్పాదన కేంద్రంపై దాడులు చేసేందుకు తాను ఆమోదం తెలియజేశానని, ఈ లోపు వారు ఒక ఒప్పందం కోరుకుని అమెరికాను సంప్రదించారని చెప్పారు. ‘ఇది సజావుగా సాగితే సమస్యను పరిష్కరించుకుంటాం, లేకపోతే బాంబు దాడులు జరుగుతూనే ఉంటాయి’ అన్నారు. ‘మీరు చెబుతున్నట్టుగా ప్రథమ, ద్వితీయశ్రేణి నాయకులు తుడిచిపెట్టుకుపోయినప్పుడు ఇరాన్‌లో ఎవరితో అమెరికా (ప్రతినిధులు) సంభాషణలు చేస్తోందని ప్రశ్నించగా, ‘బహుశా అత్యంత గౌరవనీయుడు, నాయకుడు అన్ని నేను నమ్ముతున్న వ్యక్తితోనే మాట్లాడుతున్నాం, మాకు తెలిసీ ఆ దేశానికి ప్రాతినిధ్యం వహించే వ్యక్తులు ఉన్నారు’ అని చెప్పారు. తాము మాట్లాడుతున్నది మరణించిన అయొతొల్లా ఖమేనీ కుమారుడు మోజ్తాబా ఖమేనీ కాదన్నారు. మొజ్తాబాను నాయకుడుగా గుర్తించేందుకు ట్రంప్ తిరస్కరించారు. అమెరికా ఎవరితో మాట్లాడుతోందో ఆ నాయకుణ్ణి గుర్తించేందుకు ఆయన నిరాకరించారు. ఐతే గతంలో ఇరాన్‌తో అమెరికా చర్చలకు టర్కీ మధ్యవర్తిత్వం వహించింది. ‘యుద్ధంలో తండ్రి మరణించారు, ఆ తర్వాత గాయపడిన ఆయన కుమారుడు నాయకుడయ్యారని భావిస్తున్నారు. ఆ కొడుకు నుండి మాకు ఎలాంటి సమాచారం లేదు, ఆయన బ్రతికి ఉన్నాడో లేదో తెలియదు’ అన్నారు. ఇరాన్ అంతటా ఉన్న విద్యుత్ కేంద్రాలను ధ్వంసం చేసేందుకు తొలుత విధించిన 48 గంటలు డెడ్‌లైన్‌ను పొడిగిస్తున్నామని, ఐదు రోజుల పాటు దాడులకు విరామం ఇస్తున్నామని సోషల్ మీడియా ద్వారా ప్రకటించిన తర్వాత తాజాగా ట్రంప్ పాత్రికేయులతో మాట్లాడుతూ, ఇరాన్‌తో అమెరికా ఫలవంతమైన చర్చలు జరుపుతోందని, ఈ కారణంగా దాదాపు అన్ని అంశాలపైనా ప్రధాన ఒప్పందాలు కుదిరాయని ప్రకటించారు. ఐతే చర్చలు జరుగుతున్నాయన్న విషయం వట్టి బూటకమని ఇరాన్ ఎందుకు ఖండించిందని ట్రంప్‌ను పాత్రికేయులు ప్రశ్నించగా, సమాచార లోపం వల్ల ఇరాన్ నాయకత్వం అలా స్పందించిందని, చర్చల్లో పాల్గొన్న ప్రతినిధులు తప్పనిసరిగా ఇరాన్ ప్రభుత్వంలోని ఇతర వ్యక్తులతో మాట్లాడే పరిస్థితి లేకపోవడంవల్ల సమాచారంలో అంతరాయం ఏర్పడిందని వివరణ ఇచ్చారు. అమెరికా తరపున అగ్రస్థాయి రాయబారులు స్టీవ్ విట్‌కాఫ్, జారెడ్ కుష్నెర్ ఈ చర్చల్లో పాల్గొన్నారని, ఈ చర్చలు పరిపూర్ణంగా సాయంత్రం వరకూ జరిగాయని, ఇంకా ఈ వారమంతా చర్చలు జరుగుతాయన్నారు. వారు (ఇరాన్) ఈ సంభాషణలను కొనసాగిస్తే ఈ యుద్ధం చాలా వరకూ ముగుస్తుందని చెప్పారు. యుద్ధం మధ్యలో ఉన్నందువల్ల అనుసంధానకర్తలు దేశం విడిచివెళ్ళడం కష్టంగా ఉన్నందువల్ల సోమవారం తర్వాత మళ్ళీ వారు ఫోన్ ద్వారా సంభాషణలు జరిపే అవకాశాలు ఉన్నాయని చెప్పారు.

చర్చల సారాంశాన్ని వివరంగా చెప్పాలని పాత్రికేయులు ఒత్తిడి చేయగా, ‘అణ్వాయుధం లేకుండా ఉండేందుకు ఇరాన్ అంగీకరించింది, ఐతే చాలా కాలంగా ఆ దేశం తాము అణ్వాయుధాన్ని కోరుకోవడంలేదని చెబుతోంది, శాంతియుత ప్రయోజనాలకే అణుపదార్థాన్ని ఉపయోగిస్తామని అంటోంది, యురేనియంను శుద్ధి చేయబోమని కూడా అంగీకరించింది, ఐతే యురేనియం శుద్ధి చేయడం తమ హక్కు అని చాలా కాలంగా ఇరాన్ వాదిస్తూ వస్తోంది’ అని ట్రంప్ చెప్పారు. ఇజ్రాయెల్ పత్రిక ఈ వార్తను ప్రముఖంగా ప్రచురించింది.

# రంగు ఎందుకు?

(మొదటి పేజీ తరువాయి)

ప్రారంభమైన విధానాన్నే కొనసాగిస్తున్నామని చెప్పారు. గుజరాత్‌లో సబర్మతి నది ప్రక్షాళనకు కాంగ్రెస్ పార్టీ సహకరించిందని తెలిపారు. మూసీ నది ప్రక్షాళన అత్యవసరమని, కాలుష్య ప్రభావంతో నల్లగొండ జిల్లా ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పండించిన పంటలు కూడా వినియోగానికి అనుకూలంగా లేవన్నారు. నల్లగొండ ప్రజల ఫ్లోరోసిస్ కష్టాలను, వారి ఆవేదనను చూసిన వారెవరూ మూసీ ప్రక్షాళనను అడ్డుకోవాలని అనుకోరన్నారు. ఇది కేవలం ఒక ప్రాజెక్టు కాదు, తెలంగాణ భవిష్యత్తుకు నిర్మించుకుంటున్న రోడ్ మ్యాప్ అని సిఎం అన్నారు. మూసీ పరివాహక ప్రాంత ప్రజలకు నష్టం జరగకుండా చూడాల్సిన బాధ్యతను ప్రభుత్వం తీసుకుంటుందన్నారు. ఈ ప్రాజెక్టుపై రాజకీయం చేయకుండా, ప్రజలకు ఉపయోగపడే నిర్మాణాత్మక సలహాలిస్తే ప్రభుత్వం తప్పనిసరిగా అమలు చేస్తుందన్నారు. నగర తాగునీటి అవసరాల కోసం 20 టిఎంసిల గోదావరి నీటిని తరలిస్తున్నామని, అందులో 17 టిఎంసిలు తాగునీటి కోసం కాగా, మిగిలిన నీటిని మూసీలో నిరంతరం ప్రవహించేలా వినియోగిస్తామన్నారు.

**తెలంగాణ ప్రగతికి మూడు అంచెల వ్యూహం**

‘తెలంగాణ రైజింగ్ 2047’ విజన్‌తో హైదరాబాద్‌ను ప్రపంచ స్థాయి లివబుల్ సిటీగా తీర్చిదిద్దుతామని రేవంత్ రెడ్డి అన్నారు. తెలంగాణ రూపురేఖలు మార్చేందుకే క్యూర్, ప్యూర్, రేర్ మోడల్ తీసుకొస్తున్నామన్నారు. కోర్ అర్బన్ రీజియన్ ఔటర్ రింగ్ రోడ్డు లోపల ఉన్న 1.34 కోట్ల జనాభా ప్రాంతాన్ని కాలుష్య రహితంగా మారుస్తామన్నారు. రెడ్ ఆరెంజ్ జోన్‌లలో ఉన్న పరిశ్రమలను ఓఆర్ఆర్ అవతలికి తరలించి, ఆ భూములను మల్టీయూజ్ జోన్‌గా మార్చి మధ్యతరగతి నివాస ప్రాంతాలుగా తీర్చిదిద్దుతామన్నారు. హిల్ట్ పాలసీతో పరిశ్రమల తరలింపు వల్ల యాజమాన్య హక్కులు మారవని, కేవలం భూ వినియోగం మాత్రమే మారుతుందని సిఎం స్పష్టం చేశారు. ఆ భూములను మల్టీజోన్‌లుగా అభివృద్ధి చేసి సేవా రంగానికి వినియోగిస్తామన్నారు. ఢిల్లీలో కాలుష్యం, ముంబైలో వర్షాల ఇబ్బందులు, బెంగళూరులో ట్రాఫిక్ జామ్‌ల వంటి పరిస్థితులు హైదరాబాద్‌కు రాకూడదనే ఉద్దేశంతోనే మారకూడదనే ’హిల్ట్ పాలసీ’ తెచ్చామన్నారు. ఒకప్పుడు ‘లేక్ అండ్ రాక్ సిటీ’గా ఉన్న నగరానికి పూర్వవైభవం తీసుకురావడమే లక్ష్యమని చెప్పారు.

**మెట్రోరైల్ స్వాధీనం చేసుకుంటాం**

రూ.24 వేల కోట్లతో 74 కిలోమీటర్ల మేర మెట్రో విస్తరణ చేపడుతున్నామని తెలిపారు. మెట్రో ప్రాజెక్ట్ విషయంలో ఎల్ అండ్ టి సహకరించలేదన్నారు. కేంద్ర సూచనల మేరకు రూ.15 వేల కోట్లతో మెట్రోను ప్రభుత్వం స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. ఇతర రాష్ట్రాల మాదిరిగా ఎయిర్‌పోర్ట్‌కు మెట్రో కనెక్టివిటీ కల్పిస్తామన్నారు.

**ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణం**

కులీకుతుబ్ షాహీల కాలంలో గుల్జార్ హౌజ్, ఫలక్‌నుమా, తారామతి భారాదరి, ఉస్మానియా హాస్పిటల్, హైకోర్టు, ఉస్మానియా ఆర్ట్స్ కాలేజీల నుంచి మొదలుపెడితే ఈరోజు సమావేశాలు నిర్వహించుకుంటున్న శాసనమండలి హాలు, ఇలా ఎంతో చరిత్ర కలిగిన అద్భుతమైన నగరం ఇప్పుడు కాలుష్యం, ట్రాఫిక్ ఇబ్బందుల వంటి ఎన్నో సమస్యలతో సతమతమవుతోందని సిఎం వివరించారు. పంజాగుట్ట, హైటెక్ సిటీ, జూబ్లీహిల్స్ ప్రాంతాల్లో ఎలివేటెడ్ కారిడార్లు నిర్మాణంలో ఉన్నాయని, జూన్‌జూలై నాటికి పనులు పూర్తి చేస్తామని చెప్పారు. నగరం నుంచి బయటకు వెళ్లేందుకే ఎలివేటెడ్ కారిడార్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ట్రాఫిక్ సమస్యలను తగ్గించేందుకు సిగ్నల్స్ వద్ద వాహనాలు ఆగకుండా ఉండే విధంగా ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు. ఫుట్‌పాత్ ఆక్రమణలు ప్రమాదాలకు కారణమవుతున్నాయని, చిన్న వ్యాపారులకు ఇబ్బంది ఉన్నా ఆక్రమణలు తొలగిస్తామని స్పష్టం చేశారు.

# భారత్ సంప్రదింపులు

(మొదటి పేజీ తరువాయి)

తగినంత బొగ్గు నిల్వలు ఉన్నాయని చెప్పారు. ఆహార భద్రత విషయంలో కూడా భారతదేశం సన్నద్ధంగా ఉందని తెలియజేశారు. మానవాళి ప్రయోజనాల దృష్ట్యా భారతదేశం ఎల్లప్పుడూ శాంతి కోసం గళం విప్పిందని, ఈ సమస్యకు చర్చలు, దౌత్యమే పరిష్కారాలని ఆయన స్పష్టంచేశారు. ఈ సంఘర్షణలను అంతం చేయడమే భారత ప్రభుత్వ ప్రయత్నాల లక్ష్యం అని ప్రధానమంత్రి వివరించారు. ఈ యుద్ధం మానవాళి ప్రయోజనాలకు మంచిది కాదన్నారు. అందువల్ల అన్ని పక్షాలు త్వరితగతిన శాంతియుత పరిష్కారాన్ని అనుసరించేలా ప్రోత్సహించడమే భారతదేశ ప్రయత్నమని అధికార కూటమి పక్షాలు బల్లలు చరుస్తున్న నేపథ్యంలో ఆయన ఈ విషయాన్ని విపులీకరించారు. ఈ సంఘర్షణ మొదలైనప్పటి నుంచీ అంటే అమెరికా, ఇజ్రాయెల్ ఇరాన్‌పై దాడి చేసినప్పుడు, ఇరాన్ తన గల్ఫ్ పొరుగు దేశాలను, ఇజ్రాయెల్‌ను లక్ష్యంగా చేసుకుని ప్రతీకారం తీర్చుకున్నప్పటి నుంచి భారతదేశం ఈ సంఘర్షణపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేసిందని ప్రధానమంత్రి మోదీ చెప్పారు. తాను పశ్చిమాసియా నాయకులతో మాట్లాడి ఉద్రిక్తతలను తగ్గించమని అభ్యర్థించానని తెలియజేశారు. పౌర, ఇంధన, రవాణా, మౌలిక సదుపాయాలపై దాడులను భారతదేశం వ్యతిరేకించింది. వాణిజ్య నౌకలపై దాడులు, హోర్ముజ్ జలసంధి వంటి జలమార్గాలలో అంతరాయాలు ఆమోదయోగ్యం కాదని ప్రధాని మోదీ తెలిపారు. ఈ పరిస్థితులల్లో భారత నౌకల భద్రతను నిర్ధారించడానికి దౌత్యపరంగా భారతదేశం నిరంతర ప్రయత్నాలు చేస్తోందని చెప్పారు. భారతదేశానికి 5.3 మెట్రిక్ టన్నులకు పైగా వ్యూహాత్మక పెట్రోలియం నిల్వలు ఉన్నాయని ప్రధాన మంత్రి వివరించారు, అదనంగా 6.5 మిలియన్ మెట్రిక్ టన్నులకు పైగా నిల్వలను సమకూర్చుకునేందుకు కూడా ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తున్నదని మోదీ తెలియజేశారు. ఇది కాకుండా చమురు కంపెనీల వద్ద కూడా నిల్వలు ఉన్నాయని ఆయన వివరించారు. పశ్చిమాసియా భారతదేశానికి చాలా ముఖ్యమైనదన్నారు. దాదాపు కోటిమంది భారతీయులు గల్ఫ్ దేశాలలో నివసిస్తూ, పని చేస్తున్నారని ప్రధానమంత్రి వివరించారు. ఈ సముద్రాలలో ప్రయాణించే వాణిజ్య నౌకలలో భారతీయ సిబ్బంది కూడా ఎక్కువగానే ఉందన్నారు. ఈ వివిధ కారణాల వల్ల భారతదేశ ఆందోళనలు సహజంగానే ఎక్కువగా ఉన్నాయన్నారు. అందువల్ల ఈ సంఘర్షణపై భారతదేశం ఐక్యస్వరం ప్రపంచానికి చేరడం అత్యవసరమని ప్రధాని మోదీ అన్నారు. ఖరీఫ్ సాగు సక్రమంగా జరిగేలా ప్రభుత్వం కూడా కృషి చేస్తోందన్నారు. ఎలాంటి అత్యవసర పరిస్థితినైనా ఎదుర్కోవడానికి ప్రభుత్వం అన్ని రకాల ఏర్పాట్లను చేసిందన్నారు. వేసవికాలం ప్రారంభం కావడంతో దేశంలో విద్యుత్ డిమాండ్ పెరిగిందన్నారు. అయితే దేశంలోని అన్ని విద్యుత్ ప్లాంట్లలో తగినంత బొగ్గు నిల్వలు అందుబాటులో ఉన్నాయని ప్రధానమంత్రి మోదీ తెలియజేశారు.

## 'పెండింగ్ భూసేకరణ, ఆర్‌అండ్ఆర్' పరిష్కారానికి రూ.5 వేల కోట్ల మంజూరు

• మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి



**ప్రజాపక్షం/హైదరాబాద్:** నీటిపారుదల శాఖకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న భూసేకరణ, రిలీఫ్, రిహాబిలిటేషన్ (ఆర్ అండ్ ఆర్) సమస్యల పరిష్కారానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్య మంత్రి భట్టి విక్రమార్క ప్రత్యేక ప్యాకేజీ కింద రూ.5 వేల కోట్లను మంజూరు చేస్తున్నారని రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడించారు. శాసనసభలో సోమవారం జరిగిన ప్రశ్నోత్తరాల సమయంలో కాంగ్రెస్ ఎమ్మెల్యేలు వేముల వీరేశం, కసిరెడ్డి నారాయణరెడ్డి, కుంభం అనిల్ కుమార్ రెడ్డి, జాటోత్ రాంచందర్ నాయక్, బిఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు కొత్త ప్రభాకర్‌రెడ్డి, వి.సునీతా లక్ష్మారెడ్డి, బిజెపి ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు అడిగిన ప్రశ్నకు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సమాధానమిచ్చారు. పెండింగ్‌లో ఉన్న భూసేకరణ పనులను జూన్ వరకు పూర్తి చేసేందుకు ప్రయత్నిస్తామని మంత్రి చెప్పారు.

## కమిటీ వద్ద ఆర్‌టిసి విలీనం పెండింగ్

• గుర్తింపు సంఘాల అంశం ప్రభుత్వం వద్ద చర్చలో ఉంది: మంత్రి పొన్నం ప్రభాకర్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ప్రభుత్వంలో ఆర్‌టిసి విలీనం అంశం ఇందుకోసం ఏర్పాటు చేసిన కమిటీ వద్ద పెండింగ్‌లో ఉన్నదని, గుర్తింపు సంఘాల అంశం ప్రభుత్వం వద్ద చర్చలో ఉన్నదని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఆర్‌టిసి సంస్థ పరిరక్షణ, ఉద్యోగుల సంక్షేమం, ప్రయాణికుల సౌలభ్యమే తమ ప్రాధాన్యత అని అన్నారు. శాసన సభలో సోమవారం జరిగిన ప్రశ్నోత్తరాల సమయంలో కాంగ్రెస్ ఎమ్మెల్యే జాటోత్ రాంచందర్ నాయక్, బిఆర్‌ఎస్ ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు అడిగిన ప్రశ్నకు మంత్రి పొన్నం ప్రభాకర్ సమాధానమిస్తూ గత ప్రభుత్వ పదేళ్ల కాలంలో ఆర్‌టిసిని నిర్వీర్యం చేసిందని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం మహాలక్ష్మి పథకాన్ని ప్రవేశపెట్టిన తర్వాత 85 శాతానికిపైగా ఆర్‌టిసి ఒఆర్ పెరిగిందన్నారు. తెలంగాణ టెక్నాలజీ సర్వీసెస్, సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్, స్వయం సహాయ బృందాలు, విద్యాశాఖ,ఆరోగ్య శాఖ డీలా బస్, అలాగే వివిధ వనరుల నుండి స్మార్ట్ కార్డుల కోసం లబ్ధిదారుల డేటాను సేకరిస్తున్నామని తెలిపారు.

ఎన్నికల హామీ మేరకు మహిళలకు ఉచిత బస్సు సౌకర్యాన్ని కల్పిస్తున్నామని రవాణాశాఖమంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ప్రశ్నోత్తరాల సమయంలో సోమవారం కాంగ్రెస్ సభ్యులు విజయశాంతి, అద్దంకి దయాకర్ అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానం ఇచ్చారు. మహాలక్ష్మి పథకం కింద 2023 డిసెంబర్ 9 నుంచి ఈ సౌకర్యం అమలులో ఉందని చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో మహిళలు ఉచితంగా ప్రయాణించవచ్చని వివరించారు. ఇప్పటివరకు కోట్లాది మహిళలు ఈ సేవను వినియోగించుకున్నారని తెలిపారు. ప్రైవేట్ మెడికల్ షాపుల్లో అధిక ధరలకు మందులు విక్రయిస్తున్నారని బిఆర్‌ఎస్ సభ్యులు ఎల్.రమణ ఆందోళన వ్యక్తం చేశారు. ఎంఆర్‌పి కంటే మూడు నుంచి నాలుగు రెట్లు ఎక్కువ ధరలకు మందులు అమ్ముతున్నట్లు ఆరోపించారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో మందుల ధరలు అధికంగా ఉన్నాయని, వాటిని నియంత్రించేలా చర్యలు తీసుకోవాలని మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి సూచించారు. దీనిపై స్పందించిన మంత్రి దామోదర రాజనర్సింహ ఇలాంటి అక్రమాలను సహించబోమని, కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ మాట్లాడుతూ గురుకుల విద్యార్థులకు ఉపాధ్యాయుల పోస్టులను కల్పిస్తున్నామని తెలిపారు. అన్ని గురుకులాల్లో నాణ్యమైన విద్య అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. విద్యార్థులకు పోషకాహారం అందించేందుకు డైట్ చార్జీలు పెంచామన్నారు. మౌలిక వసతులను మరింత బలోపేతం చేస్తామన్నారు.

## కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది

• పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రంలోని స్థానిక సంస్థల బలోపేతానికి, కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని పంచాయతీరాజ్ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క అన్నారు. శాసనమండలిలో సోమవారం ప్రశ్నోత్తరాల సమయంలో పలు కీలక అంశాలపై వివరణ ఇచ్చారు. బిఆర్‌ఎస్ సభ్యుడు నవీన్ రెడ్డి అడిగిన ప్రశ్నకు సమాధానమిస్తూ, సర్పంచులు, వార్డు మెంబర్లు తమ విధులను సమర్థవంతంగా నిర్వహించేలా వారికి ప్రత్యేక శిక్షణ ఇచ్చామని మంత్రి తెలిపారు. పారిశుద్ధ్య కార్మికులకు క్రమం తప్పకుండా జీతాలు అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. గత బిఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో నెలల తరబడి పారిశుద్ధ్య కార్మికులకు జీతాలు ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేశారన్నారు. బిఆర్‌ఎస్ ప్రభుత్వం హయాంలో తీసుకువచ్చిన జిఓ 51 వల్ల కారోబార్లకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. కారోబార్లకు, పారిశుద్ధ్య కార్మికులకు మధ్య తేడా లేకుండా చేసి వారిని ఇబ్బందుల్లోకి నెట్టింది గత ప్రభుత్వమేనని విమర్శించారు. చాలా కాలంగా కారోబార్లు చేస్తున్న పోరాటం తమ దృష్టిలో ఉందని, ఈ అంశం ప్రస్తుతం ప్రభుత్వ పరిశీలనలో ఉందని తెలిపారు. తప్పకుండా అన్ని సమస్యలను క్షుణ్ణంగా పరిశీలించి, కార్మికులకు, స్థానిక సంస్థల ప్రతినిధులకు న్యాయం చేస్తామని మంత్రి సీతక్క సభలో భరోసా ఇచ్చారు.

## ప్రభుత్వానిది పైశాచిక ధోరణి

• బిజెపి ఎమ్మెల్యే పాయల్ శంకర్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** అధికారంలోకి రాకముందు ఆరు గ్యారెంటీలు అమలు చేస్తామని హామీ ఇచ్చి రెండు ఏళ్ళు గడిచినా అమలు చేయకుండా రాష్ట్ర ప్రభుత్వం పైశాచికంగా వ్యవహరిస్తుందని బిజెపి ఎమ్మెల్యే పాయల్ శంకర్ ఆరోపించారు. అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగుల బకాయిలు ప్రభుత్వం చెల్లించడం లేదని, విశ్రాంత ఉద్యోగుల బకాయిలు కూడా చెల్లించడం లేదన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీల అమలుకై చలో అసెంబ్లీ కార్యక్రమాన్ని బిజెపి చేపడితే కార్యకర్తలను అరెస్టు చేశారన్నారు. తెరాస పాలన కన్నా నిర్బంధం కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో కనిపిస్తుందని ఎద్దేవా చేశారు. చలో అసెంబ్లీ సందర్భంగా కార్యకర్తలను, నేతలను పోలీసులు అరెస్టు చేయడాన్ని బిజెపి పార్టీ ఖండిస్తుందన్నారు. ఎమ్మెల్యే ధనపాల్ సూర్యనారాయణ మాట్లాడుతూ ఆదివారం రాత్రి నుండి చలో అసెంబ్లీ కార్యక్రమం పెడితే కార్యకర్తలను అరెస్టు చేస్తున్నారన్నారు. బిజెపి పార్టీ అరెస్టులకు భయపడదన్నారు.

## అరకొరగా సంక్షేమ పథకాలు

• బిఆర్‌ఎస్ శాసనసభాపక్ష ఉప నాయకులు టి.హరీశ్‌రావు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఎన్నికల ప్రణాళికలో ఆకాశమంత హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం బడ్జెట్‌లో అసంపూర్తిగా నిధులను కేటాయిస్తు క్షేత్రస్థాయిలో సంక్షేమ పథకాలను అరకొరగా అమలు చేస్తోందని బిఆర్‌ఎస్ శాసనసభాపక్ష ఉప నాయకులు టి.హరీశ్ రావు ఆరోపించారు. ప్రభుత్వం సభలో ప్రవేశపెట్టిన 2026–27 వార్షిక బడ్జెట్ సైతం వాస్తవ అంచనాలకు పూర్తిగా విరుద్ధంగా ఉందని, ఈ బడ్జెట్‌లో సైతం రూ.50 వేల కోట్లకు పైగా లోటు ఏర్పడినుందని, ఈ సారి ఏ పథకాలకు కోత విధించనున్నారో స్పష్టం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. శాసన సభలో సోమవారం బడ్జెట్‌పై సాధారణ చర్చను హరీష్‌రావు ప్రారభించారు. ఈ సందర్భంగా హరీష్ రావు మాట్లాడుతూ బడ్జెట్ కేటాయింపులు, చేస్తున్న ఖర్చుల్లో భారీ కోత వల్లే సంక్షేమ పథకాల అమలు ప్రశ్నార్థకంగా మారిందన్నారు. బడ్జెట్ వాస్తవికగా లేకపోవడం వల్లే రైతు భరోసా, పంట బోనస్, రుణ మాఫీ, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రాజీవ్ యువ వికాసం, కల్యాణలక్ష్మి పథకాలలో కొతలు విధిస్తున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం కేవలం కోతలు మాత్రమే కాదు కెసిఆర్ కిట్టు, న్యూట్రీషన్ కిట్, దళితబంధు, బిసి బంధు, గొర్రెల పంపిణీ, చేప పిల్లల పంపిణీ, బతుకమ్మ చీరలు తదితర అనేక పథకాలను బంద్ పెట్టారన్నారు. ప్రభుత్వం ఇచ్చిన 6 గ్యారంటీలు రెండున్నరేళ్లు గడిచినా ఎందుకు అమలు కాలేదని, ప్రభుత్వ సంకల్ప బలం సడలిందా, లేక చిత్తశుద్ధి కొరవడిందా అని ప్రశ్నించారు. గత 10 ఏళ్ల బిఆర్‌ఎస్ పాలనతో పోల్చుకుంటే కాంగ్రెస్ పాలనలో ప్రతి రంగంలోను రాష్ట్ర ప్రగతి తిరోగమన బాట పట్టిందన్నారు. తలసరి ఆదాయం ప్రగతి సూచి 9ఏళ్ల బిఆర్‌ఎస్ సగటు వృద్ధి రేటు14 శాతం కాగా, కాంగ్రెస్ అధికారం చేపట్టిన తర్వాత 2024–25 వృద్ధి రేటు 10.6 శాతం, 2025–26 వృద్ధి రేటు 10.2 శాతానికి పడిపోయిందన్నారు. జిఎస్‌డిపికి సంబంధించి తొమ్మిదేళ్ల బిఆర్‌ఎస్ సగటు వృద్ధి రేటు 12 శాతం కాగా అదే కాంగ్రెస్ హయాంలో 2024–25 వృద్ధి రేటు 10.6శాతం 2025–26 వృద్ధి రేటు 10.7 శాతానికి దిగజారిందని, మరోవైపు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాత్రం రైజింగ్ తెలంగాణ అంటున్నారని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను పూర్తిగా మోసం చేస్తోందని, రైతులకు ఇవ్వాల్సిన రైతు భరోసాను రూ.18 వేల కోట్లను బకాయి పెట్టి రూ.20 వేల కోట్లు రుణమాఫీ చేశామని ప్రభుత్వం గొప్పలు చెప్పుతున్నారన్నారు. పౌరసరఫరాల శాఖకు సంబంధించి ఉమ్మడి రాష్ట్రం మొదలు బిఆర్‌ఎస్ పదేళ్ల పాలన వరకు రూ.56 వేల కోట్ల అప్పులు ఉంటే కాంగ్రెస్ రెండున్నర ఏళ్ల పాలనలో రూ.47 వేల కోట్ల అప్పుల ఊబిలో చిక్కుకుందని తెలిపారు. ఈ శాఖ అక్రమాలపై నిగ్గు తేల్చేందుకు సభా సంఘం వేయాలని హరీష్‌రావు డిమాండ్ చేశారు. ఆరు గ్యారంటీలకు చట్టబద్ధత కల్పిస్తూ సభలో బిల్లు ప్రవేశపెట్టాలని, వృద్ధులకు రూ.4 వేల పెన్షన్, మహిళలకు నెలకు రూ.2500లు, విద్యార్థులకు ఫీజు రీయంబర్స్‌మెంట్‌ను తక్షణమే చెల్లించడంతో పాటు నిరుద్యోగులకు 2 లక్షల ఉద్యోగాలను ఎప్పటిలోగా భర్తీ చేస్తారో స్పష్టం చేయాలని హరీష్ రావు డిమాండ్ చేశారు.

## 'సీపెక్' సర్వేలోని కుటుంబాలన్నింటికీ రూ.5 లక్షల బీమా

• ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి
• ఏ ఒక్క ప్రభుత్వ ఉద్యోగికీ నిస్సహాయ స్థితి రాకూడదు
• ఉద్యోగుల క్షేమమే మా ప్రాధాన్యత : డిప్యూటీ సిఎం మల్లు భట్టివిక్రమార్క



**ప్రజాపక్షం/హైదరాబాద్:** సీపెక్ సర్వే ప్రకారం తేలిన కుటుంబాలన్నింటికీ రూ.5 లక్షల రూపాయల 'ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం' వర్తిస్తుందని, కుటుంబ పెద్ద మరణించినప్పుడు ఆ కుటుంబం వీధిన పడకూడదని కుటుంబ బీమా తీసుకొచ్చామని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి చెప్పారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచామన్నారు. విద్యుత్ శాఖలో పనిచేస్తూ విధి నిర్వహణలో మరణించిన ప్రాణాలు కోల్పోయిన ఓర్సు సురేష్, ముఖ్తార్ బేగ్ కుటుంబ సభ్యులకు ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఒక కోటి రూపాయల చొప్పున ప్రమాద బీమా చెక్కులు అందజేశారు. అసెంబ్లీ కమిటీ హాల్ లో సోమవారం జరిగిన ఈ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, ఇతర మంత్రుల సమక్షంలో బాధితులకు చెక్కులు అందించారు. మృతి చెందిన వారి కుటుంబాలను ఆదుకునేందుకు ముందుకొచ్చిన విద్యుత్ శాఖ మంత్రి భట్టి విక్రమార్కను ఈ సందర్భంగా ముఖ్యమంత్రి అభినందించారు. ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యుల్లో మనోధైర్యాన్ని నింపేందుకే అసెంబ్లీ సమావేశాల సమయంలో చెక్కుల పంపిణీ కార్యక్రమం చేపట్టామన్నారు.

దేశ చరిత్రలోనే ఉద్యోగులకు బీమా చారిత్రక కార్యక్రమమని, ప్రభుత్వ ఉద్యోగుల సంక్షేమం కోసం ఇలాంటి పథకం దేశంలో మరెక్కడా లేదని డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. ఉద్యోగుల క్షేమం కోసం ఆలోచన చేసి మంత్రివర్గంలో ఈ కీలక నిర్ణయం తీసుకున్నామని వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు దురదృష్టవశాత్తు విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోతే ఆ కుటుంబం రోడ్డున పడే ప్రమాదం ఉందని, యజమానిపై ఆధారపడిన జీవితాలు తారుమారవుతున్న తీరును తాము గమనించామని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణలో పనిచేస్తున్న ఏ ఒక్క ప్రభుత్వ ఉద్యోగికి ఇలాంటి నిస్సహాయ స్థితి రాకూడదన్న మానవీయ ఆలోచనతోనే రూ.1.20 కోట్ల భారీ ప్రమాద బీమాను రాష్ట్రంలో అమలు చేస్తున్నామని ప్రకటించారు. ఈ ప్రమాద బీమా పథకం విద్యుత్ సంస్థల్లోని 51 వేల మందికి పైగా, సింగరేణి సంస్థలోని 41 వేల మంది, రాష్ట్రంలోని ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లు 7.57 లక్షల మంది కుటుంబాల్లో భరోసాను కల్పిస్తుందని వివరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే విద్యుత్ ఉద్యోగుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని సింగరేణి, ఎస్‌పిడిసిఎల్, ఎన్‌పిడిసిఎల్, ట్రాన్స్‌కో సంస్థల్లో పైలట్ ప్రాజెక్టుగా ఈ పథకాన్ని ఇప్పటికే ప్రారంభించామని ఆయన గుర్తు చేశారు. విధి నిర్వహణలో ప్రాణత్యాగం చేసిన ఉద్యోగుల సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. ఒక కుటుంబంలో ఆదాయం తెచ్చే వ్యక్తి అకస్మాత్తుగా దూరమైతే ఆ కుటుంబం పడే మానసిక వేదనతో పాటు వారు ఎదుర్కొనే ఆర్థిక విపత్తు వర్ణనాతీతమని, ఆ అభద్రతాభావం ఏ ఒక్క తెలంగాణ బిడ్డకూ ఉండకూడదన్నదే ప్రభుత్వ సంకల్పమన్నారు. ప్రపంచంలోని ఏ అభివృద్ధి చెందిన దేశానికీ సాధ్యం కాని రీతిలో ఒక మహత్తర జీవిత బీమా పథకాన్ని ఈ బడ్జెట్‌లో ప్రవేశపెట్టామన్నారు. 'ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని' అమలు చేస్తున్నామని డిప్యూటీ సిఎం స్పష్టం చేశారు. కార్యక్రమంలో మంత్రులు ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, జూపల్లి కృష్ణారావు, తుమ్మల నాగేశ్వరరావు, ధనసరి అనసూయ సీతక్క, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, వివేక్ వెంకటస్వామి, మహమ్మద్ అజహరుద్దీన్, ఇంధన శాఖ కార్యదర్శి నవీన్ మిట్టల్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## స్థానికులకు ఉద్యోగావకాశాలు దక్కకపోవడం బాధాకరం


• సిపిఐ ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణ రాష్ట్ర ఉద్యమం నీళ్లు, నిధులు, నియామకాల కోసమే జరిగిందని, ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత కూడా స్థానికులకు ఉద్యోగ అవకాశాలు దక్కకపోవడం బాధాకరమని సిపిఐ ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఫార్మా కంపెనీలు కూడా స్థానికులకు అవకాశం కల్పించడంలేదని, రాష్ట్ర ప్రభుత్వం ఒక కమిటీని ఏర్పాటు చేసి రాష్ట్రవ్యాప్తంగా పరిశ్రమలలో స్థానికులకు ఎంత మేరకు అవకాశాలు కల్పిస్తున్నారో తెలియజేయాలని డిమాండ్ చేశారు. శాసనమండలి మీడియా పాయింట్ వద్ద సోమవారం ఆయన మాట్లాడుతూ నిబంధనల ప్రకారం 80 శాతం ఉద్యోగాలు స్థానికులకే ఇవ్వాలని ఉన్నప్పటికీ రాష్ట్రవ్యాప్తంగా పరిశ్రమలు నెలకొల్పిన ప్రాంతాల్లో స్థానికులకే ఉద్యోగ అవకాశాలు ఇవ్వడంలేదని, ప్రభుత్వాలు వాటిని అమలు చేయకపోవడం అన్యాయమన్నారు. స్థానికులకు ఉద్యోగ అవకాశాలు ఇవ్వకుండా ఇతర ప్రాంతాల నుండి ఉద్యోగులను తీసుకుంటున్నారని, ఫలితంగా తెలంగాణ ప్రజలు వేరే రాష్ట్రాలకు వలస వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడిందని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకుని స్థానికులకే ఉద్యోగ అవకాశాలు కల్పించేలా కృషి చేయాలని కోరారు. మరి కొందరు స్థానికులను అటెండర్లుగా మాత్రమే అవకాశాలు కల్పిస్తున్నారని, ఉమ్మడి రాష్ట్రంలో కూడా తెలంగాణ ప్రజలకు నియామకాల విషయంలో తీవ్ర అన్యాయం జరిగిందని నెల్లికంటి సత్యం తెలిపారు.

రాష్ట్రవ్యాప్తంగా నెలకొల్పుతున్న పరిశ్రమలలో స్థానికులకు ఉద్యోగ అవకాశాలు కల్పించడం లేదని సిపిఐ ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం అన్నారు. శాసనమండలిలో సోమవారం ప్రశ్నోత్తరాల సమయంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం రైతుల నుండి తీసుకున్న భూములను పరిశ్రమలకు ఉచితంగా ఇస్తుందని, భూములతో అనేక రాయితీలు ప్రభుత్వం కల్పిస్తుందని, కానీ స్థానికులకు ఉద్యోగాలు వచ్చేందుకు పరిశ్రమలు సిద్ధంగా లేవన్నారు. కేవలం కింది స్థాయి ఉద్యోగాలు మాత్రమే ఇస్తున్నారని సత్యం ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై సభా సంఘాన్ని ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని ఆయన కోరారు. అలాగే వ్యవసాయ ఉత్పత్తులను నిల్వచేసేందుకు కోల్డ్ స్టోరేజ్‌లు ప్రభుత్వం ఏర్పాటు చేయాలని, దీనివల్ల కూడా ఉపాధి అవకాశాలు లభిస్తాయని సూచించారు.

## స్పీకర్‌కు బిఆర్‌ఎస్ 'ప్రైవేట్ మెంబర్ బిల్లు' నోటీసు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** కాంగ్రెస్ ప్రభుత్వ ఆరు గ్యారంటీలకు చట్టబద్ధత కల్పించే అంశంపైన శాసనసభ స్పీకర్‌కు బిఆర్‌ఎస్ 'ప్రైవేట్ మెంబర్ బిల్లు' నోటీసును అందజేసింది. శాసనసభ స్పీకర్ చాంబర్‌లో బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటి.రామారావు ఆధ్వర్యంలో సోమవారం బిఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌కు అందజేశారు. ఈ సమావేశాల్లోనే అత్యంత కీలకమైన ఈ బిల్లును ప్రవేశపెట్టడానికి అనుమతించాలని స్పీకర్‌ను కెటిఆర్ విజ్ఞప్తి చేశారు. ఈ ప్రైవేట్ మెంబర్ బిల్లు ద్వారా 6 గ్యారంటీలకు చట్టబద్ధత కల్పించేందుకు వీలవుతుందని ఆయన చెప్పారు. కాగా శాసనసభ కార్యదర్శికి కూడా ప్రైవేటు మెంబర్ బిల్లు నోటీసును అందజేశారు. ఈ సందర్భంగా కెటిఆర్ మాట్లాడుతూ, ప్రైవేట్ మెంబర్ బిల్లు ద్వారా ప్రజలకు హామీ ఇచ్చిన 6 గ్యారంటీలకు చట్టబద్ధత కల్పించే అవకాశం ఉంటుందని తెలిపారు. ఈ బిల్లును ప్రస్తుత అసెంబ్లీ సమావేశాల్లోనే ప్రవేశపెట్టేందుకు అనుమతి ఇవ్వాలని స్పీకర్‌ను కోరారు. అదేవిధంగా, బిల్లుకు సంబంధించిన నోటీసులను అసెంబ్లీ కార్యదర్శికి కూడా అందజేసినట్లు కెటిఆర్ వెల్లడించారు. ప్రజలకు ఇచ్చిన హామీలను చట్టపరంగా అమలు చేయించేందుకు బీఆర్‌ఎస్ కట్టుబడి ఉందని ఆయన స్పష్టం చేశారు. ఈ పరిణామం రాష్ట్ర రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది. 6 గ్యారంటీల అమలు, వాటి చట్టబద్ధతపై ఇకపై అసెంబ్లీలో కీలక చర్చ జరిగే అవకాశం కనిపిస్తోంది.

## గత ప్రభుత్వం చేసిన తప్పులను కాంగ్రెస్ ప్రభుత్వం ఒక్కొక్కటిగా సరిదిద్దుతోంది

• ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** గత బిఆర్‌ఎస్ ప్రభుత్వం చేసిన తప్పులను కాంగ్రెస్ ప్రభుత్వం ఒక్కొక్కటిగా సరిదిద్దుతోందని ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క చెప్పారు. శాసనసభలో సోమవారం బడ్జెట్‌పై జరిగిన సాధారణ చర్చ సందర్భంగా బిఆర్‌ఎస్ సభ్యులు హరీష్ రావు ప్రస్తావించిన పలు అంశాల పట్ల డిప్యూటీ సిఎం తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. హరీష్ రావు అన్నీ అవాస్తవాలు మాట్లాడుతున్నారని డిప్యూటీ సిఎం అన్నారు. హరీశ్‌రావు పేర్కొన్నట్లుగా రాష్ట్రంలో స్టాంప్స్, రిజిస్ట్రేషన్ల శాఖ అదాయం ఏమాత్రం తగ్గలేదని స్పష్టం చేశారు. గత బిఆర్‌ఎస్ ప్రభుత్వం మున్సిపాలిటీ, కార్పొరేషన్లకు చెల్లించాల్సిన వాటాను చెల్లించకుండా వచ్చిన ఆదాయం మొత్తాన్ని చూపుతూ వచ్చిందన్నారు. అదే కాంగ్రెస్ ప్రభుత్వం ఈ ఏడాది రూ.14,250 కోట్ల ఆదాయం రాగా, ఇందులో నుంచి మున్సిపల్స్ కార్పోరేషన్లకు వాటాగా రూ.5740 కోట్లను చెల్లించామని,ఆ వివరాలను ఇందులో కలపకపోవడం వల్లే ఆదాయం తగ్గినట్లు కనిపిస్తోందని చెప్పారు. హరీష్ రావు పూర్తిగా అసత్యాలను మాట్లాడుతున్నారని రికార్డులను సరి చేయాలని స్పీకర్‌ను డిప్యూటీ సిఎం కోరారు.

**ఈ ఏడాది ఎక్సైజ్ శాఖ అదాయం రూ.39 వేల కోట్లు : జూపల్లి**

ఈ ఏడాది బడ్జెట్‌లో రాష్ట్ర ఎక్సైజ్ శాఖ అదాయం రూ.44 వేల కోట్లుగా పొందపర్చారని, తెలంగాణను తాగుబోతుల రాష్ట్రంగా మార్చుతారా అన్న హరీష్ రావు వ్యాఖ్యలను రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు తీవ్రంగా ఆక్షేపించారు. ఈ ఏడాది ఎక్సైజ్ శాఖ ద్వారా దాదాపుగా రూ.39 వేల కోట్లు ఆదాయం సమకూరిందని, దానిని దృష్టిలో పెట్టుకునే ఈ ఏడాది అంచనాలను కొంత మేర పెంచామని మంత్రి తెలిపారు. 2014లో తెలంగాణ రాష్ట్ర ఎక్సైజ్ శాఖ అదాయం రూ.9.900 కోట్లు ఉంటే 2023 నాటికి రూ.35వేల కోట్లకు పెరిగిందని, మరి గత ప్రభుత్వం ఏ విధంగా చేసిందని ఆయన ప్రశ్నించారు.

**పదేళ్లలో బిఆర్‌ఎస్ ఏమి చేసింది? : మంత్రి సీతక్క**

కాంగ్రెస్ ప్రభుత్వంపై బిఆర్‌ఎస్ అసత్య ఆరోపణలు చేయడం కాకుండా బిఆర్‌ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్న పదేళ్ల కాలంలో ఏమి చేసిందో చెప్పాలని మంత్రి ధనసరి అనసూయ సీతక్క డిమాండ్ చేశారు. బడ్జెట్‌పై చర్చ సందర్భంగా బిఆర్‌ఎస్ పక్ష ఉప నాయకులు హరీష్‌రావు కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను పూర్తిగా మోసం చేసిందన్న వ్యాఖ్యల పట్ల మంత్రి తీవ్రన అభ్యంతరం వ్యక్తం చేశారు. బిఆర్‌ఎస్ ప్రభుత్వం రైతులకు మేలు చేసి ఉంటే వారికి అప్పులు ఎందుకు ఉండేవని సీతక్క ప్రశ్నించారు. గత ప్రభుత్వం సకాలంలో రుణమాఫీ చేయకపోవడమే వల్లే రైతులు ఇబ్బందులు పడ్డారని మంత్రి తెలిపారు.

## 3వ సవరణ చట్టానికి అసెంబ్లీ ఓకె

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణ పబ్లిక్ సర్వీసుల నియామకాల క్రమబద్ధీకరణ, సిబ్బంది తీరు, వేతన స్వరూపం హేతుబద్ధం మూడవ సవరణ చట్టాన్ని శాసనసభ ఆమోదించింది. సభలో సోమవారం ఈ బిల్లును ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ప్రవేశ పెట్టారు. కారుణ్య నియామాకాలు, తీవ్రవాద హింస, పోలీసుల కాల్పులు, మత ఘర్షణలు, షెడ్యూల్, కులాలు, షెడ్యూల్ జాతులపై అత్యాచారాల లాంటి కేసుల్లో బాధితులను ప్రత్యక్షంగా నియామకాలకు గాను కొన్ని మినహాయింపులను చట్టంలోని4(2)స సెక్షన్ పొందపర్చిన ఈ సవరణ చట్టాన్ని శాసనసభ ఏకగ్రీవంగా ఆమోదించింది.

## సిపిఐ వాయిదా తీర్మానం

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఫీజు రీయంబర్స్‌మెంట్ బకాయిలను సకాలంలో చెల్లించకపోవడంతో కళాశాలల యాజమాన్యాలు విద్యార్థులకు ఒరిజినల్ సర్టిఫికెట్లు జారీ చేయడం లేదని, తద్వారా ఆ విద్యార్థులు ఉన్నత చదువులకు వెళ్లలేకపోతున్నారని సిపిఐ ఇచ్చిన వాయిదా తీర్మానాన్ని స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ తిరస్కరించారు. శాసనసభ సోమవారం సమావేశం కాగానే ఈ అంశంపై సిపిఐ శాసనసభాపక్ష నేత కూనంనేని సాంబశివరావు వాయిదా తీర్మానం ఇచ్చారు. ఫీజు రీయంబర్స్‌మెంట్ పథకం ద్వారా 2022–23 విద్యా సంవత్సరం నుంచి ప్రస్తుత విద్యా సంవత్సరం వరకు చెల్లించాల్సిన మొత్తం బకాయిలు సకాలంలో చెల్లించకపోవడంతో విద్యార్థులకు ఒరిజినల్ సర్టిఫికెట్లు ఇవ్వడం లేదని తెలిపారు.

## బిఆర్‌ఎస్ ఎమ్మెల్యేల నిరసన




**ప్రజాపక్షం/హైదరాబాద్:** అసెంబ్లీ ప్రాంగణం బిఆర్‌ఎస్ సభ్యుల నిరసనలతో మార్మోగిపోయింది. రాష్ట్రంలోని పేద విద్యార్థుల భవిష్యత్తుతో కాంగ్రెస్ ప్రభుత్వం చెలగాటం ఆడుతోందని ఆరోపిస్తూ బిఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు అసెంబ్లీ ప్రాంగణంలో భారీ నిరసన చేపట్టారు. పెండింగ్‌లో ఉన్న సుమారు రూ.12 వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ప్లకార్డులను ప్రదర్శించారు. ఈ సందర్భంగా శాసనమండలిలో బిఆర్‌ఎస్ నేత సిరికొండ మధుసూదనాచారి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజల జీవితాలతో ఆడుకుంటున్నట్టే, ఇప్పుడు విద్యార్థుల జీవితాలను కూడా అంధకారంలోకి నెడుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కానీ ప్రస్తుత ప్రభుత్వానికి పేద విద్యార్థుల పట్ల కనీస చిత్తశుద్ధి లేదని విమర్శించారు. తక్షణమే ఫీజుల బకాయిలు విడుదల చేయకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

## అసెంబ్లీ ముట్టడికి బిజెపి నేతల యత్నం



**ప్రజాపక్షం/హైదరాబాద్:** అధికార కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ తెలంగాణ బిజెపి రాష్ట్ర అధ్యక్షులు రాంచందర్ రావు నేతృత్వంలో సోమవారం 'చలో అసెంబ్లీ' కార్యక్రమం నిర్వహించారు. ఈ నిరసన నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న పార్టీ శ్రేణులు, నేతలు పెద్దఎత్తున అసెంబ్లీ ముట్టడికి తరలిచ్చారు. దీంతో పోలీసులు అప్రమత్తమై అసెంబ్లీ పరిసరాల్లో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని బిజెపి నేతలు ఆరోపించారు. రెండున్నరేళ్లు గడుస్తున్నా ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చలేదని నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ముఖ్యంగా భాగ్యనగర అభివృద్ధిని ప్రభుత్వం పట్టించుకోవడం లేదని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు ధ్వజమెత్తారు. ప్రభుత్వం కేవలం ఓటు బ్యాంకు రాజకీయాల కోసమే నిర్ణయాలు తీసుకుంటూ ప్రజలపై భారం మోపుతోందని విమర్శించారు.

**మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ :: ఎల్‌బినగర్ సర్కిల్-13**

షార్ట్ టెండర్ నోటీసు

NIT No. 40/EEC-13/LBNR/MMC/2025-26 తేదీ: 23.03.2026

**పని పేరు:** నిర్వహణ పనులు - 01 నెం.లు (అత్యవసర పని), **అంచనా మొత్తం:** రూ.3.60 లక్షలు, **బిడ్ల స్వీకరణకు చివరి తేదీ & సమయం:** 24.03.2026న ఉ.11.00గం.ల నుండి 25.03.2026న ఉ.11.00గం.ల వరకు, **అధికారి పేరు & చిరునామా:** శ్రీ.వి.కార్తీక్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, ఎల్‌బినగర్ సర్కిల్-13, ఎంఎంసి, సెల్ నెం.: 9701365519, ఇతర వివరాల కోసం ఇ-ప్రొక్యూర్‌మెంట్ @ http://www.eprocurement.telangana.gov.in/లో చూడగలరు.

సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, ఎల్‌బినగర్ సర్కిల్-13, ఎంఎంసి.

DIPR R.O. No. : 17435-PP/CL/ADVT/1/2025-26, Date: 23-03-2026

**షాద్‌నగర్ మున్సిపల్ కౌన్సిల్ కార్యాలయం : రంగారెడ్డి జిల్లా.**

Lr.No. E1/298/2026 ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండర్ నోటీసు తేదీ: 23.03.2026

షాద్‌నగర్ మున్సిపాలిటీలో నిర్వహణ పనులు (3 పనులు) మరియు కార్మికుల నియామకం (1 పని) కోసం, ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్లాట్‌ఫారమ్ వెబ్‌సైట్: tender.telangana.gov.in ద్వారా టెండర్లను ఆహ్వానించడమైనది. టెండర్ షెడ్యూల్: 1. బిడ్ డాక్యుమెంట్ డౌన్‌లోడ్ ప్రారంభ తేది: 23.03.2026న సా.04.00గం.ల నుండి, 2. బిడ్ దాఖలు ఆఖరి తేది: 27.03.2026న సా.04.00గం.ల వరకు, 3. బిడ్ ప్రారంభ తేది: 27.03.2026న సా.04.01 గం.లకు. వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ ప్లేస్ (వెబ్‌సైట్: tender.telangana.gov.in)లో సంప్రదించవచ్చు.

సం/- మున్సిపల్ కమిషనర్, షాద్‌నగర్ మున్సిపాలిటీ.

DIPR R.O. No. : 17490-PP/CL/ADVT/1/2025-26, Date: 23-03-2026



## సాగర్ ప్రాజెక్టును పరిశీలించిన కెఆర్‌ఎంబి చైర్మన్

**ప్రజాపక్షం/నందికొండ:** నాగార్జునసాగర్ ప్రాజెక్టును సోమవారం కృష్ణా రివర్ మేనేజ్మెంట్ బోర్డు (కేఆర్ఎంబి) చైర్మన్ సుబ్రవంశు బిస్వాల్ సందర్శించి ప్రాజెక్టు పనితీరును సమీక్షించారు. ఈ సందర్భంగా డ్యాం పరిసర ప్రాంతాలు, జలాశయ నీటిమట్టం, క్రస్ట్ గేట్ల నిర్వహణ, భద్రతా ఏర్పాట్లపై అధికారులను అడిగి తెలుసుకున్నారు.అలాగే డ్యాం కంట్రోల్ రూమ్‌ను పరిశీలించి నీటి విడుదల నియంత్రణ విధానం, సాంకేతిక వ్యవస్థల పనితీరుపై సమగ్ర సమాచారం సేకరించారు. ప్రాజెక్టు ఇంజనీర్లు ప్రస్తుత పరిస్థితులు, జలాశయ నీటిమట్టం తదితర అంశాలను ఆయనకు వివరించారు. టెలీమెట్రి వ్యవస్థ ద్వారా నీటి స్థాయిల పర్యవేక్షణ విధానాన్ని కూడా ఆయన పరిశీలించారు.ప్రాజెక్టు నిర్వహణ,సాంకేతిక వ్యవస్థల పనితీరును పరిశీలించిన ఆయన అధికారులు తీసుకుంటున్న చర్యలపై సంతృప్తి వ్యక్తం చేసారు. ఆ తరువాత స్వచ్ఛత వక్షౌత్సవ్ 2026 కార్యక్రమంలో భాగంగా నాగార్జునసాగర్ ప్రాజెక్టు పై చీపిరితో శుభ్రం చేశారు.ఈ కార్యక్రమంలో ఆయన వెంట కృష్ణానది యాజమాన్య,బోర్డు సభ్యులు కేకే జాంగిడ్,ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పవన్ నాద్ సాగర్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సీతారాం,ప్రాజెక్టు అధికారులు పాల్గొన్నారు.

## ప్రజావాణి దరఖాస్తులు పెండింగ్ ఉండొద్దు



**ప్రజాపక్షం/యాదాద్రి కలెక్టరేట్ :** ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను పెండింగ్ లేకుండా సత్వరమే పరిష్కరించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు అన్నారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు, రెవెన్యూ అదనపు కలెక్టర్ వెంకా రెడ్డితో కలిసి వివిధ ప్రాంతాల ప్రజల నుండి వచ్చిన 52 అర్జీలను స్వీకరించారు. ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను సంబంధిత అధికారులు పెండింగ్ లేకుండా ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించాలన్నారు. అందులో రెవిన్యూ శాఖ 39, డివిజనల్ పంచాయతీ 5 జిల్లా మేనేజర్ సివిల్ సప్లై, జిల్లా గ్రామీణ అభివృద్ధి, ఎంప్లాయిమెంట్, సివిల్ కోర్టు, లీగల్ సర్వీస్ అథారిటీ, జిల్లా మార్కెటింగ్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ యూనిట్ వన్, ఈఈ పంచాయతీ రాజ్ శాఖలకు ఒక్కొకటి చొప్పున వచ్చాయని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి జయమ్మ, జెడ్పీ సిఈఓ శోభ రాణి, జిల్లా నాగిరెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి విష్ణువర్ధన్ రెడ్డి పాల్గొన్నారు.

## పరిశ్రమలు నెలకొల్పి యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలి



**ప్రజాపక్షం/తుర్కపల్లి :** యాదాద్రి భువనగిరి జిల్లా తుర్కపల్లి మండల పరిసర ప్రాంతాల్లో పరిశ్రమలు నెలకొల్పి యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని, అర్హులైన పేదలందరికీ ఇంటి స్థలాలు ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వాలని సిపిఐ ఆధ్వర్యంలో జిల్లా కార్యవర్గ సభ్యులు కళ్లెం కృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తుర్కపల్లి మండల కేంద్రంలో సీపీఐ నాయకులు గుంటిపల్లి సత్తయ్య అధ్యక్షతన నిర్వహించిన భారత కమ్యూనిస్టు పార్టీ కార్యవర్గ సమావేశానికి సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కళ్లెం కృష్ణ ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడుతూ ఈ మండలంలో ఉన్నటువంటి నిరుపేదలందరినీ గుర్తించి, వారందరికీ ఇంటి స్థలాలు, ఇందిరమ్మ ఇల్లు ఇవ్వాలని, అదేవిధంగా తుర్కపల్లి రెండు జిల్లాల సరిహద్దు ఉండడం వలన ఈ ప్రాంతం అభివృద్ధికి నోచుకోలేదన్నారు. ఈ సమావేశంలో రైతు సంఘం జిల్లా నాయకులు పేరు బొయిన బంగారి, సిపిఐ మండల కార్యదర్శి సిల్వేరు దుర్గయ్య, కలకుంట్ల సత్యనారాయణ, బొట్టు భూమయ్య, వల్లపు భగవంతు, దొంకిని మల్లయ్య, జిన్న రజిత, కొండా అంజమ్మ, సిలేవేరు స్వరూప తదితరులు పాల్గొన్నారు.

## వరుస చోరీలకు పాల్పడుతున్న నిందితుడి అరెస్టు




**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** సూర్యాపేట పట్టణంతోపాటు పరిసర ప్రాంతాల్లో వరుసగా చోరీలకు పాల్పడుతున్న నింధితుడిని సూర్యాపేట పట్టణ పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. దీనికి సంబంధించిన వివరాలను పట్టణ ఇన్‌స్పెక్టర్ వెంకట్ ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు. సూర్యాపేట పట్టణంలోని అన్నాదురైనగర్‌కు చెందిన గూడెపు శ్రీకాంత్ చెడుఅలవాట్లకు బానిసై దొంగతనాలకు పాల్పడుతున్నాడు. ఈనెల 21వ తేదీన పట్టణంలోని సాయినగర్‌లో టి. నాగేశ్వరరావు నివాసంలో చోరీచేసి 3 తులాల బంగారం, 20 తులాల వెండి వస్తువులు, రూ.1000 నగదును దోచుకున్నాడు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ ఏడుకొండలు కేసు నమోదు చేసి దర్యాప్తు చేయగా శ్రీకాంత్‌ను అదుపులోకి తీసుకొని విచారించగా చేసిన నేరాన్ని ఒప్పుకున్నాడు. అతని నుండి మూడు తులాల బంగారం, 20 తులాల వెండితోపాటు నగదును రికవరీ చేసి కోర్టుకు రిమాండ్ చేసినట్లు తెలిపారు. ఈ సమావేశంలో ఎస్ఐ ఎం ఏడుకొండలు పాల్గొన్నారు

## కుక్కల దాడిలో జింక మృతి


**ప్రజాపక్షం/మర్రిగూడ:** మండలంలోని తానేదారుపల్లి గ్రామ పరిధిలోని పంట పొలాలకు మేత కోసం వచ్చిన జింకపై సోమవారం కుక్కలు దాడి చేసి చంపేశాయి.ఈ ఘటనను గమనించిన రైతులు వెంటనే అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించారు.అయితే సమాచారం ఇచ్చినా అధికారులు స్పందించకపోవడంపై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అటవీ ప్రాణుల రక్షణకు తక్షణ చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

# పన్నుల వసూళ్లలో వెనుకబాటు!

### మున్సిపల్ ఎన్నికలతోనే అంతరాయం!
### స్పెషల్ డ్రైవ్‌ల ఫలితం అంతంత మాత్రమే!

**ప్రజాపక్షం/సూర్యాపేట :** ఇంటి పన్నుల వసూళ్లలో జిల్లాలోని మున్సిపాలిటీలు ఈ ఆర్థిక సంవత్సరం వెనుకబడ్డాయి. ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో అధికారులు, సిబ్బంది బిజీగా ఉండడంతో వసూళ్ళకు అంతరాయం ఏర్పడింది. నూతన పాలక వర్గం ఏర్పడిన తరువాత కేవలం ఆర్థిక సంవత్సరం ముగింపుకు ఒక నెల మాత్రమే మిగలడంతో పన్ను వసూళ్ల కోసం అధికారులు స్పెషల్ డ్రైవ్‌లు చేపట్టినా గృహ నిర్మాణదారులు మాత్రం అంతంత మాత్రమే పన్నుల చెల్లిస్తున్న పరిస్థితి.

సూర్యాపేట జిల్లాలో మొత్తం 5 మున్సిపాలిటీలు ఉన్నాయి. ఇందులో సూర్యాపేట, కోదాడ, హుజూర్ నగర్, నేరేడుచర్ల, తిరుమలగిరిలు ఉండగా పన్నుల వసూళ్ళతోనే పాలన సాగుతుంది. గతం లాగా రాష్ట్ర ప్రభుత్వాలు అభివృద్ధికి నిధులు ఇవ్వకపోవడంతో ఉద్యోగుల జీతభత్యాలతోపాటు అభివృద్ధి పనులకు కూడా వీటినే ఖర్చు చేస్తున్నారు. ప్రతి ఆర్థిక సంవత్సరం ఆయా మున్సిపాలిటీలలో పన్ను వసూళ్లు 80 నుండి 90 శాతం అవుతుండగా నేడు ఆ పరిస్థితి కనపడడం లేదు. మార్చి వస్తుందంటే చాలు మున్సిపల్ అధికారులు స్పెషల్ టీమ్స్ ఏర్పాటు చేసి జనవరి మాసం నుండే పన్ను వసూళ్ల కార్యక్రమం చేపట్టేవారు. కానీ ఇటీవల కాలంలోనే మున్సిపల్ ఎన్నికలు జరగడంతో అధికారులు, సిబ్బంది మొత్తం ఆ బిజీలోనే గడిపారు. నూతన పాలకవర్గాలు కొలువుదీరే నాటికి కేవలం ఒక్క నెల మాత్రమే గడువు ఉండడంతో అధికారులు, సిబ్బంది పన్ను వసూళ్ల కోసం చెమటోడుస్తున్నారు. మున్సిపల్ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం సూర్యాపేట మున్సిపాలిటీలో మొత్తం 36092 నివాస గృహాలు ఉండగా రూ.18కోట్ల మేర పన్ను బకాయిలు రావల్సి ఉండగా ఈనెల 22వ తేదీ వరకు కేవలం 58.72శాతం మాత్రమే వసూళ్లు అయింది. కోదాడ మున్సిపాలిటీలో 17722 నివాస గృహాలు ఉండగా రూ.8.28కోట్ల పన్ను బకాయిలకు గాను 58.21 శాతం, హుజూర్‌నగర్ మున్సిపాలిటీలో 8759 నివాస గృహాలు ఉండగా రూ. 3.07కోట్ల పన్నులకు గాను 59.28 శాతం, నేరేడుచర్ల మున్సిపాలిటీలో 4072 నివాస గృహాలు ఉండగా రూ.1.35కోట్లు పన్నులకు గాను 64.44 శాతం, తిరుమలగిరి మున్సిపాలిటిలో 5572 నివాస గృహాలు ఉండగా రూ.1.54కోట్ల పన్ను బకాయిలకు గాను 54.55 శాతం మాత్రమే వసూలయ్యాయి. గత ఆర్థిక సంవత్సరం 2024/25తో పోలిస్తే ఈ ఆర్థిక సంవత్సరం 2025/26లో చాలా తక్కువగా పన్ను బకాయిలు వసూలు అయినట్లు దీనిని బట్టి అర్థమవుతుంది. ఆర్థిక సంవత్సరం ముగింపుకు కేవలం వారం రోజులు మాత్రమే గడువు ఉండడంతో 75 శాతానికి మించి పన్ను వసూళ్లు అయ్యే అవకాశం లేదని అధికారులు చెబుతున్న పరిస్థితి. అధికారులు స్పెషల్ డ్రైవ్‌లు పెట్టి సిబ్బంది చెమటోడుస్తున్నా గత ఆర్థిక సంవత్సరం కన్నా 15 నుంచి 20 శాతం పన్ను వసూళ్లు వెనకబాటుగా ఉన్నట్లు ఇట్టే స్పష్టమవుతుంది. పన్ను వసూళ్లలో వెనుకబాటు ఉంటే ఆర్థిక సంఘం నిధులు కూడా ఆలస్యమయ్యే అవకాశం లేకపోలేదు.




| మున్సిపాలిటీ పేరు | నివాస గృహాలు | మొత్తం పన్ను బకాయిలు | ఈనెల 22 వరకు వసూళ్లు | మిగులు బకాయి | శాతం |
|---|---|---|---|---|---|
| సూర్యాపేట | 36092 | రూ.18కోట్లు | రూ.10.57 | రూ.7.43 | 58.72 |
| కోదాడ | 17722 | రూ.8.28కోట్లు | రూ.4.82 | రూ.3.46 | 58.21 |
| హుజూర్‌నగర్ | 8759 | రూ.3.07కోట్లు | రూ.1.82 | రూ.1.25 | 59.28 |
| నేరేడుచర్ల | 4072 | రూ.1.35కోట్లు | రూ.0.87 | రూ.0.48 | 64.44 |
| తిరుమలగిరి | 5572 | రూ.1.54కోట్లు | రూ.0.84 | రూ.0.70 | 54.55 |

## ప్రజా సమస్యలు సత్వరమే పరిష్కారం

### జిల్లా ఎస్‌పి శరత్ చంద్ర పవర్

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** ప్రతి ఒక్కరి ఫిర్యాదును విని, సంబంధిత అధికారులకు వెంటనే చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్‌పి శరత్ చంద్ర పవర్ పోలీస్ అధికారులను ఆదేశించారు. జిల్లా ప్రజల సమస్యలను త్వరితగతిన పరిష్కరించడం లక్ష్యంగా నల్లగొండ జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం గ్రీవెన్స్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా లోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన దాదాపు 35 మంది ప్రజలు తమ వ్యక్తిగత,ఆర్థిక,భూ సంబంధిత సమస్యలను ఎస్‌పి దృష్టికి తీసుకువచ్చారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరి ఫిర్యాదును విని,సంబంధిత అధికారులకు వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజలకు న్యాయం జరిగేలా పోలీస్ శాఖ ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని,ఎలాంటి సమస్య ఉన్నా ప్రజలు భయపడకుండా పోలీస్ శాఖను సంప్రదించాలని తెలిపారు.



# ధాన్యం కొనుగోళ్లకు పకడ్బందీ ఏర్పాట్లు

### సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** యాసంగి సీజన్‌లో జిల్లాలో నాలుగు లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోళ్ల లక్ష్యంగా ధాన్యం కొనుగోళ్లకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో సమావేశ మందిరంలో యాసంగి 2025/26 ధాన్యం కొనుగోళ్లపై సంబంధిత అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ధాన్యం కొనుగోళ్ళకు ఐకెపి, పిఏసిఎస్, మెప్మా, ఎఫ్‌పిఓల ఆధ్వర్యంలో మొత్తం 330 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయడానికి చర్యలు చేపట్టినట్లు చెప్పారు. ఈనెలాఖరి నాటికి అన్ని కొనుగోలు కేంద్రాలు సిద్ధం చేసి వరికోతలు ప్రారంభమయ్యే ప్రాంతాలకు అనుగుణంగా కొనుగోళ్ళు ప్రారంభించాలని ఆదేశించారు. రైతులు సులభంగా కొనుగోలు కేంద్రాలకు చేరే విధంగా సౌకర్యాలు కల్పించాలన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద టెంట్లు, తాగునీటి సౌకర్యం, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, అందుబాటులో ఉంచాలన్నారు. ప్రతి కేంద్రంలో మద్దతు ధరలు, కంట్రోల్ రూం నంబర్లు, సెంటర్ ఇంచార్జి వివరాలు, రైతులకు అవసరమైన సూచనలతో ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలని చెప్పారు. వ్యవసాయ శాఖ అధికారులు పంట కోతల పురోగతిని సమీక్షిస్తూ రైతులకు టోకెన్ వ్యవస్థను సమర్థవంతంగా అమలు చేయాలన్నారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటనే మిల్లలకు తరలించి దిగుమతి అయ్యేలా చర్యలు తీసుకోవాలని పౌరసరఫరాల శాఖ అధికారులను ఆదేశించారు. రైతులు ధాన్యం అమ్మిన 48 గంటల్లోనే వారి బ్యాంక్ ఖాతాల్లో డబ్బు జమ చేయాలన్నారు. రైతులు ధాన్యాన్ని మంచిగా ఆరబెట్టి తేమ లేకుండా అమ్మకానికి తేవాలని కోరారు. ఈ సమావేశంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ కె సీతారామారావు, డిఎస్ఓ మోహన్‌బాబు, సివిల్ సప్లై మేనేజర్ రాము, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి శిరీష, డిసిఓ ప్రవీణ్, పలు శాఖల అధికారులు, రైస్ మిల్లర్లు, రవాణా కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.






## అభివృద్ధి ఫలితాలు క్షేత్రస్థాయిలో కనిపించాలి : కలెక్టర్

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాల ఫలితాలు ప్రజలకు క్షేత్రస్థాయిలో స్పష్టంగా కనిపించేలా అధికారులు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ ఆదేశించారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించిన అనంతరం వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు.ప్రజాపాలనప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణను అత్యంత ప్రాధాన్యంగా తీసుకోవాలని, ఏప్రిల్ 2న నిర్వహించే గ్రామసభల కోసం లబ్ధిదారుల జాబితాలను తక్షణమే సిద్ధం చేసి సమర్పించాలని సూచించారు. మండల, మున్సిపల్ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టాలని తెలిపారు.జనగణన ఏర్పాట్లు వేగవంతం చేసి ఎన్యుమరేషన్ బ్లాకులు, సూపర్వైజర్ల జాబితాలను పూర్తి చేయాలని, ఆర్థిక సంవత్సరం ముగియడంతో యుటిలైజేషన్ సర్టిఫికెట్లను వెంటనే సమర్పించాలని ఆదేశించారు. ప్రజావాణి కార్యక్రమంలో రెవెన్యూ శాఖకు 40, ఇతర శాఖలకు 43 కలిపి మొత్తం 83 ఫిర్యాదులు అందాయి. పదవ తరగతి పరీక్షలు ముగిసే వరకు పరీక్షా కేంద్రాల్లో ఎలాంటి లోపాలు ఉండకూడదని జిల్లా కలెక్టర్ చంద్రశేఖర్ అన్నారు. సోమవారం పట్టణంలోని డైట్ కళాశాల పరీక్షా కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి వసతులను పరిశీలించారు. జిల్లాలో తృతీయ భాష పరీక్షకు మొత్తం 106 పరీక్షా కేంద్రాల్లో నిర్వహించిన ఈ పరీక్షకు 19,635 మంది రెగ్యులర్, 15 మంది ప్రైవేట్ విద్యార్థులు కేటాయించగా, అందులో 19,600 మంది రెగ్యులర్, 14 మంది ప్రైవేట్ విద్యార్థులు హాజరయ్యారు. రెగ్యులర్ విద్యార్థుల హాజరు శాతం 99.82 , ప్రైవేట్ విద్యార్థుల హాజరు శాతం 93.33 గా నమోదైంది.

## మున్సిపల్ కమిషనర్‌గా రవీందర్ రెడ్డి

**ప్రజాపక్షం/హాలియా:** హాలియా మున్సిపల్ నూతన కమిషనర్‌గా కె. రవీందర్ రెడ్డి సోమవారం పదవి బాధ్యతలు స్వీకరించారు.హాలియా మున్సిపాలిటీ కమిషనర్ గా విధులు నిర్వహించిన శ్రీనివాస్ రెడ్డి సెలవుపై వెళ్లడంతో నూతన కమిషనర్‌గా రవీందర్ రెడ్డి బదిలీపై వచ్చారు. రవీందర్ రెడ్డి నల్లగొండ మున్సిపల్ కార్పొరేషన్‌లో అసిస్టెంట్ కమిషనర్ గా విధులు నిర్వహిస్తూ హాలియా మున్సిపల్ కమిషనర్‌గా బదిలీ పై వచ్చారు.ఈ సందర్భంగా హాలియా మున్సిపాలిటీ చైర్మన్ చింతల చంద్రా రెడ్డి నూతన కమిషనర్ ని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. మున్సిపల్ వైస్ చైర్మన్ గౌని రాజా రమేష్ యాదవ్, కార్యాలయ సిబ్బంది, కౌన్సిలర్లు కమిషనర్‌కి అభినందనలు తెలిపారు.

# రాజేష్ మృతి విచారణ నత్తనడక

### మందకృష్ణ మాదిగ ధ్వజం
### బాధ్యులను కాపాడే ప్రయత్నం వద్దు

**ప్రజాపక్షం/కోదాడ:** కర్ల రాజేష్ లాకప్‌డెత్ కేసు విచారణలో పోలీసుల నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తోందని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ విమర్శించారు. సోమవారం కోదాడలో ఆయన మాట్లాడుతూ విచారణ ప్రారంభించి మూడు నెలలు కావస్తున్నా ఇంకా పూర్తి కాకపోవడం వెనుక పోలీసులను కాపాడే కుట్ర దాగి ఉందని ఆరోపించారు. ఈ కేసులో ప్రధాన బాధ్యులైన చిలుకూరు ఎస్ఐ సురేష్‌రెడ్డిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటి చట్టం కిద శాఖపరమైన చర్యలు తక్షణమే తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎస్సీ, ఎస్టీ చట్టం ప్రకారం ఫిర్యాదు అందిన వెంటనే ఎఫ్ఐఆర్ నమోదు చేయాల్సి ఉన్నా, అప్పటి డిఎస్‌పి, ప్రస్తుత డిఎస్‌పి, ఎస్‌పి నిర్లక్ష్యం వహించారని మండిపడ్డారు. డిజిపి శివధర్‌రెడ్డి స్థాయికి ఫిర్యాదు వెళ్లే వరకు కేసు నమోదు కాకపోవడం శోచనీయమన్నారు. విచారణాధికారిగా ఉన్న డిఎస్‌పి రవి సోమవారం ఇచ్చిన హామీ మేరకు మూడు, నాలుగు రోజుల్లో విచారణ పూర్తి చేసి నివేదిక సమర్పించకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు ఏపూరి రాజు, పాతకోట్ల నాగరాజు, పిడమర్తి వెంకట్రావ్, కుదుముల శ్రీను, లంజపల్లి శ్రీను, కొండపల్లి సూర్యప్రకాశ్, ఆకారపు కొండలు, మొలుగూరి సైదులు, పంది శ్రీను, కర్ల శివ, కర్ల ప్రేమ్, కమల్ పాల్గొన్నారు.



**వారం రోజుల్లో రాజేష్ మృతి కేసు కొలిక్కి : డిఎస్‌పి రవి**

సంచలనం సృష్టించిన కర్ల రాజేష్ మృతి కేసులో దర్యాప్తు సాగుతోందని, ఈ కేసు విచారణలో భాగంగా నల్లగొండ డిఎస్‌పి రవి సోమవారం కోదాడ పట్టణానికి విచ్చేసి కీలక వివరాలను సేకరించారు. రాజేష్ మృతికి సంబంధించిన హైకోర్టు ఇంజెక్షన్‌ను రాజేష్ తల్లి లలితమ్మ నుంచి స్వాధీనం చేసుకున్నట్లు ఆయన తెలిపారు. ప్రస్తుతం కేసు విచారణ దశలో ఉందని, మరో నాలుగైదు రోజుల్లో దర్యాప్తు పూర్తి చేసి పిపి అభిప్రాయం తీసుకున్న అనంతరం కేసును ఫైనలైజ్ చేస్తామని డిఎస్‌పి రవి స్పష్టం చేశారు.

# భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్ ఆశయాలను కొనసాగిస్తాం



**ప్రజాపక్షం/మునుగోడు :** దేశంలో నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడంలో కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి తీన్మార్ వెంకటేశ్వర్లు ఆరోపించారు.సోమవారం మునుగోడు మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో విప్లవ వీరుడు భగత్ సింగ్ 95వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశంలో పెరుగుతున్న నిరుద్యోగ సమస్యను పరిష్కరించేందుకు పార్లమెంటులో భగత్ సింగ్ ఉపాధి హామీ పథకం"ను ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ మండల కార్యదర్శి బందారు శంకర్,సిపిఐ మండల కార్యదర్శి చాపల శ్రీనివాస్,కార్యవర్గ సభ్యులు కట్కూరి లింగస్వామి, ఎఐఎస్ఎఫ్ జిల్లా కోశాధికారి గోపగోని ఉదయ్,నాయకులు రాసమల్ల మహేష్, అందుగుల నరేష్,చింతల రమేష్,గజ్జల కిషన్, శశి పాల్గొన్నారు.




**భగత్ సింగ్ ఎంప్లాయ్‌మెంట్ గ్యారెంటీ స్కీం తీసుకురావాలి**

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** పార్లమెంటులో భగత్ సింగ్ ఎంప్లాయ్‌మెంట్ గ్యారెంటీ స్కీమ్ తీసుకొచ్చి దేశంలోని నిరుద్యోగ సమస్య పరిష్కరించేందుకు కృషి చేయాలని ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి తీర్పారి వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు సోమవారం నల్లగొండ జిల్లా కేంద్రంలోని సిపిఐ కార్యాలయంలో భగత్ సింగ్ 95వ వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు భగత్ సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా కోశాధికారి గోపగోని ఉదయ్,ఏఐవైఎఫ్ నాయకులు బండారు శంకర్,కట్కూరి లింగస్వామి,మధు,వి.లెనిన్, లింగం తదితరులు పాల్గొన్నారు




**ప్రజాపక్షం/దేవరకొండ :** భగత్ సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్ ఆశయాలను కొనసాగిస్తామని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు వలమల్ల ఆంజనేయులు, ఏఐవైఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు ఏషామోని మల్లేష్‌లు అన్నారు. సోమవారం ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో పట్టణంలోని పల్లా పర్వత్‌రెడ్డి భవన్‌లో ఏర్పాటు చేసిన స్వాతంత్ర్య సమరయోధులు, విప్లవ యువకిశోరులు భగత్ సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల 95వ వర్ధంతి కార్యక్రమానికి హాజరై వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భగత్ సింగ్ జయంతి, వర్ధంతిలను అధికారికంగా జరపాలని అదే విధంగా భగత్‌సింగ్ నేషనల్ ఎంప్లాయిమెంట్ గ్యారంటీ యాక్ట్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ మండల అధ్యక్ష, కార్యదర్శులు చైతన్య, భాను, ఎఐఎస్ఎఫ్, ఎఐవైఎఫ్ నాయకులు కొండల్, శ్రీను, కిరణ్, శ్రీకాంత్, శివ, చరణ్, ప్రణేష్, శ్రీశాంత్, శివాజీ, తరుణ్ పాల్గొన్నారు.

**ప్రజాపక్షం/చౌటుప్పల్ :** భారత స్వాతంత్రోద్యమంలో బ్రిటిష్ పాలకులకు వ్యతిరేకంగా భగత్ సింగ్ చేసిన పోరాటం, త్యాగం అజరామరామని ఏఐవైఎఫ్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కొండూరి విప్లవ్ అన్నారు. సోమవారం చౌటుప్పల్‌లో భగత్సింగ్ 95వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మున్సిపాలిటీ శాఖ కార్యదర్శి పగిళ్ల మోహన్ రెడ్డి, బద్దుల సుధాకర్, రొండి నర్సింహా, టంగుటూరు రాములు, దాసరి మనోహర్, సిద్దు పాల్గొన్నారు.



**భగత్‌సింగ్ ఉద్యమ స్ఫూర్తితో యువత ముందుకు సాగాలి**

**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** భగత్‌సింగ్ ఉద్యమ స్ఫూర్తితో యువతగా ముందుకు సాగాలని ఏఐవైఎఫ్ అధ్యక్ష కార్యదర్శులు బూర సైదులు, ఎడెల్లి శ్రీకాంత్ పిలుపునిచ్చారు. సోమవారం జిల్లా కేంద్రంలో ధర్మబిక్షం భవనంలో భగత్‌సింగ్ 95వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ పట్టణ గౌరవ అధ్యక్షులు కుక్కడపు శౌరి, పట్టణ కమిటి నాయకులు అయితగాని కామేష్, ఆలగడప గోపి, రెడ్డిమల్ల శ్రీనివాస్, జనకల సతీష్, బీస్ నాగరాజు, అశోక్, పాల్వాయి అంజయ్య పాల్గొన్నారు.



# ఎల్‌పిజి కొరతపై ఏం చర్యలు తీసుకుంటున్నారు?

• ప్రజలకు ప్రధాని మోదీ సమాధానం చెప్పాలని కాంగ్రెస్ డిమాండ్
• పశ్చిమ ఆసియాలో శాంతి చర్చలకు భారత్ నాయకత్వం వహించాలని సూచన



**న్యూఢిల్లీ :** భారత్‌లో ఎల్‌పిజి కొరత, పెరుగుతున్న ద్రవ్యోల్బణాన్ని ఎదుర్కోవడానికి తీసుకుంటున్న చర్యల గురించి పౌరులకు తెలియజేయాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీని కాంగ్రెస్ డిమాండ్ చేసింది. పశ్చిమ ఆసియాలో శాంతి చర్చలకు భారత్ నాయకత్వం వహించాలని సూచించింది. ప్రధానమంత్రి మోదీ ముందే మాట్లాడి ఉండాల్సిందని కాంగ్రెస్ ఎంపి ప్రియాంక గాంధీ వాద్రా అన్నారు. 'మాకు ఎలాంటి అంచనాలు లేవు. ఆయన ఏం చెప్పాలనుకుంటున్నారో నేను వినాలనుకుంటున్నాను. చాలా సమస్యలు ఉన్నాయి. మన దేశంపై యుద్ధ ప్రభావం తీవ్రంగా ఉంది. ఎల్‌పిజి, అనేక ఇతర సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి' అని ప్రియాంకాగాంధీ సోమవారం పార్లమెంట్ హౌస్ ప్రాంగణంలో విలేకరులతో అన్నారు. ఇదిలా ఉండగా, ప్రధానమంత్రి మోదీ సోమవారం మధ్యాహ్నం పశ్చిమ ఆసియా సంక్షోభంపై లోక్‌సభలో ప్రసంగిస్తూ, ప్రస్తుత పరిస్థితి ఆందోళనకరంగా ఉందని, ఇది ప్రపంచ ఆర్థిక వ్యవస్థపైనా, ప్రజల జీవనోపాధిపైనా తీవ్ర ప్రతికూల ప్రభావాన్ని చూపుతోందని పేర్కొన్నారు. అంతకుముందు, ఈ సంఘర్షణను ముగించే దిశగా ప్రయత్నాలు జరుగుతాయని తమ పార్టీ ఆశిస్తోందని కాంగ్రెస్ ఎంపి రాజీవ్ శుక్లా పేర్కొన్నారు. 'ఈ యుద్ధం భారతదేశానికి నేరుగా హాని కలిగిస్తోంది. ఇది ఆగాలి. మనం వంటగ్యాస్ కొరతను ఎదుర్కొంటున్నాము, అదే సమయంలో డీజిల్ ధరలు కూడా పెరిగే అవకాశం ఉంది... ఇది ఇప్పటికే రూ. 21 పెరిగింది. గతంలో మన విదేశాంగ విధానం తటస్థంగా ఉండేది. మనం ఎవరితోనూ పొత్తు పెట్టుకోలేదు, అందుకే అందరూ మనతో నిలబడ్డారు. ఇప్పుడు, ఇజ్రాయెల్‌కు దగ్గరవ్వడం వల్ల ఆ సమతుల్యత దెబ్బతిన్నట్లు కనిపిస్తోంది. గతంలో మాదిరిగానే, ఇరాన్‌తో సహా అన్ని దేశాలతో మనం మంచి సంబంధాలను కొనసాగించాలి. అంతేకాకుండా, ఉజ్వల పథకం కింద గృహాలకు సిలిండర్లు అందించారు, కానీ ఈ రోజు వాటిలో చాలా వరకు ఖాళీగా పడి ఉన్నాయి. ఈ పథకం వల్ల ప్రయోజనం ఏమిటి? గ్యాస్ అందుబాటులో లేకపోవడంతో ప్రజలకు 'చుల్హాల'కు తిరిగి వెళ్లడం తప్ప మరో మార్గం లేదు' అని శుక్లా పేర్కొన్నారు. ప్రధానమంత్రి ఈ సమస్యను ముందే పరిష్కరించాల్సిందని కాంగ్రెస్ ఎంపి తారిఖ్ అన్వర్ అన్నారు. చాలా కాలం తర్వాత ప్రధానమంత్రి ఈ విషయాన్ని గ్రహించి పార్లమెంటును ఉద్దేశించి మాట్లాడుతున్నారు, కానీ ఆయన ఈ చర్యను చాలా ముందే తీసుకుని ఉండాల్సింది. మనం మనల్ని తటస్థ దేశమని, ఏ కూటమిలోనూ భాగం కాదని చెప్పుకుంటున్నం దున భారతదేశంపై దేశం లోపల, బయట కూడా చాలా అంచనాలు ఉన్నాయన్నారు. మన దేశ విదేశాంగ విధానం స్పష్టంగా ఉందని, ఆ విధానం ప్రకారం, అక్కడ (పశ్చిమ ఆసియాలో) ఏమి జరుగుతున్నా దానిని ఖండించాలిలన్నారు. ఒక మధ్యే మార్గం పరిష్కారం కనుగొనడానికి ప్రయత్నాలు చేయాలని అన్వర్ చెప్పారు. ప్రభుత్వం ఉన్నత స్థాయి సమావేశం ఫలితాన్ని వివరించి, దేశ ప్రజలకు భరోసా ఇవ్వాలని కాంగ్రెస్ ఎంపి ఉజ్వల్ రామన్ సింగ్ అన్నారు. రానున్న రోజుల్లో ఎల్‌పిజి సంక్షోభం, పెరుగుతున్న ద్రవ్యోల్బణం నుండి ఎలా ఉపశమనం కల్పిస్తారో ఆయన (మోదీ) ప్రజలకు భరోసా ఇవ్వాలని, ప్రభుత్వం సమాధానం చెప్పాలని సింగ్ విలేకరులతో అన్నారు. ఈ సమస్యను పరిష్కరించడంలో ఆలస్యం చేస్తున్నందుకు లోక్‌సభ కాంగ్రెస్ విప్ మణికం ఠాగూర్ మోదీని విమర్శించారు. 14 రోజుల మౌనం తర్వాత, కేరళ, తమిళనాడు, పుదుచ్చేరి, బెంగాల్, అసోంలో ఇంధన సంక్షోభం గురించి మాట్లాడటానికి ప్రధానమంత్రికి ఇప్పుడు సమయం దొరికిందని ఎద్దేవా చేశారు. స్పష్టమైన ప్రణాళిక ఏదీ లేదని విమర్శించారు. ఈపాటికి ఎల్‌పిజి కొరత పెరిగింది. ఎల్‌పిజి వాణిజ్య ధర 40 శాతం పెరిగింది. విమాన ఛార్జీలు పెరగబోతున్నాయి. (సిసిఎస్) సమావేశం ఫలితం ఏమిటి? కేవలం టీ, బిస్కెట్లు, చర్చలు మాత్రమేనా అని ఠాగూర్ వ్యంగ్యానించారు. పశ్చిమ ఆసియాలో పెరుగుతున్న ఉద్రిక్తతలు ప్రపంచ సరఫరా గొలుసులకు అంతరాయం కలిగించి, నిత్యావసర వస్తువులపై ప్రభావం చూపుతాయని కాంగ్రెస్ ఎంపీ మనీష్ తివారీ హెచ్చరించారు.

# భారత్‌కు మరో రెండు ఎల్‌పిజి ట్యాంకర్లు

● హోర్ముజ్ జలసంధిని దాటి భారత ఓడరేవులకు ● షిప్ ట్రాకింగ్ డేటా వెల్లడి ● హోర్ముజ్ జలసంధి మూసివేతలో చిక్కుకుపోయిన 'పైన్‌గ్యాస్', 'జగ్‌వసంత్'కు తాజాగా లైన్‌క్లియర్



**న్యూఢిల్లీ :** భారత జెండాలు కలిగి ఉన్న మరో రెండు ఎల్‌పిజి ట్యాంకర్లు పర్షిన్ గల్ఫ్ నుంచి ప్రయాణాన్ని ప్రారంభించి, యుద్ధంలో దెబ్బతిన్న హోర్ముజ్ జలసంధిని దాటి భారత ఓడరేవులకు బయల్దేరాయి. ఈ విషయం షిప్ ట్రాకింగ్ డేటా ద్వారా వెల్లడి అయ్యింది. సోమవారం మధ్యాహ్నం ఎల్‌పిజి ట్యాంకర్లు పైన్ గ్యాస్, జగ్ వసంత్ ఇరాన్‌కు చెందిన లారక్, ఖ్వేష్మ్ దీవుల మధ్య ఉన్న నదీ జలాల్లో ఒకదానికొకటి అత్యంత సమీపంగా ప్రయాణిస్తున్నాయి. బహుశా జలసంధిని దాటేముందు ఇరాన్ అధికార యంత్రాంగాన్ని ఈ సంకేతాలు ఇస్తున్నట్లు స్పష్టమవుతోంది. మధ్య ప్రాచ్యంలో యుద్ధం కారణంగా ఇరాన్, ఇతర దేశాల మధ్య ఉన్న ఇరుకైన జలమార్గం హోర్ముజ్ జలసంధి మూసివేయబడిన అనంతరం పర్షియన్ గల్ఫ్‌లో చిక్కుకుపోయిన 22 భారత జెండా నౌకలలో ఈ రెండు నౌకలు కూడా ఉన్నాయి. ఈ జలమార్గం చమురు, గ్యాస్ ఉత్పత్తి చేసే గల్ఫ్ దేశాలను మిగిలిన ప్రపంచానికి కలుపుతోంది. షిప్ ట్రాకింగ్ డేటా ప్రకారం... ఆ రెండు నౌకలు భారత ఓడ రేవులకు వెళ్లే ముందు సోమవారం ఏదో ఒక సమయంలో సముద్రాన్ని దాటవచ్చని తెలిసింది. అయితే గతంలో దేశంలో ఒక రోజు వంటకు సరిపడా వంట గ్యాస్‌కు సమానమైన 92,712టన్నుల ఎల్‌పిజిని మోసుకొచ్చిన ఎం.టి. శివాలిక్, ఎం.టి.నందాదేవి నౌకలు భారత తీరాన్ని సురక్షితంగా చేరిన విషయం తెలిసిందే. అమెరికా, ఇరాన్, ఇజ్రాయెల్ మధ్య యుద్ధం చెలరేగిన తర్వాత పశ్చిమాసియాలో యుద్ధం మొదలైనప్పుడు వాస్తవానికి హోర్ముజ్ జలసంధిలో 28 భారత జెండా నౌకలు ఉండేవి. వీటిలో 24నౌకలు జలసంధికి పశ్చిమవైపున నాలుగు నౌకలు మరోవైపున ఉన్నాయి. గత కొద్ది రోజులుగా ఇరువైపుల నుండి రెండేసి నౌకలు సురక్షితంగా ఒడ్డుకు చేరుకున్నాయి. ఎల్‌పిజి రవాణ నౌక శివాలిక్ మార్చి 16న గుజరాత్‌లోని ముంద్రాకు చేరుకోగా, మరో ఎల్‌పిజి ట్యాంకర్ మరుసటి రోజు గుజరాత్‌లోని కాండ్లా ఓడరేవుకు చేరుకుంది.ఈ రెండు ఎల్‌పిజి నౌకలు మార్చి 13న వాటి ప్రయాణాన్ని ప్రారంభించి మార్చి 14 తెల్లవారుజామున హోర్ముజ్ జలసంధిని దాటాయి. యుఎఇ నుంచి భారత జెండా కలిగిన ఆయిల్ ట్యాంకర్ 'జగ్ లాడ్కీ' 88,886 టన్నుల క్రూడ్ ఆయిల్ తో మార్చి 18న ముంద్రాకు చేరుకుంది. ఒమన్ నుంచి ఆఫ్రికాకు గాసోలైన్‌ను తీసుకు వెళుతున్న మరో ట్యాంకర్ 'జగ్ ప్రకాశ్' జలసంధిని దాటి టాంజానియాకు వెళుతోంది. యుద్ధ ప్రాంతంలో మిగిలి ఉన్న 24 భారత జెండా నౌకలలో, 22 నౌకలు 611 మంది నావికులతో జలసంధికి పశ్చిమవైపున ఉండగా, రెండు తూర్పు వైపున ఉన్నాయి. నౌకాదళంలో మిగిలి ఉన్న మిగతా 22 భారత జెండా నౌకలలో 6 ఎల్‌పిజి నౌకలు ఉండగా, వీటిలో రెండు భారతదేశానికి బయల్దేరాయి. మిగిలిన వాటిలో ఒకటి ద్రవీకృత సహజ వాయువు (ఎల్ఎన్‌జి) ట్యాంకర్, నాలుగు క్రూడ్ ఆయిల్ ట్యాంకర్లు, ఒకటి రసాయనిక ఉత్పత్తులను కూడా రవాణా చేస్తోంది ఉన్నది, మూడు కంటైనర్ నౌకలు, 2 బల్క్ క్యారియర్లు కూడా ఉన్నాయి.అదనంగా ఒక నౌక డ్రెడ్జర మరొకటి ఖాళీగా ఉన్నది. మూడు సాధారణ నిర్వహణ కోసం డ్రై డాక్‌లో ఉన్నాయి. మొత్తం మీద దాదాపు 500 ట్యాంకర్ నౌకలు పర్షియన్ (అరేబియా) గల్ఫ్‌కే పరిమితమై ఉన్నాయి. వీటిలో 108 ముడి చమురు ట్యాంకర్లు, 166 చమురు ఉత్పత్తుల ట్యాంకర్లు, 104 రసాయనిక / ఉత్పత్తుల ట్యాంకర్లు, 52 రసాయన ట్యాంకర్లు, 53 ఇతర రకాల ట్యాంకర్లు ఉన్నాయి. భారతదేశం తన ముడిచమురులో 88శాతం, సహజ వాయువులో 50శాతం, ఎల్‌పిజిలో 60శాతం దిగుమతి చేసుకుంటోంది. యుద్ధం ప్రారంభం కావడానికి ముందు భారతదేశం దిగుమతి చేసుకున్న ముడి చమురులో సగానికి పైగా సౌదీ అరేబియా, ఇరాక్, యుఎఇ వంటి దేశాల నుంచి వచ్చేది. రవాణ కోసం ఈ దేశాలు హోర్ముజ్ జలసంధిని ఉపయోగిస్తాయి. దాదాపు 85 నుంచి 95 శాతం ఎల్‌పిజి, 30శాతం గ్యాస్ ఈ హోర్ముజ్ జలసంధి ద్వారానే వచ్చింది.

## ఎఐఎంఐఎం–హుమాయన్ మధ్య పొత్తు

# ఓట్లను చీల్చేందుకే

పశ్చిమ బెంగాల్‌లో ప్రతిపక్షపార్టీలు మండిపాటు



**నూఢిల్లీ :** పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల ముందు ఎఐఎంఐఎం, సస్పెండ్ అయిన తృణమూల్ కాంగ్రెస్ (టిఎంసి) ఎమ్మెల్యే హుమాయున్ కబీర్ పొత్తు పెట్టుకోవడంపై ప్రతిపక్ష నాయకులు విమర్శించారు. ఇలాంటి చర్యలు ఓట్లను చీల్చి, లౌకిక పార్టీలను బలహీనపరుస్తాయని ఆందోళన వ్యక్తం చేశారు. అత్యంత కీలకమైన పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల కోసం ఎఐఎంఐఎంకు చెందిన అసదుద్దీన్ ఒవైసీ, హుమాయున్ కబీర్‌కు చెందిన ఆమ్ జనతా ఉన్నయన్ పార్టీ (ఎజెయుపి)తో పొత్తు పెట్టుకున్నారు. 294 మంది సభ్యులున్న ఈ అసెంబ్లీకి ఏప్రిల్ 23, 29 తేదీలలో పోలింగ్ జరగనుండగా, మే 4న ఓట్ల లెక్కింపు జరుగుతుంది. టిఎంసి ఎంపీ సౌగత రాయ్ దీనిని ఒక చెడు పరిణామం అని అభివర్ణించారు. ఈ చర్య ముస్లిం ప్రజలను ఒంటరిని చేయవచ్చని అన్నారు. 'ఒవైసీ పార్టీ వాస్తవానికి బిజెపికి సహాయం చేస్తోంది. కానీ దాని వల్ల ఎలాంటి ప్రభావం ఉండదు. వారికి బలం లేదు, ఓట్లు కూడా రావు' అని రాయ్ పార్లమెంట్ హౌస్ ప్రాంగణంలో విలేకరులతో అన్నారు. లౌకిక శక్తులను బలహీనపరిచేందుకు కొందరు కాంట్రాక్టు తీసుకున్నారని కాంగ్రెస్ ఎంపి మణికం ఠాగూర్ ఆరోపించారు. పొత్తులు పెట్టుకోవడం రాజకీయ ఎంపికే అయినా, మతతత్వ శక్తులను ఓడించడం పైనే దృష్టి కేంద్రీకరించాలని మరో కాంగ్రెస్ ఎంపి ఉజ్వల్ రామన్ సింగ్ నొక్కి చెప్పారు. ఎవరైనా మరొకరితో పొత్తు పెట్టుకోవడం వారి సొంత విషయం. కానీ, మతతత్వ శక్తులను ఓడించడమే మా లక్ష్యమన్నారు. ఇందుకోసం కాంగ్రెస్ పార్టీ నిలకడగా పనిచేస్తూనే ఉంటుందన్నారు. ఎఐఎంఐఎం తరచుగా బిజెపికి సహాయం చేస్తుందని శివసేన (యుబిటి) ఎంపి ప్రియాంక చతుర్వేది ఆరోపించారు. బిజెపికి సంక్షోభం వచ్చినప్పుడల్లా, అది తన స్పీడ్ డయల్‌లో ఉన్న ఎఐఎంఐఎంకు ఫోన్ చేస్తుంది. వచ్చి పాల్గొని, గెలవడానికి సహాయం చేయమని ఆ పార్టీ వారిని ఆహ్వానిస్తుంది'అని ఆమె పేర్కొన్నారు. ప్రతిపక్షాల ఓట్ల వాటాను చీల్చి, కాషాయ పార్టీకి ప్రయోజనం చేకూర్చడానికే ఎన్నికలలో పాల్గొంటుందని ఆరోపిస్తూ, ఎఐఎంఐఎంను జార్ఖండ్ ముక్తి మోర్చా ఎంపి మహువా మాఝీ బిజెపి 'బిటీమ్'గా అభివర్ణించారు. 'ఇది అన్నిచోట్లా జరుగుతోంది. వారు (ఎఐఎంఐఎం) ఎక్కడైతే తమ అభ్యర్థులను నిలబెట్టారో, అది చివరికి బిజెపికే ప్రయోజనం చేకూర్చడం మీరు చూశారు. అందుకే, అనేక రాష్ట్రాల్లో, వారి సొంత వర్గానికి చెందిన ప్రజలు వారికి మద్దతు ఇవ్వకుండా, బిజెపిని ఓడించి గెలిచే అవకాశాలు ఎక్కువగా ఉన్న పార్టీకి ఓటు వేస్తున్నారు' అని ఆమె పార్లమెంట్ హౌస్ ప్రాంగణంలో విలేకరులతో అన్నారు. 'బెంగాల్‌లో ప్రజలు మమతా బెనర్జీని ఎన్నుకున్నారు; ఆమె విజయం సాధించి బిజెపిని ఓడించగలరనే నమ్మకంతో ముస్లిం సమాజానికి చెందినవారు కూడా ఆమెకు మద్దతు పలికారు. కానీ, ఎఐఎంఐఎం పోటీ చేయడం ద్వారా ఓట్లను చీల్చుతోంది, తద్వారా అది బిజెపికి గణనీయంగా లబ్ధి చేకూరుస్తోంది. ఈ కారణంగానే, తాము ఎఐఎంఐఎంను బిజెపి బిటీమ్‌గా పరిగణిస్తున్నామన్నారు.

# రైతు రుణమాఫీ ప్రతిపాదన కేంద్రం పరిశీలనలో లేదు: నిర్మలా సీతారామన్



**న్యూఢిల్లీ :** రైతులకు పూర్తి రుణమాఫీకి సంబంధించి ఎలాంటి ప్రతిపాదన కేంద్ర ప్రభుత్వ పరిశీలనలో లేదని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ సోమవారం పార్లమెంటులో వెల్లడించారు. అయితే, రైతుల ఆర్థిక పరిస్థితులను బలోపేతం చేయడానికి కేంద్ర ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుందని, వాటిలో కిసాన్ క్రెడిట్ కార్డ్ (కెసిసి) ద్వారా సకాలంలో తగినంత రుణం అందించడం కూడా ఉందన్నారు. ఈ కెసిసి కింద రూ. 3 లక్షల వరకు పంట రుణాన్ని రాయితీ వడ్డీ రేట్లకు అందిస్తున్నామని తెలిపారు. సవరించిన వడ్డీ రాయితీ పథకం (ఎంఐఎస్ఎస్) కింద సకాలంలో తిరిగి చెల్లిస్తే అదనపు ప్రోత్సాహకాలు కూడా ఇస్తున్నామని గుర్తు చేశారు. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బిఐ) జారీ చేసిన ప్రాధాన్య రంగ రుణాల మార్గదర్శకాల ప్రకారం అనుబంధ కార్యకలాపాల రుణాలతో సహా, పూచీకత్తు లేని స్వల్పకాలిక వ్యవసాయ రుణాలను రూ. 1.60 లక్షల నుంచి రూ. 2 లక్షలకు ప్రభుత్వం పెంచిందన్నారు. అలాగే వ్యవసాయంతో సహా ఆర్థిక వ్యవస్థలోని ప్రాధాన్య రంగాలకు బ్యాంకింగ్ వ్యవస్థ నుంచి తగినంత రుణ ప్రవాహం ఉండేలా చూస్తున్నామని లోక్‌సభకు ఇచ్చిన సమాధానంలో తెలిపారు. వీటితోపాటు ప్రధాన మంత్రి కిసాన్ సమ్మాన్ నిధి (పిఎంకిసాన్) పథకం కింద రైతులకు నేరుగా నగదు బదిలీతో పాటు పంటల బీమా అందిస్తున్నామని పేర్కొన్నారు. మరోవైపు సాయుధ దళాల్లో పని చేస్తూ తీవ్రమైన వైకల్యం సంభవించి సర్వీస్ నుంచి వైదొలగిన సైనికులు పొందే వైకల్య పింఛనుకు ఆదాయపు పన్ను మినహాయింపుపై అడిగిన ప్రశ్నకు సమాధానం ఇచ్చారు. ఆ పన్ను మినహాయింపును నిలిపివేయడం లేదని ఆర్థిక మంత్రి స్పష్టం చేశారు. ఇంతకుముందు ఉన్న మినహాయింపు, దాని పరిధిని షరతులతో సహా కొనసాగేలా చూసేందుకే ప్రస్తుత నిబంధనను చేర్చినట్లు ఆమె వివరించారు. '2025 ఆదాయపు పన్ను చట్టం అమల్లోకి రావడంతో 1922 ఆదాయపు పన్ను చట్టానికి సంబంధించిన మినహాయింపు నిబంధనలు అమలులో లేకుండా పోయాయి. అందువల్ల, కొత్త చట్టంలో స్పష్టమైన నిబంధన లేనందున మినహాయింపు రద్దయి ఉండేది. అందుకే దానిని కొనసాగించేలా కొత్త నిబంధనను ఇందులో చేర్చాం.' అని ఆర్థిక మంత్రి అన్నారు. 2026 జనవరి 31 నాటికి వైకల్యంతో సాయుధ దళాల సర్వీస్ నుంచి పదవీ విరమణ చేసిన సాయుధ దళాల సిబ్బంది సంఖ్య 1,47,263గా ఉందని నిర్మలా సీతారామన్ తెలిపారు. వైకల్యం కారణంగా సర్వీస్ తొలగించి పింఛను పొందుతున్న సాయుధ దళాల సిబ్బంది 89,598 మంది అని ఆమె వివరించారు. సాయుధ దళాల్లో సేవలు అందిస్తున్న సిబ్బందికి ఏటా వైద్యపరమైన అర్హత పరీక్షలు నిర్వహిస్తారని పేర్కొన్నారు. ఇందులో వ్యాధులు, వైకల్యాలు, గాయాలు, వైద్యపరమైన సమస్యలు ఉన్న సిబ్బందిని గుర్తిస్తారని చెప్పారు. ఆ తర్వాత వారి ఆరోగ్య పరిస్థితి ఆధారంగా వర్గీకరిస్తారని వివరించారు. ఈ వార్షిక వైద్య పరీక్షలో సాధారణ శారీరక, వ్యవస్థాగత పరీక్షతో పాటు అనేక ఇతర పరీక్షలు కూడా ఉంటాయన్నారు. ఈ పరీక్షలు ఆయా సర్వీసులో, అధికారి పాత్ర ఆధారంగా వేర్వేరుగా ఉంటాయని ఆమె చెప్పారు.

## కార్పొరేట్ చట్టాల (సవరణ) బిల్లు-2026

# జెపిసికి సిఫార్సు

ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రతిపాదన మూజువాణి ఓటుతో ఆమోదం

దీనికి ముందు లోక్‌సభలో ప్రవేశపెట్టిన ఈ బిల్లును గట్టిగా వ్యతిరేకించిన విపక్షాలు



**న్యూఢిల్లీ :** సమగ్ర విశ్లేషణ, సిఫార్సుల కోసం లోక్‌సభ సోమవారం కార్పొరేట్ చట్టాల (సవరణ) బిల్లు2026ను పార్లమెంట్ ఉభయ సభల సభ్యులతో కూడిన జాయింట్ పార్లమెంటరీ కమిటీ (జెపిసి)కి పంపింది. ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ సూచించిన తర్వాత మూజువాణి ఓటు ద్వారా ఈ నిర్ణయం తీసుకున్నారు. అంతకు ముందు లోక్‌సభలో ఈ బిల్లును ప్రవేశపెట్టిన తర్వాత ప్రతిపక్ష సభ్యులైన మనీష్ తివారీ (కాంగ్రెస్), సౌగతారాయ్ (తృణమూల్ కాంగ్రెస్), టి.సుమతి (డిఎంకె)లు ఈ బిల్లును గట్టిగా వ్యతిరేకించారు. కంపెనీలు తమ లాభాలలో 2శాతాన్ని కార్పొరేట్ సామాజిక బాధ్యత (సిఎస్ఆర్) కింద చెల్లించాలనే చట్టంలోని నిబంధనలను ఈ చట్టం నీరుగార్చేందుకు ప్రయత్నిస్తోందని వారు ఆరోపించారు. అయితే ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ఈ ఆరోపణలను గట్టిగా ఖండించారు. రెండు సంవత్సరాల చర్చల తర్వాత ఈ బిల్లును ప్రవేశపెట్టారని తెలిపారు. సభ్యుల ఆందోళనలు నిరాధారమైనవన్నారు. ఈ బిల్లు సిఆర్ఎస్‌కు సంబంధించిన మొత్తం నిబంధనను కాకుండా కేవలం నికర లాభాల ప్రమాణాన్ని మాత్రమే సవరించాలని కోరుకుంటోందని సీతారామన్ అన్నారు. అనంతరం ఆమె విస్తృతమైన చర్చలు, సరైన సూచనల కోసం ఈ విషయాన్ని జాయింట్ పార్లమెంటరీ కమిటీకి పంపించాలని స్పీకర్ ఓం బిర్లాకు సూచించారు. మనీష్ తివారీ మాట్లాడుతూ కార్పొరేట్ వ్యవహారాలపై పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ ఇప్పటికే ఉన్నందున కొత్త జెపిసిని ఏర్పాటుచేసే బదులు ఆ కమిటీకే ఈ బిల్లును పంపాలని అన్నారు. కాంగ్రెస్ ఎంపి మనీష్ తివారీ ప్రసంగంపై హోం మంత్రి అమిత్‌షా జోక్యం చేసుకుంటూ చట్టాన్ని పార్లమెంటరీ కమిటీకి నివేదించడం గురించి ప్రతిపక్ష సభ్యులెవరూ మాట్లాడలేదని అన్నారు. ఇప్పుడు స్వయంగా ఆర్థికమంత్రి దానిని కోరినప్పుడు బిల్లును ఏ కమిటీకి పంపాలనే దానిపై వారు వాదించడం శోచనీయమన్నారు. అనంతరం స్పీకర్ ఓం బిర్లా ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ ప్రతిపాదనకు ఓటింగ్ పెట్టగా సభ దానిని మూజువాణీ ఓటుతో ఆమోదించింది. కార్పొరేట్ చట్టాల (సవరణ)బిల్లు2026 ఉద్దేశ్యం వ్యాపారం చేసే సౌలభ్యాన్ని కల్పించడానికి, కంపెనీ లా కమిటీ తన 2022 నివేదికలో గుర్తించిన లోపాలను పరిష్కరించడానికి లిమిటెడ్ లయబుల్ పార్ట్‌నర్‌షిప్ (ఎల్ఎల్‌పి) చట్టం, 2008, కంపెనీల చట్టాన్ని సవరించాలని లక్ష్యంగా పెట్టుకుంది. వ్యాపారాలపై నిబంధనల పాటింపు భారాన్ని మరింత సులభతరం చేయడానికి, చిన్న కార్పొరేట్ నేరాలను నేరరహితం చేయాలన్న ప్రభుత్వ అజెండాను ముందుకు తీసుకెళ్లడానికి ఉద్దేశించిన ప్రతిపాదిత బిల్లుకు కేంద్ర మంత్రివర్గం ఇప్పటికే ఆమోదం తెలిపింది. సీతారామన్ ప్రకారం వేగంగా అభివృద్ధి చెందుతున్న కార్పొరేట్ ప్రపంచం మారుతున్న వ్యాపార పద్ధతుల దృష్ట్యా ప్రస్తుత నియంత్రణ పద్ధతులను క్రమబద్ధీకరించి, వాటిని బలోపేతం చేయడంతోపాటు కొత్త భావనలను గుర్తించడమే ఈ సవరణల లక్ష్యం.

## ఎన్ఇపి ఏ రాష్ట్రంపైనా ఒక్క భాషనూ కూడా రుద్దదు

కేంద్ర విద్యాశాఖ సహాయ మంత్రి జయంత్ చౌదరి

**న్యూఢిల్లీ :** జాతీయ విద్యా విధానం (ఎన్ఇపి) ఏ రాష్ట్రంపైనా హిందీతో సహా ఒక్క భాషను కూడా రుద్దడం లేదని, పైగా అది బహుభాషావాదాన్ని స్పష్టంగా ప్రోత్సహిస్తుందని కేంద్ర విద్యాశాఖ సహాయ మంత్రి జయంత్ చౌదరి పేర్కొన్నారు. సోమవారం లోక్‌సభలో ప్రశ్నోత్తరాల సమయంలో అనుబంధ ప్రశ్నలకు మంత్రి సమాధానమిచ్చారు. ఎన్ఇపి 2020పై తమిళనాడు కొంత అభ్యంతరం వ్యక్తం చేసినప్పటికీ, కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మక పాఠశాల విద్యా కార్యక్రమమైన సమగ్ర శిక్ష కింద ఆ రాష్ట్రానికి రూ. 538 కోట్లు విడుదల చేసిందని పేర్కొన్నారు. ఏ భాషను కూడా బలవంతంగా రుద్దడం లేదన్నారు. ఎన్ఇపిలో ప్రతిపాదించిన మూడు భాషలు, ద్విభాషా సూత్రానికి అనుగుణంగా ఉన్నాయని, హిందీతో సహా ఏ భాషను కూడా బలవంతంగా రుద్దడం లేదు, దీనిని పూర్తిగా అమలు చేయడం రాష్ట్ర ప్రభుత్వానికే వదిలేశామని స్పష్టం చేశారు. జాతీయ విద్యా విధానం (ఎన్ఇపి)లోని 4.13వ పేరా బహుభాషావాదాన్ని స్పష్టంగా ప్రోత్సహిస్తుందని, చిన్న వయసులోనే బహుళ భాషలకు పరిచయం కావడం వల్ల అభ్యాస సామర్థ్యానికి, ఫలితాలకు స్పష్టమైన ప్ర యోజనాలు ఉంటాయని మంత్రి అన్నారు. మూడు భాషలను బోధించేందుకు పాఠశాలల్లో సామర్థ్యాన్ని పెంపొందించాలని, 15 ఏళ్ల వయసు వచ్చేసరికి భారతదేశానికి చెందిన కనీసం రెండు భాషలలో ప్రావీణ్యం సాధించేలా చూడాలని, మూడో భాషను స్థానిక అవసరాలకు వదిలివేయాలని ఇది రాష్ట్రాలను ఆదేశిస్తుందన్నారు.

## తమినాడులో ఎన్‌డిఎ కూటమి మధ్య

# కుదిరిన ఒప్పందం

బిజెపి, పిఎంకె, ఎఎంఎంకెకు 56 సీట్లు కేటాయింపు




**చెన్నై :** తమిళనాడులో ఏప్రిల్ 23న జరగనున్న అసెంబ్లీ ఎన్నికల కోసం, ఎఐఎడిఎంకె నేతృత్వంలోని ఎన్‌డిఎ కూటమి సోమవారం కీలక భాగస్వామ్య పక్షాల సీట్ల పంపకం ఒప్పందాన్ని ఖరారు చేసింది. ఈ ఒప్పందంలో భాగంగా ద్రవిడ పార్టీ అయిన ఎఐఎడిఎంకె, బిజెపి 27, పిఎంకెకు 18, ఎఎంఎంకెకు 11 సీట్లను కేటాయించింది. సోమవారం చెన్నైలోని పార్టీ ప్రధాన కార్యాలయం 'పురచ్చి తలైవర్ ఎంజిఆర్ మాలిగై'లో జరిగిన విలేకరుల సమావేశంలో ఎఐఎడిఎంకె ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి కె పళనిస్వామి మాట్లాడుతూ ఇతర మిత్రపక్షాలతో కూడా చర్చలు కొనసాగుతున్నాయని, అవి ఒక కొలిక్కి వస్తాయని తెలిపారు. కూటమి పార్టీలు పోటీ చేసే నియోజకవర్గాల పేర్లను త్వరలోనే గుర్తిస్తామని, సీట్ల పంపకంపై చర్చలు స్నేహపూర్వకంగా జరుగుతున్నాయని ఆయన అన్నారు. తమిళనాడులోని 234 అసెంబ్లీ స్థానాలకు ఏప్రిల్ 23న ఎన్నికలు జరగనున్నాయి. ఎన్‌డిఎలోని ఇతర భాగస్వామ్య పక్షాలలో మాజీ కేంద్ర మంత్రి జికె వాసన్ నేతృత్వంలోని తమిళ మాణిల కాంగ్రెస్ (మూపనార్) ఐజెకె ఉన్నాయి. ఎఐఎడిఎంకె పోటీ చేయనున్న సీట్ల సంఖ్య గురించి అడగ్గా, కొన్ని పార్టీలతో చర్చలు కొనసాగుతున్నాయని, అవి ముగిశాక ఆ సమాచారాన్ని పంచుకుంటామని పళనిస్వామి అన్నారు. సీనియర్ బిజెపి నాయకుడు పీయూష్ గోయల్, పిఎంకె అగ్ర నాయకుడు అన్బుమణి రామదాస్, ఎఎంఎంకె అధినేత టిటివి దినకరన్ సహా కూటమి పార్టీల నాయకుల సమక్షంలో, పళనిస్వామి తాము నాయకత్వం వహిస్తున్న కూటమిని 'బంధం'తో కూడినదిగా అభివర్ణించి, దానిని ఒక 'విజయవంతమైన' కూటమిగా పేర్కొన్నారు. మొత్తం 234 అసెంబ్లీ నియోజకవర్గాలకు గాను, ఈ కూటమి కనీసం 210 స్థానాల్లో విజయం సాధిస్తుందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. 'కూటమి గెలుస్తుంది, ఎఐఎడిఎంకె ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుంది' అని ఆయన ధృవీకరించారు. డిఎంకె, కాంగ్రెస్ మధ్య 'మాటల యుద్ధం'తో కూడిన 'సుదీర్ఘమైన, ఆలస్యమైన' సీట్ల పంపకం ప్రక్రియను ఎద్దేవా చేస్తూ, 2021లో ఆరు సీట్లు గెలుచుకున్న సిఇఐ(ఎం) ఇప్పుడు ఐదు అసెంబ్లీ సీట్ల కోసం పోరాడుతోందని ఆయన ఆరోపించారు. 'పీయూష్ గోయల్, నైనార్ నాగేంద్రన్, ఎల్ మురుగన్, అన్బుమణి రామదాస్, టిటివి దినకరన్ ఉదయం వచ్చారు, మధ్యాహ్నం సీట్ల పంపకంపై నిర్ణయం తీసుకున్నారు, సాయంత్రం ఆ నిర్ణయాన్ని ప్రకటిస్తున్నారు; ఎంత వేగంగా జరిగిందో చూడండి. డిఎంకెను అధికార పీఠం నుంచి గద్దె దించడమే ఎఐఎడిఎంకతె లక్ష్యం. డిఎంకె కూటమిలో సీట్ల పంపకం చర్చల్లో నెలకొన్న ప్రతిష్టంభనను మీడియా విమర్శించలేదు' అని ఆయన అన్నారు. సీట్ల పంపకం విషయమై కేంద్ర హోం మంత్రి అమిత్ షాను కలిసేందుకు తాను ఢిల్లీ వెళ్లినందుకు తనపై డిఎంకె చేస్తున్న విమర్శలను తిప్పికొడుతూ, ఇటీవల జాతీయ రాజధానిలో డిఎంకె ఎంరి కనిమొళి కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీని ఎందుకు కలిశారని ఆయన ఆశ్చర్యం వ్యక్తం చేశారు. ఎన్‌డిఎ నాయకులు ఢిల్లీకి వస్తే వారిని లక్ష్యంగా చేసుకుని దూషణాత్మక కంటెంట్‌ను ప్రచారం చేయడం ముఖ్యమంత్రి ఎం.కె. స్టాలిన్‌కు అలవాటుగా మారిందని ఆయన ఆరోపించారు.

## ఆహార ధరల పెరుగుదల, క్షీణిస్తున్న రూపాయి

# సమస్యల పరిష్కారంలో విఫలం

కేంద్రంపై కాంగ్రెస్ ధ్వజం



**న్యూఢిల్లీ :** పెరుగుతున్న నిరుద్యోగం, అధికమవుతున్న ఆహార ధరలు, క్షీణిస్తున్న రూపాయి వంటి సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమైందని కాంగ్రెస్ పేర్కొంది. రాజ్యసభలో వినియోగాల బిల్లు (2), 2026పై జరిగిన చర్చల్లో పాల్గొన్న కాంగ్రెస్ సభ్యుడు నీరజ్ డాంగీ, బిజెపియేతర పాలిత రాష్ట్రాల పట్ల కేంద్రం సవతి తల్లిలా వ్యవహరిస్తోందని ఆరోపించారు. ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తరఫున ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి ఈ బిల్లును ప్రవేశపెట్టారు. గత వారం లోక్‌సభ ఈ బిల్లును ఆమోదించింది. అందులో 'పారదర్శకత తీవ్రంగా లోపించిందని' డాంగీ అన్నారు. ప్రతిపాదిత వ్యయంపై స్పష్టత లేదని పేర్కొంటూ, కేంద్ర బడ్జెట్‌లో బిజెపియేతర పాలిత రాష్ట్రాల పట్ల సవతి తల్లిలా వ్యవహరిస్తూ ప్రభుత్వం తన బాధ్యత నుంచి తప్పించుకోవడానికి ప్రయత్నిస్తోందని ఆరోపించారు. ఉద్యోగ కల్పన, ద్రవ్యోల్బణం వంటి వివిధ సవాళ్లను దేశం ఎదుర్కొంటోందని, రూపాయి విలువ క్షీణించడం వల్ల చిన్న వ్యాపారాలకు ముడిసరుకు ఖర్చులు పెరిగి ధరల పెరుగుదలకు దారితీసిందని ఆయన ప్రత్యేకంగా ప్రస్తావించారు. పడిపోతున్న రూపాయి గురించి ప్రస్తావిస్తూ, బిజెపి నేతృత్వంలోని ప్రభుత్వ హయాంలో పరిస్థితి అదుపు తప్పిందని, దానిని నియంత్రించలేకపోతే అధికారంలో ఉండే హక్కు ప్రభుత్వానికి లేదని కాంగ్రెస్ సభ్యుడు అన్నారు. బంగారం, వెండి ధరలు సామాన్యుడికి అందుబాటులో లేకుండా పోయాయని డాంగీ అభిప్రాయపడ్డారు. దిగుమతి సుంకాన్ని తొలగించడం, వస్తు సేవల పన్నును తగ్గించడం వంటి నిర్దిష్ట చర్యలు తీసుకోవాలని ఆయన కేంద్రాన్ని కోరారు. ప్రస్తుతం కొనసాగుతున్న పశ్చిమ ఆసియా సంఘర్షణను ప్రస్తావిస్తూ, ప్రభుత్వం దేశాన్ని ఎల్‌పిజి సంక్షోభంలోకి నెట్టిందని ఆయన ఆరోపించారు. అనేక హోటళ్లు, రెస్టారెంట్లు మూతపడే దశలో ఉన్నాయని, అదే సమయంలో గృహ బడ్జెట్లు పెరిగి చిన్న వ్యాపారాలు నష్టాలను ఎదుర్కొంటున్నాయని, సిలిండర్ల బ్లాక్ మార్కెటింగ్ కూడా జరుగుతోందని ఆయన అన్నారు. రైతులు ఎరువుల కొరతను ఎదుర్కొంటున్నారని, దీనివల్ల కేంద్రం ఎరువుల సబ్సిడీలను పెంచాల్సి వచ్చిందని, భారతదేశం ఎరువుల దిగుమతులపై ఎంతగా ఆధారపడి ఉందో ఈ కాంగ్రెస్ ఎంపి ఎత్తి చూపారు. 2026–27 సంవత్సరానికి వివిధ మంత్రిత్వ శాఖల గ్రాంట్ల డిమాండ్ల రూపంలో మొత్తం వ్యయం రూ. 53 లక్షల కోట్లుగా అంచనా వేయబడిందని, అయితే దానిని సమగ్ర అభివృద్ధికి ఖర్చు చేస్తారా లేక కేవలం కొద్దిమంది వ్యక్తుల ప్రయోజనం కోసమేనా అనేది చూడాల్సి ఉందని డాంగీ అన్నారు. దేశం సాంకేతిక రంగంలో వేగంగా ముందడుగు వేస్తోందని, పునరుత్పాదక ఇంధన రంగంలో భారతదేశం అందరికంటే ముందంజలో ఉందని బిజెపికి చెందిన మదన్ రాథోడ్ పేర్కొన్నారు. నరేంద్ర మోదీ నేతృత్వంలోని ప్రభుత్వం మావోయిస్టు ఉగ్రవాదాన్ని పూర్తిగా అణచివేసిందని ఆయన తెలిపారు. గత కాంగ్రెస్ ప్రభుత్వాల హయాంలో జరిగిన కుంభకోణాలను ప్రస్తావిస్తూ, ప్రస్తుత ప్రభుత్వంలో అవినీతి పూర్తిగా నిర్మూలించబడటంతో మధ్యవర్తులు లబ్ధి పొందలేకపోతున్నారని, అందుకే నేడు ప్రతిపక్ష పార్టీలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని ఆయన వ్యాఖ్యానించారు.

# ఇరాన్‌పై యుద్ధం ముగుస్తుందా?

తమ దేశంపై అమెరికా, ఇజ్రాయెల్ 23 రోజులుగా కొనసాగిస్తున్న క్షిపణుల దాడిని ఇరాన్ సాహసోపేతమైన, దీటైన ఎదురు దాడులతో ఇజ్రాయెల్‌కే గాక, అమెరికా సైనిక స్థావరాలు కలిగి ఉన్న పర్షియన్ జలసంధి అరబ్ రాజ్యాలకు చుక్కలు చూపిస్తున్న నేపథ్యంలో, ముడి ఆయిలు ధరలు పెరిగిపోయి, సరఫరాలు నిలిచిపోయి ప్రపంచ ఆర్థిక వ్యవస్థలు బేజారు పడుతున్న దశలో అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ సోమవారం (భారత కాలమానం ప్రకారం) చేసిన ప్రకటన సంచలనాత్మకమైంది : ''ఐదు రోజులపాటు ఇరాన్‌పై బాంబుదాడులు ఆపుచేస్తున్నాం. రెండ్రోజులుగా ఇరాన్‌తో జరుగుతున్న చర్చలు మరో 5రోజులు కొనసాగుతాయి. పశ్చిమాసియాలో ఇరు దేశాల మధ్య (ఇరాన్, ఇజ్రాయెల్) శాంతికి కృషి చేస్తున్నా''అని అనూహ్యమైన ప్రకటన చేశారు. ఇరాన్ 48గంటల్లో హోర్ముజ్ జలసంధిని తెరవకపోతే దాని విద్యుచ్ఛక్తి కేంద్రాలను ధ్వంసం చేస్తామని హెచ్చరించిన ట్రంప్ ఇంతలోనే ఎందుకు యు–టర్న్ తీసుకున్నారు. అమెరికా తన హెచ్చరికలతో ముందుకుసాగితే పశ్చిమాసియాలో దాని కీలకమైన మౌలిక వసతులను (సైనిక స్థావరాలని అర్థం) కోలుకోలేనంతగా ధ్వంసం చేస్తామని, ఆయిలు, ఇతర ఎగుమతుల రవాణాకు కీలకమైన హోర్మెజ్ జలసంధిని శాశ్వతంగా మూసివేస్తామని ఇరాన్ ఆదివారం చేసిన తిరుగు హెచ్చరిక ట్రంప్‌పై పనిచేసిందా? లేక ఆయిలు ధరలు పెరిగి ఆర్థిక వ్యవస్థలు, అంతర్జాతీయ వాణిజ్యం కుదేలవుతున్న స్థితిలో మిత్రరాజ్యాలు ట్రంప్‌పై యుద్ధ విరమణకు ఒత్తిడి పెంచాయా? యుద్ధం కొనసాగితే అమెరికాలో ఇప్పటికే పెరిగిన ద్రవ్యోల్బణం మరింత ఎగబ్రాకి ప్రజల జీవనం మరింత దుర్భరమైతే నవంబర్‌లో జరిగే మధ్యంతర ఎన్నికల్లో ఎదురుదెబ్బ తప్పదని రిపబ్లికన్‌లు ట్రంప్‌పై ఒత్తిడి తెచ్చారా? ఏదైనా కావచ్చు. తాజా ఆకస్మిక ప్రకటనతో యుద్ధోన్మాది శాంతి ప్రవక్త కాలేరు. అమెరికా ఆధిపత్య ఆకాంక్ష తప్ప మానవత్వం, అంతర్జాతీయ చట్టాలు, రూల్సు పట్ల గౌరవం ఉన్నవాడైతే ఆయిలు కోసం వెనిజులా అధ్యక్షుడు మదురోను బందీగా పట్టుకవచ్చి జైల్లో బంధించి మాదక ద్రవ్యాల ఎగుమతి మాఫియా అంటూ కేసు బనాయిస్తాడా? గాజాలో అమాయక పాలస్తీనియన్‌లపై ఇజ్రాయెల్ రణోన్మాద ఊచకోతలకు వంత పాడతాడా? అణుబాంబును బూచిగా చూపి ఇరాన్‌పై ఇజ్రాయెల్‌తో కలిసి ఆకస్మిక బాంబుదాడులతో సర్వోన్నతాధిపతి అయతుల్లా అలీ ఖమేనీ తదితర ప్రభుత్వ, సైనిక నాయకులను హతమారుస్తాడా?

ఇంత పాశవికంగా వ్యవహరించినా ట్రంప్ ఆశించిన ప్రభుత్వ మార్పుకు ఇరాన్ ప్రజలనుంచి మద్దతు రాలేదు. మరోవైపున, 2025లో ఇరాన్ అణువసతులపై ఇజ్రాయెల్‌తో కలిపి బాంబుదాడులు చేసి, టెహరాన్ అణు కార్యక్రమాన్ని నిర్మూలించామని ప్రకటించిన ట్రంప్, ఇరాన్ అణుబాంబుతో దాడి చేయబోతుందన్న ఇజ్రాయెల్ వాదనకు వంతపాడుతూ ఇరాన్‌పై యుద్ధానికి ఒడిగట్టటాన్ని సమర్థనీయంగా అమెరికన్‌లు, నాటో మిత్రరాజ్యాలు విశ్వసించలేదు. హోర్ముజ్ జలసంధి తెరిచేందుకు సైన్యాన్ని దించాలని ఆయన చేసిన విజ్ఞప్తిని నాటో రాజ్యాలు నిరాకరించటంతో వాటిని పిరికి పందలని నిందించాడు. సమయమొచ్చినపుడు గుణపాఠం చెబుతామన్నాడు. మరోవైపున, అమెరికా సైనిక స్థావరాలు తమకు తిరుగులేని రక్షణ అని భావించిన గల్ఫ్ దేశాలు ఇరాన్ దాడులతో భ్రమలు కోల్పోయాయి. యుద్ధం వికటించి గల్ఫ్‌కు ఆరోప్రాణం అయిన ఆయిలు, గ్యాస్ వసతులపై అటు ఇజ్రాయెల్ నుంచి ఇటు ఇరాన్‌నుంచి పరస్పర బాంబుదాడులు అపార విధ్వంసం కలుగజేశాయి. అమెరికా కూడా ఖర్గ్ వసతిపై బాంబులు వేసింది. ఇటు ఇరాన్‌లో, అటు గల్ఫ్ రాజ్యాలు, ఇజ్రాయెల్‌లో పౌర వసతులు అపారంగా ధ్వంసమైనాయి. అయినా ఇరాన్ తన సైనిక పాటవంతో శత్రుదుర్భేద్యంగా అమెరికా పరిగణించే ఎఫ్ 35 ను కూల్చింది. 4 వేల మైళ్లదూరంలోని డీగో గార్షియా దీవికి కొద్దిదూరంలో బాంబు వేసినట్లు చెప్పబడుతున్నది. ఎందుకీ యుద్ధం, ఎవరి ప్రయోజనం కోసం అన్న ప్రశ్నలు ట్రంప్‌కు ఎదురైనాయి. కాబట్టి ఈ ఊబినుంచి బయట పడాలని ట్రంప్ భావించి ఉండవచ్చు. ట్రంప్ తాజా ప్రకటన రాగానే అమెరికా సహా ప్రపంచ స్టాక్ మార్కెట్లు ఉత్సాహంగా ఎగబాకటం పెట్టుబడిదాడుల సానుకూల స్పందనకు ప్రతిరూపం.

అయితే అణు కార్యక్రమంపై చర్చలు ఫలప్రదం కాబోతుండగా ఇజ్రాయెల్‌తో కుమ్మక్కై ఫిబ్రవరి 28న బాంబుదాడులకు పాల్పడిన ట్రంప్‌ను ఇరాన్ నమ్మటం లేదు. 'ట్రంప్ ప్రకటన కుట్ర. చర్చలు జరగటం లేదు. సమయం చూసి దాడి చేసే పన్నాగం' అన్నది ఇరాన్ తక్షణ స్పందన. వాస్తవానికి ఇరాన్ 10రోజుల క్రితమే మూడు షరతులతో చర్చలు ప్రతిపాదించినా యుద్ధోన్మాదులు స్పందించలేదు. ఇదిలాఉండగా, ఇరాన్‌పై తమదాడులు కొనసాగుతాయన్న ఇజ్రాయెల్, ట్రంప్ ప్రకటన తర్వాత కొద్దిసేపటికే టెహరాన్‌పై క్షిపణి దాడులు చేసింది.


నెతన్యాహును వెనక్కులాగలేకపోతే ట్రంప్ పరువుపోతుంది. ఏది ఏమైనా, యుద్ధం నిలుపుదలను, శాంతిస్థాపనను ప్రపంచం కోరుకుంటోంది. బంతి పూర్తిగా ట్రంప్ కోర్టులో ఉంది.



## అమెరికాకు వ్యతిరేకంగా మోదీ మాట్లాడలేడు

నరేంద్ర మోదీ 100 శాతం డొనాల్డ్ ట్రంప్ కంట్రోల్‌లో ఉన్నారు. ఈ రోజు పార్లమెంటులో ఆయన 25 నిమిషాలు మాట్లాడారని విన్నాను. అమెరికాకు వ్యతిరేకంగా ఒక్క మాట అనలేదు. వంద శాతం ఆయన ట్రంప్ కంట్రోల్‌లో ఉన్నారు. గ్యారెంటీ ఇస్తాను రాసి పెట్టుకోండి పార్లమెంట్ హౌజ్‌లో(ఇరాన్‌యుద్ధంపై) చర్చ పెట్టడు. కాంప్రమైజ్ అయ్యారు. ట్రంప్ ముందు మోదీ ఒక్క మాట కూడా అనలేడు. నేను నిజమే చెబుతున్నా. ట్రంప్ భారత్ పాకిస్థాన్ యుద్ధం తానే ఆపానని అంటాడు. మన సైనికులను అవమానిస్తాడు. భారతదేశ ఏడు విమానాలు కూలిపోయాయని 50 సార్లు అన్నాడు. కానీ మన ప్రధాని ఒక్క మాట కూడా అనలేకపోతాడు. ఎందుకంటే కంట్రోలర్ ట్రంప్ చేతిలో ఉంది. దానివల్ల ఎక్కువ నష్టం ప్రజలకే.

– గుజరాత్‌లోని వడోదరలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ




## క్షయ రహిత భారతమే మన లక్ష్యం కావాలి!

మైకోబ్యాక్టీరియమ్ ట్యుబర్క్యులోసిస్ బ్యాక్టీరియా గాలి ద్వారా ఊపిరితిత్తులకు సోకడంతో కలిగే ప్రమాదకర అంటువ్యాధిని క్షయ లేదా ట్యుబర్క్యులోసిస్ (టిబీ) వ్యాధిగా పిలుస్తున్నాం. క్షయ రోగులు దగ్గడం, తుమ్మడం, చీమిడి తీయడం, ఉమ్మి వేయడం లాంటి కారణాలతో ఈ వ్యాధి ఇతరులకు వ్యాపిస్తుంది. ప్రపంచ మానవాళి ఎదుర్కొంటున్న వ్యాధుల్లో అత్యంత ప్రమాదకరమైనదిగా గుర్తింపు పొందిన క్షయ వ్యాధిని నయం చేయడానికి, నివారించడానికి వీలు ఉన్నప్పటికీ అవగాహన లోపంతో ప్రపంచవ్యాప్తంగా అనేక నిండు ప్రాణాలు గాల్లో కలుస్తున్నాయి. ఇలాంటి తీవ్ర పరిణామాలకు కారణమవుతున్న క్షయ పట్ల పూర్తి అవగాహన కల్పించటానికి 1982 నుంచి ప్రతి ఏట 24 మార్చిన ప్రపంచ క్షయ దినం నిర్వహించడం ఆనవాయితీగా మారింది. 2026 ప్రపంచ టిబి దినం ఇతివృత్తంగా 'అవును! టిబిని అంతం చేయవచ్చు : ప్రపంచ దేశాల నాయకత్వం, చైతన్యవంతమైన ప్రపంచ మానవాళి సహకారంతో' అనబడే అంశాన్ని తీసుకొని ప్రచారం చేయడం జరుగుతోంది. టిబీ నివారణకు ఔషధనిరోధకత కూడా అడ్డుపడుతున్నది.

**టిబీ వ్యాధి లక్షణాలు, నివారణ మార్గాలు:**

క్షయ వ్యాధిగ్రస్తుల్లో దగ్గు, ఛాతి నొప్పి, బరువు తగ్గడం, అలసట, జ్వరం, రాత్రి చెమట పట్టడం, అతి వణుకు లాంటి లక్షణాలు కనిపిస్తాయి. క్షయ నివారణ మార్గాల్లో వ్యాధి సోకిన వ్యక్తులు దగ్గినపుడు నోటిని కండువా కప్పుకోవడం, చేతులను తరుచుగా శుభ్రం చేసుకోవడం, ఆరోగ్యకర జీవనశైలి పాటించడం, సరైన వైద్య చికిత్స పొందడం, పోషకాహారం తీసుకోవడం, సరిగ్గా నిద్ర పోవడం లాంటి జాగ్రత్తలు తీసుకోవాలి. ఇలాంటి ప్రమాదకర వ్యాధికి సరైన చికిత్స ఉందని, నివారణ మార్గాలు పాటించాలని తెలుసుకోవాలి.

అనాదిగా మానవాళిని పట్టి పీడుస్తున్న టిబి వ్యాధిని అశ్రద్ధ చేస్తే ప్రాణాలు పోతాయని గమనిస్తూ, రోగులకు సరైన చికిత్సతో పాటు ఇతరులకు సోకకుండా తగు జాగ్రత్తలు తీసుకోవడం, అవగాహన గొడుగుతో క్షయకు చరమగీతం పాడ డం సత్వరమే జరగాలి. ఈ చర్యలను తీసుకున్నపుడు తప్పకుండా క్షయ నివారణ సుసాధ్యం అవుతుందని, వ్యాధి కట్టడి కి తగు నిధులు కేటాయించాలని, నివారణ చర్యలను నిర్దిష్టంగా తీసుకోవాలని, ఈ యజ్ఞంలో మనందరం మానవహారంగా పట్టడానికి సిద్ధంగా ఉందాం. క్షయ కానరాని ప్రపంచాన్ని నిర్మించుకుందాం.

*(24 మార్చి ప్రపంచ క్షయవ్యాధి దినం సందర్భంగా)*

# క్యూబా గొంతు నులుముతున్న అమెరికా

శ్రీనివాసన్ రమణి

అట్లాంటిక్ మహాసముద్రంలో ప్రయాణిస్తున్న రెండు నౌకలు ప్రపంచవ్యాప్తంగా ఉన్న సముద్ర నిఘా సంస్థలు, భౌగోళిక వ్యూహకర్తల దృష్టిని ఆకర్షించాయి. రష్యా ప్రభుత్వానికి చెందిన 'అనాతోలీ కోలోడ్కిన్' నౌక సుమారు 7,30,000 బ్యారెళ్ళ ముడి చమురుతో క్యూబా దిశగా వెళ్తోంది. సోషలిస్టు ద్వీప దేశమైన క్యూబాపై డొనాల్డ్ ట్రంప్ విధించిన చట్టవిరుద్ధమైన ఇంధన దిగ్బంధనాన్ని స్పష్టంగా ధిక్కరిస్తూ, ఇంధన కొరతతో ఉన్న క్యూబా వైపు ఆ నౌక ప్రయాణం సాగిస్తోంది. షిప్పింగ్ ట్రాకర్ సంస్థ 'క్ప్లెర్' చెప్పిన ప్రకారం కోలోడ్కిన్ మార్చి 23వ తేదీ నాటికే క్యూబాకు చేరాల్సి ఉంది.

ఇటీవల వారాలలో క్యూబాకు రష్యన్ ఇంధనం తీసుకువెళ్ళేందుకు ప్రయత్నిస్తున్న కోలోడ్కిన్ మొదటి ట్యాంకరేమి కాదు. చైనా సంస్థకు చెందిన రష్యా నుండి 2 లక్షల బ్యారెళ్ళ గ్యాస్ ఆయిల్ (కిరోసిన్)ను నింపుకొని వెళ్తున్న 'ది సీ హార్స్' అనే నౌక క్యూబాకు వెళ్తుండగా అట్లాంటిక్ సముద్రం మధ్యలోనే అర్థాంతరంగా నిలిపివేశారు. బహుశా అమెరికా నుంచి పర్యవసానాలను ఎదుర్కోవాల్సి వస్తుందనే ఆందోళనతో కావొచ్చు. ఒక వేళ రష్యా నౌకలు క్యూబాకు చేరుకుంటే బహుశా మూడునెలల్లో ఆ దేశానికి చేరిన మొదటి ఇంధన నౌకలు అవే అవుతాయి.

నిస్సహాయ స్థితిలో ఉన్న క్యూబాకు రష్యా సాయం భారీ ఊరట కలిగిస్తుంది. ఆ దేశానికి చెందిన విద్యుత్ గ్రిడ్ గత వారమే కుప్పకూలిపోవడంతో కోటిమంది ప్రజలకు విద్యుత్ సరఫరా లేకుండా పోయింది. హవానాలోని కొన్ని ప్రాంతాలలో ప్రభుత్వం పాక్షికంగా విద్యుత్ సరఫరాను పునరుద్ధరించినప్పటికీ, సామాన్య క్యూబన్‌ల పరిస్థితి దారుణంగా ఉంది. 'ది గార్డియన్' పత్రికలో హవానాలోని క్షేత్రస్థాయి నుంచి వెలువడిన వార్త ప్రకారం రోడ్లపై కార్లు చాలా తక్కువగా తిరుగుతున్నాయి. ద్వీపదేశానికి సేవలు అందించే దాదాపు అన్ని విమానయాన సంస్థలు తమ విమాన సేవలను నిలిపివేశాయి. కెనెడియన్ కంపెనీ షెర్రిట్ ఇంటర్నేషనల్ క్యూబాలోని నికెల్ గనుల తవ్వకాన్ని ఆపేసింది. ప్రభుత్వ కార్యాలయాలు మూతపడ్డాయి. పాఠశాలలు తరగతులను పాక్షికంగా నిలిపివేశాయి. చాలా మంది పాడైపోయిన ఆహారాన్ని తింటూ, ఉక్కపోత, నిద్రలేని పిల్లలతో ఇబ్బందులు పడుతున్నారని ఆ పత్రిక పేర్కొంది.



చమురుపై క్యూబా ఆధారపడడమనేది వ్యవస్థాగతమైనది. మొత్తం విద్యుత్ ఉత్పత్తిలో 83 శాతం దీనిపైనే ఆధారపడి ఉంది. పరిశ్రమ, రవాణా, వ్యవసాయం, గృహాల మొత్తం విద్యుత్ వినియోగంలో చమురు ఉత్పత్తుల వాటా 56 శాతం.

ఇవేవి ట్రంప్ ప్రభుత్వాన్ని కదిలించలేకపోగా, చట్ట వ్యతిరేక చర్యలను కొనసాగిస్తున్నది. క్యూబాకు చమురు విక్రయించే ఏ దేశంపైనైనా ప్రతీకార టారిఫ్‌ను విధిస్తామని హెచ్చరిస్తూ జనవరి 29న ఎగ్జిక్యూటివ్ ఆర్డర్‌పై ట్రంప్ సంతకం చేశారు. గత వారం ఆయన ఒక అడుగు ముందుకేసి ఆ ద్వీపాన్ని 'స్వాధీనం చేసుకుంటామని' స్పష్టంగా బెదిరింపులకు దిగాడు. హ్యూగో చావెజ్ ప్రవేశపెట్టిన 'ఆయిల్ ఫర్ డాక్టర్స్' పథకం కింద వెనిజులా నుంచి లభించే చమురుపై క్యూబా తన ఇంధన అవసరాల కోసం ఎక్కువగా ఆధారపడి ఉండేది. 2022లో క్యూబా చమురు ఎగుమతులలో 75 శాతం వెనిజులానే సరఫరా చేసింది. 2023 నాటికి అది 58 శాతానికి పడిపోగా, 31 శాతం సరఫరా చేస్తూ మెక్సికో కీలక సరఫరాదారురాలిగా అవతరించింది. జనవరి తొలినాళ్ళలో నికోలసర్ మదురో అపహహరణ తరువాత, డిసెంబర్‌లో 46,500 బ్యారెళ్ళుగా ఉన్న వెనిజులా నుంచి సరఫరా అయ్యే చమురు దిగుమతి పూర్తిగా నిలిచిపోయింది. జనవరి 29 ఆర్డర్ తరువాత మెక్సికో సైతం తన చమురు నౌకలను నిలిపివేసింది.

> *'ది గార్డియన్' పత్రికలో హవానాలోని క్షేత్రస్థాయి నుంచి వెలువడిన వార్త ప్రకారం రోడ్లపై కార్లు చాలా తక్కువగా తిరుగుతున్నాయి. ద్వీపదేశానికి సేవలు అందించే దాదాపు అన్ని విమానయాన సంస్థలు తమ విమాన సేవలను నిలిపివేశాయి. కెనెడియన్ కంపెనీ షెర్రిట్ ఇంటర్నేషనల్ క్యూబాలోని నికెల్ గనుల తవ్వకాన్ని ఆపేసింది. ప్రభుత్వ కార్యాలయాలు మూతపడ్డాయి. పాఠశాలలు తరగతులను పాక్షికంగా నిలిపివేశాయి. చాలా మంది పాడైపోయిన ఆహారాన్ని తింటూ, ఉక్కపోత, నిద్రలేని పిల్లలతో ఇబ్బందులు పడుతున్నారని ఆ పత్రిక పేర్కొంది.*

**దశాబ్దాల బెదిరింపు**

ప్రస్తుత సంక్షోభం ఆరు దశాబ్దాల అమెరికా ఆర్థిక బెదిరింపులకు పరాకాష్ఠ. క్యూబన్లు 'దిగ్బంధనం'గా పిలుచుకునే క్యూబన్ విప్లవం, పరిశ్రమల జాతీయాకరణ నేపథ్యంలో 1962లో క్యూబన్‌లు 'దిగ్బంధనం'గా పిలుచుకునే ఆంక్షలు మొదలయ్యాయి. 1992లో టొరిసెల్లి చట్టం ద్వారా ఈ ఆంక్షలు మరింత బలపడ్డాయి. ఈ చట్టం అమెరికా కంపెనీ విదేశీ అనుబంధ సంస్థలు క్యూబాతో వ్యాపారం చేయటాన్ని నిషేధించింది. క్యూబాలో లంగరు వేసిన ఓడలు 180 రోజుల పాటు అమెరికా ఓడరేవుల్లోకి ప్రవేశించకుండా నిరోధించింది. ట్రంప్ మొదటి దఫా పాలనలో 2021 జనవరిలో క్యూబాను 'ప్రభుత్వ ప్రాయోజిత ఉగ్రవాదం'గా పునర్నిర్వచించింది.

వాషింగ్టన్‌తో తాము చర్చలు జరుపుతున్నామని, కొన్ని ఆర్థిక మార్పులు చేసేందుకు సుముఖంగా ఉన్నట్లు క్యూబా ఇటీవల అంగీకరించింది. అధ్యక్షుడు మిగ్యువెల్ డియాజ్ కానెల్ రాజీనామా చేయాలని అమెరికా మధ్యవర్తులు డిమాండ్ చేస్తున్నట్లు 'న్యూయార్క్ టైమ్స్' ప్రచురించింది.

గతంలో క్యూబా తీవ్రమైన ఆర్థిక సంక్షోభాలను ఎదుర్కొని, బైటపడింది. ఏటా సగటున 4.3 బిలియన్ డాలర్‌ల రాయితీలను అందజేసిన సోవియెట్ యూనియన్ పతనం తరువాత, 1990వ దశకం అంతా ఆ ద్వీప దేశం 'ప్రత్యేక కాలం' అని పిలుచుకునే దశను ఎదుర్కొంది. 1989, 1993 మధ్య కాలంలో జిడిపి 35 శాతం పడిపోయింది. క్యూబన్‌లు తీవ్ర ఆహార కొరతను ఎదుర్కొన్నారు. ఫలితంగా ప్రభుత్వం పాక్షిక సరళీకరణను అనుమతించింది. తాజాగా సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలను అనుమతించింది. కానీ దిగ్బంధనం, దానిని అనుసరించి ఆంక్షల ఉమ్మడి భారం ముందు ఈ సంస్కరణలు సరిపోలేదని రుజువైంది.

చర్చలు జరుపుతున్న సమయంలో సైతం క్యూబా ప్రభుత్వం ధిక్కరిస్తూనే ఉంది. అధ్యక్షుడు డియాజ్ కానెల్ మాట్లాడుతూ అమెరికా ప్రభుత్వం 'మా దేశాన్ని, వనరులను, ఆస్తులను, చివరకు అది ఉక్కిరిబిక్కిరి చేస్తున్న మా ఆర్థిక వ్యవస్థను సైతం స్వాధీనం చేసుకొని, బలవంతంగా మమ్మల్ని లొంగదీసుకోవాలని చూస్తోంది' అని అన్నారు. 'అత్యంత దారుణమైన పరిస్థితిని ఎదుర్కొన్న క్యూబా ఒక నిశ్చయంతో ముందుకు సాగుతోంది. బైటి దురాక్రమణదారుడు ఎవరైనా సరే ఒత్తిడికి తలొగ్గని ప్రతిఘటనను ఎదుర్కోవాల్సి వస్తుంది' అని కూడా ఆయన స్పష్టం చేశారు.

*(ది హిందూ సౌజన్యంతో..)*

# పిఎసిఎస్‌ల పునర్నిర్మాణం, ఎన్నికలు ఎప్పుడు?

రైతులకు తక్కువ వడ్డీకి రుణాలు ఇస్తూ సకాలంలో విత్తనాలు, ఎరువులు సరఫరా చేస్తూ వ్యవసాయానికి చేదోడుగా ఉంటు ఆదుకునే వ్యవస్థ సహకార సంఘం. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు రైతుల చేతుల్లో ఉండే స్వయం ప్రతిపత్తి సంస్థలు. రైతు ఆర్థిక స్వావలంబన, గ్రామీణ అభివృద్ధి, ఆహార భద్రతకు ఈ సంఘాలు మూలాధారం. ఇప్పటివరకు సహకార సంఘాల ద్వారా రైతులకు వ్యవసాయానికి అన్ని విధాల నాణ్యమైన విత్తనాలు, ఎరువులను సకాలంలో సరఫరా చేసి రైతులను ఆదుకుంటున్నాయి. ఇటీవల మారుతున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకొని ఆన్లైన్ ద్వారా వ్యాపారాలు మొదలుపెట్టింది. టి స్కాబ్ నాబార్డ్ నుండి రుణాల సేకరించి డిసిసిబిల ద్వారా తక్కువ వడ్డీలకు పంట రుణాలు అందిస్తున్న సహకార సంస్థను మరింత పటిష్టం చేయాల్సిన బాధ్యత ప్రభుత్వం పై ఉన్నది.

రుణమాఫీ లాంటి ప్రభుత్వం నుంచి వచ్చే పథకాలను రైతులందరికీ వర్తింపజేసి చేయూతనందిస్తున్నాయి. పెట్రోల్ బంకులు, సూపర్ మార్కెట్‌లు ఇలా ప్రతి రంగంలోనూ రాణించి వ్యవస్థను పటిష్టం చేయాలని ప్రభుత్వం ఆలోచన చేస్తూనే.. మరోవైపు ఇంకోరకంగా ఆలోచన చేయడంపై భిన్నాభిప్రాయాలు వినిపిస్తున్నాయి.. అంటే గడువు ముగిసినా ఏర్పాటు కానీ కొత్త పాలక వర్గాలు. నామినేటెడ్ పదవులతో భర్తీకి ప్రభుత్వం సిద్ధమవుతున్నట్లు వార్తలు వస్తున్నాయి! ఈ ఆలోచన ఉపసంహరించుకొని వెంటనే ఎన్నికలు జరిపించాలని, ఎన్నికల ద్వారానే అన్నదాతలకు సరైన న్యాయం జరుగుతుందని.. అప్పుడే రైతులకు నిజమైన భాగస్వామ్యం ఏర్పడుతుందని రైతు సంఘాలు తెలుపుతున్నాయి.

గ్రామస్థాయిలో ప్రాధాన్యత కలిగిన సహకార సంఘాల పాలకవర్గాల గడువు ముగిసి రెండు సంవత్సరాలు కావస్తుంది. ఇవి ప్రస్తుతం ప్రభుత్వ నియంత్రణలోనే ఉన్నాయి. రాష్ట్ర ప్రభుత్వం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు(పిఎసిఎస్) డిసిసిబి (జిల్లా కేంద్ర సహకార బ్యాంకు), టెస్కాబ్ పాలకవర్గాలను రద్దు చేస్తూ 2025 డిసెంబర్ 19న ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ నేపథ్యంలో పిఎసిఎస్ లకు పర్సనల్ ఇన్చార్జిలను నియమిస్తూ ఉత్తర్వులు ఇచ్చింది. నేడు ఇన్చార్జిలతో పాలన కొనసాగుతుంది. రాష్ట్రవ్యాప్తంగా ఉమ్మడి జిల్లాలలో 9 సహకార కేంద్ర బ్యాంకులు, 908 ప్రాథమిక వ్యవసాయ సహకార బ్యాంకులున్నాయి. ఒక్కో సహకార సంఘంలో 13 మంది చొప్పున 9,797 మంది పాలకవర్గ సభ్యులు ఉన్నారు. సహకార సంఘం ద్వారా గెలిచిన అధ్యక్షులు డిసిసిబి అధ్యక్షులను,.. డిసిసిబి అధ్యక్షులు టీజీ కాబ్ అధ్యక్షులను ఎన్నుకుంటారు. ఆ విధంగా 2020 ఫిబ్రవరి 13న ఎన్నికలు జరిగినవి. గత ఏడాది ఫిబ్రవరి నాటికి వాటి పదవీ కాలం ముగిసింది. అయితే రాష్ట్ర ప్రభుత్వం ఆయా పాలకవర్గాల పదవీ కాలాన్ని ఆరు నెలలు పొడిగించింది. ఆ పదవీ కాలం కూడా 2025 ఆగస్టు 14వ తేదీతో ముగిసిపోయింది. ఆ తర్వాత మరోసారి పాలకవర్గ పదవీ కాలాన్ని మరో ఆరు నెలల పాటు.. అంటే 2026 ఫిబ్రవరి 14 వరకు పొడిగించింది. అది ముగియడానికి దాదాపు రెండు నెలల ముందే.. గత డిసెంబర్ 19న పాలకవర్గాలు రద్దు చేస్తూ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది.

**కొత్త జిల్లాల ప్రాతిపదికన సహకార సంఘాలకు ఎన్నికలు:**

గతంలో పాత జిల్లాల పరిధిలోనే ఎన్నికలు నిర్వహించడం జరిగింది. ప్రస్తుతం 33 జిల్లాలు ఉన్న నేపథ్యంలో ఆ జిల్లాలోని మండలాల ప్రాథమిక సహకార సంఘాలకు ఎన్నికలు జరిపి డిసిబిలకు ఎన్నికలు నిర్వహించాలి. అయితే గతంలో పాత జిల్లాలలో మండలానికి ఒకటి, రెండు చొప్పున ప్రాథమిక సహకార సంఘాలు ఉండేవి. వాటికి ఎన్నికలు జరిపి డిసిసిబి లను ఎన్నుకునే విధానం ఉండేది.

నేడు 33 జిల్లాలు ఏర్పడటము.. కొన్ని జిల్లాల్లో నాలుగు, ఐదు సహకార సంఘాలు ఉండటం, కొన్ని జిల్లాలో ఒకటి, రెండు మాత్రమే ఉండటం వీటిపై నిర్ణయం తీసుకోవాల్సి ఉంది.

**కొత్తగా మరో 131 సహకార సంఘాలు :**

రాష్ట్రంలో ప్రస్తుతం 908 సంఘాలు ఉండగా, 272 మండలాలలో ఒక్కటి చొప్పున సహకార సంఘం ఉంది. 81 మండలాల్లో ఒకటి లేదు. కొన్ని సంఘాలు రెండు గ్రామాలకు ఒకటిగా ఉండగా.. మరికొన్ని 30 గ్రామాలకు ఒకటి ఉన్నాయి. సభ్యత్వంలోను అసమానతలు ఉన్నాయి. ఒక సంఘంలో 500 మంది సభ్యులు ఉండగా.. మరికొన్ని సంఘాల్లో వేలమంది ఉన్నారు. రుణాలు ఎరువులు విత్తనాల పంపిణీతో పాటు ఇతర సేవలందించే సంఘాలు అందుబాటులో లేకపోవడంతో రైతులు ఇతర వినియోగదారులు ఇబ్బందులు పడుతున్నారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తర్వాత కొత్త సంఘాలు ఏర్పాటు కాలేదు. 2019లో అప్పటి ప్రభుత్వం సహకార సంఘాలు లేని మండలాలలో కొత్త సంఘాలు ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. కానీ కార్యరూపం దాల్చలేదు. 2022లో కేంద్ర ప్రభుత్వం కొత్త సహకార విధానం కింద దేశంలోని ప్రతి గ్రామంలో ఒక్క ప్రాథమిక సహకార సంఘం, మత్స్య, పాల ఉత్పత్తిదాల సంఘం ఏర్పాటు చేయాలని రాష్ట్రాలకు లేఖలు రాసింది. మరోవైపు రెండేళ్లుగా కొత్త సహకార సంఘాల ఏర్పాటు కోసం ప్రభుత్వానికి రైతులు, ప్రజాప్రతినిధులు సైతం విన్నవిస్తున్నారు. ఈ నేపథ్యంలో కొత్త పిఎసిఎస్‌లకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.

**కొత్త సంఘాలు ఏర్పాటు గుర్తింపు :**

రాష్ట్ర సహకార శాఖ ఆదేశాలతో 31 జిల్లాల నుంచి 204 ప్రతిపాదనలు వచ్చాయి. క్షేత్రస్థాయి అధ్యయనంతో పాటు ప్రజాప్రతినిధుల నుండి అభిప్రాయాలు సేకరించిన అనంతరం 131 సంఘాలు కొత్తగా ఏర్పాటుకు అనువుగా ఉన్నట్లు గుర్తించారు. కొత్త సహకార సంఘాల ఏర్పాటుకు మంత్రి మండలి ఆమోదం అవసరం. వాటికి సిబ్బంది నియామకంతో పాటు బడ్జెట్ కావాలి. ఈ నేపథ్యంలో వీటి ఏర్పాటుకు ప్రభుత్వం అనుమతి కోసం ప్రతిపాదనలు పంపించారు. కొత్తగా సంఘాలు ఏర్పాటుకు అనుమతులు ఇస్తూ.. ఎన్నికలు జరిపించాలని రైతులు కోరుతున్నారు.

ఉజ్జిని రత్నాకర్ రావు,
9490952646

# మూసీ ప్రక్షాళన: అభివృద్ధికి బాటలా? రాజకీయాలకు వేదికలా?

భాగ్యనగరానికి జీవనాడి అయిన మూసీ నది దశాబ్దాలుగా కాలుష్య కోరల్లో చిక్కుకుని విలవిల్లాడుతోంది. ఒకప్పుడు స్వచ్ఛమైన నీటితో కళకళలాడిన ఈ నది, నేడు పారిశ్రామిక వ్యర్థాలు, మురుగునీటితో 'మురికి కాల్వ'గా మారిపోయింది. ఈ నేపథ్యంలో తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వం 'మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్' ప్రాజెక్టును అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టింది.

**ప్రభుత్వ పట్టుదల: 'విశ్వనగర' కల సాకారం కోసం..**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ ప్రాజెక్టును తన స్వప్నంగా భావిస్తున్నారు. లండన్‌లోని థేమ్స్ నది తరహాలో మూసీ తీరాన్ని అభివృద్ధి చేసి, హైదరాబాద్‌ను అంతర్జాతీయ స్థాయికి చేర్చాలన్నది ప్రభుత్వ సంకల్పం. నదీ గర్భంలో ఆక్రమణలు తొలగించకుండా ప్రక్షాళన సాధ్యం కాదని, బాధితులకు మెరుగైన పునరావాసం (డబుల్ బెడ్రూమ్ ఇళ్లు) కల్పిస్తున్నామని ప్రభుత్వం చెబుతోంది. మరోవైపు, ప్రధాన ప్రతిపక్షం బిఆర్ఎస్ (BRS) మరియు బిజెపి ఈ ప్రాజెక్టును 'పేదల వ్యతిరేక చర్య'గా అభివర్ణిస్తున్నాయి. 'అభివృద్ధి అంటే కూల్చడమా?' అని ప్రతిపక్ష నేతలు ప్రశ్నిస్తున్నారు.

వేల కోట్లు ఖర్చుచేసే ఈ ప్రాజెక్టులో పారదర్శకత లేదని, కేవలం కాంట్రాక్టర్ల కోసమే రీడిజైనింగ్ చేస్తున్నారని ఆరోపిస్తున్నారు. నిర్వాసితుల కన్నీళ్లు ప్రభుత్వానికి శాపంగా మారుతాయని, బాధితులకు న్యాయం జరిగే వరకు తమ పోరాటం ఆగదని హెచ్చరిస్తున్నారు. ప్రభుత్వం దీన్ని పెట్టుబడిగా చూస్తుంటే, ప్రతిపక్షాలు దీన్ని 'అప్పుల భారం'గా చూస్తున్నాయి.

తెలంగాణ ప్రభుత్వం ఇస్తున్న డబుల్ బెడ్రూమ్ ఇళ్లు తమ జీవనోపాధికి దూరంగా ఉన్నాయని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నది శుద్ధీకరణ అవసరమే అయినా, దానికి అనుసరిస్తున్న 'బుల్డోజర్' విధానంపైనే ప్రధానంగా అభ్యంతరాలు వ్యక్తం అవుతున్నాయి. ఏ నగరానికైనా నది పునరుజ్జీవం అనేది ఒక గొప్ప వరం. కానీ అది ప్రజల ప్రాథమిక అవసరాలను, వారి భావోద్వేగాలను గౌరవించినప్పుడు మాత్రమే సఫలమవుతుంది. ప్రభుత్వం మొండితనం వీడి పారదర్శకతతో ముందుకు వెళ్లాలని, ప్రతిపక్షాలు కేవలం రాజకీయం కోసం కాకుండా నిర్మాణాత్మక సూచనలు చేయాలని సామాన్య జనం కోరుకుంటున్నారు. మూసీ 'మురికి' వదిలినా, వదలకపోయినా.. ప్రస్తుతం సాగుతున్న ఈ రాజకీయ రొంపి మాత్రం ఇప్పట్లో వదిలేలా కనిపించడం లేదు.

నమిండ్ల ప్రమోద్, 6305638569

## నెక్కొండ రైతుల ఆవేదన

మక్కలకు గిట్టుబాటు ధర కోసం
ప్రభుత్వ కొనుగోలు కేంద్రం అవసరం

**ప్రజాపక్షం/నెక్కొండ:** నెక్కొండ మండలంలోని రైతులు ప్రస్తుతం తీవ్ర ఆందోళనలో ఉన్నారు. ఈ సీజన్‌లో పండించిన మక్కలకు సరైన ధర లభించకపోవడంతో రైతులు ఆర్థికంగా నష్టపోయారు. ప్రయివేట్ వ్యాపారులు మక్కలను తక్కువ ధరకు కొనుగోలు చేస్తుండడంతో, ఒక్క క్వింటాల్‌కు రూ.400 వందల నుండి రూ. 500 వందల వరకు నష్టం వాటిల్లుతోందని రైతులు వాపోతున్నారు. ఈ నేపథ్యంలో నెక్కొండ మార్కెట్ యార్డు లేదా కొనుగోలు కేంద్రాన్ని తక్షణమే ప్రారంభించాలని రైతులు గట్టిగా కోరుతున్నారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేస్తే రైతులకు కనీస మద్దతు ధర లభించి, నష్టాల నుండి రక్షణ కలుగుతుందని వారు అభిప్రాయపడుతున్నారు. ఈ సమస్యపై స్థానిక ఎంఎల్ఏ ప్రత్యేక దృష్టి సారించి వెంటనే చర్యలు తీసుకొని కొనుగోలు కేంద్రం ప్రారంభించాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు. రైతుల కష్టాన్ని గుర్తించి ప్రభుత్వం స్పందిస్తుందనే ఆశతో నెక్కొండ రైతులు ఎదురుచూస్తున్నారు.

## వడదెబ్బతో వ్యక్తి మృతి



**ప్రజాపక్షం/గూడూరు:** మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం మట్టెవాడ గ్రామంలో విషాద ఘటన చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన వట్టం పాపయ్య (60) అనే వ్యక్తి తన పశువులను మేపేందుకు వెళ్లిన సమయంలో తీవ్ర ఎండ కారణంగా వడదెబ్బకు గురై ప్రాణాలు కోల్పోయినట్లు సమాచారం ఎస్సై గిరిధర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం పాపయ్య ఉదయం ఆవులను మేపడానికి వెళ్లగా మధ్యాహ్నం వరకు ఇంటికి తిరిగి రాకపోవడంతో అనుమానంగా రాగా అనంతరం అతని కూమారుడు వట్టం సుమన్ వెతుకుతూ వోళ్లి మధ్యాహ్నం సేమారు 3 గంటల సమయంలో ఆయన అపస్మారక స్థితిలో పడి ఉన్నట్లు గమనించాడు వెంటనే పరిశీలించగా అప్పటికే ఆయన మృతి చెందినట్టు తెలిసింది. ఈ ఘటపై సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకోని మృతదేహాన్ని పరిశీలించారు. వడదెబ్బ కారణంగా మృతి సంభవించినట్లు ప్రాథమికంగా బావిస్తున్నారు. మృతుడి కుమారుడు ఇచ్చిన ఫీర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు కోనసాగిస్తున్నారు. గ్రామంలో ఈఘటన తీవ్ర విషాదాన్నిన మిగిల్చింది మండుతున్న ఎండల్లో బయటకు వెళ్లే సమయంలో ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వైద్య నిపుణులు సూచిస్తున్నారు.

## ఆశ వర్కర్ల సమస్యలను వెంటనే పరిష్కరించండి




**ప్రజాపక్షం/గూడూరు:** ఆశ వర్కర్ల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరుతూ గూడూరు మండల కేంద్రంలో సోమవారం ఆశ వర్కర్లు ర్యాలి గా వచ్చి డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కు ఆశ వర్కర్లు వినతి పత్రాన్ని సమర్పించారు. తమకు ఎదురువుతున్న సమస్యలను వివరంగా తెలియజేస్తూ ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలనని వారు డిమాండ్ చేశారు. ఈసందర్భంగా ఆశా వర్కర్లు మాట్లాడుతూ ప్రతి నెల 1వ తేదీనే జీతాలు చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలనికోరారు. పెండింగ్‌లో ఉన్న జీతాలు ఇవ్వాలి జీతాలు పెంపును అమలు చేసి కనీసం రూ1800 వేతనం ఇవ్వాలరని అన్నారు. ఎ,ఎన్ యం జీ ఎన్ యం అర్హతలు పోందిన ఆశా వర్కర్లకు వారి అనుభవాన్ని పరిగణనలోకీ తీసుకోని ప్రాధాన్యత ఇవ్వాలని వారు పేర్కోన్నారు.గత రెండు నెలలుగా జీతాలు నిలిచిపోవడంతో తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కోంటున్నామని వెవటనే ఆ బకాయిలు విడుదల చేయాలని వారు డిమాండ్ చేశారు.అదనంగా ఎఎన్సీ టార్గెట్ల బత్తిడి తగ్గించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. డ్యూటి సమయంలో ప్రాణాలు కోల్పోయిన ఆశా వర్కర్లల కుటుంబాలను ప్రభుత్వం అదుకోవాలని అంబేద్కర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈసమస్యలపై ప్రభుత్వం స్పందించి తక్షణమే చర్యలు తీసుకుంటుందని ఆశా వర్కర్లులు తెలిపారు.

## ప్రశాంతంగా కొనసాగుతున్న 10వ తరగతి పరీక్షలు: కలెక్టర్



**ప్రజాపక్షం/భూపాలపల్లి:** జిల్లాలో 10వ తరగతి పబ్లిక్ పరీక్షలు ప్రశాంత వాతావరణంలో సజావుగా కొనసాగుతున్నట్లు జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. సోమవారం జిల్లా కేంద్రం లోని సింగరేణి, గిరిజన ఆశ్రమ పాఠశాలలో నిర్వహిస్తున్న పరీక్షా కేంద్రాలను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పరీక్ష కేంద్రాలలో విద్యార్థులకు కల్పించిన మౌలిక సదుపాయాలు, పర్యవేక్షణ ఏర్పాట్లు తదితర అంశాలను పరిశీలించారు. పరీక్షలు ఎలాంటి అంతరాయం లేకుండా పారదర్శకంగా, క్రమశిక్షణతో నిర్వహించేందుకు సంబంధిత అధికారులందరూ సమన్వయంతో పని చేయాలని ఆయన ఆదేశించారు. విద్యార్థులు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాయడానికి అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించామని సూచించారు. పరీక్షా కేంద్రాలలో కట్టుదిట్టమైన భద్రతా చర్యలు అమలు చేయాలని, సెల్‌ఫోన్లు మరియు ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలను కేంద్రాల్లోకి అనుమతించకూడదని స్పష్టం చేశారు. అలాగే విద్యార్థులను పరీక్ష హాలులోకి అనుమతించే ముందు క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించాలని అధికారులకు సూచించారు. ఈ తనిఖీలలో జిల్లా విద్యాశాఖ అధికారి రాజేందర్, తహసీల్దార్ శ్రీనివాసులు, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## చేపల వేటకు వెళ్లి వ్యక్తి మృతి



**ప్రజాపక్షం/కేసముద్రం:** కేసముద్రం మండలం అర్పణపల్లి సమీపంలోని వట్టివాగు ఏరులో చేపల వేటకు వెళ్లిన వ్యక్తి మృతి చెందిన ఘటన సోమవారం చోటు చేసుకుంది. కేసముద్రం ఎస్ఐ క్రాంతి కిరణ్ తెలిపిన వివరాల ప్రకారం మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని హనుమంతుని గడ్డకు చెందిన అలువాల సాయిబాబా(29) ప్రతిరోజు చేపలు పట్టి అమ్మి కుటుంబాన్ని పోషించుకునేవాడు. రోజులాగానే ఆదివారం మధ్యాహ్నం అర్పణపల్లి శివారులోని వట్టివాగు ఏరులో చేపలు పట్టడానికి వెళ్తున్నానని తన భార్యకు చెప్పి మహబూబాబాద్ నుండి బయలుదేరి అర్పణపల్లి శివారులోని వట్టివాగు ఏరులో చేపలు పట్టడానికి వలను వేయగా, ప్రమాదవశాత్తు వల అతని కాళ్లకు చుట్టుకొని నీటిలో మునిగి చనిపోయాడు. మృతునికి భార్య ఉమ, కూతురు కారుణ్య, కుమారుడు కౌశిక్ ఉన్నారు. మృతుని భార్య ఉమ ఇచ్చిన పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ తెలిపారు.

## మద్దతు ఇవ్వని మార్క్‌ఫెడ్

# సంకటస్థితిలో మొక్కజొన్న రైతులు




ఎమ్మెస్పీ క్వింటాల్‌కు రూ.2400
మార్కెట్‌లో రూ.1800 లోపు మాత్రమే
పెట్టుబడులూ రాక రైతుల ఆందోళన



**ప్రజాపక్షం/హనుమకొండ:** మొక్కజొన్నల కొనుగోళ్ల విషయంలో ప్రభుత్వ రంగ సంస్థలు పట్టీపట్టనట్లుగా వ్యవహ రిస్తున్నాయి. మార్క్ ఫెడ్ చాలా చోట్ల ఇంకా కొను గోళ్లను ప్రారంభించలేదు. ఫలితంగా సిండికేట్ గా మారిన ప్రైవేట్ వ్యాపారులు మార్కెట్లో ఇష్టారాజ్యంగా మొక్కజొన్నలు కొంటున్నారు. 2025–26 ఖరీఫ్ సీజన్ లో కేంద్ర ప్రభుత్వం మొక్కజొన్న క్వింటాలుకు రూ.2,400 కనీస మద్దత ధర (ఎంఎస్పీ)ని ప్రకటించింది. మొక్కజొన్నల కొనుగోలు విషయంలో మార్కెఫెడ్, ఇతర ప్రభుత్వరంగ సంస్థలు దూరంగా ఉన్నాయి. దీంతో ఖరీఫ్ లో ఎలాగోలా గండం గట్కెక్కించుకున్న మొక్కజొన్న రైతులకు ఈ యాసంగిలో వ్యాపారులు చుక్కలు చూపెడుతున్నారు. క్వింటాకు రూ.1,850 నుంచి రూ.1,950 మించి ధర ఇవ్వకపోవడంతో ఏం చేయాలో అర్థం కాని పరిస్థితిలో రైతులు కొట్టుమిట్టాడుతున్నారు.

**2.11 లక్షల ఎకరాల్లో సాగు..**

2025–26 యాసంగి సీజన్ కు సంబంధించి విత్త నాల వేసే నుంచి ఫిబ్రవరిమే మధ్య వరకు సాగు నమోదు ఆధారంగా 2,11,500 ఎకరాల్లో మొక్క జొన్న వేసినట్లు వ్యవసాయశాఖ నివేదికలు చెబుతు న్నాయి. ఈ సాగు ఆధారంగానే ఒక్కో ఎకరానికి వాతావరణ పరిస్థితుల ఆధారంగా 28 క్వింటాళ్ల నుంచి 32 వరకు వస్తుందనేది అంచనా. ఈ లెక్కన 5.92 లక్షల మెట్రిక్ టన్నుల నుంచి 6.78 లక్షల మెట్రిక్ టన్నుల మొక్కజొన్నలు దిగుబడి రావొచ్చని భావించి ఆ మేరకు కొనుగోలు కేంద్రా లను ఏర్పాటు చేయాలని మార్క్ ఫెడ్ సహా ఇతర ప్రభుత్వ రంగ సంస్థలను ఉన్నతాధికారులు ఆదేశిం చారు. ఆ మేరకు క్షేత్రస్థాయిలో ప్రభుత్వ రంగ సం స్థలు కొనుగోళ్లను ప్రారంభించకపోవడంతో ప్రైవేట్ వ్యాపారులే వ్యవసాయ మార్కెట్ కమిటీల తో పాటు నేరుగా గ్రామాలకు వెళ్లి అగ్గువసగ్గువకు కొనుగోలు చేస్తున్నారు. దీంతో లాభాల మాట దేవుడెరుగు కానీ ఇంటిల్లిపాది కష్టపడినప్పటికీ తమ పెట్టుబడులు పోను రెక్కల కష్టం కూడా మిగిలడం లేదు అని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎకరానికి సుమారు రూ.28,000 నుంచి రూ.40 వేలు ఖర్చు చేస్తే.. ఇప్పుడున్న ధరలకు రూ.18.200 నుంచి రూ. 23,000 మిగిలితే అప్పులు, వడ్డీలకే సరిపోతున్నాయని చెబుతున్నారు.

**ఏనుమాముల మార్కెట్ లో వెంటనే మక్కల కొనుగోలు ప్రారంభించాలి:** తెలంగాణలో 8 లక్షల ఎకరాల్లో రైతులు మొక్కజొన్న పంటను సాగు చేశారని,పంట మార్కెట్‌కు వచ్చి 15 రోజులవుతున్నా.. కాంగ్రెస్ ప్రభుత్వం ఇంతవరకు కొనుగోలు కేంద్రాలు తెరవలేదని రాజకీయ పార్టీలు, రైతు సంఘాలు తెలిపాయి. ఇప్పటికైనా ఈ కాంగ్రెస్ ప్రభుత్వం నిద్రలేచి అన్ని గ్రామాల్లో మక్కల కొనుగోలు సెంటర్లు ప్రారంభించాలని కోరుతున్నాయి.రూ. 2400 మద్దతు ధర ఉన్న మొక్కజొన్నను ప్రయివేట్ వ్యక్తులకు రూ. 1600/1700కే రైతులు అమ్ముకుంటున్నారని, వెంటనే కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి, మొక్కజొన్నను ప్రభుత్వం మద్దతు ధరకు కొని రైతులను ఆదుకోవాలి లేని పక్షంలో రైతులకు మద్దతుగా నిరసన, ధర్నా కార్యక్రమాలు చేపడతామని వారు హెచ్చరిస్తున్నారు.

**యాసంగిలోఎకరానికి సగటు దిగుబడి, ఆదాయం వివరాలు...**

సగటు దిగుబడి : 2830 క్వింటాళ్లు
మార్కెట్ ధర (సగటు ): రూ. 1,850 రూ. 1,950
మొత్తం ఆదాయం : ఉదాహరణకు 28 క్వింటాళ్లకు రూ. 1,900 చొప్పున రూ. 53,200
మొత్తం ఖర్చు సగటు : రూ.35,000
నికర లాభం : రూ.18,200 రూ. 23,000
ధర క్వింటాకు రూ.2,000 నుంచి రూ.2,300 పైగా ఉంటే లాభం పెరుగుతుంది. కానీ, క్వింటాకు రూ.1.850 నుంచి రూ.1,950 ఇస్తుండడంతో పరిస్థితి ఇబ్బందికరంగా మారింది.

## బాల్య వివాహాల నిరోధక చట్టం గోడ ప్రతులను ఆవిష్కరించిన కలెక్టర్




**ప్రజాపక్షం/హనుమకొండ టౌన్ :** హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌లో బాల్య వివాహాల నిరోధక చట్టం2006కు సంబంధించిన గోడపత్రికలను జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్ సోమవారం ఆవిష్కరించారు.మహిళలు, పిల్లలు, దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మిషన్ శక్తి జిల్లా మహిళా సాధికారత కేంద్రం ద్వారా "బేటీ బచావో – బేటీ పఢావో" కార్యక్రమంలో భాగంగా ఈ కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా ఈ గోడపత్రికలను విడుదల చేశారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ, బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని, వాటిని నివారించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు. బాల్య వివాహాల నిరోధక అధికారులుగా జిల్లా స్థాయిలో జిల్లా కలెక్టర్, డివిజన్ స్థాయిలో ఆర్‌డీఓ/సబ్ కలెక్టర్, ప్రాజెక్టు స్థాయిలో సీడీపీవో, మండల స్థాయిలో తహశీల్దార్, సెక్టార్ స్థాయిలో ఐసీడీఎస్ సూపర్వైజర్, గ్రామ స్థాయిలో పంచాయతీ కార్యదర్శి సీఎంపీవోగా వ్యవహరిస్తారని వివరించారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రవి, జిల్లా రెవెన్యూ అధికారి సత్యపాల్ రెడ్డి, డీఆర్‌డీఓ శ్రీను, పరకాల, హనుమకొండ ఆర్‌డీఓలు డాక్టర్ కన్నం నారాయణ, రాథోడ్ రమేష్, డీఎంహెచ్వో డాక్టర్ అప్పయ్య, డీడబ్ల్యూఓ విశ్వజ, జీఈసీఓ సునీత, ఈఓ సింధు రాణి, మిషన్ కోఆర్డినేటర్లు కళ్యాణి, పావని తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యలకు ప్రాధాన్యం: కలెక్టర్

**ప్రజాపక్షం/జనగామ :** ప్రజాసమస్యల పరిష్కారానికి అధికారులు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అన్నారు. సోమవారం ప్రజావాణి సందర్భంగా కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్‌హాల్‌లో జిల్లా కలెక్టర్ వివిధ గ్రామాల నుండి వచ్చిన ఆర్జీదారుల నుంచి వచ్చిన 207 వినతులను స్వీకరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సమస్యలకు అధికారులు ప్రాధాన్యత ఇవ్వాలని, వారి సమస్యలను త్వరితగతిన పరిష్కరించి వారికి సమాచారం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ బెన్ షా లోమ్, వివిధ శాఖల అధికారులు, వివిధ సెక్షన్‌ల సూపరిండెంట్‌లు పాల్గొన్నారు.

## నేడు ఇండ్ల పట్టాల సాధనకు మహా ధర్నా

సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి
మద్దెల ఎల్లేష్



**ప్రజాపక్షం/కాజీపేట:** గత అనేక సంవత్సరాలుగా రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ స్థలాలలో నిలువ నీడ లేని పేదలు గుడిసెలు వేసుకుని నివసిస్తున్న వారికి పట్టాలు ఇవ్వాలని ఈ నెల 24న ఇందిరా పార్కు వద్ద మహా ధర్నా నిర్వహిస్తున్నట్లు సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి మద్దెల ఎల్లేష్ తెలిపారు. సోమవారం మడికొండలో సీపీఐ మండల కార్యదర్శి మాలోతు శంకర్ అధ్యక్షతన జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పేద ప్రజలకు పట్టాలు ఇవ్వాలని, ఇండ్లు నిర్మించి ఇవ్వాలని, పేదల కాలనీలలో మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేస్తూ అనేక మార్లు ప్రభుత్వ అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకుని వెళ్ళడం జరిగిందన్నారు. గతంలో తెలంగాణ రాష్ట్రం సాధించిన అధికారంలోకి వచ్చిన బీఆర్ఎస్ ప్రభుత్వం పేదలకు అన్ని సదుపాయాలతో కూడిన డబుల్ బెడ్రూం ఇండ్లను నిర్మించి ఇస్తామని ప్రజలకు ఆశ చూపి మభ్యపెట్టి పది సంవత్సరముల పాటు కాలయాపన చేసిందన్నారు. విదిలేని పరిస్థితులలో నిలువ నీడ లేని పేదలు భారత కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో ఎర్ర జెండా నీడన ప్రభుత్వ భూములలో గుడిసెలు వేసుకుని నివసిస్తున్నారని, జిల్లాలలోని అనేక ప్రాం తాలలోని అన్యాక్రాంతం అవుతున్న ప్రభుత్వ, చెరువుశిఖం భూములను ఆక్రమించుకొని వేలాది మంది పేదలు ప్రజలు గుడిసెలు వేసుకుని నివసిస్తున్నారన్నారు. ఈ సమావేశంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బిక్షపతి, సిపిఐ కాజీపేట మండల సహాయ కార్యదర్శి కుడి స్వామి, సిపిఐ లకావత్ లక్ష్మి , భుక్య స్వరూప, గుండె నాగరాజు, వక్కల ప్రతిభ, పాల్గొన్నారు.

## రైతులకోసం మక్కల కొనుగోలు కేంద్రాల ఏర్పాటు

రైతులు సద్వినియోగం చేసుకోవాలి
ఎమ్మెల్యే కడియం శ్రీహరి



**ప్రజాపక్షం/స్టేషన్ ఘన్ పూర్ :** రైతులను అప్పుల భారీ నుండి బయటకు తీసుకువచ్చేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యవసాయ రంగానికి పెద్ద పీట వేస్తున్నారని మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి తెలిపారు.స్టేషన్ ఘనపూర్ పట్టణ కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ లో మార్క్ ఫెడ్ ఆధ్వర్యంలో ఓడిసిఎంఎస్, మార్కెట్ కమిటీ ద్వారా ఏర్పాటు చేసిన మొక్కజొన్నల కొనుగోలు కేంద్రం ప్రారంబొత్సవానికి ఎమ్మెల్యే కడియం శ్రీహరి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కొనుగోలు కేంద్రం వద్ద ఉన్న మక్కలను, వాటి తేమ శాతాన్ని పరిశీలించి మక్కల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.... మొట్ట మొదటి మక్కల కొనుగోలు కేంద్రం ప్రారంభించడం చాలా సంతోషంగా ఉందని అన్నారు. కేంద్ర ప్రభుత్వం మక్కలకు నిర్ణయించిన మద్దతు ధర 2400ఉండగా మధ్య దళారులు మక్కలను 1600 నుండి 1700 కే కొనుగోలు చేయడం వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని తెలిపారు. మద్దతు లభించక పెట్టుబడి వ్యయం పెరిగిరైతులు అప్పులపాలు అవుతున్నారని అన్నారు. మొక్కజొన్న రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి మక్కల కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రిని కోరిన వెంటనే మక్కల కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు అనుమతి ఇచ్చిన సీఎం రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలలో మద్దతు ధరతో మక్కలను కొనుగోలు చేస్తారని, కొనుగోలు చేసిన వారం రోజులలోనే డబ్బులు రైతుల ఖాతాలలో జమ అవుతాయాని వెల్లడించారు. వ్యవసాయానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు పెద్ద పీట వేస్తున్నారని అన్నారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ లావణ్య శిరీష్ రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మారుజోడు రాంబాబు, మున్సిపల్ చైర్మన్ తాటికొండ వినయ్ కుమార్, ఐలయ్య, నీల రాజమ్మ, మార్కెట్ డైరెక్టర్లు, మున్సిపల్ కౌన్సిలర్లు, మార్క్ ఫెడ్, మార్కెట్, వ్యవసాయ శాఖ అధికారులు, వివిధ గ్రామాల సర్పంచులు, నాయకులు, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.

## మొండి బకాయిల వసూళ్లపై ప్రత్యేక శ్రద్ధ

కలెక్టర్, జిడబ్ల్యూఎంసి కమిషనర్
రాహత్ బాజ్‌పాయ్



**ప్రజాపక్షం/ఖిలా వరంగల్:** మొండి బకాయిల వసూళ్లపై ప్రత్యేక శ్రద్ధ వహించి పన్ను వసూళ్లను వేగవంతం చేయాలని హనుమకొండ జిల్లా కలెక్టర్, జిడబ్ల్యూఎంసి కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ అధికారులను ఆదేశించారు. సోమవారం నగర పరిధిలోని 48, 49, 50, 51 డివిజన్‌లలో క్షేత్రస్థాయిలో పర్యటించిన కలెక్టర్, పన్ను వసూళ్ల తీరును ప్రత్యక్షంగా పరిశీలించి సమర్థవంతంగా అమలు చేయడానికి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా నక్కలగుట్ట సర్కిల్ కార్యాలయంలోని ఈ సేవ కేంద్రాన్ని ఆకస్మికంగా సందర్శించిన కలెక్టర్, పన్ను చెల్లింపుల ప్రక్రియపై వివరాలు తెలుసుకున్నారు. ప్రతి రోజూ ఎంత మొత్తంలో వసూళ్లు జరుగుతున్నాయి. ఏ సమయాల్లో సేవలు అందిస్తున్నారు. వంటి అంశాలపై విచారించారు. 51వ డివిజన్‌లో రెవెన్యూ అధికారులతో కలిసి ఇంటింటికి వెళ్లి పన్ను వసూళ్ల విధానాన్ని పరిశీలించారు. 50వ డివిజన్‌లో పర్యటించిన సందర్భంలో, సంబంధిత డివిజన్లకు చెందిన బకాయిల జాబితా, ఇప్పటి వరకు జరిగిన వసూళ్ల వివరాలు, ఇంకా వసూలు చేయాల్సిన బకాయిల జాబితా ఆధారంగా తీసుకొని, బిల్ కలెక్టర్లు ప్రతి 20 అసెస్‌మెంట్‌ల చొప్పున విభజించి వసూళ్లను చేపట్టాలని తెలిపారు. అలాగే పిఓఎస్ యంత్రాలను వినియోగంలో ఉంచి, ప్రజలు స్థానికంగానే పన్నులు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నగరంలోని ప్రతి గృహం నుండి పన్నులు చెల్లింపులు జరిగేలా చూడాలని అన్నారు. 49వ డివిజన్‌లో పర్యటించిన సందర్భంగా ఒకే ఇంటికి రెండు లేదా మూడు హౌస్ నంబర్లు ఉండడాన్ని గమనించిన కలెక్టర్, వాటిని తక్షణమే సరిచేయాలని అధికారులను ఆదేశించారు. 48వ డివిజన్‌లో సుమారు 9వందల గృహాల నుండి పన్ను వసూళ్లు చేపట్టాలని సూచిస్తూ, కొన్ని డివిజన్‌లలో రూ.లక్షల్లో బకాయిలు ఉన్నాయని తెలిపారు. లక్ష్యాలను సాధించాలంటే ప్రణాళికబద్ధంగా పనిచేస్తూ, ప్రతి రోజు వార్డులో కనీసం రూ.3లక్షల వసూళ్లు సాధించాల్సిందిగా అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ఎంహెచ్ఓ డాక్టర్ రాజారెడ్డి, ఆర్ఐ అనిల్ కుమార్, వార్డు అధికారులు, బిల్ కలెక్టర్లు, తదితరులు పాల్గొన్నారు.

## భూ వివాదాల పరిష్కారం కోసం ఎస్‌డిసి కోర్టు నిర్వహణ

కలెక్టర్, ఐటిడిఎ ఇన్‌చార్జి ప్రాజెక్టు
ఆఫీసర్ దివాకర టిఎస్



**ప్రజాపక్షం/ములుగు:** గిరిజనుల సమస్యల సత్వర పరిష్కారం కోసం నిర్వహించిన గిరివాణి కార్యక్రమానికి ఫిర్యాదులు వెల్లువెత్తాయి. ఆర్జీలను త్వరితగతిన పరిష్కరించాలని ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్, ఐటిడిఏ ఇన్‌చార్జి ప్రాజెక్టు ఆఫీసర్ దివాకర టిఎస్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం ఐటిడిఏ ఏటూరునాగారం సమావేశ మందిరంలో ప్రజావాణి.. గిరివాణి(గిరిజన దర్బార్) కార్యక్రమంలో స్వయంగా ప్రజల నుండి దరఖాస్తులను జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ స్వీకరించారు. గిరివాణి(గిరివాణి దర్బార్) కార్యక్రమానికి 130, ప్ర టజావాణి కార్యక్రమానికి 52 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను కలెక్టర్‌కు విన్నవిస్తూ ఆర్జీలు సమర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ సమస్యలను పరిష్కరించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. గిరిజనులు ప్రధానంగా తమ గ్రామాల్లో రోడ్ల నిర్మాణం, కొ త్త బోర్‌వెల్‌ల ఏర్పాటు, వ్యవసాయ భూముల్లో బోర్ వెల్స్ ఏర్పాటు వంటి పలు అంశాలపై తమ ఆర్జీలను సమర్పించడం జరిగిందని కలెక్టర్ పేర్కొన్నారు. భూ సమస్యలు ఎల్టిఆర్ కేసుల పురోగతి అభ్యంతరాలపై ప్రజల నుండి ఎక్కువగా దరఖాస్తులు వస్తున్నాయని వాటిని సమగ్రంగా పరిశీలించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రత్యేకంగా భూ వివాదాల పరిష్కారం కోసం ఎస్‌డిసి కోర్టును వారానికి నాలుగు రోజులు మంగళ, బుధ, గురు, శుక్రవారాలు ఉదయం 11గంటల నుండి మధ్యాహ్నం 2గంటల వరకు ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఎఫ్ఓ రాహుల్ కిషన్ జాదవ్, అదనపు కలెక్టర్ సంపత్‌రావు, ఏపిఓ వసంతరావు, ఆర్‌డిఓ వెంకటేష్, ఎస్‌డిసి ప్రతాప్, డిడి జనార్ధన్, జిల్లా అధికారులు, కలెక్టరేట్ ఏఓ, ఐటిడిఏ ఎస్ఓ, తహసీల్దార్లు, ఎంపిడిఓలు, ఎంపిఓలు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణిలో 127 వినతులు స్వీకరణ



**ప్రజాపక్షం/వరంగల్ :** వరంగల్ జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద ప్రజల నుండి వినతిపత్రాలను స్వీకరించారు. ప్రజావాణికి పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరై తమ సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చి దరఖాస్తులు సమర్పించారు. ఈ సందర్భంగా ప్రజలు సమర్పించిన వినతిపత్రాలను పరిశీలించిన కలెక్టర్, సంబంధిత శాఖల అధికారులతో దరఖాస్తుదారుల సమక్షంలోనే చర్చించి సమస్యలపై వివరాలు తెలుసుకున్నారు.ప్రజావాణిలో అందిన వినతులను ఆలస్యం చేయకుండా త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 127 దరఖాస్తులు అందినట్లు తెలిపారు. అందులో రెవెన్యూ శాఖకు సంబంధించినవి 50, జీడబ్ల్యూఎంసీకి సంబంధించినవి 16, ఇతర శాఖలకు సంబంధించినవి 61 దరఖాస్తులు ఉన్నట్లు వెల్లడించారు. ప్రజావాణి కార్యక్రమం ఆలస్యం కావడంతో దరఖాస్తుదారులకు అరటిపండ్లు, బట్టర్ మిల్క్ ప్యాకెట్లను పంపిణీ చేయగా, వారు హర్షం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వై.వి. గణేష్, జిల్లా రెవెన్యూ అధికారి విజయలక్ష్మి , నర్సంపేట ఆర్డీవో ఉమారాణి, హౌసింగ్ పీడీ శ్రీవాణి, డీఎంహెచ్వో డాక్టర్ సాంబశివరావు, తదితర శాఖల జిల్లా అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

## పదో తరగతి పరీక్షల సరళిని పరిశీలించిన కలెక్టర్

**ప్రజాపక్షం/రఘునాథపల్లి:** మండల కేంద్రంలో జెడ్పీ హై స్కూల్, సెయింట్ మేరీస్, సెయింట్ ఆల్ఫోన్స్‌లో ఏర్పాటుచేసిన పదవ తరగతి వార్షిక పరీక్ష కేంద్రాలను సోమవారం జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆకస్మికంగా విచ్చేసి పరీక్షల సరళిని ఆయన పరిశీలించారు. తనిఖీలలో భాగంగా పదవ తరగతి పరీక్ష కేంద్రాల నిర్వాహకులతో కలెక్టర్ మాట్లాడుతూ పదవ తరగతి వార్షిక పరీక్ష కేంద్రాలలో మౌలిక వసతులు సరిగ్గా ఉండాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. పరీక్ష కేంద్రాలలోకి మొబైల్ ఫోన్‌తో లోపలికి ఎవరినీ అనుమతించవద్దని స్పష్టం చేశారు. ఎటువంటి లోటుపాట్లకు తావు లేకుండా పరీక్షలు సజావుగా జరిగేలా చూడాలన్నారు. ఈ పరిశీలనలో ఎస్ఐ దూదిమెట్ల నరేష్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలు అభివృద్ధిలో భాగస్వాములు కావాలి

2వ డివిజన్ పర్యటనలో మేయర్ మూడ్ గణేష్



**ప్రజాపక్షం/పాల్వంచ :** ప్రజలు అభివృద్ధి పనుల్లో భాగస్వాములు కావాలని అప్పుడే మెరుగైన ఫలితాలు వస్తాయని కొత్తగూడెం మునిసిపల్ కార్పొరేషన్ మేయర్ మూడ్ గణేష్ అన్నారు. పాల్వంచలోని రెండవ డివిజన్‌లో సోమవారం డిప్యూటి మేయర్ లలిత, కార్పొరేటర్ భవితలతో కలిసి పర్యటించారు. ముందుగా అంబేద్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా డివిజన్‌లో సమస్యలను నేరుగా ప్రజలను అడిగి తెలుసుకొన్నారు. డ్రైనేజీలు, పారిశుద్ధ్యం, తాగునీటి వసతులను పరిశీలించారు. అనంతరం మేయర్ మాట్లాడుతూ బాబా సాహెబ్ అంబేద్కర్ రాజ్యాంగం ఫలితంగానే నేడు ఈ బాధ్యతల్లో ఉన్నామని చెప్పారు. డివిజన్‌లో పలు సమస్యలు అపరిష్కృతంగా ఉన్నాయని అన్నారు. పలుచోట్ల నూతన డ్రైనేజీలు, రహదారులు, విద్యుత్ సౌకర్యం ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి సారిస్తామని తెలిపారు. నీరు ఎంతో విలువైనదని, ప్రజలు తాగునీటి వృథా చేయొద్దని కోరారు. ప్రజలు తమ సమస్యలను నేరుగా తమకు తెలియజేయాలన్నారు. డివిజన్‌ల అభివృద్ధి కోసం ప్రత్యేక ప్రణాళికలతో ముందుకు సాగనున్నట్లు స్పష్టం చేశారు. వార్డు అధికారులు డివిజన్‌లోని సమస్యలను గుర్తించి ఎప్పటికప్పుడు కార్పొరేటర్‌ల దృష్టికి తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో మిషన్ భగీరథ డిఈ శ్రీనివాస్, మున్సిపల్ ఏఈ రాము, శానిటైజర్ ఇన్స్‌పెక్టర్ రవి, నాయకులు తుమ్మల శివారెడ్డి, మద్రబోయిన శ్రీను, ఉన్నం నాగేశ్వరరావు, రాహుల్, స్థానిక ప్రజలు, మిషన్ భగీరథ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## తరగని దేశభక్తి

ఐదవ తరానికి భగత్‌సింగ్‌ను
పరిచయం చేస్తున్న శాంతికౌర్



**ప్రజాపక్షం/ ఖమ్మం :** శాంతికౌర్‌ది ఇప్పటి పాకిస్తాన్‌లోని లాహోర్ ప్రాంతం. అనేక ఇబ్బందులను ఎదుర్కొన్న శాంతికౌర్ కుటుంబం ఎట్టకేలకు ఖమ్మం నగరంలోని బల్లేపల్లిలో స్థిరపడింది. స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్న తమ కుటుంబ వారసత్వాన్ని ఈ దేశం కోసం నిలబెట్టాలని ఆమె తపనపడుతుంది. అందులో భాగంగానే తన మనవలను భగత్‌సింగ్ వర్ధంతి సందర్భంగా పాత బస్టాండ్ సమీపంలోని భగత్‌సింగ్ విగ్రహం వద్దకు తీసుకువచ్చి విగ్రహానికి పూలమాల వేయించడంతో పాటు భగత్‌సింగ్ పోరాట చరిత్ర గురించి వారికి వివరించింది. వివరాల్లోకి వెళితే... శాంతికౌర్ తాత బలియాన్ సింగ్. ప్రస్తుత పాకిస్తాన్‌లో గల పంజాబ్ రాష్ట్రంలోని లాహోర్ ప్రాంతం. భగత్‌సింగ్ కూడా ఆ ప్రాంతంలోనే ఉండేవాడు. భగత్‌సింగ్ లాగే బలియాన్ సింగ్ సోదరులు స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్నారు. బలియాన్ సింగ్‌తో సహా ముగ్గురు సోదరులు ప్రాణాలు కోల్పోగా మిగిలిన దిలీప్ సింగ్ తన కుటుంబ సభ్యులను తీసుకుని బతుకుదెరువు కోసం రాష్ట్రాలు తిరుగుతూ వచ్చి 60 ఏళ్ల క్రితం ఖమ్మంలో స్థిరపడ్డారు. పోరాట కుటుంబం నుంచి వచ్చిన దిలీప్ సింగ్ మనవరాలు శాంతికౌర్ ఇప్పటి తరానికి చెందిన పిల్లలను తీసుకు వచ్చి ప్రతి ఏటా భగత్‌సింగ్‌కు నివాళులర్పించడంతో పాటు భగత్‌సింగ్ వీరగాధను వారికి తెలియజేప్పడం జరుగుతుంది. శ్రమించి జీవించే శాంతికౌర్ కుటుంబం భగత్‌సింగ్ వర్ధంతిని గుర్తుంచుకుని జరపడమే కాకుండా రాబోయే తరానికి కూడా తెలియజేప్పడం అభినందనీయం. శాంతికౌర్‌ను పలువురు అభినందిస్తున్నారు.

## త్వరలో మునిసిపల్ షాపులకు వేలం

మునిసిపల్ చైర్‌పర్సన్ కాపా చంద్రకళ



**ప్రజాపక్షం/వైరా :** వైరా మునిసిపల్ చైర్‌పర్సన్ డాక్టర్ కాపా చంద్రకళ మురళీకృష్ణ సోమవారం వైరా మున్సిపాలిటీ పరిధిలోని పాత కూరగాయల మార్కెట్ వద్ద ఉన్న మున్సిపాలిటీ షాపింగ్ కాంప్లెక్స్‌ను మున్సిపల్ శానిటరీ అధికారి వీరన్నతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా షాపుల వివరాలను అడిగి ఆమె తెలుసుకున్నారు. అనంతరం డాక్టర్ కాపా చంద్రకళ మురళీకృష్ణ మాట్లాడుతూ ఆర్థిక సంవత్సరం ఈ నెల31తో ముగింపుతో ఏప్రిల్ ఫస్ట్ నుంచి కొత్త ఆర్థిక సంవత్సరం ప్రారంభం కానుంది. మునిసిపల్ భవనాలను షాపింగ్ కాంప్లెక్స్‌లను వేలంపాట నిర్వహించి మునిసిపల్ ఆదాయం పెంచే దిశగా చర్యలు చేపట్టడం జరుగుతుంది. గత కొన్ని సంవత్సరాల నుండి మునిసిపల్ ఆదాయం షాపుల రూపంలో పెరగాల్సి ఉన్నా పూర్తిస్థాయిలో పెరగలేదు. టెండర్‌లు పిలవకపోవడమే ఆదాయం కుంటుపడింది. మునిసిపాలిటీ అభివృద్ధి ధ్యేయంగా ఆదాయం పెరిగే విధంగా టెండర్లకు పిలవడం జరుగుతుంది. మున్సిపాలిటీ షాపులకు అద్దెలు చెల్లించకుండా సీజ్ చేయబడిన షాపులను ప్రత్యేకంగా మరలా టెండర్లు పిలుస్తాం, మునిసిపల్ ఆదాయానికి సహకరించే విధంగా షాపుల నిర్వాహకులు చేయూతనిఅందించాలి. ప్రతినెల క్రమం తప్పకుండా మున్సిపాలిటీ అద్దెలు చెల్లించే విధంగా ఉండాలని ఆమె సూచనలు చేశారు. అదేవిధంగా గాంధీచౌక్‌లోని షాపులపై కూడా ప్రత్యేక దృష్టి సారించడం జరుగుతుందని డాక్టర్ కాపా చంద్రకళ తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ మెడికల్ అండ్ హెల్త్ చైర్మన్ డాక్టర్ కాపా మురళీకృష్ణ, వేముల రత్నాకర్, ఉయ్యూరు రామకృష్ణ, గంగవరపు కిషన్, తోటకూర శ్రీకాంత్, ఐవి.నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## పదో తరగతి పరీక్షా కేంద్రాన్ని తనిఖీ

**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** పదో తరగతి పరీక్షా కేంద్రాలను జిల్లా కలెక్టర్ అంకిత్ సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సింగరేణి కాలరీస్ హైస్కూల్, సెయింట్ మేరీస్ హైస్కూల్, బాబూ క్యాంపు పిఎం శ్రీ ఉన్నత పాఠశాలల్లో ఏర్పాటు చేసిన పదో తరగతి పరీక్షల నిర్వహణను ఆయన సమగ్రంగా పరిశీలించారు. ఈ సందర్భంగా పరీక్షా కేంద్రాల వద్ద విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలపై కలెక్టర్ ఆరా తీశారు. మాల్ ప్రాక్టీస్‌కు తావులేకుండా చూడాలని, ఇన్విజిలేటర్లు, సిబ్బంది బాధ్యతా యుతంగా విధులు నిర్వహించాలన్నారు. పరీక్షా కేంద్రాల పరిసరాల్లో 163 (బి) సెక్షన్ అమలు వంటి అంశాలపై కూడా ఆరా తీశారు. ఈ తనిఖీల్లో భాగంగా కలెక్టర్ విద్యార్థుల హాజరు శాతాన్ని అడిగి తెలుసుకున్నారు

# అధికారులు ఏం తేల్చా(రు)రో?

మంత్రి ఆదేశించినా విచారణలో జాగు
వేగవంతం చేయాలని ప్రజల డిమాండ్
ఇప్పటికైనా అధికారులు
నిగ్గు తేల్చుతారా?

**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** 'తోటకూర దొంగించిన నాడే తొడ పాశం పెట్టి ఉంటే' అన్న సామెత ఏదులాపురం మునిసిపాలిటీ పరిధిలోని వరంగల్ క్రాస్‌రోడ్ రేషన్ షాప్ వ్యవహారంలో ఇట్టే సరిపోతుంది. సాక్షాత్తు మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఆదేశాలతో విచారణ చేపట్టి రోజులు గడుస్తున్నా తుది నిర్ణయం వెలువడకపోవడం ప్రజల్లో అసహనానికి దారి తీస్తోంది. రేషన్ షాపు ద్వారా కంట్రోల్ బియ్యం పంపిణీపై వచ్చిన ఫిర్యాదుల నేపథ్యంలో విచారణకు ఆదేశాలు జారీ అయినప్పటికీ, ఇప్పటివరకు ఎలాంటి స్పష్టత రాకపోవడం అనుమానాలకు తావిస్తోంది. తాత్కాలికంగా రేషన్ షాపును నిర్వహిస్తున్న డీలర్ జిల్లా స్థాయిలో ఓ కీలక పదవిని వెలగబెడుతున్న నేపథ్యంలో అధికారులు చర్యలకు బ్రేక్ పడుతున్నాయన్న విమర్శలు వినిపిస్తున్నాయి. తొలుత రెగ్యులర్ రేషన్ షాప్ ఏర్పాటు సమయంలో కోర్టును ఆశ్రయించి, ప్రక్రియను అడ్డుకున్న డీలర్ అనంతరం చీకటి ఒప్పందాలతో తన అనధికారిక ప్రస్థానాన్ని కొనసాగిస్తున్నట్లు ఆరోపణలు వినపడుతున్నాయి. కాగా మంత్రి ఆదేశాలిచ్చినా.. విచారణలో ఇంత ఆలస్యం చోటుచేసుకోవడం ప్రజలను విస్మయానికి గురిచేస్తుంది. ఇప్పటికైనా విచారణను వేగవంతం చేసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

**'ప్రజాపక్షం' వరుస కథనాలు...**

ప్రజల కష్టాలే అక్షరాలుగా..ఏళ్ల తరబడి కొనసాగుతున్న రేషన్‌షాప్ సమస్యపై 'ప్రజాపక్షం' వరుస కథనాలు ప్రచురిస్తున్న విషయం పాఠకులకు విధితమే. ప్రజల ఇబ్బందులను వెలుగులోకి తీసుకురావడమే లక్ష్యంగా ఈ అంశాన్ని పతాక స్థాయిలో ప్రస్తావిస్తూ వస్తోంది. ఈ నేపథ్యంలో జనవరి 9న 'ఈ బాధలు తీరేదెన్నడో?', మార్చి 16న 'మంత్రి ఆదేశాలిచ్చిన అమలు శూన్యం' శీర్షికలతో కథనాలు ప్రచురించగా, సంబంధిత అధికార యంత్రాంగం కదిలింది. సివిల్ సప్లై, రెవెన్యూ శాఖల ఆధ్వర్యంలో అక్కడి తాత్కాలిక రేషన్‌షాపును తనిఖీ చేసినప్పటికీ, అసలు సమస్యగా నిలిచిన రేషన్ బియ్యంలో నాణ్యతలోపంపై సమగ్ర పరిశీలన మాత్రం అటక్కెనట్టే కనిపిస్తోంది. స్వయంగా రేషన్ డీలర్‌ను తమ వెంటపెట్టుకొని ఆయన చెప్పిన వారినే విచారణ చేయడం విశేషం. కానీ అసలు బియ్యంలో సమస్య ఏర్పడిన వారి దగ్గరికి వెళ్లడంలో మాత్రం అధికారులు ఎందుకంత ఉదశీనత కనబరుస్తున్నారనేది మిలియన్ల ప్రశ్నగా మారింది.

ఇప్పటికైనా అధికారులు నిగ్గు తేల్చుతారా?

ఏళ్లుగా కొనసాగుతున్న రేషన్‌షాప్ సమస్యపై వరుసగా ఫిర్యాదులు వస్తున్నా, మంత్రి ఆదేశాలతో విచారణలు సాగుతున్నా స్పష్టమైన నిర్ణయం వెలువడకపోవడం ప్రజల్లో తప్పుడు సాంకేతాలనిస్తుంది. సాక్షాత్తు మంత్రి ఆదేశాలు జారీ చేసిన తర్వాత కూడా జాప్యం కొనసాగుతుండటంపై ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రేషన్ బియ్యం నాణ్యత సమస్యపై తుది నిర్ణయం తీసుకుని బాధ్యులపై చర్యలు తీసుకుంటారా? అనేది సంశయంగా మారింది. సామాన్యుల ఫిర్యాదులపై అలా చూస్తున్నారంటే ఏమో అనుకోవచ్చు. కానీ మంత్రి ఆదేశాలపై ఇంత అలసత్వం ప్రదర్శిస్తుండటం వెనుక ఆంతర్యం ఏమిటో అధికారుల వైఖరిని ప్రశ్నిస్తోంది. లేకపోతే మరుగున పడుతుందో? అనేది ప్రజలల్లో ప్రధాన ప్రశ్నగా నిలుస్తోంది.

## కార్మిక హక్కుల రక్షణకు ఐక్యపోరాటాలే శరణ్యం

అసంఘటిత రంగ కార్మికుల
సంక్షేమానికి ప్రత్యేక చట్టాలు రావాలి
ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలు తిప్పికొడదాం
నాలుగు లేబర్ కోడ్‌లు రద్దు చేయాలి
సమరశీల పోరాటాలకు సిద్ధం కావాలి
సాబీర్ పాషా, నరాటి పిలుపు



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** కార్మిక హక్కుల రక్షణకు ఐక్యపోరాటాలే శరణ్యమని, ప్రభుత్వాల కార్మిక వ్యతిరేక విధానాలను ఐక్యంగా తిప్పికొట్టాలని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె సాబీర్ పాషా పిలుపునిచ్చారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ఎఐటియుసి జిల్లా కార్యాలయం శేషగిరి భవన్‌లో ఎఐటియుసి జిల్లా కౌన్సిల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాల వల్ల కార్మికులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బ్రిటీష్ కాలం నుండి పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను కేంద్ర ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్‌లుగా మార్చి కార్మికులను బానిసలుగా తయారు చేస్తోందన్నారు. అసంఘటిత రంగ కార్మికులకు సామాజిక భద్రత కల్పించడంలో పాలకులు నిర్లక్ష్యం వహిస్తున్నారని, కనీస వేతన అమలు కావడం లేదని ధ్వజమెత్తారు. ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి నరాటి ప్రసాద్ మాట్లాడుతూ ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్ శక్తులకు ధారాదత్తం చేయడాన్ని అడ్డుకోవాలని, కార్మిక శ్రేణులు రాజకీయాలకు అతీతంగా ఏకతాటిపైకి రావాలని కోరారు. పెరిగిన త్యావసర ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలని, పెండింగ్‌లో ఉన్న కార్మిక సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. భవిష్యత్ కార్యాచరణలో భాగంగా ఛలో అసెంబ్లీ, కలెక్టరేట్ ముట్టడి వంటి కార్యక్రమాలను విజయవంతం చేయాలని శ్రేణులకు దిశా నిర్దేశం చేశారు. ఎఐటియుసి జాతీయ, రాష్ట్ర, జిల్లా, మండల స్థాయి మహాసభలకు ఎఐటియుసి నాయకులు, కార్యకర్తలు సిద్ధం కావాలని కోరారు. ఈ సమావేశంలో ఎఐటియుసి జిల్లా నాయకులు కంచర్ల జమలయ్య, కందుల భాస్కర్, దేవరకొండ శంకర్, వంగ వెంకట్, జి వీరస్వామి, గెద్దాడు నగేష్, గోనె మణి, వేల్పుల మల్లిఖార్జున్, ఎండి నజీర్, అహ్మద్, పిట్టల రామచందర్ తదితరులు పాల్గొన్నారు.

## భగత్‌సింగ్ స్ఫూర్తితో సమరశీల పోరాటాలు

సామ్రాజ్యవాదంతో పెనుముప్పు
సంయుక్త కిసాన్ మోర్చా పిలుపు



**ప్రజాపక్షం/ ఖమ్మం :** భగత్‌సింగ్ స్ఫూర్తితో వ్యవసాయ రంగ పరిరక్షణ, సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా సమరశీల పోరాటాలు నిర్వహించాలని సంయుక్త కిసాన్ మోర్చా నేతలు పిలుపునిచ్చారు. సంయుక్త కిసాన్ మోర్చా జాతీయ సమితి పిలుపు మేరకు సోమవారం ఖమ్మం ఆర్డిఒ కార్యాలయం నుంచి ప్రదర్శన నిర్వహించారు. ప్రదర్శన అనంతరం సంజీవరెడ్డి భవన్‌కు ఎదురుగా గల భగత్‌సింగ్ విగ్రహానికి కిసాన్ సంయుక్త మోర్చా నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్ లు అమరత్వం పొంది 95 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు సంయుక్త కిసాన్ మోర్చా నేతలు తెలిపారు. అమెరికా సామ్రాజ్యవాద ప్రభావం భారతదేశంపై గణనీయంగా చూపుతుందన్నారు. ట్రంప్‌తో మోదీ చేసుకున్న ఒప్పందం భారతదేశ వ్యవసాయ రంగాన్ని కుదేలు చేయనుందని నేతలు ఆరోపించారు. ఈ ఒప్పందాన్ని తక్షణం రద్దు చేసుకోవాలని డిమాండ్ చేశారు. భారతదేశం అలీనదేశంగా కీర్తినొందిందని కాని మోదీ ఇప్పుడు ట్రంప్ ముందు మోకారిల్లుతున్నారని వారు ఆరోపించారు. భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్ లాంటి అమరుల త్యాగాలను గుర్తు చేసుకుని భవిష్యత్తు పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. జాతీయ సమైక్యత, వ్యవసాయ రంగ పరిరక్షణ లక్ష్యంగా ముందుకు సాగాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘాలు, వ్యవసాయ కార్మిక సంఘాల నాయకులు దొండపాటి రమేష్, బొంతు రాంబాబు, నాగేశ్వరరావు, పొన్నం వెంకటేశ్వరరావు, తాటి వెంకటేశ్వరరావు, సిద్దినేని కోటయ్య, ప్రకాష్, వాసిరెడ్డి ప్రసాద్, నాగేశ్వరరావు, ఎస్‌కె మీరా, యర్రా శ్రీనివాసరావు, ఖాసీం, అప్పారావు, వెంకన్న, వెంకటేశ్వర్లు, పాశం అప్పారావు, కూచిపూడి మధు తదితరులు పాల్గొన్నారు.

## పంట పొలాలను సందర్శించిన శాస్త్రవేత్తల బృందం

'శ్రీరామ్ సీడ్స్'తో నిండా మునిగిన రైతన్నలు
'ప్రజాపక్షం' కథనానికి స్పందన

ప్రజాపక్షం ఎఫెక్ట్



ప్రజాపక్షం/సత్తుపల్లి : శ్రీరామ్ సీడ్స్‌తో నిండా మునిగిన రైతన్నలు అనే శీర్షికన ఈనెల 21న ''అన్నదాతకు న్యాయం జరిగేనా'' అనే శీర్షికన సోమవారం 'ప్రజాపక్షం' పత్రికలో వెలువడిన కథనాలకు వ్యవసాయ శాఖ అధికారులు స్పందించారు. సోమవారం సత్తుపల్లి మండలం గౌరిగూడెం, సిద్ధారం, రేజర్ల, సదాశివునిపాలెం గ్రామాలలోని వరి పంటలను వ్యవసాయ శాఖ శాస్త్రవేత్తల బృందం పరిశీలించింది. శ్రీరామ ఆగ్రో జెనెటిక్స్ కంపెనీకి చెందిన ఆర్ ఎన్ ఆర్ 15048 అను వరి రకం తాలు కంకులు అధిక మొత్తంలో వచ్చాయని రైతుల ఫిర్యాదు, పత్రికలలో వచ్చిన కథనాల మేరకు ఆయా గ్రామాలకు చెందిన రైతుల వరి పంటను శాస్త్రవేత్తలు పరిశీలించి నమూనాలను సేకరించినట్లు మండల వ్యవసాయ శాఖాధికారి వై. శ్రీనివాసరావు తెలిపారు. నివేదిక ఆధారంగా తదుపరి కార్యాచరణ ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ టి. సుచరిత దేవి, కో ప్రోగ్రాం కోఆర్డినేటర్ కృషి విజ్ఞాన కేంద్రం డాక్టర్ టి. పావని, కౌటక శాస్త్రం కె వి కె, పి ఎస్ ఎం ఫణిశ్రీ, విస్తరణ శాస్త్రవేత్త కేవీకే వైరా, టి వేణుమాధవ్, విత్తన ధ్రువీకరణ అధికారి వరంగల్, వ్యవసాయ విస్తరణ అధికారి కే ఆశాజ్యోతి, రైతులు పాల్గొన్నారు.

## ఆధునిక వ్యవసాయ పద్ధతులతో అధిక దిగుబడులు

కలెక్టర్ అంకిత్



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** జిల్లా రైతాంగం ఆధునిక వ్యవసాయ పద్ధతులు అనుసరించి పంటల దిగుబడులు గణనీయంగా పెంచుకోవాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అన్నారు. సోమవారం రామవరం కృషి విజ్ఞాన కేంద్రంలో వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ (ఆత్మ) ఆధ్వర్యంలో నిర్వహించిన కిసాన్ మేళా, వ్యవసాయ ప్రదర్శన కార్యక్రమానికి ఆయన హాజరై జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో గాలికుంట వ్యాధి నివారణకు సంబంధించి నిర్వహించిన జాతీయ ఉచిత టీకాల గోడపత్రికను ఆవిష్కరించారు. అనంతరం జెండా ఊపి టీకాల కార్యక్రమాన్ని ప్రారంభించారు, అదే విధంగా వివిధ స్టాల్స్‌ను ఆయన పరిశీలించారు. రైతులకు అందుబాటులో ఉన్న ఆధునిక సాంకేతిక పద్ధతులు, నాణ్యమైన విత్తనాల వినియోగం, పంటల నిర్వహణ విధానాలు, వ్యవసాయ యంత్రాల వినియోగం, పంట రక్షణ చర్యలు, నీటి సంరక్షణ పద్ధతులపై ఏర్పాటు చేసిన ప్రదర్శనను ఆసక్తిగా వీక్షించారు. ఈ సందర్భంగా రైతులతో ముచ్చటించి వారి సమస్యలను అడిగి తెలుసుకుని, అధికారులకు తగిన సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మారుతున్న వాతావరణ పరిస్థితులతో అకాల వర్షాలు, వడగండ్ల వానలు వంటి సవాళ్లను దృష్టిలో ఉంచుకుని రైతులు శాస్త్రీయ ఆధునిక పద్ధతులను అనుసరించడం మేలన్నారు. వ్యవసాయ రంగంలో చోటు చేసుకుంటున్న సాంకేతిక మార్పులను రైతులు స్వీకరించి ఆధునిక విధానాల ద్వారా ఖర్చులను తగ్గిస్తూ దిగుబడులు పెంచుకవాలని సూచించారు. కృషి విజ్ఞాన కేంద్రం అందిస్తున్న శిక్షణలు, శాస్త్రవేత్తల సలహాలు, ప్రభుత్వ పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని అంకిత్ కోరారు. పంట మార్పిడి విధానాలను అమలు చేయడం ద్వారా నేల సారాన్ని కాపాడుకోవడం తోపాటు పంటల దిగుబడి పెరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ మూడ్ గణేష్, డిప్యుటీ మేయర్ సిరిపురపు లలిత కుమారి, వ్యవసాయాధికారి బాబూరావు, ఉద్యానశాఖ అధికారి కిషోర్, మత్స్యశాఖ అధికారి ఇంతియాజ్ ఖాన్, త్రి ఇంక్లైన్ సర్పంచ్ ఈసం ప్రవల్లిక, కృషి విజ్ఞాన కేంద్రం కోఆర్డినేటర్ భరత్, ఆత్మ చైర్మన్లు వీరభద్రరావు, తహశిల్దార్‌లు, ఎంపిడిఓలు, సంబంధిత శాఖల అధికారులు ప్రజాప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

## సర్పంచ్ కృషి ఫలితం..బోర్‌వెల్

**ప్రజాపక్షం/కారేపల్లి :** మాదారం గ్రామంలో తాగునీటి సమస్య పరిష్కారానికి బోర్‌వెల్ మంజూరు అయింది. ఖమ్మం ఎంపి రఘురాం రెడ్డి ప్రత్యేక చొరవతో ఎంపి నిధుల ద్వారా ఈ బోర్‌వెల్ ఏర్పాటు చేయనున్నారు. గ్రామ సర్పంచ్ అజ్మీర ఉమా నరేష్ నిరంతరం కృషితో రూ.80 వేల వ్యయంతో బోర్‌వెల్ ఏర్పాటుకు కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నిధులు ఎస్‌టి కేటగిరీ కింద మంజూరు కావడం విశేషం. గ్రామ ప్రజల తాగునీటి అవసరాన్ని దృష్టిలో ఉంచుకొని తీసుకున్న ఈ నిర్ణయాన్ని స్థానికులు స్వాగతిస్తూ సర్పంచ్ నాయకత్వాన్ని ప్రశంసిస్తున్నారు.

## స్పెషల్ డ్రైవ్ కార్మికులను జిఒ 14లో చేర్చాలి

ఎమ్మెల్యే కూనంనేనికి ఎఐటియుసి వినతి



**ప్రజాపక్షం/వైరా :** వైరా మున్సిపాలిటీలో స్పెషల్ డ్రైవ్‌లో పనిచేస్తున్న 50 మంది మునిసిపల్ కార్మికులను జిఒ నెంబర్ 14లో చేర్చి, వారికి కూడా సమాన వేతనం ఇవ్వాలని ఎఐటియుసి ఖమ్మం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గాదె లక్ష్మీ నారాయణ, తోట రామాంజనేయులులు కొత్తగూడెం శాసన సభ్యులు కూనంనేని సాంబశివరావుకు విన్నవించారు. హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ వద్ద జరిగిన ధర్నాలో వైరా నుండి పాల్గొన్న మునిసిపల్ కార్మికులతో కలిసి వారు శాసనసభ్యులకు వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైరా మున్సిపాలిటీలో గత పది సంవత్సరాలుగా పనిచేస్తున్న స్పెషల్ డ్రైవ్ వర్కర్స్ సరైన వేతనాలు రాక నానా ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. జీవో నెంబర్ 14లో ఉన్న వర్కర్లకు నెలకు రూ.16,500 చెల్లిస్తుండగా వీరికి కేవలం రూ.10,500 మాత్రమే చెల్లిస్తున్నారని అన్నారు. అధికాక నెలల వేతనాలు చెల్లించడం లేదన్నారు. పిఎఫ్, ఈఎస్ఐ లాంటి సదుపాయాలు కూడా వీరికి లేవని కేవలం డైలీవైస్ వర్కర్లుగా పనిచేస్తున్నారని వారు ఈ సందర్భంగా వాపోయారు. వీరిని కూడా జిఒ నెంబర్ 14లో చేర్చి సమాన పనికి సమాన వేతనాన్ని చెల్లించాలని పిఎఫ్, ఈఎస్ఐ లాంటి సౌకర్యాలను కల్పించాలని ఆయన ఈ సందర్భంగా అసిస్టెంట్ కలెక్టర్‌ని కోరారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర మున్సిపల్ స్టాఫ్ అండ్ ఔట్‌సోర్సింగ్ వర్కర్స్ యూనియన్, ఎఐటియుసి జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బుర్రి ఉపేందర్, నాకిరకింటి కృష్ణ, వర్కింగ్ ప్రెసిడెంట్ రాయపూడి శ్రీను, జిల్లా సహాయ కార్యదర్శి బోళ్ళ శ్రీనివాసరావు, కోశాధికారి గుండ్ల మహేష్, పిడియాల లక్ష్మయ్య, గొల్లమందల కృష్ణ, దాసరి నగేష్, రాయపూడి కన్నయ్య, ఇండ్ల వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## దరఖాస్తుల పరిష్కారం వేగవంతం



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను పరిశీలించి పరిష్కరించే ప్రక్రియ వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. సోమవారం ఐడిఒసిలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి హాజరైన ఆయన జిల్లా నలు మూలల నుండి వచ్చిన ప్రజల దరఖాస్తులను స్వీకరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ అందిన ప్రతి దరఖాస్తును అర్హత మేరకు పరిశీలించి పరిష్కరించాలన్నారు. పరిష్కారానికి నోచుకోని వాటిపై సమగ్ర నివేదికలు ఇవ్వాలని ఆదేశించారు. అధికారులపై నమ్మకంతో సమస్యలు తీరుతాయని ప్రజలు ఇక్కడిదాక వస్తుంటారని, వారి నమ్మకాన్ని వమ్ముచేయకుండా అధికారులు చిత్తశుద్ధితో విధులు నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వేణుగోపాలరావు, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన, ఆర్డిఒ మధు, అధికారులు రవీందర్‌తో పాటు పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

## భగత్ సింగ్ 95వ వర్ధంతి



**ప్రజాపక్షం/చింతకాని :** విప్లవ వీరుడు భగత్ సింగ్ 95వ వర్ధంతి చింతకాని మండలవ్యాప్తంగా సిపిఐ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. చింతకాని మండలం బస్వాపురం, నాగిలిగొండలో జరిగిన కార్యక్రమంలో పార్టీ జిల్లా సహాయకార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి హాజరై భగత్ సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జితేందర్ రెడ్డి మాట్లాడుతూ భగత్ సింగ్ దేశభక్తుల కుటుంబంలో జన్మించడంతో పోరాటం వారసత్వంగా వచ్చింది. జలియన్‌వాలాబాగ్ సంఘటన భగత్ సింగ్‌ను కలచి వేసింది. దేశవ్యాప్తంగా విప్లవకారులను సమీకరించి పార్లమెంట్‌పైనా పొగ బాంబులు వేసి బ్రిటీష్ వారి నల్లచట్టాలకు వ్యతిరేకంగా నిరసన తెలిపి అరెస్ట్ అయ్యాడన్నారు. లాలాజీ మరణానికి కారకుడైన పోలిస్ అధికారి సాండర్స్ హత్యకేసులో భగత్ సింగ్ , రాజ్‌గురు, సుఖదేవ్‌లకు కాపిటల్ పనిష్మెంట్ ఉరిశిక్ష విధించారు.వారి మరణం దేశ స్వాతంత్ర్య ఉద్యమాన్ని వేగవంతం చేసింది. ప్రస్తుత సామ్రాజ్య వాద యుద్ధానికి, కార్పొరేట్‌లకు వ్యతిరేకంగా సమసమాజ స్థాపనకు యువత పోరాడటమే భగత్ సింగ్, రాజ్‌గురు, సుఖదేవ్‌లకు మనమిచ్చే ఘన నివాళి అన్నారు. ఈ కార్యక్రమంలో బస్వాపురం, నాగిలిగొండ సర్పంచ్‌లు ఆవుల నర్సింహారావు, వేపూరి పద్మ, సిపిఐ మండల కార్యదర్శి దూసరి గోపాలరావు, జిల్లా సమితి సభ్యులు రాసాల గోపాలరావు, మండల సహాయ కార్యదర్శి మార్గం శ్రీను, బద్దల నర్సింహారావు, షేక్ హుస్సేన్, పంది శేఖర్, మామిడాల యాలాద్రి, చాట్ల ముఖర్జీ, బాబు పెద్ద వెంకటి, అరికోట్ల భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

# బాంబుల మోతల మధ్య చెస్ ఆడలేను..

## క్యాండిడేట్స్ టోర్నీని బాయ్‌కాట్ చేస్తున్నా : చెస్ క్రీడాకారిణి కోనేరు హంపి

భారత ప్రముఖ చెస్ క్రీడాకారిణి కోనేరు హంపి కఠినమైన నిర్ణయం తీసుకుంది. ప్రతిష్ఠాత్మకమైన ఫిడే మహిళల క్యాండిటేట్స్ టోర్నమెంట్ నుంచి ఆమె వైదొలిగింది. పశ్చిమాసియాలో యుద్ధం జరుగుతున్నందున భద్రతపై ఆందోళనగా ఉందని చెప్పిన ఆమె.. బాంబుల మోతల మధ్య చెస్‌పై శ్రద్ధ పెట్టడం సాధ్యం కాదని వాపోయింది. ఇదివరకే టోర్నీ వేదికపై అసంతృప్తి వ్యక్తం చేసిన హంపి చివరకు టోర్నీని బాయ్‌కాట్ చేయాలని భావించింది. ఈ విషయాన్ని సోమవారం ఎక్స్ వేదికగా వెల్లడించిందీ గ్రాండ్‌మాస్టర్. పశ్చిమాసియాలో యుద్ధం కారణంగా భారత క్రీడాకారిణులు ప్రధాన టోర్నీలకు దూరమవుతున్నారు. దుబాయ్‌లో చిక్కుకొని ఆల్ ఇంగ్లాండ్ ఛాంపియన్షిప్ పోటీలకు పివి సింధు దూరమవ్వగా.. కోనేరు హంపి సైతం మెగా ఈవెంట్ నుంచి వైదొలిగింది. మధ్య ఆసియాలోని సిప్రస్‌లో మార్చి 28 నుంచి మొదలయ్యే ఫిడే మహిళల



క్యాండిడేట్స్ టోర్నమెంట్‌లో తాను ఆడడం లేదని సోమవారం హంపి ఎక్స్ చేసిన పోస్ట్‌లో పేర్కొంది. 'చాలా సమయం ఆలోచించి నేను కీలక నిర్ణయం తీసుకున్నాను. ఫిడే మహిళల క్యాండిడేట్స్ టోర్నమెంట్ నుంచి వైదొలుగుతున్నా. వ్యక్తిగత భద్రత, సురక్షితంగా ఉండడం కంటే ఏ ఈవెంట్ ముఖ్యమైనది కాదు. నిర్వాహకులు భరోసా కల్పించినప్పటికీ ప్రస్తుతం అక్కడి పరిస్థితుల్లో నేను సురక్షితంగా ఉంటానని నాకు అనిపించడం లేదు. ఈ నిర్ణయం బాధతో కూడినదే. కానీ, తప్పనిసరిగా తీసుకోవాల్సి వచ్చింది. నేను నా నిర్ణయానికి కట్టుబడి ఉన్నాను' అని హంపి తన పోస్ట్‌లో వెల్లడించింది.

### 10 వేల యూరోల ఫైన్

హంపి వైదొలగడంతో ఆమె స్థానంలో ఉక్రెయిన్ అమ్మాయి అన్నా ముజిచుక్ క్యాండిడేట్స్ టోర్నీకి ఎంపికైంది. అయితే.. టోర్నీలో ఆడనందుకు హంపిపై భారీ జరిమానా పడింది. నిబంధనల ప్రకారం టోర్నీని బాయ్‌కాట్ చేసినందుకు ఆమె 10 వేల యూరోల ఫైన్ చెల్లించనుంది. హంపి వైదొలగడంతో ఈ టోర్నీకి ఎంపికైన భారత యువ కెరటాలు దివ్య దేశ్ముఖ్, ఆర్.వైశాలి పాల్గొంటారా? లేదా? అనేది తెలియాల్సి ఉంది.

# ఆ రోజు రాత్రి ఎంతో ప్రత్యేకం



ఐపిఎల్ ప్రతి సీజన్‌లో 'ఈసారి కప్ మనదే' అనేది రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు లక్ష్యంగా ఉండేది. ఆరంభ సీజన్ నుంచి 17వ ఎడిషన్ వరకూ మూడు సార్లు ఫైనల్ చేరినా ఆర్‌సిబిని ఓటమే పలకరించింది. కానీ, పద్దెనిమిదో సీజన్‌లో బెంగళూరు కల సాకారమైంది. ఎట్టకేలకు సుదీర్ఘ నిరీక్షణలకు తెరదించుతూ నిరుడు జూన్ 3వ తేదీన ఐపిఎల్ ట్రోఫీని ఒడిసిపట్టింది బెంగళూరు. ఏళ్ల ఎదురుచూపు ఫలించిన వేళ.. భావోద్వేగానికి లోనైన విరాట్ కోహ్లీ పంతొమ్మిదో సీజన్ సమీపిస్తున్న వేళ తమ జట్టు గెలుపు సంబురాలను ఓసారి గుర్తు చేసుకున్నాడు.

ఇండియన్ ప్రీమియర్ లీగ్‌లో స్టార్ ఆటగాళ్లకు కొదవలేని రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు 18వ సీజన్లో విజేతగా అవతరించింది. ఐపిఎల్ ఆరంభం నుంచి జట్టుతో కొనసాగుతున్న విరాట్ కోహ్లీ బ్యాటింగ్ విన్యాసాలకు తోడు బౌలర్ల శ్రమ ఫలితంగా ఆర్సీబీ కల నిజమైంది. నిరుడు జూన్ 3న ఫైనల్లో పంజాబ్ కింగ్స్‌పై 6 పరుగుల తేడాతో గెలిచిన రజత్ పాటిదార్ సేన తొలిసారి ఐపీఎల్ ట్రోఫీని ముద్దాడింది. ఆ రోజు తనకెంతో ప్రత్యేకమని చెబుతున్న కోహ్లీ ఆర్సీబీ విజయంపై ఆసక్తికర విషయాలు పంచుకున్నాడు.

'ఆర్‌సిబి ఆటగాళ్లకు, ఫ్రాంచైజీకి, అభిమానులకు జూన్ 3 రాత్రి ఎంతో ప్రత్యేకం. ఐపీఎల్ మొదటి రోజు నుంచి నేను, రమేశ్ మనే(టీమ్ కేర్ బెంగళూరుతో ఉన్నాం. ఆరీర్‌సిబి గ్రూప్‌లో మేమే అందరికంటే పాత సభ్యులం. పద్దెనిమిదో సీజన్‌లో ఫైనల్ చేరాక నాలో ఆత్మవిశ్వాసం మరింత పెరిగింది. కానీ, విజయం అంత తేలిక కాదని తెలుసు. ఎందుకుంటే.. లీగ్ ఆసాంతం గొప్పగా ఆడిన పంజాబ్ కింగ్స్ ఫైనల్. బలమైన జట్లను ఓడించి ఫైనల్‌కు దూసుకొచ్చిన ఆ టీమ్ ఎంతో ఆత్మవిశ్వాసంతో ఉంది. గతంలో మూడుసార్లు మేము ట్రోఫీకి దగ్గరగా వచ్చాం. కానీ, విజేతలం కాలేదు. చెప్పాలంటే ఆ ఓటములే మాలో ఈసారి గెలిచి తీరాల్సిందేనన్న కసిని రగిల్చాయి. లీగ్ దశ నుంచి మంచి క్రికెట్ ఆడి మేము ఫైనల్ చేరాం. పటిష్టమైన జట్లను ఓడించి టైటిల్ పోరుకు అర్హత సాధించాం.

### 18 ఏళ్ల ప్రయాణమంతా కళ్లముందు ప్రత్యక్షం విరాట్‌కోహ్లీ

అందుకే.. ఆరోజు రాత్రి చాలా అద్భుతమైనది. ఫైనల్లో గెలిచిన క్షణం నేను చాలా సంతోషించాను. ఆర్‌సిబితో నా పద్దెనిమిదేళ్ల ప్రయాణం ఒక్కసారిగా కళ్లముందు మెదిలింది. మంచి సందర్భాలతో పాటు చెడు సంఘటనలు గుర్తుకొచ్చాయి. అప్పుడు భావోద్వేగాలను మాటల్లో చెప్పడం కష్టమనిపించింది. విజేత ఎవరో తేల్చే చివరి ఓవర్ అందరిలో ఉత్కంఠ రేపింది. అయితే.. ఎన్నడూ నో బాల్ వేయని జోష్ హేజిల్వుడ్ ఈసారి కూడా నో బాల్ వేయడని నా గట్టి నమ్మకం. అతడిపై నమ్మకం ఉన్నా.. అనుకున్న ఫలితం రావాలిగా. అప్పటికే మ్యాచ్ మావైపు మొగ్గింది. అయినా సరే చివరి మూడు బంతుల వరకూ ఎదురుచూశాం. ఆఖరి ఓవర్ ఆ రాత్రి అత్యంత కఠినమైన భాగం' అని విరాట్ ఆర్సీబీ ఐపీఎల్ విజేతగా నిలిచిన క్షణాలను యాది చేసుకున్నాడు.

## యువతరంగం

### ఆర్థిక స్వాతంత్ర్యం.. వ్యక్తిగత స్వేచ్ఛ



'ఫైర్' ఉద్యమం వెనుక మరో ముఖ్యమైన ఆలోచన ఆర్థిక స్వాతంత్ర్యం. అంటే ఉద్యోగంపై పూర్తిగా ఆధారపడకుండా జీవించగల స్థితి. ఈ భావన ప్రకారం, ఒక వ్యక్తి తన ఖర్చులను నిర్వహించడానికి సరిపడే పెట్టుబడులను కూడబెట్టాలి. పెట్టుబడుల నుండి వచ్చే ఆదాయం జీవితాన్ని కొనసాగించడానికి సరిపోతే ఉద్యోగం అవసరం ఉండదు. ఈ ఆలోచన యువతకు ఆకర్షణీయంగా కనిపిస్తోంది. ఎందుకంటే అది వ్యక్తిగత స్వేచ్ఛను అందిస్తుంది. ఉద్యోగ ఒత్తిడి లేకుండా వ్యక్తి తనకు ఇష్టమైన పనులను చేయవచ్చు. కొందరు కళలు, రచన, వ్యవసాయం లేదా చిన్న వ్యాపారాలపై దృష్టి పెట్టాలని కోరుకుంటున్నారు. ఈ విధంగా 'ఫైర్' ఉద్యమం కేవలం పదవీ విరమణ గురించి మాత్రమేగాక, జీవన విధానంలో ఒక పెద్ద మార్పును సూచిస్తుంది.

### సోషల్ మీడియా ప్రభావం

ఈ ధోరణి పెరగడానికి సోషల్ మీడియా మరియు ఆన్‌లైన్ సముదాయాలు కూడా ముఖ్య పాత్ర పోషిస్తున్నాయి. ఇంటర్నెట్‌లో అనేక వేదికలు యువతకు పెట్టుబడులు, పొదుపు విధానాలు, ముందస్తు పదవీ విరమణ గురించి సమాచారం అందిస్తున్నాయి. ఇలాంటి వేదికల్లో సభ్యులు తమ ఆర్థిక వ్యూహాలను పంచుకుంటారు. వారు ఎలా పొదుపు చేస్తున్నారు, ఎలాంటి పెట్టుబడులు చేస్తున్నారు, ఎంత కాలంలో ఆర్థిక స్వాతంత్ర్యం సాధించవచ్చని చర్చిస్తారు. ఈ చర్చలు ఇతర యువతను కూడా ప్రభావితం చేస్తాయి. కొంత పరిశోధన ప్రకారం 25 సంవత్సరాల కంటే తక్కువ వయస్సు ఉన్న భారతీయుల్లో గణనీయమైన శాతం మంది 55 సంవత్సరాలకంటే ముందే రిటైర్ కావాలని ఆశిస్తున్నారు.

# పెరుగుతున్న 'ఫైర్' ధోరణి!



ఇటీవలి కాలంలో భారత్‌సహా పలు దేశాల్లో పనిచేస్తున్న యువ ప్రొఫెషనల్స్‌లో ఒక కొత్త ఆలోచన వేగంగా పెరుగుతోంది. అది ఎక్కువ సంపాదించి త్వరగా పదవీ విరమణ చేయాలి అనే భావన. ఈ భావనను సాధారణంగా 'ఫైనాన్షియల్ ఇండిపెండెన్స్, రిటైర్ ఎర్లీ' (ఫైర్) ఉద్యమంగా పిలుస్తున్నారు. గతంలో ఉద్యోగం చేసి 60 సంవత్సరాల తరువాత రిటైర్ అవడం సాధారణ జీవన విధానంగా భావించేవారు. కానీ ఇప్పుడు చాలామంది యువత తమ నలభైల్లో లేదా ఐదవ దశకంలోనే ఉద్యోగ జీవితం నుండి బయటపడాలని ఆశిస్తున్నారు. ఈ మార్పుకు పలు కారణాలు ఉన్నాయి. ఆధునిక ఉద్యోగ ప్రపంచంలో ఒత్తిడి ఎక్కువగా ఉండటం, పని గంటలు పెరగడం, వ్యక్తిగత జీవితానికి సమయం తగ్గిపోవడం వంటి అంశాలు యువతను ముందస్తు పదవీ విరమణ గురించి ఆలోచించేటట్లు చేస్తున్నాయి. అయితే ఈ ఆశయానికి ఆర్థికంగా సిద్ధం కావడం చాలా కష్టమైన విషయం. ఫలితంగా, ఆశయం ఒక వైపు ఉండగా, ఆర్థిక వాస్తవాలు మరోవైపు ఉండే పరిస్థితి ఏర్పడుతోంది. ఈ ధోరణి వెనుక ప్రధాన కారణాలలో ఒకటి ఉద్యోగ ఒత్తిడి. ముఖ్యంగా కార్పొరేట్ రంగంలో పని చేసే యువత ఎక్కువ పని గంటలు, కఠినమైన లక్ష్యాలు, నిరంతర పోటీని ఎదుర్కొంటున్నారు. ఈ పరిస్థితిని సాధారణంగా బర్నౌట్ అని అంటారు. బర్నౌట్ అనేది కేవలం శారీరక అలసట మాత్రమే కాదు.... అది మానసికంగా కూడా మనిషిని దెబ్బ తీసే స్థితి. ఈ పరిస్థితిలో చాలా మంది యువ ఉద్యోగులు తమ జీవితాన్ని కేవలం పనికే పరిమితం చేయాలని అనుకోవడం లేదు. వారు కుటుంబంతో గడపడానికి, ప్రయాణాలు చేయడానికి, సృజనాత్మక ఆసక్తులను కొనసాగించడానికి లేదా సమాజ సేవలో పాల్గొనడానికి సమయం కావాలని భావిస్తున్నారు. అందువల్ల ఎక్కువ కాలం ఉద్యోగంలో ఉండటం కన్నా త్వరగా ఆర్థిక స్వాతంత్ర్యం పొందడం ఉత్తమ మార్గంగా కనిపిస్తోంది.



అయితే ముందస్తు పదవీ విరమణ లక్ష్యం సాధించడం అంత సులభం కాదు. చాలామంది యువతకు స్థిరమైన ఆదాయం ఉండదు. అదనంగా, జీవన ఖర్చులు, ఆరోగ్య వ్యయాలు, కుటుంబ బాధ్యతలు వంటి అంశాలు పెరుగుతాయి. ఈ పరిస్థితుల్లో పెద్ద మొత్తం లో పొదుపు చేయడం కష్టమవుతుంది. 'ఫైర్' సాధించడానికి సాధారణంగా చాలా క్రమశిక్షణ అవసరం. ఆదాయంలో పెద్ద భాగాన్ని పొదుపు చేయాలి, ఖర్చులను తగ్గించాలి. దీర్ఘకాలిక పెట్టుబడులు చేయాలి. కానీ

### ఆశయాలు.. వాస్తవాల మధ్య అంతరం

చాలా మంది యువత ఈ స్థాయి క్రమశిక్షణను పాటించడం కష్టం అనిపించుకుంటున్నారు. అందువల్ల వారి ఆశయాలు ఉన్నప్పటికీ, ఆర్థికంగా సిద్ధం కావడం తక్కువగా ఉంటుంది. ముందస్తు పదవీ విరమణ లక్ష్యం ఆకర్షణీయంగా కనిపించినప్పటికీ, అది ప్రతి ఒక్కరికీ సాధ్యమయ్యే మార్గం కాదు. ఆర్థిక స్వాతంత్ర్యం కోసం పొదుపు, పెట్టుబడులు అవసరం అయినప్పటికీ, ప్రస్తుత జీవితాన్ని పూర్తిగా త్యాగం చేయడం కూడా సమంజసం కాదు. అందువల్ల యువతకు ముఖ్యమైన ప్రశ్న ఏమిటంటే: భవిష్యత్తు భద్రత, ప్రస్తుత జీవన ఆనందం మధ్య సరైన సమతుల్యత ఎలా సాధించాలి? 'ఫైర్' ఉద్యమం ఒక దిశను చూపిస్తే, సాఫ్ట్ సేవింగ్ మరో దిశను సూచిస్తుంది. ఈ రెండు మధ్య సమతుల్యతను కనుగొనడం ఆధునిక యువతకు ఒక ప్రధాన సవాలుగా మారుతోంది.

**సాఫ్ట్ సేవింగ్ ధోరణి...** ఇటీవల యువతలో కనిపిస్తున్న విభిన్న ధోరణుల్లో 'సాఫ్ట్ సేవింగ్' ఒకటి. ముఖ్యంగా జనరేషన్ జెడ్ (జెన్ జీ) యువతలో ఇది ఎక్కువగా కనిపిస్తోంది. ఈ విధానంలో జీవితాన్ని పూర్తిగా పొదుపులకు అంకితం చేయడం కన్నా ప్రస్తుత అనుభవాలను ప్రాధాన్యం ఇస్తారు. సాఫ్ట్ సేవింగ్ విధానాన్ని అనుసరించే వారు ప్రయాణాలు, వినోదం, వ్యక్తిగత అభిరుచులు, మానసిక ఆరోగ్యాన్ని ముఖ్యంగా భావిస్తారు. వారు భవిష్యత్తు కోసం పొదుపు చేయాలని అంగీకరిస్తారు కానీ అది అధిక ఒత్తిడితో కూడిన పొదుపు కాకూడదని భావిస్తారు. ఈ విధంగా వారు ప్రస్తుత జీవితాన్ని ఆస్వాదించడం, భవిష్యత్తు భద్రత మధ్య సమతుల్యతను సాధించాలని ప్రయత్నిస్తున్నారు.

# యుద్ధ నియంత్రణకు ప్రధాని చొరవ తీసుకోవాలి

### సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి

**ప్రజాపక్షం/కరీంనగర్ :** ప్రపంచ వ్యాప్తంగా ఒక దేశంపై మరొక దేశం యుద్ధాలు, దాడులు చేయకుండా నియంత్రించాలంటే అంతర్జాతీయ స్థాయిలో చర్చలు జరగాలని, తక్షణమే ఐక్యరాజ్యసమితి చొరవ తీసుకోవాలని అదే స్థాయిలో భారత దేశ ప్రధాని నరేంద్ర మోదీ చొరవ తీసుకోవాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి కోరారు. కరీంనగర్‌లోని బద్దం ఎల్లారెడ్డి భవన్‌లో సిపిఐ జిల్లా కార్యవర్గ, కౌన్సిల్ సమావేశం జిల్లా కార్యవర్గ సభ్యుడు సమ్మయ్య అధ్యక్షతన సోమవారం జరిగింది. ఈ సమావేశానికి హాజరైన చాడ వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ జరుపుతున్న బాంబుల దాడులు రోజు రోజుకు తీవ్రతరం అవుతున్నాయని, దీంతో అంతర్జాతీయంగా చమురు, గ్యాస్ కొరత ఏర్పడుతుందన్నారు. దీని ప్రభావంతో దేశంలో వంట గ్యాస్ కొరతతో సామాన్య ప్రజలపై భారం పడుతుందన్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం గ్యాస్ సిలిండర్‌ల కొరత లేకుండా చేయాలని డిమాండ్ చేశారు. ప్రధాని నరేంద్రమోదీ యుద్ధ నియంత్రణకు అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌తో సంప్రదింపులు జరపాలన్నారు. దేశంలో ఐదు రాష్ట్రాలలో జరుగనున్న ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని బిజెపి ప్రభుత్వం నిత్యావసర వస్తువులు, వముడిసరుకుల మీద దృష్టి పెట్టలేదని, లేకుంటే ఇప్పటికే దేశ ప్రజలపై భారీగా భారం మోపేదనీ వెంకట్‌రెడ్డి ఆరోపించారు.




### ఏప్రిల్‌లో ఇంటింటికి సిపిఐ

సిపిఐ వందేళ్లు పూర్తి చేసుకుని దేశ రాజకీయాలలో క్రియాశీల పాత్ర పోషిస్తున్న సందర్భంగా ప్రజలకు మరింత చేరువ కావడం కోసం ఏప్రిల్ నెలలో ఇంటింటికీ సిపిఐ అనే నినాదంతో ప్రజల వద్దకు వెళ్ళే కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని, ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సిపిఐ శ్రేణులకు వెంకటరెడ్డి పిలుపునిచ్చారు. సిపిఐ కరీంనగర్ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్ మాట్లాడుతూ జిల్లాలో పార్టీ బలోపేతం చేయడం కోసం ప్రజా సంఘాలను అన్ని గ్రామాల్లో, మండలాల్లో విస్తరించి మహాసభలు జరుపుకోవాలని సూచించారు. సమావేశంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పొనగంటి కేదారి, అందె స్వామి, కొయ్యడ సృజన్‌కుమార్, బోయిని అశోక్, గూడెం లక్ష్మి, కసిరెడ్డి సురేందర్‌రెడ్డి, బత్తుల బాబు, సమ్మయ్య, నాగెల్లి లక్ష్మారెడ్డి, బోయిని తిరుపతి, పిట్టల సమ్మయ్య న్యాలపట్ల రాజు పాల్గొన్నారు.

### కార్మికుల సమస్యల పరిష్కారానికే

# సేవ్ సింగరేణి పోరు జాతా




### సీతారామయ్య, కొరిమి రాజ్ కుమార్

**ప్రజాపక్షం/పెద్దపల్లి :** కార్మికుల సమస్యల పరిష్కారానికి ఎఐటియుసి సేవ్ సింగరేణి పోరు జాతాపై కొన్ని కార్మిక సంఘాలు విమర్శలు చేయడం సరైంది కాదని, సంఘీభావం తెలిపి కార్మికుల ఐక్యతను చాటాలని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఎఐటియుసి అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య, ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్ కుమార్ పేర్కొన్నారు. సోమవారం గోదావరిఖని ప్రెస్ క్లబ్‌లో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ కార్మికుల సమస్యలను పరిష్కారం చేయకుండా యాజమాన్యం నిర్లక్ష్యం చేస్తుందని, కేంద్ర ప్రభుత్వం సింగరేణికి కొత్త గనులు ఇవ్వడం లేదని, దీంతో ఉన్న బొగ్గు గనులు మూత పడే అవకాశం ఉందని, సంస్థకు బకాయిలు వస్తేనే అన్ని కార్మిక సమస్యలు పరిష్కారం అవుతాయని, సమస్యలు పరిష్కారం కావడం లేదనే ఎఐటియుసి సేవ్ సింగరేణి జాతా పోరాట కార్యక్రమం తీసుకుందని పేర్కొన్నారు. సమావేశంలో ఎఐటియుసి ఆర్జీవన్ బ్రాంచి ఆఫీస్ బేరర్స్, పిట్ కార్యదర్శులు పాల్గొన్నారు. ప్రజానాట్యమండలి కళాకారులు కన్నం లక్ష్మి నారాయణ బృందం విప్లవ గేయాలు ఆలపించారు.

# నేటి యువతకు భగత్‌సింగ్ స్ఫూర్తి అవసరం

### సిపిఐ భద్రాద్రి జిల్లా కార్యదర్శి సాబీర్ పాషా

### భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌లకు నివాళి

**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** దేశం, సమ సమాజ స్థాపన కోసం అమరులైన విప్లవీరుల అశయాల సాధనకు పునరాంకితం కావాలని సిపిఐ భద్రాద్రి జిల్లా కార్యదర్శి ఎస్‌కె.సాబీర్ పాషా పిలుపునిచ్చారు. సోమవారం కొత్తగూడెంలోని సిపిఐ జిల్లా కార్యాలయం శేషగిరి భవన్‌లో సర్దార్ భగత్ సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా విప్లవ వీరుల చిత్రపటాలకు పూల మాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కందుల భాస్కర్, దేవరకొండ శంకర్, జిల్లా సమితి సభ్యులు వంగ వెంకట్, గెద్దాడు నగేష్, భూక్య శ్రీనివాస్, వి మల్లిఖార్జున్, గోనె మణి, నాయకులు మాతంగి లింగయ్య, లక్ష్మీ నారాయణ, రాములు, రాజు తదితరులు పాల్గొన్నారు.




కొత్తగూడెంలో...

**కుత్బుల్లాపూర్ :** అన్యాయాన్ని ఎదిరించడమే భగత్‌సింగ్‌కు ఇచ్చే నివాళి అని సిపిఐ మేడ్చల్ జిల్లా కార్యదర్శి ఉమా మహేష్ అన్నారు. భగత్‌సింగ్, రాజుగురు, సుఖదేవ్‌ల వర్ధంతి సందర్భంగా సిపిఐ ఆధ్వర్యంలో జగద్గిరిగుట్ట లాస్ట్ బస్‌స్టాప్, భగత్ సింగ్ మార్గ్‌లో ఉన్న భగత్‌సింగ్ విగ్రహాలకు పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి కె.స్వామి, సహాయ కార్యదర్శి హరినాథ్‌రావు, ఎఐటియుసి జిల్లా కార్యదర్శి వి.శ్రీనివాస్,బాబు, సహదేవరెడ్డి, నరసింహారెడ్డి, రవి, మజ్జి గౌరీ, మారెప్ప, సోమయ్య, సామెల్, ఆశప్ప, ఇమామ్, బాబు పాల్గొన్నారు.

**వరంగల్ :** భగత్ సింగ్ ఆశయాన్ని కొనసాగిస్తాం అని సిపిఐ వరంగల్ జిల్లా కార్యదర్శి షేక్ బాష్ మియా అన్నారు. సిపిఐ వరంగల్ జిల్లా కార్యాలయం తమ్మెర భవన్ శివ నగర్‌లో సోమవారం భగత్ సింగ్, రాజ్ గురు, సుఖదేవ్‌ల వర్ధంతి సందర్భంగా వారి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి దండు లక్ష్మణ్, ఉగన్నారపు రమేష్ గుండె బద్రి, జిల్లా సమితి సభ్యులు తాళ్ళపల్లి జాన్ పాల్, ల్యాదల్ల శరత్, తాళ్ళపల్లి రహేల, పరికిరాల రమేష్, మస్క సుధీర్, చిట్యాల సువర్ణ, దస్రు, సంద్ర కుమార్, గణేష్ రాజ్ పాల్గొన్నారు.

### భగత్ సింగ్ కలల సాకారానికి యువత ముందుకు రావాలి

భగత్‌సింగ్ కలల సాకారానికి యువత ముందుకు రావాలని ఎఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు సయ్యద్ వలీ ఉల్లా ఖాద్రి కోరారు. ఎఐవైఎఫ్ ఆధ్వర్యంలో వరంగల్‌లోని పోచమ్మ మైదాన్ సర్కిల్ వద్ద భగత్ సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్ చిత్రపటాలకు పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎఐవైఎఫ్ వరంగల్ జిల్లా కార్యదర్శి మక్సూద్ సుదీర్, జగదీష్, లక్ష్మి, విజయ, దేవి, షబానా, తబ్సీం, మహేష్, రాజేష్, జాను, రవి పాల్గొన్నారు.

**నిజామాబాద్ అర్బన్ :** భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల జీవిత చరిత్రను పాఠ్యాంశాల్లో చేర్చాలని సిపిఐ జిల్లా కార్యదర్శి పి.సుధాకర్ డిమాండ్ చేశారు. నగరంలోని భగత్‌సింగ్ చౌరస్తాలో భగత్ సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల వర్ధంతి సందర్భంగా భగత్‌సింగ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సిపిఐ నాయకులు బి.రఘురాం, పి.రంజిత్, పి.హనుమాండ్లు, జి. రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



మునగాలలో...

**సిద్ధిపేట :** షాహిద్ భగత్ సింగ్ జయంతి, వర్ధంతులను ప్రభుత్వాలు అధికారికంగా నిర్వహించాలని సిద్దిపేట సిపిఐ జిల్లా కార్యదర్శి మంద పవన్ డిమాండ్ చేశారు. సోమవారం భగత్‌సింగ్ వర్ధంతి సంధర్భంగా జిల్లా కేంద్రంలో ఎఐఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో భగత్ సింగ్ విగ్రహనికి పూలమాలలు వేసి నివాలులర్పించారు. కార్యక్రమంలో ఎఐటియుసి జిల్లా కార్యదర్శి కిష్టపురం లక్ష్మణ్, గజబింకారి బన్సిలాల్, మేడిశెట్టి శ్రీధర్, ఎఐఎస్‌ఎఫ్ జిల్లా వర్కింట్ ప్రేసిడెంట్ రాగమల్ల నరేష్, జిల్లా సమితి సభ్యులు భరత్, మోహన్, కనకబాబు, ప్రజా సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

**హుజూర్‌నగర్:** భగత్‌సింగ్ ఆశయాలు అనుసరణీయాలని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గన్నా చంద్రశేఖర్, సిపిఐ సూర్యాపేట జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు అన్నారు. హుజూర్‌నగర్‌లో భగత్‌సింగ్ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. ఎఐవైఎఫ్ నాయకులు యల్లావుల శివ, కంబాల శ్రీని



నిజామాబాద్‌లో...



మధిరలో...

వాస్, గుండు వెంకటేశ్వర్లు, యల్లావుల రమేష్, బంటు శ్రీనివాస్, తెల్లబోయిన వీరయ్య, పుల్లయ్య, బత్తిని మల్లయ్య, బత్తిని నర్సింహా, యల్లావుల సందీప్, జక్కుల నాగేంద్రబాబు పాల్గొన్నారు.

**మధిర :** ప్రజా సమస్యల పరిష్కారానికి సమరశీల పోరాటాలు నిర్వహించడమే భగత్‌సింగ్‌కు ఇచ్చే నివాళి అని సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ తెలిపారు. మడుపల్లిలోని సిపిఐ కార్యాలయంలో భగత్‌సింగ్, రాజుగురు, సుఖదేవ్‌ల వర్ధంతి సందర్భంగా చిత్రపటాలకు నివాళులర్పించారు. కార్యక్రమంలో బెజవాడ రవిబాబు, మేకల శ్రీనివాసరావు, మందడపు రాణి, ఊట్ల కొండలరావు, ప్రకాశరావు, కామేశ్వరరావు, మరుందతి, మచ్చా వెంకటేశ్వరరావు, శేషగిరి పాల్గొన్నారు.




కుత్బుల్లాపూర్‌లో...



వరంగల్‌లో...



## ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలి



ప్రజాపక్షం/కరీంనగర్:ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించాలని కలెక్టర్ చిత్రా మిశ్రా అన్నారు. సోమవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి కలెక్టర్ దరఖాస్తులు స్వీకరించారు. మొత్తం 233 మంది అర్జీదారులు ప్రజావాణిలో దరఖాస్తులు సమర్పించారు. కొన్ని దరఖాస్తులను అక్కడికక్కడే పరిష్కరించగా మరికొన్నింటిని అధికారులకు బదిలీ చేశారు. త్వరితగతిన దరఖాస్తులు పరిష్కరించాలని, పెండింగ్ లో ఉంచవద్దని కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు అశ్విని తానాజీ వాకడే, లక్ష్మి కిరణ్, ఆర్డీవోలు మహేశ్వర్, రమేష్ బాబు పాల్గొన్నారు.

## ఇ-నామ్ 2.0 అమలుకు రైతులు సహకరించాలి: కలెక్టర్

ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్ : ఇనామ్ 2.0 అమలుకు రైతులు సహకరించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష తెలిపారు.సోమవారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో ఇనామ్ 2.0 అమలు పై సంబంధిత అధికారులతో రివ్యూ నిర్వహించారు.ఈ సమావేశంలో మాట్లాడుతూ దేశవ్యాప్తంగా రైతులకు పారదర్శకమైన పోటీ ధరలు అందించడానికి ఈ నామ్ వ్యవస్థ అమలు చేస్తున్నామని, పెద్దపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీలో కూడా ఇనామ్ ప్లాట్‌ఫారం ద్వారా వివిధ వ్యవసాయ ఉత్పత్తుల కొనుగోలు అమ్మకాలు జరుగుతున్నాయని అన్నారు. ప్రస్తుతం ఈనామ్ 1.0 నుంచి 2.0 కి మార్పిడి జరుగుతున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరికి అవగాహన కల్పించాలని అన్నారు. ఇనామ్ 2.0 అమలు తప్పనిసరి అని , ఈ కొత్త వ్యవస్థ ద్వారా రైతులకు మరింత పారదర్శకంగా మెరుగైన పోటీ ధరలు లభిస్తాయని అన్నారు. రైతులు తమ పంటను మార్కెట్ యార్డుకు తీసుకురావడానికి ముందు తమ పూర్తి వివరాలు నమోదు చేసుకోవడం ద్వారా ఎల్.ఓ.టి ఐడి పోందాలని సూచించారు. అలాగే కమిషన్ ఏజెంట్, ట్రేడర్లు కూడా ఈనామ్ 2.0 మార్పిడి సంబంధించి ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా మార్కెటింగ్ అధికారి ప్రవీణ్ రెడ్డి, మార్కెట్ కమిటీ సిబ్బంది, ట్రేడర్లు ,కమిషన్ ఏజెంట్లు సంబంధిత అధికారులు,తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కార వేదిక ప్రజావాణి: సత్యప్రసాద్



ప్రజాపక్షం/జగిత్యాలటౌన్ :ప్రజా సమస్యల పరిష్కార వేదిక ప్రజావాణి అని జగిత్యాల జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్ పేర్కొన్నారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని కలెక్టర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి 46 మంది హాజరై తమ వినతులను కలెక్టర్‌కు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సమస్యల పరిష్కారం కోసం జిల్లా కేంద్రంతో పాటు మండలాల నుండి ప్రజలు సమస్యలు విన్నవించుకోవడానికి ప్రజావాణికి వస్తారన్నారు. అదికారులు ప్రజల వద్ద స్వీకరించిన ఫిర్యాదులపై సానుకూలంగా వ్యవహరించడంతో పాటు సమస్యలపై సమగ్ర విచారణ చేపట్టి పరిష్కారానికి చొరవ చూపాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు బీఎస్ లత, రాజ గౌడ్, జగిత్యాల, కోరుట్ల,మెట్‌పెల్లి ఆర్డీవోలు మధు సూదన్, జీవాకర్ రెడ్డి, నరసింహా రావు తదితరులు ఉన్నారు.

## టిపిఎస్ ఏర్పాటును పరిశీలించిన కలెక్టర్



ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల : తెలంగాణ పబ్లిక్ స్కూల్ (టీపీఎస్) ఏర్పాటుకు కలెక్టర్ గరిమ అగ్రవాల్ సోమవారం పరిశీలించారు. రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా విద్యాలయంలో స్కూల్, జూనియర్ కళాశాల కొనసాగుతుండగా, పరిశీలించి.. విద్యార్థుల సంఖ్య, ఎన్ని గదులు, ఎంత విస్తీర్ణంలో ఉందో ఆరా తీశారు. గ్రౌండ్, కంప్యూటర్ ల్యాబ్ కూడా పరిశీలించారు. ఈ పరిశీలనలో జిల్లా విద్యాధికారి జగన్ మోహన్ రెడ్డి, తహసీల్దార్ మహేష్ కుమార్. ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## సిపిఐ నుంచి పలువురి సస్పెన్షన్

ప్రజాపక్షం/కరీంనగర్:భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) నుండి మర్రి వెంకటస్వామి,కంది రవీందర్ రెడ్డి,గరిగె శారద లను సస్పెండ్ చేస్తున్నట్లు సిపిఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్ తెలిపారు. సోమవారం కరీంనగర్ లోని సిపిఐ కార్యాలయం బద్దం ఎల్లారెడ్డి భవన్ లో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు సమ్మయ్య అధ్యక్షతన కార్యవర్గ,కౌన్సిల్ సమావేశం జరిగిందని, సమావేశంలో జిల్లాలో పార్టీ నిర్మాణం ప్రజాసంఘాల నిర్మాణంపై సుదీర్ఘంగా చర్చించడం జరిగిందని,పార్టీ వ్యతిరేక విధానాలను అవలంబిస్తూ, పార్టీ నాయకుల మధ్య విభేదాలు సృష్టిస్తూ నిర్మాణాన్ని దెబ్బతీస్తున్నందున మర్రి వెంకటస్వామిని, పార్టీ క్రమశిక్షణను ఉల్లంఘించి, నిర్ణయాలను అతిక్రమించినందున కంది రవీందర్ రెడ్డి, గరిగె శారద లను పార్టీ నుండి సస్పెండ్ చేయాలని జిల్లా కార్యవర్గ, కౌన్సిల్ సమావేశంలో సభ్యులందరి ఏకగ్రీవ తీర్మానం మేరకు ముగ్గురిని పార్టీ నుండి సస్పెండ్ చేస్తున్నట్లు సిపిఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్ తెలిపారు. ఇక నుండి సిపిఐ పార్టీ కి మర్రి వెంకటస్వామి కి, కంది రవీందర్ రెడ్డి కి, గరిగె శారద కు ఎలాంటి సంబంధం లేదని, ఎక్కడైనా పార్టీ పేరు చెప్పి కార్యక్రమాలు చేసినట్లు పార్టీ దృష్టికి వస్తె వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సమావేశం తీర్మానం చేసినట్లు శ్రీనివాస్ తెలిపారు.

# 4.5 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలుకు ప్రణాళిక

### జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష



ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్ : రబీ సీజన్ లో 4.5 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలుకు ప్రణాళిక సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష తెలిపారు.సోమవారం సమీకృత జిల్లా కలెక్టరేట్ లో రబీ సీజన్ ధాన్యం కొనుగోలుపై అదనపు కలెక్టర్ డి.వేణుతో కలిసి సంబంధిత అధికారులు, రైస్ మిల్లర్లతో రివ్యూ నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ రబీ సీజన్ లో పెద్దపెల్లి జిల్లా నందు లక్షా 77 వేల ఎకరాలలో వరి పంట సాగు జరుగుతుందని,వీటిలో 12 వేల ఎకరాల లో సన్న రకం ధాన్యం రైతులు సాగు చేస్తున్నారని పేర్కొన్నారు. 4.5 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయాల్సి ఉంటుందని, ఏప్రిల్ 15 నుంచి ప్రారంభించి మే నెలాఖరు నాటికి ధాన్యం కొనుగోలు పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు.ధాన్యం రవాణా నిమిత్తం అవసరమైన మేర వాహనాలు సిద్ధం చేయాలని, తేమ శాతం వచ్చిన తరువాత 24 గంటల వ్యవధిలో ధాన్యం కొనుగోలు పూర్తి చేసి సంబంధిత రైస్ మిల్లులకు తరలించాలని కలెక్టర్ తెలిపారు. గతంలో 20 వేల మెట్రిక్ టన్నుల కంటే అధిక ధాన్యం వచ్చిన కొనుగోలు కేంద్రాల వద్ద అదనపు సెంటర్ ఏర్పాటు అవకాశాలను పరిశీలించాలని అన్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద అవసరమైన మేర టార్పాలిన్ కవర్లు అందుబాటులో పెట్టాలని అన్నారు. తేమ శాతం యంత్రాలు, ప్యాడీ క్లీనర్, వెయింగ్ యంత్రాలు కొనుగోలు కేంద్రాల వద్ద ఏర్పాటు చేయాలని , యంత్రాలలో ఉన్న మరమ్మతులను వెంటనే సరి చేయాలని అన్నారు. యాసంగి ధాన్యం కొనుగోలు కోసం 1.1 కోట్ల గన్ని సంచులు అవసరం ఉందని కలెక్టర్ తెలిపారు.మిల్లర్ల నుంచి 30 లక్షల గన్ని సంచులు సేకరణ చేయాలని అన్నారు. రాష్ట్రం నుంచి కొత్త గన్ని సంచుల స్టాక్ సకాలంలో జిల్లాకు చేరుకునేలా సమన్వయం చేసుకోవాలని అన్నారు. గన్ని సంచుల ఇబ్బంది జిల్లాలో రాకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ పేర్కొన్నారు. లక్ష మెట్రిక్ టన్నుల వరకు ధాన్యం స్టోర్ చేసుకునేందుకు స్పేస్ ఉందని, మరో 2 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం స్టోర్ చేసుకునేందుకు స్పేస్ గుర్తించాలని కలెక్టర్ తెలిపారు. నాణ్యమైన ధాన్యం వెంటనే కొనుగోలు చేయాలని, ఎటువంటి ఒత్తిడులకు గురి కావద్దని అన్నారు.రైస్ మిల్లర్లు బ్యాంక్ గ్యారంటీలను సకాలంలో సమర్పించాలని కలెక్టర్ సూచించారు.బ్యాంకు గ్యారంటీ అందిస్తే సంబంధిత మిల్లులకు ముందస్తుగా ధాన్యం కేటాయింపు చేస్తామని అన్నారు. ఈ సమావేశంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి కాళిందిని, జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి శ్రీనాథ్, జిల్లా పౌరసరఫరాల సంస్థ మేనేజర్ శ్రీకాంత్ , జిల్లా సహకార అధికారి శ్రీ మాల, జిల్లా మార్కెటింగ్ అధికారి ప్రవీణ్ రెడ్డి,సంబంధిత అధికారులు,తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా జనగణన

### శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి: కలెక్టర్ గరిమ అగ్రవాల్



ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల : జనగణన 2027 ను ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా పకడ్బందీగా పూర్తి చేయాలని కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. జనగణన 2027 లో భాగంగా సెన్సస్ మానిటరింగ్ మేనేజ్మెంట్ సిస్టమ్ పోర్టల్, మొబైల్ యాప్, గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో హౌస్ లిస్టింగ్, బ్లాక్స్ డిజిటల్ విధానంలో సిద్ధం చేయడం, ఎన్యూమరేటర్లు, సూపర్‌వైజర్ల నియామకం తదితర అంశాలపై చార్జ్ సహాయకులు, సాంకేతిక సహాయకులకు శిక్షణ కార్యక్రమం జిల్లా సమీకృత కార్యాలయం సముదాయంలో సోమవారం ప్రారంభించారు. కలెక్టర్ హాజరై మాట్లాడారు. రాష్ట్రంలో డిజిటల్ విధానంలో జరిగే మొదటి జనగణనని వెల్లడించారు. మొదటి దశలో మే 11 వ తేదీ నుంచి జూన్ 09 వ తేదీ వరకు ఇండ్ల గణన నిర్వహిస్తారని, రెండో దశ ఫిబ్రవరి 2027లో వ్యక్తుల వారిగా సమాచారం సేకరిస్తారని తెలిపారు. ప్రభుత్వ పథకాలను రూపకల్పనకు, వివిధ సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టేందుకు జనగణన చాలా ఉపయోగప డుతుందని తెలిపారు. ఆరోగ్య, అక్షరాస్యత, జనాభా, లింగ నిష్పత్తి, వలసలు, ఉపాధి నివాస స్థితి తదితర అంశాల వివరాలు జనగణనతో ప్రభుత్వం వద్ద ఉంటాయని వెల్లడించారు. శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని బాధ్యతల నిర్వహణలో ఎంతో కీలకమని స్పష్టం చేశారు. వివరాలు పక్కాగా సేకరించి నమోదు చేయించాలని ఆదేశించారు. శిక్షణలో జిల్లా ప్రణాళిక అధికారి శ్రీనివాసాచారి, గణాంక అధికారి సంపత్, డైరెక్టర్ ఆఫ్ సెన్సస్ ఆపరేషన్ నుంచి స్టాటిస్టికల్ ఇన్వెస్టిగేటర్స్ శ్రేయ, శిరీష, తదితరులు పాల్గొన్నారు.

**పదో తరగతి పరీక్ష కేంద్రాల్లో కలెక్టర్ తనిఖీ..**

రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన పదో తరగతి పరీక్ష కేంద్రాల్లో కలెక్టర్ గరిమ అగ్రవాల్ సోమవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సిరిసిల్ల పట్టణంలోని గీతా నగర్ లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని ఏ, బీ వింగ్ పదో తరగతి పరీక్ష కేంద్రాల్లో కలెక్టర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు పరీక్షలు రాస్తుండగా పరిశీలించారు సౌకర్యాలను పరిశీలించి.. అధికారులకు పలు సూచనలు చేశారు.

## పదో తరగతి పరీక్షా కేంద్రాల్లో కలెక్టర్ తనిఖీ



ప్రజాపక్షం/కరీంనగర్:కరీంనగర్ సప్తగిరి కాలనీ ప్రభుత్వ ఉన్నత పాఠశాల, తిరుమల నగర్ లోని మైనార్టీ గురుకుల పాఠశాలలో ఏర్పాటు చేసిన పదవ తరగతి పరీక్షా కేంద్రాలను జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సోమవారం నిర్వహిస్తున్న ఇంగ్లీష్ పరీక్షల సరళిని పరిశీలించారు. విధులు నిర్వర్తిస్తున్న అధికారులు సిబ్బందితో మాట్లాడారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులూ కలగకుండా పరీక్షలు నిర్వహించాలని సూచించారు. పరీక్షా కేంద్రాల్లో విద్యార్థులకు అవసరమైన తాగునీరు, ప్రథమ చికిత్స, మందులు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలన్నారు. తరగతి గదిలో తగిన వెంటిలేషన్ ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎక్కడా ఎలాంటి చిన్న తప్పిదానికి అవకాశం ఇవ్వకుండా విద్యార్థులు ప్రశాంతమైన వాతావరణంలో పరీక్షలు రాసేలా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. విద్యుత్ అంతరాయం కలుగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

**అడిషనల్ కలెక్టర్ తనిఖీ**

హౌసింగ్ బోర్డు కాలనీలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల (కుమర్వాడి), సుభాష్ నగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పదవ తరగతి పరీక్షా కేంద్రాన్ని అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే తనిఖీ చేశారు. విధులు నిర్వర్తిస్తున్న అధికారులకు తగిన సూచనలు చేశారు. పదవ తరగతి పరీక్షలు పక్కాగా నిర్వహించాలని, ఎక్కడా తప్పులు జరగకుండా జాగ్రత్తగా వ్యవహరించాలన్నారు. పరీక్షా కేంద్రాల్లో వసతులను అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు.

## సర్దార్ భగత్ సింగ్ భావితరాలకు స్ఫూర్తి

### ఖనిలో భగత్ సింగ్ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలి




ప్రజాపక్షం/పెద్దపలి:స్వాతంత్ర సమరయోధుడు కామ్రేడ్ సర్దార్ భగత్ సింగ్ 95వ వర్ధంతి సందర్భంగా స్థానిక భాస్కరరావు భవన్లో సోమవారం నాడు అఖిల భారత విద్యార్థి యువజన సమాఖ్య రామగుండం నగర సమితి ఆధ్వర్యంలో సర్దార్ భగత్ సింగ్ చిత్రపటానికి పూల మాలవేసి వర్ధంతిని ఘనంగా నిర్వహించడం జరిగింది.ఈ సందర్భంగా ఎఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి కార్పొరేటర్ మార్కపురి సూర్య ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి రేణుకుంట్ల ప్రీతం మాట్లాడుతూ స్వాతంత్ర సంగ్రామంలో ఉరితాడును ముద్దాడిన యోధుడు సర్దార్ భగత్ సింగ్ అని అతని జీవితం ఎంతోమంది యువకులకు ఆదర్శమని వారన్నారు. 23 ఏళ్ల వయసులోనే బ్రిటిష్ పాలకుల వెన్నులో వణుకు పుట్టించే విధంగా పార్లమెంట్ పై బాంబు వేసి తన స్వతంత్ర కాంక్షను తెలియజేసిన ధీరుడు కామ్రేడ్ సర్దార్ భగత్ సింగ్ అని అంతేకాకుండా స్వతంత్ర సంగ్రామంలో లాలా లజపతిరాయ్, గాంధీజీలు చేసే ఉద్యమానికి ఆకర్షితుడైన భగత్ సింగ్ విద్యార్థి దశనుండే స్వతంత్ర సంగ్రామంలో పాల్గొనడంతో పాటు బ్రిటిష్ పాలకులను గడగడలాడించిన ధీరుడు భగత్ సింగ్ అని అన్నారు. బ్రిటిష్ పాలకుల క్షమాభిక్షను తన అరికాలితో తన్ని ఉరితాడును ముద్దాడిన భగత్ సింగును పక్కనబెట్టి బ్రిటిష్ పాలకుల క్షమాభిక్ష పై బయటికి వచ్చి వారి అడుగులకు మడుగులొత్తిన సావర్కర్ జీవిత చరిత్రను ఈరోజు పాఠ్యపుస్తకాలో చేర్చడం దుర్మార్గ చర్యని అన్నారు భగత్ సింగ్ వర్ధంతి సందర్భంగా దేశవ్యాప్తంగా భగత్ సింగ్ జాతీయ ఉపాధి హామీ పథకాన్ని దేశవ్యాప్తంగా అమలు చేసి ప్రతి నిరుద్యోగికి ఉద్యోగం కల్పించాలని , అలాగే భగత్ సింగ్ ను స్వాతంత్ర సమరయోధుడు గా గుర్తించి ఆయన జయంతి వర్ధంతి లను ప్రభుత్వమే నిర్వహించాలని వారు డిమాండ్ చేశారు. ఎఐఎస్ఎఫ్ నాయకులు తాళ్లపల్లి సురేందర్ ,ఆసాలు నవీన్, రాణవేణి సుధీర్, సాధులశివ,మాతంగి సా గర్, అనూప్ సాయి, రిషి,తదితరులు పాల్గొన్నా రు.

## మెట్‌పల్లిలో పేకాట స్థావరాలపై మెరుపు దాడులు



ప్రజాపక్షం /మెట్‌పల్లి :జగిత్యాల జిల్లా మెట్‌పల్లి పట్టణంలో ఆదివారం సాయం త్రం పోలీసు లు పేకాట స్థావరాలపై ఆకస్మి క దాడులు నిర్వహించారు. విశ్వసనీయ స మాచారం మేరకు ఓ ఇంట్లో పేకాట జరుగుతోందని తెలుసుకున్న పో లీసులు అక్కడకు చేరుకున్నప్పుడు అనూహ్య ప రిణామాలు చోటుచేసుకున్నాయి. దా డిలో మొత్తం ఏడుగురిని అదుపులోకి తీసుకున్నట్లు సమాచా రం. పట్టుబడిన వారిలో పట్టణానికి చెందిన ఒక అధికార పార్టీ మండల స్థాయి నేత, వ్య వసాయ మార్కెట్ కమిటీలో ఉన్నత స్థాయి నాయకుడు, ఓ రిటైర్డ్ ఉద్యోగి, ఒక ఈవో, ఒక ఏఎస్సై, అలాగే ఇంటి యజమాని మరికొందరు ఉన్నారని తెలుస్తోంది. ఈ ఘటన స్థానికంగా చర్చనీయాంశంగా మారింది.ఈ పేకాట స్థావరం గతంలో నుండే కార్యకలాపాలు నిర్వహిస్తూ వచ్చినట్లు స్థానికులు చెబుతున్నారు. ఇంటి యజమాని పెంచిన కాపలా కుక్క ఇటీవల మృతి చెందడంతో ఈ వ్యవహారం బయటపడిందని ప్రచారం జరుగుతోంది. కుక్క ఉన్నప్పుడు ఎవరు వచ్చినా ముందుగానే హెచ్చరిక ఇవ్వడంతో అక్కడి వారు అప్రమత్తమై తప్పించుకునేవారని, గతంలో కూడా టాస్క్ ఫోర్స్ దాడుల నుండి ఇలా తప్పించుకున్నారని స్థానికులు చెబుతున్నారు.పోలీసులు ఈ ఘటనపై అధికారిక ప్రకటన ఇవ్వాల్సి ఉందని, కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తామని పేర్కొనవచ్చని ఊహిస్తున్నారు.

## మంత్రి అడ్లూరి చొరవతో ధాన్యం కొనుగోలు కేంద్రం మంజూరు



ప్రజాపక్షం/పెగడపల్లి : జగిత్యాల జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం జిల్లా కలెక్టర్ గారి అధ్యక్షతన జరిగిన 'ప్రజావాణి' కార్యక్రమం ఏడుమోటలపల్లి గ్రామ రైతులలో కొత్త ఆశలు నింపింది. పెగడపల్లి మండలం, ఏడుమోటాలపల్లి గ్రామానికి వరి ధాన్యం కొనుగోలు కేంద్రం మంజూరైన నేపథ్యంలో, రైతులు జిల్లా సహకార అధికారి (డిసిఒ) మనోజ్ గారిని కలిసి వినతిపత్రం అందజేశారు. గ్రామ రైతుల ఇబ్బందులను గుర్తించి, గౌరవ రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి వర్యులు శ్రీ అడ్లూరి లక్ష్మ ణ్ కుమార్ గారు పెద్ద మనసుతో తమ గ్రామానికి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంజూరు చేశారని రైతులు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. దీనిపై సానుకూలంగా స్పందించిన డిసిఒ మనోజ్ గారు వచ్చే నెల ఏప్రిల్ 10వ తారీఖున ఏడుమోటలపల్లిలో కొనుగోలు కేంద్రాన్ని అధికారికంగా ప్రారంభించి, ధాన్యం సేకరణ ప్రక్రియను చేపడతామని రైతులకు పక్కా హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అఖిల భారత బంజారా సేవా సంఘం యువజన జిల్లా అధ్యక్షులు నగావత్ జీవన్ నాయక్, ఉప సర్పంచ్ అజ్మీరా రజిత కుమార్ నాయక్, వార్డు సభ్యులు నగావత్ లక్ష్మ ణ్ నాయక్, నగావత్ దివ్య, మాజీ సర్పంచ్ అజ్మీరా హరిలాల్ నాయక్ రైతులు రామ నాయక్, సామా నాయక్, రాజేశం నాయక్, రామ చంద్రం నాయక్ , రైతులు పాల్గొన్నారు.

## హనుమాన్ జయంతి ఉత్సవాలకు సమన్వయంతో ఏర్పాట్లు పూర్తి

### కలెక్టర్ బి. సత్యప్రసాద్



ప్రజాపక్షం/జగిత్యాల:కొండగట్టు శ్రీ చిన్న హనుమాన్ జయంతి ఉత్సవాలకు వచ్చే భక్తులకు అన్ని విధాలా సౌకర్యాలు కల్పించాలని జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ పేర్కొన్నారు.సోమవారం కలెక్టరేట్ మినీ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్, జిల్లా ఎస్‌పి అశోక్ కుమార్ కలిసి వివిధ శాఖల అధికారులతో శ్రీ చిన్న హనుమాన్ జయంతి ఉత్సవాల ఏర్పాట్లపై సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ మాట్లాడుతూ ఏప్రిల్ 1 నుండి 3వ తేదీ వరకు కొండగట్టులో నిర్వహించనున్న ఉత్సవాలకు అన్ని శాఖలు సమన్వయంతో ముందస్తు ఏర్పాట్లు పూర్తి చేయాలని ఆదేశించారు.వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని త్రాగునీటి సరఫరాకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని, భక్తులు ప్రయాణించే మార్గాల వెంట చలివేంద్రాలను ఏర్పాటు చేయాలని సూచించారు. వివిధ ప్రాంతాల నుండి వచ్చే భక్తుల కోసం 7 వాహన పార్కింగ్ సౌకర్యాలు కల్పిస్తూ, నీడ, తాగునీరు అందుబాటులో ఉంచాలని తెలిపారు. రాత్రి వేళల్లో సరిపడ లైటింగ్ ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. కాలి నడకన వచ్చే దీక్ష భక్తులకు ఉపశమనం కలిగించే ఏర్పాట్లు చేయాలని, మాల ధారణ తీసివేత, కేశ ఖండన, కోనేరు ప్రాంతాల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టాలని సూచించారు. ఈ సందర్భంగా కేశ ఖండన కేంద్రాలు, షవర్లు ఏర్పాట్లు చేయాలని తెలిపారు. భద్రత కోసం 64 సిసి కెమెరాలను ఏర్పాట్లు, అత్యవసర వైద్య సేవల కోసం మెడికల్ క్యాంపులు, అంబులెన్సులు సిద్ధంగా ఉంచాలని తెలిపారు.

ఉత్సవాల సమయంలో పరిశుభ్రతను కాపాడేందుకు అవసరం మేరకు పారిశుద్ధ్య కార్మికులను నియమించాలని తెలిపారు. కోనేరులోని నీటిని శుభ్రపరచాలని ఆదేశించారు. అత్యవసర పరిస్థితుల కోసం అగ్నిమాపక వాహనాలను సిద్ధంగా ఉంచుతున్నట్లు పేర్కొన్నారు.

రాత్రివేళల్లో నడిచి వచ్చే భక్తులకు రేడియం స్టిక్కర్లు పంపిణీ చేయాలని, పోలీస్ కంట్రోల్ రూమ్, మీడియా సెంటర్లను ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు.పారిశుద్ధ్య పనులను జిల్లా పంచాయతీ అధికారి ఆధ్వర్యంలో నిర్వహిస్తారని, కార్యక్రమాల సమన్వయ బాధ్యతలను జగిత్యాల రెవెన్యూ డివిజనల్ అధికారి చూడాలని భక్తులకు ప్రసాదం అందించేందుకు తగిన సంఖ్యలో కౌంటర్లు ఏర్పాటు చేయాలని ఆలయ అధికారులను ఆదేశించారు.ఈ సమావేశంలో జగిత్యాల స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి. రాజ గౌడ్, ఆర్‌డిఒ పి. మధుసూధన్, ఆలయ ఈ.ఓ అంజనా రెడ్డి, వివిధ స్థాయిల జిల్లా అధికారులు, తహసీల్దార్లు, ఎంపిడిఒలు సంబంధిత అధికారులు,తదితరులు పాల్గొన్నారు.



## మున్సిపల్ కార్యాలయం ముట్టడి

### మౌలిక వసతుల కోసం సిపిఐ ధర్నా

**ప్రజాపక్షం/ఆదిలాబాద్ :** పట్టణంలోని 12వ వార్డు న్యూహౌసింగ్ బోర్డు కాలనీలో నెలకొన్న మౌలిక సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సోమవారం సిపిఐ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి ముడుపు ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ ... గత 12 ఏళ్లుగా కాలనీవాసులు మంచినీరు, రోడ్లు, విద్యుత్ సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో నిర్మించిన మంచినీటి ట్యాంకులకు విద్యుత్ బకాయిలు రూ. 2.50 లక్షలు చెల్లించి, తక్షణమే నీటి సరఫరా పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. అనంతరం మున్సిపల్ చైర్‌పర్సన్ బండారి అనూష సతీష్ ధర్నాస్థలనికి చేరుకుని బాధితులతో మాట్లాడారు. ఈ సమస్యలను మున్సిపల్ కమిషనర్‌తో చర్చించి త్వరలోనే పరిష్కరిస్తామని ఆమె హామీ ఇవ్వడంతో నిరసనకారులు ధర్నా విరమించుకున్నారు. అయితే సమస్యలు త్వరగా పరిష్కారం కాకపోతే మున్సిపల్ కార్యాలయం ముందే నిరాహార దీక్షలు చేస్తామని నాయుకులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు కుంటాల రాములు, రామదాస్, కొడప జంగుబాయి, సురేష్, షేక్ తాజ్ తదితరులు పాల్గొన్నారు.

## అసంపూర్తి డ్రైనేజీ పనులు పూర్తిచేయాలి

### సిపిఐ మండల సహాయ కార్యదర్శి మహేష్ డిమాండ్



**ప్రజాపక్షం/వాంకిడి :** వాంకిడి మండల కేంద్రం గుండా వెళ్లే జాతీయ రహదారి పక్కన నిలిచిపోయిన అసంపూర్తి డ్రైనేజీ పనులను వెంటనే పూర్తి చేయాలని సిపిఐ మండల సహాయ కార్యదర్శి కోదురుపాక మహేష్ డిమాండ్ చేశారు. సోమవారం ఈ మేరకు జిల్లా కలెక్టరుకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాలుగు వరుసల జాతీయ రహదారి పక్కన చేపట్టిన డ్రైనేజీ కాలువల పనులు మధ్యలోనే నిలిచిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. వర్షాకాలంలో నీరు రోడ్లపై నిలిచిపోయి పాదచారులు, ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని, నిల్వ నీటి వల్ల దోమలు పెరిగి వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. పూర్తికాని కాలువల వల్ల రాత్రి సమయంలో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారని పేర్కొన్నారు. అధికారులు తక్షణమే స్పందించి డ్రైనేజీ నిర్మాణ పనులు పూర్తి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## ప్రతి ఇంటికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు

### రూ 5.41 కోట్లతో సిసి రోడ్లు, మురికి కాల్వల నిర్మాణం

### మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి

**ప్రజాపక్షం/గజ్వేల్ :** గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి కాంగ్రెస్ సర్కార్ ప్రాధాన్యత ఇస్తుండగా, నియోజకవర్గ పరిధిలోని ఆయా గ్రామాలలో రూ. 5 కోట్ల 41లక్షల వ్యయంతో సిసి రోడ్లు, మురికి కాల్వల నిర్మాణం చేపడుతున్నట్లు గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి పేర్కొన్నారు. సోమవారం వర్గల్ మండలం మజీద్ పల్లిలో స్థానిక సర్పంచ్ చెన్నయ్యతో కలిసి సిసి రోడ్డుకు శంకుస్థాపన చేసిన సందర్భంగా ఆయన మాట్లాడారు. పార్టీలకు అతీతంగా అభివృద్ధికి పెద్దపీట వేస్తూ నియోజకవర్గ పరిధిలోని అన్ని గ్రామాలకు సిసి రోడ్లు, మురికి కాల్వల నిర్మాణానికి నిధులు మంజూరు చేసినట్లు చెప్పారు. రైతులు అభ్యున్నతిని కాంక్షిస్తూ రూ.2లక్షల పంట రుణమాఫీతోపాటు సన్న ధాన్యానికి రూ.500 బోనస్ ఇచ్చిన విషయాన్ని గుర్తుచేశారు. అలాగే రూ.9వేల కోట్ల రైతు భరోసా నిధులు విడుదల చేయగా, అర్హులైన ప్రతి పేదకు ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు, సన్న బియ్యం పంపిణీ, ఆరు గ్యారంటీల్లో భాగంగా ప్రతి ఇంటికి కాంగ్రెస్ ప్రభుత్వం సంక్షేమ పథకాలు వర్తింపజేస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ మోహన్, ఉప సర్పంచ్ మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ డిగ్రీ కళాశాల బైంసాలో ఘనంగా షహిద్ దివస్

**ప్రజాపక్షం/బైంసా :** బైంసా పట్టణంలోని అమరవీరుల దినం(షహిద్ దివస్)ను ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించారు. దేశ స్వాతంత్ర్య పోరాటంలో తమ ప్రాణాలను అర్పించిన వీరులను ఈ సందర్భంగా స్మరించారు. ఈ రోజు 1931లో వీర విప్లవకారులు భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌లను బ్రిటిష్ ప్రభుత్వం ఉరి తీసిన దినంగా చరిత్రలో నిలిచింది. వారి త్యాగ స్ఫూర్తిని గుర్తుచేసుకుంటూ కళాశాలలో నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపల్ డా.కె.రఘునాథ్ మాట్లాడుతూ అమర వీరుల త్యాగం ప్రతి విద్యార్థికి స్ఫూర్తి కావాలని, దేవభక్తి భావాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్,జైభీమారావు, శంకర్, సంతోష్ కుమార్, సురేందర్, శ్రావణ్య, దివ్య, కల్పన, రాజయ్య, కిషన్, రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

## దేశ యువత రాజకీయాల్లోకి రావాలి

### ఎఐఎస్ఎఫ్ రఘురాంనాయక్

**ప్రజాపక్షం/నిజామాబాద్ :** దేశ యువత భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌లను ఆదర్శంగా తీసుకొని రాజకీయాలలో రావాలని ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి బానోత్ రఘురాంనాయక్ అన్నారు. ఎఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్ 95వ వర్ధంతిని ఘనంగా నిర్వహించామన్నారు. దేశవ్యాప్తంగా నిరుద్యోగ సమస్యలు పెరిగిపోవటంతో ఆర్థిక సంక్షోభం ఏర్పడే అవకాశముంది కాబట్టి నిరుద్యోగులకు బిజెపి కేంద్ర ప్రభుత్వం గత ఎన్నికల ప్రచారంలో అన్నట్లు విధంగా సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలను కల్పించాలని లేని పక్షంలో దేశవ్యాప్తంగా ఎఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించామని హెచ్చరించారు. కార్యక్రమంలో సుభోద్, కుషాల్, కిషోర్, గణేష్, నిఖిల్, చిన్నకృష్ణ, గౌతం, సాయి, నితీష్ పాల్గొన్నారు.

### వ్యవసాయ యాంత్రీకరణతో

# రైతుల ఆదాయం పెంపు

### కలెక్టర్ పి.ప్రావీణ్య



**ప్రజాపక్షం/సంగారెడ్డి :** జిల్లాలో రైతుల ఆదాయం పెంపు వ్యవసాయ ఉత్పాదకతలో గణనీయమైన వృద్ధి సాధించేందుకు ఫార్మ్‌మెకనైజేషన్,వర్షాధార ప్రాంతాల అభివృద్ధి, తేనెటీగల పెంపకం పథకాలను సమర్థవంతంగా ఆమలు చేయాలని జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టర్ చాంబర్‌లో వ్యవసాయ, ఉద్యానవన, డిఆర్‌డిఎ శాఖల అధికారులతో జిల్లాలో అమలువుతున్న పార్మ్‌మేకనైజేషన్ వర్షాధార ప్రాంతాల అభివృద్ధి తేనెటీగల పెంపకం కార్యక్రమాల పురోగతిపై జిల్లా కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రస్తుత ఆర్థిక సంవత్సరానిక కేటాయించిన ఫార్మ్ మెకనైజేషన్ లక్ష్యాలను వేగంగా సాధించాలని అధికారులకు సూచించారు. ఇప్పటివరకు సాధించిన పురోగతిని పరిశీలించి యుటిలైజేషన్ సర్టిపికెట్లు వెంటనే సమర్పించాలని ఆదేశించారు. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను అనుగుణంగా పురోగతి సాధించాలని రైతులను యాంత్రీకరణ వైపు మరింతగా ప్రోత్సహించాలని సూచించారు. ఉద్యాన యాంత్రీకరణ పథకం ద్వారా మిని ట్రాక్టర్లు, పవర్ వీడర్స్, పవర్ టీల్లర్స్, బ్రష్ కట్టర్స్ పవర్‌స్ప్రేయర్స్ వంటి యంత్రాల కొనుగోలుకు ఆర్థిక సమాయం అందిస్తున్నామని, జిల్లాలో ఇప్పటి వరకు 97 యూనిట్లు మంజూరైనట్లు తెలిపారు. వర్షాధార ప్రాంతాల అభివృద్ధి పథకం ద్వారా రైతుల ఆదాయం పెంపు, ఆహార భద్రత, వ్యవసాయ ఉత్పాదకత, మెరుగుదల లక్ష్యంగా సమగ్ర వ్యవసాయ విదానాలను ప్రోత్సహిస్తున్నాయని ఈ పథకాల అమలులో వ్యవసాయ ఉద్యానవన డిఆర్‌డిఎ శాఖల సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ ఆదేశించారు. తేనెటీగల పెంపకం కార్యక్రమాన్ని మరింత విస్తరించాలని ఎక్కువ మంది రైతులకు బిహైవ్ యూనిట్లు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అదే విధంగా కమర్షియల్ స్థాయిలో తేనెటీగల పెంపకం యూనిట్లు ఏర్పాటు చేసేందుకు ఆసక్తి ఉన్న స్వయం సహాయక సంఘాల మహిళలను ఇందిరా మహిళా శక్తి పథకం కింద ప్రోత్సహించాలని డిఆర్‌డిఏ అదికారులకు సూచించారు. ఈ సమీక్ష సమావేశంలో డిఆర్డి ఎపిడి సూర్యరావు, ఉద్యానవన శాఖ అధికారి సోమశ్వరరావు, జిల్లా వ్యవసాయ అధికారి శివప్రసాద్, ఎస్సీ కార్పొరేషన్ ఇడి రామాచారి తదితరులు పాల్గొన్నారు.



**పదవ తరగతి పరీక్షా కేంద్రం ఆకస్మిక తనిఖీ**

సంగారెడ్డి పట్టణంలోని విద్యానగర్ కాలనీలో గల శ్రీసాయికృష్ణ హై స్కూల్‌లో నిర్వహిస్తున్న పదవ తరగతి పబ్లిక్ పరీక్ష కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ ప్రావీణ్య సోమవారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా పరీక్షల నిర్వహణ విధానం, హాల్ ఏర్పాట్లు, విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలు సిసి కెమెరాల ఏర్పాటు భద్రత చర్యలను కలెక్టర్ పరిశీలించారు.

పరీక్షలు సజావుగా, పారదర్శకంగా నిర్వహించాల్సిన బాధ్యత అధికారులపై ఉందని తెలిపారు. పరీక్ష కేంద్రంలో విధులు నిర్వహిస్తున్న సూపరింటెండెంట్, ఇన్విజిలేటర్‌లు పరీక్షా నిబంధనలు కచ్చితంగా అమలు చేయాలన్నారు. పరీక్షా కేంద్రంలోకి అనుమతి లేని వ్యక్తులను ముఖ్యంగా మొబైల్ ఫోన్లు ఎలక్ట్రానిక్ పరికరాలు అనుమతించరాదని సూచించారు. విద్యార్థులు ఎలాంటి ఒత్తిడికి గురికాకుండా ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాసేలా చూడాలని కలెక్టర్ సూచించారు.

## అంకోలిలో ఎన్ఎస్ఎస్ శిబిరం

### మొక్కలు నాటిన ఉద్యాన పాలిటెక్నిక్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.ప్రభావతి

### మొక్కలు నాటి, కిచెన్ గార్డెన్ ఏర్పాటు




**ప్రజాపక్షం/ఆదిలాబాద్ రూరల్ :** జాతీయ సేవా పథకం ప్రత్యేక శిబిరంలో భాగంగా ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని ఉద్యాన పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు అంకోలి గ్రామంలో సోమవారం పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఇందులో భాగంగా అంకోలి గ్రామ పంచాయతీ కార్యలయం, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాల ఆవరణలను విద్యార్థులు శుభ్రం చేశారు. పరిసరాల పరిశుభ్రత పై గ్రామస్థులకు అవగాహన కల్పిస్తూ పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. ముఖ్యంగా జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలనే ఉద్దేశంతో, పాఠశాల ఆవరణలో కూరగాయల సాగు కోసం ప్రత్యేకంగా 'కిచెన్ గార్డెన్'ను విద్యార్థులు స్వయంగా సిద్ధం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మడావి కిషన్ మాట్లాడుతూ...విద్యార్థులు సామాజిక స్పృహతో ఇలాంటి సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమన్నారు.ఈ శిబిరంలో ఉద్యాన కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె. ప్రభావతి, పాఠశాల ఉపాధ్యాయులు మహ్మద్ రియాజ్, మురళీధర్ స్వామి, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.



## మిషన్ భగీరథ కార్మికుల వేతనాలు వెంటనే చెల్లించాలి

### ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్

**ప్రజాపక్షం/ఆసిఫాబాద్ :** మిషన్ భగీరథ కార్మికులకు పెండింగ్‌లో ఉన్న 3 నెలల వేతనాలను వెంటనే చెల్లించాలని ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్ డిమాండ్ చేశారు. మిషన్ భగీరథ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కలెక్టర్ హరిత, ఇఇ రాకేష్, ఎల్ అండ్ టి ప్రతినిధి శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ఇచ్చిన హామీ ప్రకారం మార్చి 29లోపు వేతనాలు చెల్లించి ఇతర సమస్యలు పరిష్కరించాలని కోరారు. లేనిపక్షంలో మార్చి 30వ తేదీ నుంచి నిరవధిక సమ్మెకు వెళ్తామని హెచ్చరించారు. కార్మికులకు కనీస వేతనం 26వేల రూపాయలు ఇవ్వాలని, ఒక నెల జీతం బోనస్‌తోపాటు పెట్రోల్ అలవెన్సులు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షుడు ఆత్మకూరి చిరంజీవి, జిల్లా అధ్యక్షుడు బాలేష్, నాయకులు భాస్కర్, శ్రీకాంత్, వెంకటేష్, రాకేష్ పాల్గొన్నారు.



## ఎస్సెస్సీ పరీక్షా కేంద్రాలను తనిఖీ చేసిన కలెక్టర్

**ప్రజాపక్షం/నిజామాబాద్ :** పదవ తరగతి పరీక్షా కేంద్రాలను కలెక్టర్ ఇలా త్రిపాఠి సోమవారం తనిఖీ చేశారు. జిల్లా కేంద్రంలోని మానిక్ భవన్ పాఠశాలతో పాటు నలంద హైస్కూల్ పరీక్షా కేంద్రాలను సందర్శించి పరీక్షల నిర్వహణ తీరును నిశితంగా పరిశీలించారు. విద్యార్థుల హాజరు, సిబ్బంది హాజరుపై ఆరా తీశారు. నిబంధనలకనుగుణంగానే నిర్ణీత సమయంలో ప్రశ్నపత్రాలను తెరిచారా? అని ఆరా తీశారు. తప్పనిసరిగా సిసి కెమెరా రికార్డింగ్ నడుమ ప్రశ్నపత్రాల బండిల్ సీళ్లు తెరవాలని సూచించారు. ఈ మేరకు నిబంధనలు పాటించరా లేదా అని సిసి ఫుటేజీల పరిశీలన ద్వారా నిర్ధారణ చేసుకున్నారు. పరీక్షా కేంద్రాల్లో తాగునీటి వసతి, ఆరోగ్య కార్యకర్త అందుబాటులో ఉన్నారా లేదా అని గమనించారు. ఎగ్జామ్ హాల్‌లోకి సిబ్బంది ఎవరైనా సెల్‌ఫోన్లతో వచ్చారా అని కలెక్టర్ నిశిత పరిశీలన చేశారు. ఎలాంటి లోటుపాట్లకు తావు లేకుండా సజావుగా పరీక్షలు జరిపించాలని సూచించారు. ఎక్కడ కూడా కాపీయింగ్‌కు ఆస్కారం ఉండకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని, కాపీయింగ్‌కు ఆస్కారం కల్పిస్తే కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. పరీక్షలు ముగిసేంత వరకు అప్రమత్తతో పకడ్బందీగా విధులు నిర్వహించాలని సూచించారు. ప్రశ్నపత్రాలను తప్పనిసరిగా తగిన పోలీసుబందోబస్తు మధ్య కేంద్రాలకు తరలించాలని, ఎలాంటి తప్పిదాలకు అవకాశం ఇవ్వకుండా పూర్తి పారదర్శకంగా పక్కాగా పరీక్షలు జరిపించాలని ఆదేశించారు. కలెక్టర్ పరీక్షా కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్లు జె.శంకర్, టి.శ్రీనివాస్ తదితరులున్నారు.



## పరీక్షా కేంద్రాల్లో సౌకర్యాలు కల్పించాలి

### కలెక్టర్ కుమార్ దీపక్

**ప్రజాపక్షం/మంచిర్యాల :** పదవ తరగతి వార్షిక పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు పరీక్షా కేంద్రాల్లో అవసరమైన సౌకర్యాలు కల్పించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ ఆదేశించారు. సోమవారం జిల్లా కేంద్రంలోని కాలేజ్ రోడ్డులో గల శ్రీ చైతన్య ఉన్నత పాఠశాల పరీక్షా కేంద్రాన్ని సందర్శించి ఆయన మాట్లాడారు. విద్యార్థులు ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాసేలా అధికారులు పర్యవేక్షించాలని సూచించారు. జిల్లాలో 48 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశామని, విద్యార్థుల కోసం తాగునీరు, నిరంతర విద్యుత్ సరఫరా, వెలుతురు, ఫ్యాన్లు, మరుగుదొడ్ల సౌకర్యం కల్పించినట్లు తెలిపారు. అత్యవసర పరిస్థితుల కోసం మందులు, వైద్య సిబ్బందిని అందుబాటులో ఉంచామని వివరించారు. పరీక్షా కేంద్రాల వద్ద పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసి, సమీపంలోని జిరాక్స్ సెంటర్లు మూసివేయిస్తున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు పూర్తిచేశామని కలెక్టర్ వెల్లడించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



## పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా నిర్వహించాలి : కలెక్టర్ కె.హరిత

**ప్రజాపక్షం/కాగజ్‌నగర్ :** పదవ తరగతి పరీక్షలను ప్రశాంతంగా, సజావుగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ కె.హరిత అధికారులను ఆదేశించారు. సోమవారం కాగజ్‌నగర్ మండలం ఈజ్ గాం గ్రామంలోని శాంతినికేతన్ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాన్ని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పరీక్షల నిర్వహణ తీరును పరిశీలించి, విద్యార్థులకు తాగునీరు, విద్యుత్, కూర్చునే ఏర్పాట్లు వంటి వసతులపై ఆరా తీశారు. పరీక్షలు పారదర్శకంగా జరగాలని, ఎటువంటి అక్రమాలకు తావులేకుండా పర్యవేక్షణ కట్టుదిట్టంచేయాలని సిబ్బందిని ఆదేశించారు. ఇన్విజిలేటర్లు నిబద్ధతతో విధులు నిర్వహించాలని, విద్యార్థులు ఒత్తిడికి గురికాకుండా పరీక్షలు రాయాలని సూచించారు. అనంతరం జంబుగా నుంచి పెద్దబండ మధ్య నిర్మించిన వంతెన పనులను పరిశీలించారు. అప్రోచ్ రహదారి పనులను త్వరగా పూర్తిచేసి వంతెనను అందుబాటులోకి తీసుకురావాలని అధికారులకు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.



## విధి నిర్వహణలో నిర్లక్ష్యాన్ని సహించేదిలేదు

### మాతా, శిశు ఆరోగ్య కేంద్రంలో ప్రసవాల సంఖ్య పెంచాలి

### సిద్దిపేట జిల్లా కలెక్టర్ హైమావతి

**ప్రజాపక్షం/గజ్వేల్ :** విధి నిర్వహణలో సిబ్బంది నిర్లక్ష్యాన్ని సహించేది లేదని జిల్లా కలెక్టర్ హైమావతి హెచ్చరించారు. సోమవారం గజ్వేల్‌లోని మాతా శిశు ఆరోగ్య కేంద్రాన్ని ఆమె ఆకస్మిక తనిఖీ చేసి, క్షేత్రస్థాయిలో రోగులకు అందుతున్న సేవలను పరిశీలించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ఆరోగ్య కేంద్రంలో సహజ ప్రసవాల సంఖ్య పెంచుతూ గర్భవతులకు మెరుగైన సేవలు అందించాలని ఆదేశించారు. ప్రభుత్వం నిరుపేద గర్భిణీ స్త్రీలకు మెరుగైన వైద్యం కోసం ఆసుపత్రి భవనంతో పాటు అన్ని రకాల సదుపాయాలు కల్పించిందని తెలిపారు. మాతా శిశు ఆరోగ్య కేంద్రంలోని డాక్టర్లు, నర్సులు, ల్యాబ్ సిబ్బంది ప్రతి ఒక్కరూ గర్భిణీలకు ఓపికగా వైద్యం చేయాలని చెప్పారు. అప్పుడే పుట్టిన పిల్లలకు టీకా వెయ్యాలని, వార్డులలో గర్భిణీ స్త్రీలు, పుట్టిన బిడ్డలకు మెరుగైన వైద్యం అందించాలని కోరారు. గర్భిణీ స్త్రీలలో మనో ధైర్యం నింపుతూ మంచి ఆహారపు నియమాలు, సహజ ప్రసవాలు జరిగేలా యోగ లాంటి అంశాలపై అవగాహన కల్పించాలని సూచించారు. సహజ ప్రసవాలు పెంచాలని, అయితే తప్పనిసరి పరిస్థితిలో మాత్రమే ఆపరేషన్ చెయాలని కోరారు. సిబ్బంది సెలవుల కోసం ఉన్నతాధికారుల అనుమతి పొందాలని, వాటిని రిజిస్టర్‌లో తప్పనిసరిగా ఉంచాలని వివరించారు.

# వనం..అధ్వానం!



**'పర్యవేక్షణ లేక వెలవెల బోతున్న పల్లె ప్రకృతి వనాలు'**

**ప్రజాపక్షం/నిర్మల్ :** పల్లెల్లో పచ్చదనం పరిమళించాలని,గ్రామీణ ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణం చెంతనే ఉండాలని గత ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పల్లె ప్రకృతి వనాలు'నేడు పర్యవేక్షణ కరువై అధ్వానంగా మారుతున్నాయి. ఒకప్పుడు హరిత మిత్రలు, పంచాయతీ సిబ్బంది సంరక్షణలో కళకళలాడిన ఈ వనాలు,ప్రస్తుతం అధికారుల నిర్లక్ష్యం వల్ల ఎండిపోయి అడవిని తలపిస్తున్నాయి. లక్షలాది రూపాయల ప్రజాధనాన్ని వెచ్చింది ఏర్పాటు చేసిన ఈ ఉద్యాన వనాలు ఇప్పుడు కేవలం రికార్డులకే పరిమితమవుతున్నాయన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి, నిర్మల్ జిల్లాలోని ముథోల్, బైంసా, లక్ష్మణ్‌చాంద్, మామడ, సారంగాపూర్ వంటి పలు మండాలాల్లోని గ్రామాల్లో ఈ వనాల పరిస్థితి అత్యంత దయనీయంగా మారింది. వేసవి కాలం కావడంతో ఎండల తీవ్రత పెరిగింది,కానీ ఈ మొక్కలకు నీరు పోసే నాథుడే కరువయ్యాడు. గతంలో గ్రామ పంచాయతీ ట్యాంకర్ల ద్వారా క్రమం తప్పకుండా నీటిని సరఫరా చేసేవారు,అయితే ఇప్పుడు ఆ పర్యవేక్షణ పూర్తిగా నిలిచిపోవడంతో వేల సంఖ్యలో మొక్కలు ఎండిపోయి అస్థిపంజరాల్లా దర్శనమిస్తున్నాయి. దీనికి తోడు వనాల చుట్టూ ఉన్నరక్షణ కంచెలు తెగిపోవడం, గేట్లు విరిగిపోవడంతో పశువుల సంచారం పెరిగి మిగిలిన పచ్చదనాన్ని కూడా నాశనం చేస్తున్నాయి.ముథోల్ వంటి ప్రాంతాల్లో అయితే నిర్వహణ అనేది అటకెక్కినట్లు స్పష్టమవుతోంది. అక్కడ పార్కులు పిచ్చిమొక్కలతో నిండిపోయి గుర్తుపట్టలేనంతగా తయారయ్యారు. మరోవైపు ,పర్యవేక్షణ లేకపోవడాన్ని ఆసరాగా చేసుకున్న అసాంఘిక శక్తులు ఈ ప్రకృతి వనాలను తమ స్థావరాలుగా మార్చుకుంటున్నాయి. సాయంత్రం వేళల్లో ఇవి మద్యం బాబులకు అడ్డాగా మారుతుండటంతో, వనమంతా ఖాళీ మద్య సీసాలు, సిగరెట్ ప్యాకెట్లు,గుట్కా కవర్లతో నిండిపోయి అసహ్యం కలిగిస్తోంది.చిన్నారుల కోసం ఏర్పాటు చేసిన ఊయలలు, జారుడు బల్లలు వంటి ఆటవస్తువులు సైతం తుప్పుపట్టి విరిగిపోయి ప్రమాదకరంగా మారాయి. దీంతో తమ పిల్లల ను పంపడానికి తల్లిదండ్రులు భయపడుతున్నారు.

కేవలం మొక్కలే కాకుండా,అక్కడ ఏర్పాటు చేసిన వాకింగ్ ట్రాక్‌లు కూడా పిచ్చిమొక్కలతో నిండిపోయి నడవడానికి వీలు లేకుండా పోయాయి. ముఖ్యంగా జిల్లాలోని మారుమూల గ్రామాల్లో ఈ వనాల నిర్వహణకు సంబంధించి నిధుల వినియోగంపై కూడా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. నిర్వహణ కోసం కేటాయించిన నిధులు ఎటు పోతున్నాయని,పర్యవేక్షించాల్సిన పంచాయతీ కార్యదర్శులు,సర్పంచులు ఎందుకు మౌనంగా ఉన్నారని గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు. గతంలో ఈ వనాల సంరక్షణ కోసం పనిచేసిన కూలీలకు వేతనాలు సకాలంలో అందకపోవడం వల్ల వారు కూడా ఆసక్తి చూపడం లేదని తెలుస్తోంది. ఫలితాంగా ఏ ఉద్దేశంతో అయితే ఈ వనాలను ఏర్పాటు చేశారో,ఆ లక్ష్యం దెబ్బతిరాల్సిన ప్రజల,ఇప్పుడు ఆ ప్రాంతం వైపు చూడాలంటేనే జంకుతున్నారు. తమ గ్రామానికి తలమానికంగా నిలుస్తాయని ఆశించిన ప్రకృతి వనాలు ఇలా దుస్థితికి చేరుకోవడంపై గ్రామస్తులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్,ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి సారించి,ఎండిపోతున్న మొక్కలను కాపాడేందుకు నీటి సదుపాయం కల్పించాలని డిమాండ్ చేస్తున్నారు. అలాగే పార్కుల్లో అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని,విరిగిపోయిన ఆట వస్తువులను పునరుద్ధరించి పల్లె ప్రకృతి వనాలకు పూర్వ వైభవం తీసుకురావాలని జిల్లా ప్రజలు కోరుతున్నారు.

ప్రజాపక్షం
Telugu National Daily
కరీంనగర్
మంగళవారం
24-03-2026
www.prajapaksham.in

‘ అనన్య క్రియేషన్స్ బ్యానర్‌పై కైలాష్ దుర్గం నిర్మాతగా తెరకెక్కుతున్న చిత్రం 'తెరచాప'. జోయల్ జార్జ్ దర్శకత్వంలో ప్రేక్షకుల ముందుకు రానున్న ఈ చిత్రంలో నవీన్ రాజ్ శంకరపు, పూజ సుహాసిని, శ్రీలు ముఖ్యపాత్రలో నటించగా రాజీవ్ కనకాల, పృథ్వీరాజ్, జగదీష్ ప్రతాప్ బండారి, ఫిష్ వెంకట్, జబర్దస్త్ అశోక్, నాగి, అప్పారావు, రైసింగ్ రాజు, రాజేష్ భూపతి, నాగ వంశీ, శ్రీనివాస్ నేస, చంద్ర తదితరులు కీలకపాత్రలు పోషించారు. ’

## రీల్

# విలేజ్ బ్యాక్ డ్రాప్‌లో ‘తిమ్మరాజుపల్లి టీవీ’



న్యూ టాలెంట్ ను ఎంకరేజ్ చేస్తూ హీరో కిరణ్ అబ్బవరం సుమైర స్టూడియోస్ తో కలిసి తన కేఏ ప్రొడక్షన్స్ పై నిర్మిస్తున్న సినిమా ‘తిమ్మరాజుపల్లి టీవీ‘. తేజ వేల్పుచర్ల సహ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. ఈ చిత్రంతో సాయి తేజ్, వేద జలంధర్ హీరో హీరోయిన్స్ గా పరిచయమవుతున్నారు. ‘తిమ్మరాజుపల్లి టీవీ‘ చిత్రంతో వి.మునిరాజు దర్శకుడిగా పరిచయమవుతున్నారు. విలేజ్ బ్యాక్ డ్రాప్ లో సాగే పీరియాడిక్ డ్రామాగా రూపొందుతున్న ఈ సినిమా ఏప్రిల్ 17న గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రెడీ అవుతోంది. హైదరాబాద్ లో ‘తిమ్మరాజుపల్లి టీవీ‘ సినిమా గ్రాండ్ రివీల్ ఈవెంట్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చిత్ర నిర్మాత, హీరో కిరణ్ అబ్బవరం మాట్లాడుతూ మునిరాజు మా మూవీస్‌కు ఆన్ లైన్ ఎడిటింగ్ చేసేవాడు. అతను చేసిన ఎడిటింగ్ చూస్తుంటే ఆకట్టుకునేలా ఉండేది. ఇండస్ట్రీలో నీ గోల్ ఏంటి అని అడిగాను. డైరెక్టర్ కావాలని ఉందని చెప్పాడు. ఏదైనా కథ ఉంటే చెప్పు అన్నాను. అప్పటికి డబ్బులు లేవు, సినిమా చేస్తానో లేదో తెలియదు. మనం సెటిలైనరోజు వీలైనంత కొత్త వాళ్లకు సపోర్ట్ చేద్దామనే హోప్ ఉండేది. నా చిన్నప్పుడు మా ఊరిలో ఒకే టీవీ ఉండేది. ఊరి వాళ్లంతా ఆ ఇంటికి వెళ్లి టీవీ చూసేవారు. అలాంటి సంఘటన ముని వాళ్ల ఊరిలో ఒకటి జరిగింది. శివరాత్రి పండక్కి మూడు రోజులు టీవీ అద్దెకు తీసుకొచ్చి ఊరి వాళ్లంతా కలిసి సినిమాలు చూస్తూ సెలబ్రేట్ చేసుకున్నారట. ఈ కథంతా 95 సంవత్సరంలో జరుగుతుంది.

ఏప్రిల్ 17న సినిమా రిలీజ్ చేస్తున్నాం. 90 కిడ్స్‌కు అయితే వారి గతమంతా గుర్తుకు వస్తుంది. ఊరిలో జరిగే సస్పెన్స్ డ్రామా చిత్రమిది. ఇంత హానెస్ట్ గా, ఇంత టెక్నికల్ క్వాలిటీగా ఎలా తీశారా అనిపిస్తుంది. మీ ఫ్యామిలీ అందరితో కలిసి థియేటర్స్‌కు వెళ్లండి. మా టీమ్ ను చూస్తుంటే గర్వంగా ఫీలవుతున్నాను. మా టీమ్ అంతా తమ కంఫర్ట్స్ మర్చిపోయి ఊరిలోనే ఉండి మూవీ కంప్లీట్ చేశారు. వంశీకాంత్ మ్యూజిక్, అక్షయ్ సినిమాటోగ్రఫీ, సుధీర్ ఆర్ట్ వర్క్..ఇలా ప్రతి ఒక్కరి వర్క్ ఎంతో ఇంప్రెస్ చేసింది. మునిరాజు సినిమా కంప్లీట్ అయ్యేవరకు పట్టుదలగా వర్క్ చేశాడు. పండక్కి కూడా ఊరికి వెళ్లలేదు. ఈ మూవీతో మునికి మంచి పేరు రావాలి. తేజ నాతో పాటు ఈ మూవీ కో ప్రొడ్యూసర్ చేశాడు. ఈ మూవీకి ఎవరైనా హీరోను పెడితే బిజినెస్ అవుద్దని మా వాళ్లు అంటే, మా మూవీస్ కు అసిస్టెంట్ కెమెరామెన్ గా పనిచేసిన సాయి తేజ్ తోనే చేద్దామని చెప్పాను. ప్రదీప్ కొట్టె చాలా షార్ట్ ఫిలింస్‌లో హీరోగా చేశాడు. మా సంస్థలో మరో రెండు చిత్రాలు చేస్తున్నాం. ఆ సినిమాలతో హీరోలుగా, నటీనటులుగా కొత్త వాళ్లకు అవకాశాలు కల్పిస్తున్నాం. చిన్న స్థాయిలో ఉన్న వారికి నాకు వీలైనంత అవకాశం కల్పించాలని అనుకుంటున్నా అన్నారు. సాయి తేజ్, వేద జలంధర్, ప్రదీప్ కొట్టె, స్వాతి కరిమిరెడ్డి, అమ్మ రమేష్, సత్యనారాయణ, లతీష్, తదితరులు నటిస్తున్నారు.

# మంచి సంగీతం అందించేందుకు ప్రోత్సాహం గద్దర్ అవార్డ్



మార్క్ కె రాబిన్

కొందరు తమ గోరంత ప్రతిభను కొండంతలుగా చెప్పుకుంటారు. మరికొందరు ఎంత ప్రతిభావంతులైనా ప్రచారాలకు దూరంగా ఉంటూ తమ పని తాము చేసుకుపోతుంటారు. ఈ రెండో కేటగిరీకి చెందిన యంగ్ టాలెంటెడ్‌మ్యూజిక్ డైరెక్టర్ మార్క్ కె రాబిన్. తన 8 ఏళ్ల సంగీత ప్రస్థానంలో 20 కి పైగా చిత్రాలకు సంగీతాన్ని అందించారు మార్క్ కె రాబిన్. వాటిలో నాగార్జున నటించిన ది ఘోస్ట్, ప్రియదర్శి మల్లేశం, తేజ సజ్జ జాంబీరెడ్డి, తాప్సీ మిషన్ ఇంపాజిబుల్, నవీన్ పోలిశెట్టి నటించిన ఏజెంట్ సాయిశ్రీనివాస ఆత్రేయ వంటి విజయవంతమైన చిత్రాలున్నాయి. తాజాగా దండోరా సినిమాకు బెస్ట్ మ్యూజిక్ డైరెక్టర్ గా తెలంగాణ ప్రభుత్వ గద్దర్ అవార్డ్‌ను సొంతం చేసుకున్నారు మార్క్ కె రాబిన్. ఈ సందర్భంగా రాబిన్ మీడియాతో చిట్ చాట్ నిర్వహించారు .

దండోరా సినిమాకు బెస్ట్ మ్యూజిక్ డైరెక్టర్ గా గద్దర్ అవార్డ్ దక్కడం సంతోషంగా ఉంది. గద్దర్ అవార్డ్ తో సంగీత దర్శకుడిగా నాపై మరింత బాధ్యత పెరిగిందని భావిస్తున్నాను. గద్దర్ అవార్డ్ ప్రకటించినందుకు సిఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సిఎం మల్లు భట్టివిక్రమార్క, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి గార్లకు కృతజ్ఞతలు చెప్పుకుంటున్నా డైరెక్టర్ మురళి చాలా క్లారిటీగా సినిమాను తెరకెక్కించారు. ఈ సినిమాలోని కథాంశమే నన్ను మంచి మ్యూజిక్ ఇచ్చేందుకు ఇన్స్‌పైర్ చేసింది. కులాల మధ్య ఉన్న అడ్డుగోడలు, చివరకు చనిపోయాక అంతిమ సంస్కారాలు కూడా చేయకుండా అడ్డుకోవడం, ఒక బ్రిడ్జి మీద నుంచి శవాలను నీటిలోకి దింపడం వంటివి దర్శకుడు చెప్పాక నా మనసు చలించింది. భావోద్వేగం నిండిన మనసుతోనే దండోరా సినిమాకు సంగీతాన్ని అందించాను. దండోరా సినిమాలో స్థానిక వాయిద్యాలతో సంగీతం కంపోజ్ చేశాను. నేను మల్లేశం సినిమాకు మ్యూజిక్ చేసేప్పుడే నాకు ఈ స్థానిక వాయిద్యాలు, స్థానిక సంగీతం మీద అవగాహన ఉంది. ఆ అనుభవం దండోరా సినిమాకు నాకు ఉపయోగపడింది.

లిరిసిస్ట్ కృష్ణకాంత్ నాకు మంచి మిత్రుడు. కృష్ణకాంత్, ప్రశాంత్ వర్మ, నేను కలుస్తుండే వాళ్లం. ప్రశాంత్ నేను కలిసి డైలాగ్ ఇన్ ది డార్క్ అనే ఇండియా ఫస్ట్ వర్చువల్ ఆడియో షార్ట్ ఫిలిం చేశాం. నాని హీరోగా నటించిన మజ్ను మూవీ ట్రైలర్ కు బీజీఎం ఇచ్చాను. ఆ ట్రైలర్ కు నేను అందించిన సంగీతం నచ్చి నాని తను నిర్మిస్తున్న అ..! సినిమాకు మ్యూజిక్ డైరెక్టర్ గా అవకాశం కల్పించారు. అలా టాలీవుడ్‌లో సంగీత దర్శకుడిగా నా ప్రయాణం మొదలైంది. ఆ తర్వాత 8 ఏళ్ల ప్రయాణంలో 20కి పైగా చిత్రాలకు సంగీతాన్ని అందించాను. నాకు కమర్షియల్ సినిమాలు చేయడం ఇష్టం.మెగాస్టార్ చిరంజీవి గారంటే నాకు చాలా ఇష్టం. ఆయన సినిమాకు మ్యూజిక్ చేయాలనేది నా డ్రీమ్. ఇటీవల గద్దర్ అవార్డ్స్‌లో ఆయనను కలిసి దగ్గరగా చూశాను, షేక్ హ్యాండ్ ఇచ్చాను. ఆ సందర్భం ఒక స్వీట్ మెమొరీగా గుర్తుండిపోతుంది. ప్రస్తుతం మ్యూజిక్ డైరెక్టర్స్ యూత్‌కు నచ్చే మంచి మంచి సౌండింగ్స్ ఇవ్వగలుగుతున్నారు. కానీ కలకాలం గుర్తుండిపోయే ట్యూన్స్ ఇవ్వలేకపోతున్నారు. అందుకే ఇప్పటి యూత్ ఏఆర్ రెహమాన్, ఇళయరాజా పాటలు వింటూ ఆ పాటలకు డ్యాన్సులు చేస్తున్నారు. ట్యూన్ శరీరం అయితే, సాహిత్యం ఆత్మ లాంటిది అని నా అభిప్రాయం. నేను చేసే పాటలన్నీ మంచి సాహిత్యంతో, గుర్తుండిపోయే ట్యూన్ తో ఉండాలనే ప్రయత్నిస్తుంటాను. అయితే సినిమా సంగీతం ఎప్పుడూ ఒక పరిధిలోనే ఉంటుంది. అంటే దర్శకుడి మేరకు మేము పాటలు కంపోజ్ చేయాలి. మంచి మ్యూజిక్ ఉన్న దర్శకులతో పనిచేసినప్పుడే మంచి పాటలు చేయగలం.మనలోని సృజనాత్మకతతో రూపొందించే పాటను అంతే అనుభూతితో ఏఐ అందించలేదు. ఏఐకి కూడా మన ఇన్ పుట్స్ అవసరం. ఫలానా పాట చేయమని సూచనలు చేస్తే అలాంటి పాటే చేసి ఇస్తుంది. ప్రస్తుతం కథాకళి అనే ఒక సినిమా చేస్తున్నాను. అలాగే ప్రశాంత్ వర్మ గారితో రెండు మూవీస్ చేస్తున్నాను. ఒక స్టార్ హీరో సినిమాకు చర్చలు జరుగుతున్నాయి. త్వరలో వెల్లడిస్తాను.

# ఏప్రిల్ 10న ‘పల్లిచట్టంబి’



మలయాళ స్టార్ హీరో టొవినో థామస్ నటిస్తున్న భారీ బడ్జెట్ మూవీ ‘పల్లిచట్టంబి’. ఈ చిత్రాన్ని వరల్డ్ వైడ్ ఫిలింస్, సి క్యూబ్ బ్రోస్ ఎంటర్ టైన్ మెంట్స్ బ్యానర్స్‌పై నౌఫల్, బ్రిజీష్, చాణుక్య చైతన్య చరణ్ నిర్మిస్తున్నారు. డిజో జోస్ ఆంటోనీ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాలో కయదు లోహర్ హీరోయిన్ గా నటిస్తోంది. ‘పల్లి చట్టంబి‘ సినిమాపై పాన్ ఇండియా స్థాయిలో భారీ అంచనాలు నెలకొంటున్నాయి. ఈ మూవీ ఏప్రిల్ 10న హిందీ, తమిళ, తెలుగు, మలయాళ, కన్నడ ఐదు భాషల్లో థియేట్రికల్ రిలీజ్ కు కానుంది . ‘పల్లిచట్టంబి’ సినిమా టీజర్ రిలీజ్ చేశారు. ప్రఖ్యాతిగాంచిన ఒక పురాతన చర్చి నేపథ్యంగా ఆసక్తికరంగా ఈ టీజర్ ప్రారంభమవుతుంది. ఆ భగవంతుడి ఆలయం మీద కొందరు దెయ్యాల్లాంటి మనషుల కన్నుపడుతుంది. ఆ రాక్షసులు అమాయకులైన ప్రజల్ని హింసించడం టీజర్‌లో చూపించారు. ‘మనుషులు సైతాను ఎదురెదురుగా ఉండే ప్రదేశంలో దేవుడితో పనేంటి..’ అనే డైలాగ్ ఈ మూవీ నేపథ్యం, కథలోని కాన్ఫ్లిక్ట్ ఎలా ఉండబోతోంది అనే అంశాలపై క్యూరియాసిటీ క్రియేట్ చేస్తోంది. ఈ ఆలయాన్ని, అమాయక ప్రజల్ని కాపాడేందుకు కథానాయకుడు ఎలాంటి పోరాటం చేశాడు అనేది టీజర్‌కు హైలైట్‌గా నిలుస్తోంది. 50, 60 దశకాల నేపథ్యంగా సాగే ఈ పీరియాడిక్ మూవీలో హీరో టొవినో థామస్ సరికొత్తగా కనిపించి ఆకట్టుకుంటున్నారు. టొవినో థామస్, కయదు లోహర్, విజయరాఘవన్, సుధీర్ కరమన, బాబురాజ్, వినోద్ కేదమంగళం, ప్రశాంత్ అలెగ్జాండర్, తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి ఎడిటింగ్ శ్రీజిత్ సరంగ్ సినిమాటోగ్రఫీ టిజో టోమీ మ్యూజిక్ జేక్స్ బిజోయ్ స్క్రిప్ట్ ఎస్ సురేష్ బాబు, అసోసియేట్ ప్రొడ్యూసర్స్ మేఘశ్యామ్, తంజీర్ .

# ‘గాయపడ్డ సింహం’ బాగా నచ్చింది : నిర్మాత దిల్ రాజు

తరుణ్ భాస్కర్ హీరోగా , రైటర్ డైరెక్టర్ కశ్యప్ శ్రీనివాస్‌తో కలిసి ‘గాయపడ్డ సింహం’ తో అలరించబోతున్నారు. ఈ చిత్రాన్ని సప్తస్వ మీడియా వర్క్స్, పిఓవి స్టోరీస్, జీ స్టూడియోస్ నిర్మిస్తున్నాయి. పవన్ సాదినేని ఈ చిత్రాన్ని సమర్పిస్తున్నారు. తాజాగా సినిమాకు సంబంధించిన టీజర్‌ను ప్రసాద్ ల్యాబ్‌లో ఎఫ్ డి సి చైర్మన్, నిర్మాత దిల్ రాజు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా దిల్ రాజు మాట్లాడుతూ ఈ సినిమా స్టోరీ నాకు బాగా నచ్చింది. అందుకే ఈ సినిమాను వరల్డ్ వైడ్‌గా నేనే రిలీజ్ చేస్తున్నాను అని చెప్పారు. పూర్తిగా వినోదాత్మకంగా ఈ సినిమాను తీశారు. అమెరికా వెల్లడానికి ఒక యువకుడు పడే కష్టాన్ని చాలా ఎంటర్‌టైనింగ్‌గా చెప్పారు అని దిల్ రాజు అన్నారు.




ఈ పాట హీరో అమెరికన్ డ్రీమ్ ఎలా ఒక్కసారిగా తలకిందులవుతుందో చూపిస్తుంది. అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ప్రకటించిన డిపోర్టేషన్ నిర్ణయం తర్వాత హీరో జీవితంలో ఏర్పడే గందరగోళ పరిస్థితులను సరదాగా చూపించామని డైరెక్టర్ కాశ్యప్ శ్రీనివాస్ చెప్పారు. ప్రొడ్యూసర్ భాను కిరణ్ మాట్లాడుతూ.. మీ అందరి కోసం ఈ సినిమాని మా డైరెక్టర్ అవుట్ అండ్ అవుట్ ఎంటర్‌టైనర్‌గా తీశాడు. సినిమా చాలా బాగా వచ్చింది. అన్ని పాటలు కూడా చక్కగా కుదిరాయి. ఒక డైరెక్టర్ గా తరుణ్ అంటే మనందరికీ ఇష్టం. ఈ సినిమా యాక్టర్ ఇష్టపడతారు.ఈ సినిమాలో తన యాక్టింగ్ నెక్స్ట్ లెవెల్‌లో ఉంటుంది. ఈ సినిమాలో చాలా సర్‌ప్రైజులు ఉన్నాయి. ఒక్కొక్కటి రివీల్ చేస్తూ ఉంటాం. ఏప్రిల్ లో రిలీజ్ చేయాలనుకుంటున్నాం. తప్పకుండా ఈ సాంగ్‌ని అందరితో షేర్ చేయాలని కోరుకుంటున్నాను.

డైరెక్టర్ కశ్యప్ శ్రీనివాస్ మాట్లాడుతూ.. అందరూ మన కలని చేరుకోవాలి. ఈ ప్రయాణంలో అందరం గాయపడతాం. గాయపడ్డ సింహాలవుతాం. త్వరలోనే ఈ సినిమా రిలీజ్ అవుతుంది. మిమ్మల్ని అందరిని ఎంటర్టైన్ చేస్తుంది. తరుణ్ బెస్ట్ పెర్ఫామెన్స్ ఇచ్చారు. మిమ్మల్ని అందరిని ఎంటర్‌టైన్ చేస్తారు అనీ తెలిపారు.

# ప్రతినెలా రూ.1000 కోట్లు

(మొదటి పేజీ తరువాయి)

భట్టి విక్రమార్క సమాధానమిచ్చారు. బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రతినెలా 15వ తేదీ తర్వాతనే ప్రభుత్వ ఉద్యోగులకు వేతనాలు చెల్లించేవారని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రభుత్వ ఉద్యోగులకు ప్రతి నెలా మొదటి తేదీనే వేతనాలు చెల్లిస్తున్నామని గుర్తు చేశారు. గత ప్రభుత్వం ఆర్థిక విధ్వంసానికి పాల్పడిందని, వ్యవస్థలను ధ్వంసం చేసిందని, ఉద్యోగుల ఆర్థిక పరిస్థితులను కూడా ఛిన్నాభిన్నాం చేసిందన్నారు. రిటైర్డ్ ఉద్యోగుల బకాయిల భారం నుంచి తప్పించుకునేందుకు గత ప్రభుత్వం ఉద్యోగుల పదవీ విరమణ వయసును మూడేళ్లు పెంచిందని, నాలుగవ తరగతి ఉద్యోగుల పదవీ విరమణ వయస్సును కూడా 60ఏళ్ళ నుంచి 65 ఏళ్లకు పెంచిందని, తద్వారా 17వేల మంది ఉద్యోగుల పదవీ విరమణ ప్రయోజనాల భారం ప్రజా ప్రభుత్వంపై పడిందని వివరించారు.

**సభ నుంచి బిఆర్ఎస్ వాకౌట్**

ప్రభుత్వం సరైన సమాధానం చెప్పలేదని, పెన్షనర్ల బెనిఫిట్స్, పిఆర్‌సి, డిఎల విషయంలో సిపిఎస్ ఉద్యోగుల పట్ల మోసపూరిత వైఖరికి అవలంభిస్తుందని బిఆర్ఎస్ సభ్యులు నిరసన వ్యక్తం చేస్తూ ప్రశ్నోత్తరాల స మయంలో వాకౌట్ చేశారు. అంతకుముందు బిఆర్ఎస్ఎల్‌పి ఉపనాయకులు తన్నీరు హరీశ్‌రావు మాట్లాడుతూ డిఎలను, పిఆర్‌సిలను ఎప్పటివరకు అమలు చేస్తారని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభు త్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు అయినా తర్వాత కూడా గత ప్రభుత్వంపైనే పడి ఏడుస్తారా? అని అన్నారు.

# స్కామ్ అంటారా?

(మొదటి పేజీ తరువాయి)

సమాధానమిచ్చారు. తెలంగాణ బియ్యం ఎగుమతి అంశంలో హరీశ్ రావు ఒక వ్యక్తికి సిఫార్సు చేశారని తెలిపారు. గతంలో నీటి పారుదల శాఖ మంత్రిగా పనిచేసిన హరీశ్ రావుకు చెందిన అన్ని నీటిపారుదల ప్రాజెక్టుల అంశాలపై విచారణ చేపట్టాల్సి వస్తుందన్నారు. ఫిలిప్పిన్స్‌లో నెలకొన్న అంతర్గత సంక్షోభం వల్లనే అక్కడ అన్ని రకాల దిగుమతులపై ఆంక్షలు విధించారని, కానీ కేవలం తెలంగాణ రైస్‌కు మాత్రమే మినహాయింపు ఇచ్చారని వివరించారు. ఫిలిప్పిన్స్‌కు బియ్యం ఎగుమతి చేసిన తొలి రాష్ట్రం తెలంగాణ అని అన్నారు. చత్తీస్‌గఢ్, ఎపి బియ్యం కంటే కూడా తెలంగాణ సోనా మసూరి, బాస్మతికి డిమాండ్ ఉందన్నారు. కేంద్రం 54 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యానికే పరిమితి విధించిన ప్పటికీ 72 లక్షల టన్నుల ధాన్యం కొనుగోలు చేసి నగదు చెల్లించామని వివరించారు.

**‘బియ్యం ఎగుమతి’పై సభా సంఘం వేయండి: హరీశ్‌రావు**

రాష్ట్ర పౌర సరఫరాల శాఖలో బియ్యం ఎగుమతుల చుట్టూ భారీ కుంభకోణం జరిగిందని బిఆర్ఎస్ ఎంఎల్ఎ హరీశ్ రావు ఆరోపించారు. ఈ వ్యవహారంపై తక్షణమే సభా సంఘాన్ని ఏర్పాటు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. బియ్యం ఎగుమతి విషయంలో తాను ఎవ్వరికీ సిఫారసు చేయలేదని ఆయన చెప్పారు. సిబిఐ, ఇడి కేసుల్లో నిందితుడిగా ఉన్న ప్రేమ్ చంద్ గార్గ్‌ను ప్రభుత్వానికి సలహాదారునిగా ఎలా నియమించుకుంటారని ప్రశ్నించారు. ఆ సలహాదారుడి తప్పుడు సలహాల వల్లనే రాష్ట్ర ఖజానాకు భారీ గండి పడిందని ఆరోపించారు. మంత్రి సరైన సమాధానం చెప్పనందుకు తీవ్ర నిరసన వ్యక్తం చేస్తున్నట్లు హరీశ్‌రావు చెప్పారు.

# బాసర ట్రిపుల్ ఐటిలో తాజా పరిస్థితిపై మంత్రి సమీక్ష

**ప్రజాపక్షం/హైదరాబాద్:** బాసర ట్రిపుల్ ఐటి (ఆర్‌జియుకెటి)లో నెలకొన్న పరిస్థితులు, వి ద్యార్థుల నిరసనలు, తదనంతరం సెలవులు ప్రకటించడం, తదితర అంశాలపై ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇంచార్జ్ మంత్రి జూపల్లి కృష్ణారావు సోమవారం హైదరాబాద్‌లో ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. క్యాంపస్‌లో ప్రస్తుత స్థితిగతులను, విద్యార్థుల ఆందోళనల వెనుక ఉన్న కారణాలను బాసర ట్రిపుల్ ఐటి విసి ప్రొఫెసర్ గోవర్ధన్, ఒఎస్‌డి మురళీ దర్శన్ మంత్రికి వివరించారు. క్యాంపస్‌లో విద్యార్థుల ఆందోళనల నేపథ్యంలో శాంతి భద్రతల దృష్ట్యా, ముం దస్తు జాగ్రత్తగా సెలవులు ప్రకటించాల్సి వచ్చిందని విసి గోవర్ధన్ మంత్రికి తెలిపారు. విద్యార్థుల ప్రధాన డిమాండ్లు, సెలవుల ప్రకటనకు దారితీసిన పరిణామాలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా మంత్రి జూపల్లి మా ట్లాడుతూ.. విద్యార్థులు ఎంతో ప్రతిభావంతులని, కేవలం ఆవేశంతో ఆందోళనలు చేస్తూ త మ ఉజ్వల భవిష్యత్తును అంధకారం చేసుకోవద్దని హితవు పలికారు. సమస్యలు ఏవైనా ఉంటే చర్చల ద్వారా పరిష్కరించుకోవాలని, విద్యార్థుల ప్రయోజనాలను కాపాడేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. క్యాంపస్‌లో మౌలిక వసతులు, విద్యా ప్రమాణాల మెరుగుదల విషయంలో రాజీపడే ప్రసక్తే లేదని ఆయన అధికారులకు తేల్చి చెప్పారు. త్వరలోనే క్యాంపస్‌లో సాధారణ పరిస్థితులు నెలకొనేలా చర్యలు తీసుకోవాలని, విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు భరోసా కల్పించాలని విసిని మంత్రి ఆదేశించారు. అసెంబ్లీ సమావేశాల తర్వాత ట్రిపుల్ ఐటిని సందర్శించి, విద్యార్థులతో చర్చిస్తానని మంత్రి తెలిపారు.

# బట్టబయలు

(మొదటి పేజీ తరువాయి)

అరెస్ట్ చేశారు. గతంలో ‘గోల్డ్ క్వెస్ట్’, ‘క్వెస్ట్ నెట్’ పేర్లతో పనిచేసిన ఈ సంస్థ, హాంకాంగ్‌కు చెందిన క్యూఐ గ్రూప్ అనుబంధంగా కార్యకలాపాలు కొనసాగిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు, నిరుద్యోగులు, గృహిణులు, చిన్న వ్యాపారులను లక్ష్యంగా చేసుకుని ఈ మోసాలకు పాల్పడుతున్నట్లు విచారణలో వెల్లడైంది. హైటెక్ సిటీలోని ప్రముఖ హోటళ్లలో సమావేశాలు ఏర్పాటు చేసి ఈకామర్స్ వ్యాపారం పేరుతో ప్రజలను ఆకర్షించేవారు. రూ.5లక్షల నుంచి రూ.10 లక్షల వరకు పెట్టుబడి పెడితే రెండేళ్లలో రూ.3 నుంచి రూ.4 కోట్ల లాభం వస్తుందని నమ్మించేవారు. ప్రారంభంలో ‘క్యూనెట్’ లేదా ఎంఎల్ఎం పద్ధతి గురించి వివరాలు చెప్పకుండా గోప్యత పాటించడం వారి ప్రధాన యుక్తి.

బాధితులు డబ్బు చెల్లించిన తర్వాత, వారి అనుమతి లేకుండా ఆ మొత్తాన్ని ఉత్పత్తుల కొనుగోలుగా చూపించి మళ్లించేవారు. ఇంటికి వచ్చిన వస్తువులను కంపెనీ బహుమతులుగా చెప్పి అసలు పెట్టుబడిని స్కీమ్‌లోకి మళ్లించేవారు.

**బైనరీ స్కీమ్‌తో మోసం..**

ఈ సంస్థ ‘1+2+4+8’ బైనరీ పద్ధతిలో పనిచేస్తూ కొత్త సభ్యులను చేర్పిస్తే భారీ కమీషన్లు వస్తాయని ఆశ చూపించింది. ఇందులో చేరిన వారిని ‘ఇండిపెండెంట్ రిప్రజెంటేటివ్స్’ (ఐఆర్)గా పేర్కొన్నారు. అయితే ఇటువంటి పథకాలు ‘ప్రైజ్ చిట్స్ అండ్ మనీ సర్క్యులేషన్ స్కీమ్స్ (నిషేధిత) చట్టం, 1978’ ప్రకారం నేరమని పోలీసులు స్పష్టం చేశారు. సోమవారం 30ప్రత్యేక బృందాలుగా విడిపోయిన పోలీసులు అంతర్రాష్ట్ర ఆపరేషన్ నిర్వహించి 11 మంది మహిళలతో సహా మొత్తం 32 మందిని అరెస్ట్ చేశారు. వీరిలో చాలా మంది ఐటి ఉద్యోగులే కావడం విశేషం. ప్రస్తుతం నమోదైన 4 కేసుల్లో 11 మంది బాధితుల నుంచి సుమారు రూ.75 లక్షల నష్టం జరిగినట్లు గుర్తించారు. మిగిలిన నిందితుల కోసం గాలింపు కొనసాగుతోంది. పోలీసుల హెచ్చరిక ఇలాంటి మల్టీ లెవల్ మార్కెటింగ్ పథకాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హైదరాబాద్ పోలీస్ కమిషనర్ విసి సజ్జనార్ సూచించారు. ఇటువంటి స్కీముల్లో చేరడం లేదా ఇతరులను చేర్పించడం చట్టరీత్యా నేరమని హెచ్చరించారు. మోసపోయిన వారు వెంటనే పోలీసులను సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు.

# కార్పొరేషన్ (మొదటి పేజీ తరువాయి)

సాంబశివరావు మాట్లాడుతూ గిగ్ వర్కర్లకు చట్టాన్ని ప్రవేశపెడుతామని ప్రభుత్వం చేసిన ప్రకటనను స్వాగతించారు. ప్రభుత్వ శాఖలలో ఎక్కువ సంఖ్యలోనే అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు పనిచేస్తున్నారని, వారికి ఏజెన్సీల ద్వారా సరైన సమయానికి వేతనాలు అందడంలేదని, వేతనాలను కూడా పూర్తిగా ఇవ్వడంలేదని, తగ్గిస్తున్నారని ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చారు. అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల కోసం ప్రత్యేకంగా కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలని, తద్వారా ఒక వ్యవస్థ ఏర్పడుతుందని అన్నారు. ఇందుకు మంత్రి వివేక వెంకటస్వామి సానుకూలంగా స్పందించారు.

**‘గిగ్ వర్కర్ల’కు కొత్త చట్టం**

గిగ్ వర్కర్ల సంక్షేమం, హక్కుల పరిరక్షణ కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా కొత్త చట్టాన్ని తీసుకురానుందని రాష్ట్ర కార్మిక, ఉపాధి కల్పన శాఖ మంత్రి జి.వివేక్ వెంటకస్వామి తెలిపారు. కేంద్ర మార్గదర్శకాల ప్రకారమే సెస్ వసూలు చేసి, గిగ్ వర్కర్ల సామాజిక భద్రతకు ఉపయోగిస్తామన్నారు. శాసనసభలో సోమవారం జరిగిన ప్రశ్నోత్తరాల సమయంలో కాంగ్రెస్ సభ్యులు యెన్నం శ్రీనివాస్ రెడ్డి, బీర్ల ఐలయ్య, సిపిఐ శాసనసభాపక్ష నేత కూనంనేని సాంబశివరావు, బిఆర్ఎస్ సభ్యులు కల్వకుంట్ల సంజయ్ అడిగిన ప్రశ్నకు మంత్రి వివేక్ వెంకటస్వామి సమాధానమిచ్చారు. గిగ్ వర్కర్ల బిల్లు శాసనసభ ఆమోదం పొందిన తర్వాత గిగ్ వర్కర్ల కోసం ప్రత్యేక బోర్డును ఏర్పాటు చేయనున్నట్లు మంత్రి వెల్లడించారు. ఈ బోర్డు ముఖ్యంగా గిగ్ వర్కర్లకు సంబంధించిన సమస్యలను పరిష్కరిస్తుందని, భద్రత, న్యాయం కల్పించే దిశగా పనిచేస్తుందని వివరించారు.




# తగిన వేతనాలివ్వరా?

(మొదటి పేజీ తరువాయి)

ప్రాణాలను పణంగా పెట్టి వారి కంటే ఎక్కువగా కష్టపడుతున్న కార్మికులకు కనీస వేతనం లేకపోవడం దారుణమన్నారు. మున్సిపల్ కార్మికుల సమస్యలను అసెంబ్లీలో లేవనెత్తి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క దృష్టికి తీసుకెళ్తానని కార్మికులకు హామీ ఇచ్చారు. కార్మికుల వెంట ఎర్రజెండా ఎప్పటికీ ఉంటుందని, పోరాటాలు చేసి, హక్కులను సాధించుకుందామని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో జిహెచ్ఎంసి కార్పొరేషన్‌తో పాటు మున్సిపాలిటీలలో కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ పద్ధతిలో విధులు నిర్వహిస్తున్న కార్మికులను పర్మినెంట్ చేయాలని, వారికి కనీస వేతనం కింద ప్రతినెల రూ.26 వేలు చెల్లించడంతో పాటు పర్మినెంట్ కార్మికులకు నాలుగు డిఎలు చెల్లించి, పిఆర్‌సి వెంటనే ప్రకటించాలని కోరుతూ తెలంగాణ రాష్ట్ర మున్సిపల్ వర్కర్స్, ఔట్ సోర్సింగ్ ఎంప్లాయీస్ యూనియన్ (ఎఐటియుసి) ఆధ్వర్యంలో సోమవారం హైదరాబాద్‌లోని ఇందిరాపార్కు వద్ద ‘మున్సిపల్ కార్మికుల మహాధర్నా’ నిర్వహించారు. ఈ ధర్నాను ఉద్దేశించి కూనంనేని సాంబశివరావు ప్రసంగించారు.

**మన ఓటు మనకే వేసుకుని మన సమస్యలను మనమే పరిష్కరిందాం**

‘కార్మికులకు పోరాటాల సమయంలో కమ్యూనిస్టుల మద్దతు కావాలి. కానీ, ఎన్నికల సమయంలో మాత్రం ఇతర పార్టీలకు ఓటు వేస్తున్నారు. అదే ఓటు సిపిఐకి వేసి మనల్ని మనం గెలిపించుకుంటే, రాజకీయ అధికారం మనకే దక్కుతుంది. అప్పుడు మన సమస్యలను మనమే పరిష్కరించుకోవచ్చు’అని సాంబశివరావు అన్నారు. కొత్తగూడెం, పాల్వంచ మున్సిపాలిటీల పరిధిలో పనిచేస్తున్న మున్సిపల్, సింగరేణి కార్మికులు, కూరగాయల విక్రేతలు, హమాలీలు, భవన నిర్మాణ కార్మికులు ఓటు వేయడం వల్లనే తాను ఎంఎల్ఎగా గెలిచానని చెప్పారు. తాను ఈ ధర్నాకు ఎంఎల్ఎగా రాలేదనీ, మీలో ఒ క్కడిగా వచ్చానన్నారు. సుమారు 40 ఏళ్ల కిందనే కొత్తగూడెంలో మున్సిపల్ కార్మికుల సంఘాన్ని ఏర్పాటు చేశామని గుర్తుచేశారు. ఎర్రజెండా ఎప్పటికీ మారదని, ఎర్ర జెండా పుట్టిందే పేదవాడి కోసమని, ఎర్ర జెండాను మనం కాపాడుకోవాలన్నారు.

ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్షులు ఎండి.యూసుఫ్ మాట్లాడుతూ మున్సిపల్ కార్మికుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించకపోతే రాష్ట్ర వ్యాప్తంగా సఫాయి పనులు ఆపేసి సమ్మెకి వెళ్తామని హెచ్చరించారు. అరవై ఏళ్లు దాటిన కార్మికుల వారసులకు ఉద్యోగాలు ఇవ్వడంతో పాటు మరణించిన కార్మికునికి దహన సంస్కారాల ఖర్చుల కోసం రూ.50 వేలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.బాల్‌రాజ్ మాట్లాడుతూ సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఏజెన్సీలను రద్దు చేసి, ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు కె.రవిచంద్రన్, ప్రధాన కార్యదర్శి కె.ఏసు రత్నం, కార్యదర్శులు వనంపల్లి జైపాల్ రెడ్డి, కాంతారావు, హరినాథ్ రావు, ఎఐటియుసి రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎం.నరసింహ, నాయకులు ఓమయ్య, విలాస్, పల్లా దేవేందర్ రెడ్డితో పాటు కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# ఎప్పుడూ వ్యతిరేకమే...

(మొదటి పేజీ తరువాయి)

కాంగ్రెస్ ఓట్లు గణనీయంగా తగ్గడం వల్లనే బిజెపి అసెంబ్లీలో తన ఏకైక సీటును దక్కించుకోగలిగిందని, వేరొక సెగ్మెంట్‌లో మరో పార్టీ అభ్యర్థి విజయాన్ని ఖాయం చేసేందుకు ఇది ఒక ఉద్దేశపూర్వక రాజకీయ కుట్రలో భాగమని ఆయన ఆరోపించారు. ‘వామపక్ష పార్టీలు, ముఖ్యంగా సిపిఐ(ఎం) ఎల్లప్పుడూ ఆర్ఎస్ఎస్, బిజెపిలకు వ్యతిరేకంగా రాజీలేని వైఖరిని అవలంబించాయి. దీనిని ఎవరూ కాదనలేరు’ అని విజయన్ పేర్కొన్నారు. వివిధ రాజకీయ సందర్భాలలో కాంగ్రెస్, రాహుల్ గాంధీతో సహా ఆ పార్టీ నాయకత్వం బిజెపి ‘బి టీమ్’గా వ్యవహరిస్తున్నాయని విజయన్ ఆరోపించారు. ఢిల్లీలోని రాజకీయ పరిణామాలను ప్రస్తావిస్తూ, ఆప్ నాయకుడు అరవింద్ కేజ్రీవాల్‌ను అరెస్టు చేసిన సమయంలో కాంగ్రెస్ కార్యకర్తలు బాణాసంచా కాల్చి సంబరాలు చేసుకున్నారని, అధికార వర్గానికి వ్యతిరేకంగా ఏకం కాకుండా ఆప్‌ను వ్యతిరేకించడానికే కాంగ్రెస్ పార్టీ మొగ్గు చూపిందని ఆయన ఆరోపించారు. గతంలో కూడా కాంగ్రెస్ ఆర్ఎస్ఎస్‌తో సంబంధాలు పెట్టుకోవడానికి ప్రయత్నించిందని, అయితే లెఫ్ట్ డెమోక్రటిక్ ఫ్రంట్ (ఎల్‌డిఎఫ్) ఆర్ఎస్ఎస్, బిజెపి రెండింటికీ వ్యతిరేకంగా నిలకడగా గట్టి వైఖరిని కొనసాగించిందని ఆయన స్పష్టం చేశారు. గతంలో జరిగిన ‘కోలెబి’ కూటమి ఆరోపణలను గుర్తుచేస్తూ, అటువంటి పొత్తులను చివరికి ఓటర్లు తిరస్కరించారని విజయన్ అన్నారు. కాంగ్రెస్, ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్ (ఐయుఎంఎల్), బిజెపిలను సూచించే ‘కోలెబి’ కూటమి అనేది కేరళలో సిపిఐ(ఎం) తరచుగా లేవనెత్తే ఒక రాజకీయ ఆరోపణ. గతంలో జరిగిన ఎన్నికలలో అధికారంలో ఉన్న లెఫ్ట్ డెమోక్రటిక్ ఫ్రంట్ (ఎల్‌డిఎఫ్)ను ఓడించడానికి వ్యూహాత్మకంగా కలిసి పనిచేయాలనే లక్ష్యంతో ఈ పార్టీల మధ్య ఒక రహస్య అవగాహన ఉందని సూచించడానికి దీనిని ఉపయోగిస్తారు. సిపిఐ(ఎం)–బిజెపి ఒప్పందం గురించిన ప్రస్తుత ఆరోపణలు నిలబడవని పేర్కొంటూ, బిజెపిని సమర్థవంతంగా ఎదుర్కోవడానికి దేశంలోని అనేక ప్రాంతాలలో ప్రతిపక్ష శక్తులను ఏకం చేయడంలో కాంగ్రెస్ విఫలమైందని ముఖ్యమంత్రి అన్నారు. ఏప్రిల్ 9న జరిగిన అసెంబ్లీ ఎన్నికలలో పాలక్కాడ్‌తో సహా సుమారు 10 నియోజకవర్గాలలో సిపిఐ(ఎం), బిజెపి మధ్య అవగాహన ఉందని ప్రతిపక్ష నాయకుడు వి.డి. సతీసన్ ఇటీవల చేసిన ఆరోపణల నేపథ్యంలో ఈ వివాదం తలెత్తింది.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Baddam Yella Reddy Bhavan, Ganesh Nagar, KARIMNAGAR 505001 Telangana State. RNI TELTEL /2018/76746, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com